శ్రీ రామచరిత మానసము

ఆఱవ సోపానము - లంకాకాండము

భగవత్ప్రార్థన

పృథ్వీపతి (రాజశిరోమణి)గా అవతరించిన శ్రీరామచంద్రునకు వందనమాచరించెదను. అతడు కామారియైన శివునకు ఆరాధ్యదైవము. భవభయములను దూరమొనర్చువాడు, కాలమనుమత్తేభముపాలిటిసింహము, యోగీశ్వరుడు, జ్ఞానైకగమ్యుడు, సర్వసద్గుణనిధి, అజేయుడు, నిర్గుణుడు, షడ్వికారరహితుడు, మాయాతీతుడు, దుష్టసంహారనిరతుడు, బ్రాహ్మణ బృందములకు ముఖ్యదైవము, మేఘశ్యామసుందరుడు, కమలాక్షుడు, అంతే గాదు, అతడు దేవాది దేవుడు. (1)

పార్వతీ పతియైన శంకరునకు నమస్కరించుచున్నాను. అతడు శంఖ, చంద్రులవలె ధవళ వర్ణ శోభితుడు, అత్యంతతనుసౌందర్యశోభలతో విలసిల్లువాడు, వ్యాఘ్రచర్మాంబరధరుడు, భయంకరకాలసర్పములను భూషణములుగా ధరించువాడు, గంగాధరుడు, శశాంక శేఖరుడు, కాశీనాథుడు, కలియుగపాపసమూహములను నాశమొనర్చు వాడు, పరమసుఖములను ప్రసాదించు కల్పవృక్షము, మన్మథుని భస్మమొనర్చిన వాడు, వేయేల అతడుసకలకల్యాణగుణ నిధానము, జగత్ప్రభువు. (2)

అత్యంత దుర్లభమైన కైవల్యమునుగూడ సజ్జనులకు ప్రసాదించువాడును, దుష్టులను శిక్షించువాడును ఐన శంకరుడు నాకు సమస్తశుభములను అనుగ్రహించు గాక- (3)

(తులసీదాసు నుడువుచున్నాడు)

ఓ మనసా! కాలమును ధనుస్సుగా, క్షణములు, నిముసములు, పరమాణువులు, సంవత్సరములు, యుగములు, కల్పములు తనప్రచండ బాణములుగా గల్గిన శ్రీరామచంద్రుని నీవేల భజింపవు? (దోహా)

సముద్రునిసూచనను ఆదరించి, శ్రీరామచంద్రుడు తన ఆంతరంగికులతో ఇట్లనెను. "ఇప్పుడింక ఆలస్యమేల? వెంటనే వారధిని నిర్మింపుడు. వానరులందఱును సముద్రమును దాటెదరు. "జాంబవంతుడు చేతులు జోడించి, సవినయముగా ఇట్లు నుడివెను. "ఓ సూర్య వంశ భూషణమా! శ్రీరామా! ప్రభూ! మనుష్యుడు భవసాగరమును దాటుటకు మీనామమే ఒక సేతువు. (సోరఠ)

వారధిని నిర్మించుట - లంకను జేరుట

అట్టి తఱి ఈ చిన్న సముద్రము మీకొక లెక్కా" ఈ మాటలను విని, పవనసుతుడు ఇట్లు పలికెను- "ప్రభుపరాక్రమము బడబానలతుల్యము. అదిమొదట సముద్రుని శుష్కింపజేసినది. కానీ మీ శత్రువనితల దుఃఖాశ్రుజలములచే ఆ సముద్రము మఱల నిండినది. అందువలన ఆ జలములు క్షారములైనవి." హనుమంతునియుక్తియుక్తములైన పలుకులు విని, వానరులు శ్రీరాముని వైపు చూచి, ఆనందముతో పొంగిపోయిరి. జాంబవంతుడు నలుడు, నీలుడు అను సోదరులను బిలిచి, వారికి జరిగిన వృత్తాంతమును దెలిపి, ఇట్లు పలికెను. "మనస్సులో శ్రీరాముని మహిమను స్మరించుచు సేతువును నిర్మింపుడు. ప్రభుమహత్త్యమువలన మీకేమియు శ్రమ

కలుగదు" పిదప వానరసైన్యమును బిలిచి, అతడు ఇట్లనెను. "మీ అందటికిని నాదొక విన్నపము. మీ హృదయములలో శ్రీరామునిచరణకమలములను నిలుపుకొనుడు. భల్లూకములు, వానరులు శ్రమలేని ఈ క్రీడలో నిమగ్నులగుదురు గాక. ఓ వీరవానరయోధులారా! మీరు వెళ్లి, వృక్షములను, పర్వతములను పెకలించి తీసికొనిరండు." ఈ మాటలను విని, వానరులు, భల్లూక యోధులు, 'హుం కరించుచు' శ్రీరఘునాథునిప్రతాపమునకు 'జేజేలు' పలుకుచు వెళ్లిరి. (చౌపా॥ 1-5)

వారు అత్యంతమహోన్నతపర్వతములను, వృక్షములను అవలీలగా మోసికొనివచ్చి, నలునకును, నీలునకును అప్పగించుచుండిరి. వెంటనే వారు అద్భుతముగా మిక్కిలి దృఢముగా చక్కనిసేతువును. నిర్మింపసాగిరి. (దో॥ 1)

వానరులు గొప్పగొప్ప పర్వతములను తెచ్చి ఇచ్చుచుండిరి. నలుడు, నీలుడు వాటిని బంతుల వలె అందుకొనుచుండిరి. లోకోత్తరమైన ఆ సేతునిర్మాణవైశిష్ట్యమును గాంచి, శ్రీరాముడు హర్షోల్లసితుడై పల్కెను. ఇక్కడి భూమి మిక్కిలి రమ్యమైనది, శ్రేష్ఠమైనది. దీనిఅపారమైన మహిమ వర్ణనాతీతము. నేనిచట పరమశివుని (శివలింగమును) ప్రతిష్ఠించెదను. ఇది నా సంకల్పము. "శ్రీరామచంద్ర ప్రభువచనములను విని, వానరరాజు సుగ్రీవుడు దూతలను బంపగా వారు మునీశ్వరులను పిలుచుకొని వచ్చిరి. శ్రీరాముడు శివలింగమును ప్రతిష్ఠించి, యథావిధిగా పూజించి, పలికెను. "శివునివలె ప్రియమైనవారు నాకెవ్వరును లేరు. శివునకు ద్రోహము తలపెట్టి, నాకు భక్తుడనని పలికెడు వాడు స్వప్నములోగూడ నన్ను పొందజాలడు. శంకరునకు విముఖుడై నా యెడ భక్తిని ప్రకటించువాడు మూర్ఖుడు, అల్పబుద్ధి. వానికి నరకము తప్పదు. (చౌ॥ 1-4)

శంకరుని ప్రేమించి, నా యందు వైరము పూనువారును, శంకరునికి వైరులై నాకు దాసులగు వారును కల్పాంతమువఱకు రౌరవాది నరకయాతనలను అనుభవింతురు.[1] (దో॥ 2)

రామేశ్వరమును దర్శించినవారు శరీరత్యాగమును చేసినపిమ్మట నాలోకమును (వైకుంఠమును) చేరెదరు. గంగాజలములతో శివునకు అభిషేకము చేసిన వారికి సాయుజ్యముక్తి లభించును. నిష్కాముడై కపటమును త్యజించి, శ్రీ రామేశ్వరుని సేవించినవానికి శంకరుడు నా భక్తిని ప్రసాదించును. నేను నిర్మించిన ఈ సేతువును దర్శించువాడు ఎట్టి ప్రయాసయు లేకుండగనే సంసారసాగరమును దాటును. "శ్రీరాముని వచనములను విని, అందఱి మనస్సులును ఆనందపరవశములాయెను. మునీశ్వరులు తమతమఆశ్రమములకు వెళ్లిరి. (శివుడు పల్కుచున్నాడు) గిరిజా! శరణాగతుని సర్వదా ప్రేమించుటయే శ్రీ రఘునాథునిస్వభావము. నేర్పరులైన నలుడు, నీలుడు సేతువును నిర్మించిరి. శ్రీరామునికృపచే వారియశస్సు సర్వత్ర వ్యాపించెను. తాము మునుగుటయేగాక ఇతరులనుగూడ ముంచివేయు మహాశిలలు సముద్రములో ఓడలవలె తేలిపోవుచుండెను. ఇది సముద్రునిమహిమయు గాదు, ఱాళ్ల గుణమూగాదు, వానరులకౌశలమూగాదు. అది అంతయు రామప్రభావవిశేషము. (కర్తుమ్, అకర్తుమ్, అన్యథాకర్తుం సమర్థః = శ్రీరామః) (1-5)

శ్రీ రఘువీరునిమహిమచే ఱాళ్లుగూడ సముద్రముపై తేలియాడెను. అట్టి శ్రీరాముని వీడి, ఇతర ప్రభువులను గొల్చెడి వారు మంద బుద్ధులు (దో॥ 3)

నలుడు, నీలుడు సేతువును నిర్మించి, దానిని అత్యంతదృఢముగా జేసిరి. కరుణానిధియైన శ్రీరాముడు దానిని జూచి, మిక్కిలి సంతసించెను. వానరసేనలు ముందునకు నడచుచున్న తీరు వర్ణనాతీతము. వానర వీరులు

1. 'రామేశ్వరః' అను సమాసమునకు పండిత వివరణము-
రామస్య ఈశ్వరః = రామేశ్వరః = శంకరుడు రామునకు దైవము.
రామః ఈశ్వరః యస్యసః = రామేశ్వరః = రాముడు శంకరునకు దైవము.

గర్జించుచుండిరి. కృపాళువైన శ్రీరాముడు సేతువునెక్కి ఆ అపార జలనిధివిస్తృతిని తిలకించెను. ఆ దయామయుని దర్శించుటకై జలచరములన్నియును గుంపులు గుంపులుగా ఎగురుచు పైకి చేరుచుండెను. వానిలో నానావిధములైన మొసళ్ళు, నక్రములు, చేపలు, సర్పములు గలవు. వాటి శరీరములు నూరు యోజనములప్రమాణము గలిగియుండెను. వాటిని మ్రింగగలిగిన జలజంతువులును గలవు. ఇవియు ఇతరజలచరములకు భయపడుచుండెను. ఇప్పుడు అవి పరస్పరవైరములు మాని ప్రభువును దర్శించుచుండెను. వానిని మళ్లించినను మఱలి పోకుండెను. అన్నియును సుఖానందడోలికలలో తేలియాడుచుండెను. అవి సర్వత్ర ఒక దానినొకటి ఒరిసికొనియుండుటచే నీరు కనబడకుండెను. ప్రభువును దర్శించిన వాటి ఆనందమునకు అవధులు లేకుండెను. ప్రభునాజ్ఞచే వానరసైన్యము ముందునకు నడువ సాగెను. ఆ వానర సైన్య వైపుల్యము వర్ణింప నలవి కానిది. (చౌ॥ 1-5)

చూచుచుండగనే సేతువు వానరసైన్యముతో నిండిపోయెను. కొందఱు ఆకాశములో ఎగురుచు పోవుచుండిరి. మఱి కొందఱు. జలజంతువులపై గంతులువేయుచు పోవుచుండిరి. (దో॥ 4)

శ్రీరాముడును, లక్ష్మణుడును ఈ దృశ్యమును కుతూహలముతో చూచుచు, చిఱునవ్వులను చిందించుచు ముందునకు నడచుచుండిరి. వారు సేనాసహితముగ సముద్రమును దాటిరి. పరివారములన్నియును రామలక్ష్మణులతో ఆవలితీరమున విడిసినదృశ్యము వర్ణింపనెవరితరము? ఆ తీరమున శ్రీరామునకై గుడారము నిర్మింపబడెను. రుచికరములైన ఫలమూలములను భుజింపుడని వానరభల్లూకములకు ప్రభువు ఆజ్ఞను ఇచ్చెను. ఆజ్ఞను వినినంతనే వారు నలుదెసలకు పరుగెత్తిరి. శ్రీరాముని సేవకై వృక్షములన్నియును కాలగతిని, ఋతు ధర్మములను పాటింపక ఫలభరితములయ్యెను. వానరభల్లూకములు మధురఫలములను ఆరగించుచు వృక్షములను కదలించుచుండెను. వారు పర్వతశిఖరములను లంక వైపునకు విసరివేయుచుండిరి. అటు నిటు సంచరించుచు రాక్షసుడెవ్వడైనను కనబడినచో వాని చుట్టును మూగి వానితో నాట్యము చేయించుచుండిరి. వానిముక్కును, చెవులను కొఱికి, ప్రభు కీర్తిని చెప్పి, వానితో చెప్పించి, విడిచి పెట్టుచుండిరి. ముక్కు చెవులను కోల్పోయిన రాక్షసులు రావణునియొద్దకు వెళ్ళి, విషయములను వివరించిరి. సముద్రముపై సేతువును నిర్మించినారనుసమాచారమును వినగానే దశాననుడు మిక్కిలి భయపడుచు, అతివిస్మయముతో ఒక్కసారిగా పదినోళ్లతో బిగ్గరగా అఱచెను. (చౌ॥ 1-5)

ఏమీ! నిజముగా వననిధి, నీరనిధి, జలధి, సింధు, వారీశ, తోయనిధి, కంపతి, ఉదధి, పయోధి, నదీశులపై సేతునిర్మాణము జరిగెనా? (పదిముఖములచే సముద్రుని యొక్క పది పేర్లను పలికెను) అనగా వాస్తవముగానే సముద్రముపై వారధి కట్టినారా? - అని మిక్కిలి విస్మయముతో అడిగెను. (దో॥ 5)

రావణునకు మండోదరి విన్నపము

పిదప తన వ్యాకులతను గుర్తించి, తెచ్చుకొన్న నవ్వుతో భయమును కప్పిపుచ్చుకొని, అతడు తన భవనమునకు పోయెను. శ్రీరామచంద్ర ప్రభువు అవలీలగా సముద్రమునకు సేతువు గట్టి, లంకకు ఏతెంచిన విషయమును వినిన మండోదరి పతిచేతిని పట్టుకొని, అతనిని తన భవనమునకు తీసికొని పోయెను. ఆమె పతిచరణములకు ప్రణమిల్లి, భర్త మనస్సు కఱుగునట్లు తన కొంగుబట్టి దీనముగా ఇట్లు ప్రార్థించెను. "ప్రాణేశ్వరా! కోపమును మాని, నా మాటలను ఆలకింపుడు. నాథా! బుద్ధిబలములస్థాయిని బట్టి, మనము జయింపగలవారితోడనే వైరము పెట్టుకొనవలెను. మీకును, శ్రీ రఘునాథునకును మధ్యగలఅంతరము దీపపుపురుగునకును, సూర్యునకును మధ్యగల అంతరము వంటిది. అత్యంతబలశాలురైన మధుకైటభులనెడి రాక్షసులను సంహరించినవాడతడు. వరాహ

నరసింహ రూపములలో దితిసుతులైన హిరణ్యాక్ష, హిరణ్య కశిపులను పరిమార్చినవాడు, వామనుడై బలిచక్రవర్తిని బంధించినవాడు, పరశురాముడై సహస్ర బాహువును హతమార్చినవాడు ఐన శ్రీమహావిష్ణువే భూభారమునుబాపుటకై శ్రీరాముడుగా అవతరించినాడు. కాలము, కర్మలు, జీవులు, అతని అధీనములోనే గలవు. (నీవును జీవుడవే కావున నీకును ఆతడు ప్రభువే) కనుక ఆయనతో విరోధము మానుడు. (చౌ॥ 1-5)

శ్రీరామునిచరణకమలములపై తలయుంచి నమస్కరించి, జానకీదేవిని అతనికి సమర్పింపుడు. కుమారునకు రాజ్యమును అప్పగించి, వనములకు వెళ్లి, శ్రీ రఘునాథుని సేవింపుడు. (దో॥ 6)

నాథా! శ్రీ రఘునాథుడు దీనదయాళువు. (అతడు తప్పక మిమ్ము క్షమించును) క్రూరమైన పులిగూడ శరణుజొచ్చిన వానిని (జంతువును) చంపదు. మీరు చేయవలసిన సమస్త కార్యములను చేసితిరి. దేవతలను, రాక్షసులనే గాక చరాచరప్రపంచమునంతటిని జయించినారు. దశాననా! రాజులు తమనాల్గవ దశ (వార్ధక్యము)లో రాజ్యమును వదలి, అడవులకు పోవలెనని సజ్జనులు తెల్పిన నీతివచనము. స్వామీ! మీరును వనములకు వెళ్లి, సృష్టి స్థితి లయకారకుడైన పరమాత్మను భజింపుడు. నాథా! మీరు మమకారములను త్యజించి, శరణాగతవత్సలుడైన శ్రీరఘువీరుని ఆరాధింపుడు. అతనికొఱకే మునీశ్వరులు తపస్సులను ఆచరింతురు, రాజులు రాజ్యములను త్యజించి, విరాగులయ్యెదరు. అట్టి కోసలాధిపతి శ్రీరాముడు మీపై దయచూపుటకై విచ్చేసి యున్నాడు. ప్రియతమా! మీరు నా మాటలను పాటించినచో పవిత్రమైన మీ ఉజ్జ్వలకీర్తి, ముల్లోకములయందును వ్యాపించును. (చౌ॥ 1-4)

ఈ విధముగా పలికి, పతివ్రతయైన మండోదరి కన్నీరు పెట్టినదై, కంపితశరీరయై పతిపాదములను పట్టుకొని, మఱలనిట్లనెను. "నాథా! శ్రీ రఘునాథుని భజింపుడు, పూజింపుడు. దాని వలన నా మాంగల్యము భద్రముగా నిల్చును." (దో॥ 7)

రావణుడు మండోదరిని లేవనెత్తి కూర్చుండ జేసెను. ఆ దుష్టుడు తనవైభవమును గూర్చి వర్ణింపసాగెను. "ఓ ప్రియా! వినుము. నీవు అనవసరముగా భయపడుచున్నావు. ఈ జగత్తులో నాకు సరితూగగల యోధుడెవడు? యమ వరుణ వాయు కుబేరాది దిక్పాలురనే గాక మృత్యువును గూడ జయించితిని. దేవతలు, రాక్షసులు, మనుష్యులు, అందఱును నాకులోబడియున్నవారే. మఱి నీ భయమునకు కారణమేమి?" ఇట్లు రావణుడనేక విధములుగా ఆమెకు నచ్చజెప్పి, మఱల తనసభకు వెళ్లెను. మృత్యువు ఆసన్నమగుటచేతనే ఇతడింతగా గర్వపడుచున్నాడని మండోదరి భావించెను. రావణుడు సభలో మంత్రులతో ఇట్లనెను. "శత్రువుతో తలపడు ఉపాయమేమి?" మంత్రులు ప్రత్యుత్తరమిచ్చిరి. "రాక్షసరాజా! మాటి మాటికిని మమ్ము ఏల ప్రశ్నించెదరు? మీరింతగా భయపడుటకుగల కారణమేమి? మానవులు, వానరులు, భల్లూకములు మనకు ఆహారమే గదా!' (చౌ॥ 1-5)

వారు చెప్పినదంతయును విని, రావణునికుమారుడైన ప్రహస్తుడు అంజలి ఘటించి యిట్లు పలికెను. "ప్రభూ! నీతికి విరుద్ధమైన ఏ పనినీ చేయవలదు. మంత్రులందఱును అల్పబుద్ధులు (వారు సరియైన సూచనలను ఇచ్చుట లేదు.) (దో॥ 8)

మంత్రులందఱును ముఖస్తుతులు చేయుచున్నారు. ప్రభూ! ఇట్టి మాటలతో ప్రయోజనము ఉండదు. ఒక వానరము సముద్రమును లంఘించి వచ్చెను. దాని అద్భుతకార్యములను అందఱును ఇప్పటికిని మనస్సులలో పొగడుచున్నారు. ఆ వానరుడు సభలో మాట్లాడునప్పుడు మీకు ఎవ్వరికిని ఆకలి కాలేదా? (వానరము మీ ఆహారమే గదా?) నగరమును తగుల బెట్టుచున్నప్పుడు అతనిని పట్టుకొని మీరేల తినలేదు. మీ మంత్రులిచ్చిన సలహాలు వినుటకు బాగుగనే యున్నవి. కాని వాటి ఫలితము మిగుల దుఃఖదాయకము. అవలీలగా సముద్రముపై సేతువును

నిర్మించి, సువేల పర్వతముపై తనసేనలతో చేరియున్నవాడు సామాన్య మానవుడా? మీ తృప్తికొఱకై మంత్రులందఱును గొంతులు చించుకొనుచు ఇచ్ఛకములను పలుకుచున్నారు. తండ్రీ! నా మాటలను సాదరముగా వినుడు. నన్ను పిఱికి వానినిగా భావింపవలదు. ప్రపంచములో పెక్కుమంది ఎదుట తీయని మాటలను మాట్లాడుదురు, వినెదరు. కాని ప్రభూ! వినుటకు చేదుగా ఉన్నను పరిణామమున శుభప్రదమైన మాటలను పలికెడివారు, వినెడి వారు చాల కొద్ది మంది మాత్రమే ఉందురు. నా సూచనలను ఆలకింపుడు. మొదట మీ దూతను పంపుడు, పిమ్మట సీతాదేవిని అప్పగించి, శ్రీరామునితో స్నేహము చేయుడు. (చౌ॥ 1-5)

ఒకవేళ శ్రీరాముడు తనభార్యతోగూడి మఱలి పోయినచో అతనితో కలహమును పెంచ వలదు. యుద్ధమే అనివార్యమైనచో ఎదుర్కొని పోరాడుడు. (దో॥ 9)

ప్రభూ! మీరు నా సలహాను మన్నించినచో ప్రపంచమున మీకు రెండు విధములుగా కీర్తి లభించును." దశాననుడైన రావణుడు ఈ మాటలను విని, మండిపడుచు "ఓరీ మూర్ఖుడా! నీకు ఈమాటలను ఎవరునూరి పోసిరి?" అని అఱచెను. "అప్పుడే నీ మనస్సులో భయసందేహములు కలుగుచున్నవా? వెదురు వ్రేళ్ల దగ్గర పుట్టిన పురుగు వలెనున్నావు." (ఇది వెదురును గూడ నాశనము చేయును. (తండ్రిగారిపరుషవచనములను విని, ప్రహస్తుడు "చావు దగ్గరపడిన వానికి మందులు రుచింపనట్లు నీకు మంచి మాటలు రుచింపవు." అని నిష్ఠురోక్తులను పలుకుచు ఇంటికి వెళ్లెను. సాయంకాలమైనందున దశకంఠుడు తనఇఱువది భుజములను చూచుకొనుచు తన భవనమునకు వెళ్లెను. లంకలో ఎత్తైన ఒక శిఖరముపై అతివిచిత్రమైన భవనమొకటి కలదు. అచట సంగీతనృత్యసభలు జరుగును. రావణుడు ఆ భవనమునకు చేరి, అందు ఆసీనుడయ్యెను. కిన్నరులు ఆతని గుణ గణములను కీర్తించుచు గీతములను పాడసాగిరి. వీణలు, మృదంగములు, తాళములు మున్నగు వాద్యముల గోష్ఠి జరిగెను. అప్సరసలు నాట్యములాడిరి. (చౌ॥ 1-5)

ఈవిధముగా నిత్యము అతడు ఇంద్రవైభవములకు నూఱురెట్లుభోగములను అనుభవించు చుండెను. శ్రీరామునివంటి ప్రబలశత్రువు అతని ముంగిలి చేరియున్నను అతనికి భయమూ లేదు, చింతయును లేదు. (దో॥ 10)

ఇక్కడ శ్రీ రఘువీరుడు సువేలపర్వతముపై మహాయోధులుగల సైన్యముతో గూడియుండెను. ఆ పర్వతముపై ఎత్తైనమహోజ్జ్వలశిఖరమునందు పరమసుందరమైన ఒక సమతలభూమిపై లక్ష్మణుడు స్వయముగా వృక్షములలేతఆకులను, మనోహరమైన మృదుకుసుమములను తెచ్చి చక్కగా పఱచెను. వాటిపై కోమలమైన కృష్ణాజినమును ఉంచెను. కృపాళువైన శ్రీరాముడు దానిపై ఆసీనుడయ్యెను. ప్రభువు వానరరాజైన సుగ్రీవునియొడిలో తలనుంచి విశ్రమించెను. ఎడమ వైపున ధనుస్సు, కుడివైపున అమ్ములపొది యుండెను. రెండు చేతులతో బాణములను సరిచేయుచుండెను. లంకేశుడైన విభీషణుడు ప్రభుచెవికి చేరువగాఉండి రహస్యములను మాట్లాడు చుండెను. మహాభాగ్యశాలురైన అంగదహనుమంతులు ప్రభుచరణములను ఒత్తుచుండిరి. నడుమున తూణీరమును, చేతులతో ధనుర్బాణములను ధరించి, లక్ష్మణుడు వీరాసనమున ప్రభువువెనుకనుండెను. (చౌ॥ 1-4)

కృపాసౌందర్యసద్గుణోపేతుడై శ్రీరాముడు ఇట్లు శోభిల్లుచుండెను. ఈ దృశ్యమును మనస్సులో ముద్రించుకొని, ధ్యానించువారు మిగులధన్యులు. తూర్పుదిశయందు ప్రభువు చంద్రోదయమును గాంచి, ఇట్లు నుడివెను. "సింహమువలె ఆ చంద్రుడు ఎంత నిర్భయముగా నున్నాడో చూడుడు. (దో॥ 11. క,ఖ)

పూర్వ దిశయనుపర్వతగుహాయందు నివసించు పరమప్రతాపవంతుడు, తేజోబల సంపన్నుడు ఐన చంద్రుడను సింహము అంధకారమనెడి మదపుటేనుగుమస్తకమును ఛేదించి, ఆకాశమనెడి వనమున నిర్భయముగా సంచరించుచున్నాడు. ఆకాశమున వెదజల్లబడిన తారలనెడి ముత్యములచే రాత్రి యనెడి స్త్రీ అలంకృతయై, మనోహరముగానున్నది. ప్రభువు మఱల పలికెను. "సోదరులారా! చంద్రునిలోని ఆ మచ్చయేమిటో మీ బుద్ధిబలముతో తెల్పుడు." సుగ్రీవుడు పలికెను. "రఘునాథా! వినుడు. చంద్రునియందు భూమినీడ ప్రతిబింబించినది." మఱియొకరు పలికిరి. "రాహువు చంద్రుని గ్రహించునప్పుడు ఆయన హృదయముపై ఆనల్లని మచ్చ ఏర్పడినది." ఇంకను వేఱొకరు ఇట్లు పలికిరి. "బ్రహ్మ దేవుడు మన్మథుని భార్యయైన రతీదేవి ముఖమును తీర్చిదిద్దునపుడు చంద్రునినుండి సారభాగమును దీసెను. దానివలన చంద్రునిలో రంధ్రమేర్పడినది. ఆ రంధ్రమే చంద్రుని హృదయమున కనబడుచున్నది. ఆకాశము యొక్క నీలచ్ఛాయ ఆ రంధ్రము నుండి గోచరించు చున్నది." శ్రీరామచంద్ర ప్రభువు ఇట్లు పలికెను. "క్షీరాబ్ధి జాతమైన విషము చంద్రునకత్యంత ప్రియ సోదరుడు. కనుక చంద్రుడు విషమును తన హృదయమునందుంచుకొనెను. విషపూరితములైన తనకిరణపుంజములను ప్రసరింపజేసి, విరహమునకు లోనైన స్త్రీ పురుషులను కాల్చివేయుచున్నాడు. (చౌ॥ 1-5)

హనుమంతుడు అప్పుడు ఇట్లనెను. "ప్రభూ వినుడు చంద్రుడు మీకు ప్రియమైన దాసుడు, మీ సుందరశ్యామలమూర్తి చంద్రుని హృదయములో నివసించుచున్నది. మీ శ్యామసుందరవర్ణమే చంద్రునిలో భాసించుచున్నది. (దో॥ 12. క)

(నవాహ్నిక పారాయణము-ఏడవ విరామము)

పావని వచనములను విని జ్ఞాననిధానమైన శ్రీరాముడు నవ్వుకొనెను. పిమ్మట దక్షిణ దిశవైపు చూచి, కృపానిధియైన ఆ ప్రభువు విభీషణునితో పలికెను. (దో॥ 12. ఖ)

"విభీషణా! దక్షిణదిశయందు మేఘములు దట్టముగా ఒకేచోట ఎట్లలముకొనుచున్నవో చూడుము. మెఱుపులు మిఱుమిట్లు గొలుపుచున్నవి. భయంకరమైన మేఘములు మందస్వరము లీనుచు గర్జించుచున్నవి. బహుశా వడగండ్ల వానకురియునేమో!" విభీషణుడు పలికెను. "ఓ కృపాళూ! వినుము. మెఱుపూగాదు, మేఘసముదాయమూగాదు. లంకలో శిఖరముపై ఒక భవనము గలదు. దశకంఠుడు అక్కడ నృత్యసంగీతానందములను అనుభవించుచున్నాడు. అతడు తనశిరస్సుపై మేఘసముదాయమునుబోలి విశాలమైన నల్లని ఛత్రమును ధరించియున్నాడు. అదియే మేఘములగుంపువలె కనబడుచున్నది. మండోదరీ దేవియొక్క కర్ణాభరణములు మెఱుపులవలె తళుక్కుమనుచున్నవి. ఓ దేవాదిదేవా! అక్కడి మృదంగతాళధ్వనులే మధురముగా వినబడుచున్నవి. రావణునిఅహంకారమును గుర్తించి, ప్రభువు చిఱునవ్వుతో ధనుస్సును ఎక్కుపెట్టి బాణమును సంధించెను. (చౌ॥ 1-4)

ప్రభువు ఒకేబాణముతో రావణునిఛత్రమకుటమును, మండోదరి కర్ణతాటంకములను పడగొట్టెను. అందఱును చూచుచుండగనే అవి భూమిపై పడిపోయెను. అక్కడి వారికెవ్వరికిని అంతుపట్టక పోయెను. ఇట్టి చమత్కారమునొనర్చి, ఆ రామబాణము మఱలివచ్చి తూణీరములో చేరెను. ఇట్టి మహారసభంగదృశ్యమును గాంచి, రావణుని సభలోని వారందఱును భయభ్రాంతులైరి. (దో॥ 13. క,ఖ)

భూకంపమూ లేదు, గాలి వానయూ లేదు. ఏ అస్త్ర శస్త్రములును కానరావు మఱి ఈ ఛత్ర మకుటమూ, కర్ణాభరణములును ఎట్లు నేలపై రాలినవి? అందఱును దీనిని గొప్ప భయంకరాపశకునముగా తలంచిరి. సభలోని

వారందఱును భయవిహ్వాలురగుటను చూచి, రావణుడు కృత్రిమమైన నవ్వుతో ఇట్లు సమర్థించుకొనెను. "నాతలలు తెగిపడుటయు శుభకరమేయయినప్పుడు మకుటము క్రిందపడుట అపశకునము ఎట్లగును? నిశ్చింతగా నిర్భయులై మీమీగృహములకు వెళ్ళి నిద్రింపుడు." అందఱును అతనికి ప్రణమిల్లి, గృహోన్ముఖులైరి. తనతాటంకములు నేలపై పడిపోయినప్పటినుండియు మందోదరికి విచారము అధికమాయెను. కన్నుల నీరు నిండగా చేతులు జోడించి, ఆమె రావణునితో పలికెను. "ఓ ప్రాణనాథా! నా విన్నపమును ఆలకింపుడు. శ్రీరామునితో విరోధమును మానుడు. అతడు మానవమాత్రుడను భావమును మనస్సునుండి తొలగింపుడు. (చౌ॥ 1-4)

నా మాటను విశ్వసింపుడు. రఘువంశశిరోమణియైన శ్రీరామచంద్రుడు విశ్వరూపుడు. జగత్తంతయు ఆయనరూపమే. ఆయనప్రత్యంగమునందును చతుర్దశభువనములు కలవని వేదములు తెలుపుచున్నవి. (దో॥ 14)

విశ్వరూపుడైన శ్రీరామునకు పాతాళము చరణములు. బ్రహ్మలోకము మస్తకము. ఇతరాంగములన్నియును సమస్తలోకములకు నివాసస్థానములు. ఆయన భృకుటిసంచలనమే భయంకరకాలుడు. సూర్యచంద్రులే ఆయన నేత్రములు. కేశరాశియే మేఘసమూహము. అశ్వినీ కుమారులు ఆయన నాసారంధ్రములు. ఆయన యొక్క కనురెప్ప పాటులవలన రాత్రింబవళ్ళు ఏర్పడుచున్నవి. ఆయన చెవులు దశదిశలు అనియు, శ్వాసయే వాయువనియు ఆయనవాణియైన వేదములు నుడువుచున్నవి. లోభమే ఆయన అధరము. భయంకరమైన దంత సమూహమే మృత్యు దేవత. మాయయే అతని నవ్వు. దిక్పాలురు అతనిభుజములు. అగ్ని ముఖము, వరుణుడు నాలుక. సృష్టి స్థితి లయములు అతని నిత్య కృత్యములు. అష్టాదశ విధములైన అసంఖ్యాక వనస్పతులు అతని రోమావళి. పర్వతములే ఆతని ఎముకలు, నదులాతని నరములు. సముద్రమే ఉదరము. క్రింది ఇంద్రియములు నరకము. ఈ విధముగా ప్రభువు జగన్మయుడు. ఇంతకంటె ఎక్కువ కల్పనలతో పనిలేదు. (చౌ॥ 1-4)

శివుడే అతని అహంకారము. బ్రహ్మ ఆతని బుద్ధి. చంద్రుడు మనస్సు. ఆతని చిత్తము విష్ణువు. చరాచర రూపుడైన భగవంతుడే మనుష్యరూపుడైన శ్రీరాముడుగా అవతరించెను. ప్రాణనాథా! వినుడు. బాగుగా ఆలోచించి, శ్రీరామునితో వైరమును మాని, ఆయనచరణములపై భక్తిని నిలుపుడు. దానివలన నా మాంగల్యము శాశ్వతముగా నిలబడును." (దో॥ 15. క,ఖ)

తన భార్యవచనములను చెవులారవినిన రావణుడు ఆమెను గేలిచేయుచు బిగ్గరగా నవ్వి, ఇట్లనెను. "ఆహా! మోహప్రభావము ఎంత బలవత్తరమైనది? స్త్రీ హృదయమున ఎనిమిది దోషములుండునని కవులు పేర్కొనిన విషయము సత్యమే గదా! సాహసము, అనృతము, చాపల్యము, మాయ, భయము, అవివేకము, అపవిత్రత, దయారాహిత్యము, అనునవియే ఈ ఎనిమిది దోషములు. నీవు నా బద్ధవిరోధి యొక్క విరాట్ స్వరూపమును కీర్తించి, నన్ను మిక్కిలి భయపెట్ట జూచితివి. కాని ప్రియా! ఇప్పుడు నీ చాతుర్యమును గ్రహించితిని. ఈచరాచరవిశ్వమంతయును నా గుప్పిటనున్నది. బ్రహ్మ శివ వరుణ కుబేరాదులందఱును నావశములోని వారు. నీ దయవలన నాకు ఇప్పుడు అది తేటతెల్లమైనది. ఈ నెపముతో నీవు నావైభవమునే వర్ణించితివి. (విశ్వరూపుడగుశత్రువు నా వశములోనున్నాడు) ఓ మృగలోచనా! నీ మాటలు మిక్కిలి గంభీరములు, భావయుక్తములు. విని అవగాహన చేసికొనిన వారికి భయము తొలగి సుఖము కలుగును". కాలము సమీపించుటచే పతికి మతిభ్రమించినదని మందోదరి భావించెను. (చౌ॥ 1-4)

అజ్ఞానవశమున ఈ విధమైన హాసవిలాసములతో రావణునకు తెల్లవాఱెను. సహజముగా కఠినాత్ముడును, మదాంధుడును ఐన లంకాధిపతి తనసభాభవనమున ప్రవేశించెను. (దో॥ 16. క)

మేఘములు అమృతజలములను వర్షించినను బెత్తముతీగ పుష్పింపదు, ఫలింపదు. అట్లే బ్రహ్మయే వచ్చి ఉపదేశించినను మూర్ఖుని హృదయమున జ్ఞానము ఉదయింపదు. (సో॥ 16. ఖ)

ఇక్కడ సువేలశైలముపై శ్రీ రఘునాథుడు ప్రాతఃకాలమునే మేల్కొని, మంత్రులందఱిని రప్పించి, 'కర్తవ్య మేమో తెలుపుడు" అని వారిని కోరెను. జాంబవంతుడు శ్రీరాముని చరణములకు మ్రొక్కి, పలికెను. "ఓ సర్వజ్ఞా! ప్రాణుల అంతఃకరణములయందు వసించువాడా! బుద్ధిబలతేజములకును, ధర్మగుణములకును నిధానమైనవాడా! వినుడు. నాకుతోచిన సలహాను ఇచ్చెదను. వాలిపుత్రుడైన అంగదుని 'దూత'గా పంపుడు" ఈ ప్రతిపాదన అందఱికిని నచ్చెను. కృపాళువైన శ్రీరాముడు అంగదునితో పలికెను. "ఓ వాలి తనయా! బుద్ధిబలగుణనిధానమా! నాయనా! నా కార్యమునకై నీవు లంకకు ఏగుము. నీకు అంతగా ఉపదేశింప పనిలేదు. నీవు మిక్కిలి కార్యశూరుడవని నేను ఎఱుగుదును. మనపని సఫలమగునట్లును, శత్రువునకు హితమగునట్లును మాట్లాడుము. (చౌ॥ 1-4)

అంగద రాయబారము

శ్రీరామచంద్ర ప్రభువుఆజ్ఞను శిరసావహించి, ఆయన చరణములకు ప్రణమిల్లి అంగదుడు పలికెను. "ప్రభూ! మీ కృపకునోచుకొనినవారు సద్గుణ నిధులయ్యెదరు. మీ కార్యములన్నియును స్వయం సిద్ధములు. స్వామీ! నన్ను ఈ పనికి నియోగించి, ఆదరించితిరి" ఇట్లు పలుకుచుండగా అంగదుని హృదయము ఆనందతరంగితమైనది. శరీరము పులకితమైనది. (సో॥ 17. క,ఖ)

శ్రీరామచరణములకు వందనమాచరించి, ఆయన వైభవమును హృదయమున నిలుపుకొని, అందఱికిని నమస్కరించి, అంగదుడు బయలుదేఱెను. అతనిహృదయము ప్రభుప్రతాపపూర్ణమై యుండెను. రణధీరుడైన వాలిపుత్రుడు సహజముగా నిర్భయుడు. అతడు లంకానగరమును ప్రవేశింపగనే అక్కడ ఆటలలోనున్న రావణపుత్రుడు అతనిని కలిసికొనెను. ఆ ఇద్దఱి మధ్య మాటలుపెరిగినవి. ఇద్దఱును మిక్కిలి బలశాలురు, యువకులు. రావణకుమారుడు అంగదుని తన్నుటకై కాలెత్తెను. వెంటనే అంగదుడు వానికాలిని పట్టుకొని, గిరగిర త్రిప్పి నేలకేసి కొట్టి, అక్కడికక్కడే వానిని హతమార్చెను. రాక్షసులగుంపులు గొప్పయోధుడు వచ్చినాడని తలంచి, వారు వెంటనే పాఱిపోయిరి. భయముతో బిగ్గరగా అరవలేకపోయిరి. రావణకుమారునిమరణవార్త తెలిసియు, అందఱును మిన్నకుండిరి. ఒకరితోనొకరు రహస్యముగాగూడ సంభాషించుకొనరైరి. మునుపు లంకను గాల్చిన వానరుడే మఱలవచ్చినాడనువార్త నగరమంతయు ప్రాకెను. ఇకముందు విధాత మనకు ఎట్టి కీడు తలపెట్టునో యని అందఱును భయభ్రాంతులై విచారపడసాగిరి. అడుగకుండగనే వారు అంగదునకు రావణ సభామార్గమును జూపిరి. అంగదుని చూపులుపడినవారు అందఱును భయముతో వణకుచు శుష్కితులైరి. (చౌ॥ 1-5)

పిమ్మట ధీరవీరమహాబలుడైన అంగదుడు శ్రీరామచరణములను స్మరించుచు, సభాభవనద్వారము నొద్దకు చేరి, సింహపు ఠీవితో ఇటు నటు చూడసాగెను. (దో॥ 18)

వెంటనే అతడు ఒక రాక్షసునిద్వారా రావణునకు తనరాకను ఎఱిగించెను. అది వినగానే రావణుడు పరిహసించుచు "తీసికొని రమ్ము, ఎక్కడి వానరమో చూచెదము" అనెను. రావణుని 'అనుజ్ఞ కాగానే పెక్కుమంది రాక్షసులు పరుగు పరుగున వెళ్ళి, కపికుంజరుడైన అంగదుని పిలుచుకొని వచ్చిరి. ప్రాణముగల ఒక కాటుకకొండవలెనున్న నల్లని రావణుని అంగదుడు చూచెను. అతని భుజములు వృక్షములవలెను, తలలు గిరిశిఖరములవలెను ఉండెను. శరీరముపైగల రోమావళి పెక్కుతీగలవలె ఒప్పుచుండెను. నోళ్ళు, ముక్కులు, నేత్రములు, చెవులు పర్వతగుహలవలెను, బిలములవలెను ఉండెను. మహా బలశాలియు, సాటిలేని వీరుడును ఐన

వాలిసూనుడు ఏ మాత్రము జంకుగొంకులులేకుండ సభాభవనమును ప్రవేశించెను. అంగదుని గాంచి, సభాసదులందఱును లేచి నిలుచుండిరి. ఇది చూచి, రావణుని హృదయము క్రోధముతో ఉడికి పోయెను.

(చౌ॥ 1-4)

మదపుటేగులమధ్య సింహమువలె నిర్భయముగా అంగదుడు సభను ప్రవేశించి, శ్రీరాముని ప్రతాపమును స్మరించుచు తలనువంచి కూర్చుండెను. (దో॥ 19)

దశగ్రీవుడు "ఓరీ! వానరా! నీవెవ్వడవు?" అని ప్రశ్నించెను. అంగదుడు ఇట్లు ప్రత్యుత్తరము నిచ్చెను. "ఓ దశాననా! నేను రఘువీరుని దూతను. నా తండ్రి వాలికిని నీకును మైత్రియుండుటచే నీ మేలుగోరి ఇచటికి వచ్చితిని. నీది ఉత్తమవంశము. నీవు పులస్త్యమునిమనుమడవు. శివుని, బ్రహ్మను పెక్కురీతుల పూజించి యుంటివి. వారినుండి వరములను పొంది, నీ కార్యములనన్నింటిని సఫలమొనర్చుకొనియుంటివి. లోక పాలురను, సమస్తరాజన్యులను జయించితివి. రాజుననుగర్వముననను, మోహకారణముననను జగజ్జననియైన సీతాదేవిని అపహరించితివి. నీకు శుభప్రదమైన వచనమును తెలిపెదను వినుము. నా మాట వినినచో శ్రీరామచంద్ర ప్రభువు నీ అపరాధములను అన్నింటిని క్షమింపగలడు. పండ్ల (దంతముల) మధ్య ఎండు గడ్డిపోచను, కంఠమున గొడ్డలిని ఉంచుకొనుము. (అనగా ఆవువలె సరళస్వభావము గలిగి, వినమ్రతతో నీదురభిమానమును త్యజించి, శరణాగతుడవుకమ్ము.) నీ భార్యలను, పరివారములను వెంటనిడుకొని, సీతాదేవిని ముందుంచి, భయమును వీడి, ప్రభువునొద్దకు పొమ్ము.

(చౌ॥ 1-4)

'ఓ శరణాగత రక్షకా! రఘువంశ శిరోమణీ! నన్ను రక్షింపుము, రక్షింపుము' అని వేడుకొనుము. అపుడునీ ఆర్తనాదమును ఆలకించి, ప్రభువైన శ్రీరాముడు నిన్ను భయరహితునిగా జేయును." (దో॥ 20)

రావణుడు పలికెను. "ఓరీ! పిల్లకోతీ! మాటలను జాగ్రత్తగా రానిమ్ము. మూర్ఖుడా! దేవతలకు నేను శత్రువునని నీ వెఱుంగవు. నీ పేరును, నీ తండ్రి పేరును చెప్పుము. నీ తండ్రికిని నాకును మైత్రి ఎట్టిది?" అంతట అంగదుడు ఇట్లనెను. "నా పేరు అంగదుడు. నేను వాలికుమారుడను. నీవెప్పుడైనను మా తండ్రిని కలిసి యుంటివా?" అంగదుని మాటలను వినినంతనే రావణుడు కొంత జంకెను. పిమ్మట ఇట్లు పలికెను. "ఆ! ఔను, ఇప్పుడు జ్ఞప్తికి వచ్చినది. 'వాలి' అని ఒక వానరము ఉండెడిది. ఓరీ! అంగదా! నీవు వాలి కొడుకువా? కులనాశకుడా! నీ కులమనెడి వెదురు సమూహములమధ్య నీవు అగ్నివలె జన్మించితివి. నీవు నీతల్లి గర్భముననున్నప్పుడే ఏల మరణింపలేదు. నీజన్మ వ్యర్థము. తాపసులకు దూతగా వచ్చినట్లు నీవే చెప్పికొంటివి. వాలి క్షేమ సమాచారములను తెల్పుము. ఇప్పుడతడు ఎక్కడనున్నాడు?" అప్పుడు అంగదుడు నవ్వి, ప్రత్యుత్తరమిచ్చెను. పది దినముల తరువాత నీవే వాలి కడకు వెళ్లి, నీ మిత్రుని హృదయమునకు హత్తుకొని, అతని క్షేమసమాచారములను అడుగుదువు లెమ్ము. శ్రీరామునితో వైరముపెట్టుకొనినచో ఎట్టి క్షేమము కలుగునో అతడే నీకు తెలుపును. ఓరీ! శఠుడా! శ్రీ రఘువీరుడు ఉండని మనస్సులోనే నీభేదనీతి ప్రభావము ఏర్పడవచ్చును. (చౌ॥ 1-5)

ఓరీ! దశాననా! నిజమే. నేను కులనాశకుడను. నీవు కులరక్షకుడవు. ఈ మాటలను గ్రుడ్డి వారును, చెవిటి వారును సైతము పలుకరు. నీకు మాత్రము ఇఱువది కన్నులు, ఇఱువది చెవులును కలవు. (దో॥ 21)

శివుడు, బ్రహ్మ, మొదలగు దేవతలును, మునీశ్వరులును, శ్రీరామునిపాదసేవలకై ఉవ్విళ్లూరు చుందురు. అతని దూతగా వచ్చిన నేను నా కులమును నాశమొందించితినా? ఇట్టి బుద్ధిగల నీ హృదయమేల ముక్కలు కాలేదు?" అంగదుని పరుష వచనములను విని, రావణుడు కన్నులెఱ్ఱజేసి పలుక సాగెను. "ఓరీ! అధముడా! నేను

నీతిధర్మములను ఎఱింగినవాడను గావున నీ కఠోరవచనములను సహించితిని." అంగదుడు నుడివెను. "పరస్త్రీని దొంగిలించికొనివచ్చిన నీ ధర్మ శీలమును గూర్చి నేనును వినియుంటిని. దూత నేవిధముగా నీవు కాపాడితివో నేను స్వయముగా చూచితిని. ఓరీ! ధర్మాచరణ పరాయణా! నీటమునిగి ఏల చావవు? ముక్కుచెవులు కోయబడిన నీ చెల్లెలిని జూచి, నీవు ధర్మమును గూర్చి, ఆలోచించి, క్షమించినావా? నీ ధర్మశీలము జగద్విదితము. నీ దర్శనమైనందులకు మిక్కిలి అదృష్టవంతుడను." (చౌ॥ 1-4)

రావణుడు వచించెను. "ఓరీ! మూఢుడా! వానరుడా! వ్యర్థప్రలాపములను చేయవలదు. శఠుడా! నాభుజములను చూడుము. లోకపాలురవిశాలబలమనెడి చంద్రుని గ్రసించుటలో రాహువువంటివి. ఆకాశమనెడి సరోవరమున నా భుజములనెడి కమలములపై కైలాససహితముగా శివుడు హంసవలె శోభిల్లిన విషయమును నీవు వినియే యుందువు. (దో॥ 22. క,ఖ)

అంగదా! వినుము. మీ సేనలో నన్ను ఎదిరింపగల సాహసి ఎవ్వడో తెలుపుము. నీ ప్రభువు తనభార్యా విరహముతో దుర్బలుడైనాడు. ఆయనదుఃఖములో పాలుపంచుకొనిన అతని తమ్ముడు శక్తిహీనుడైనాడు. నీవును, సుగ్రీవుడూ నదీతీరముననున్న వృక్షములవంటివారు. (వరదలు వచ్చినచో నిలువజాలనివారు) నా తమ్ముడు విభీషణుడు ఉత్త పిఱికివాడు. మంత్రి జాంబవంతుడు వృద్ధుడు. అతడును యుద్ధములో నిలువజాలడు. నలుడును, నీలుడును శిల్పకర్మను దప్పవేఱేమియును ఎఱుగరు? ఐతే ఒక్క వానరుడు మాత్రము ఆ సేనలో బలిష్ఠుడు గలడు . అతడు మునుపు వచ్చి, లంకను కాల్చి వెళ్లినాడు" ఇది వినగానే వాలి సుతుడైన అంగదుడు పలికెను. "రాక్షస రాజా! రావణా! సత్యము వచింపుము. ఆ వానరుడు నిజముగా నీ నగరమును కాల్చియుండెనా? విశ్వవిజేతయైన రావణునినగరమును ఒక చిన్నవానరము కాల్చ గలదా? ఈ మాటలు సత్యములని నమ్ముట యెట్లు? ఓ రావణా! ఉత్తమయోధుడని నీవు పొగడిన వాడు సుగ్రీవుని పనికై పరుగెత్తు చిన్న సంచారదూత మాత్రమే. అతడు ఎక్కువ దూరము నడువగలడు. వీరుడుగాడు. కేవలము వార్తలను తెలిసికొనివచ్చుటకై అతనిని మేము పంపియుంటిమి.

(చౌ॥ 1-5)

ఆ వానరుడు నిజముగా తన ప్రభువాజ్ఞలేనిదే మీ నగరమును కాల్చినాడా? ఆ భయమువలననే అతడు మఱల సుగ్రీవుని యొద్దకు రాకుండ ఎక్కడో దాగికొనినాడు. దశకంఠా! నీవు నుడువునది సత్యమే. ఆ సమాచారమును వినిన నాకు ఏ మాత్రము కోపము వచ్చుట లేదు. నిజముగా మా సేనలో నీతో పోట్లాడుటవలన ఎవ్వరికినీ శోభ చేకూరదు. ప్రేమగాని, విరోధముగాని సమానులతో పెట్టుకొనవలెను. (వియ్యానికీ కయ్యానికీ ఈడూ, జోడూ కావలెను.) ఇదియే లోక నీతి. సింహము కప్పలను చంపినచో అది సింహమునకు గొప్పదనమును తెచ్చిపెట్టునా? అట్లే నిన్ను చంపుట వలన శ్రీరామునకు గొప్పదనము రాబోదు. సరిగదా అది దోషము గూడ. ఐనను దశాననా! వినుము. క్షత్రియుల కోపము అతిభయంకరము" వ్యంగ్యరూపధనుస్సునుండి వదలిన అంగదుని వచన బాణములు రావణునిహృదయమును కాల్చివేసెను. రావణుడు ఆ బాణములను తన ప్రత్యుత్తర వచనములనెడి పటకార్లతో తీసివేయసాగెను. అతడు నవ్వుచు పలికెను. "తనను పోషించిన వాని హితమునకై పెక్కు ఉపాయములను ఆశ్రయించుట వానరుని ఉదాత్తగుణము.
(దో॥ 23. క, ఖ, గ, ఘ, జ, చ)

తన యజమాని సేవలో సిగ్గు విడిచి ఎక్కడైనను సరే నాట్యము చేయు వానరజాతి ధన్యము. నాట్యము చేయుచు, గంతులు వేయుచు, ప్రజలను సంతోషము పెట్టి, వానరము తన యజమానికి మేలు చేయును. ఇది దాని ధర్మనిరతికి తార్కాణము. అంగదా! మీ జాతి వారందఱును స్వామిభక్తిపరాయణులే. కావున నీ స్వామి గుణములను పొగడకుండ ఎట్లుండ గలవు? నేను సద్గుణములను ఆదరించెదను, చతురుడను. కావున నీ కఠోర

వాచాలత్వమునుగూడ నేను పట్టించు కొనలేదు." అంగదుడు పలికెను. "నీ గుణగ్రహణ లక్షణము సత్యము. నాకు హనుమంతుడు వినిపించెను. అతడశోకవనమును నాశమొనర్చి, నీ పుత్రుని సంహరించి, నీ నగరమును బుగ్గి చేసెను. ఐనను నీవు గుణగ్రాహివి గనుక అతడు నీకెట్టి కీడును తలపెట్టియుండలేదు. నీ మంచి స్వభావమును, విషయములన్నింటిని నేనిప్పుడు ప్రత్యక్షముగా చూచితిని. నీకు సిగ్గులేదు, కోపము లేదు, రోతయును లేదు." అప్పుడు రావణుడు "ఓరీ! వానరుడా! నీవింతటి బుద్ధిశాలివగుటవలననే నీ తండ్రి మృతికి కారణమైతివి." అని పల్కుచు అట్టహాసము చేసెను. అంగదుడు పలికెను. "నా తండ్రికే గాదు నీ మరణమునకును కారణమయ్యెదను. ఇప్పుడే నా మనస్సునకు ఒక విషయము తట్టినది. ఓరీ! అధమాభిమానీ! నీవు వాలినిర్మలయశస్సునకు ప్రత్యక్ష ప్రమాణమగుటచే నిన్ను చంపుట లేదు. ఓరీ! రావణా! ప్రపంచములో రావణులు ఎంతమంది కలరు? నాకు తెలిసిన రావణులను గూర్చి నేను తెలిపెదను. ఒక రావణుడు బలిచక్రవర్తిని జయించుటకై పాతాళమున కేగగా అక్కడి పిల్లలు వానిని గుఱ్ఱపుశాలలో కట్టివేసి ఆడుకొనుచు వానిని తమ కాళ్ళతో తన్నుచుండిరి. బలికి అతనిపై దయ గలిగి విడిపించెను. మఱొక రావణుని సహస్రబాహువు చూచి, జంతువిశేషముగా భావించి, పరుగెత్తి పట్టుకొనెను. కుతూహలముతో తనయింటికి తీసకొని వెళ్లగా పులస్త్యముని వానిని విడిపించెను. (చౌ॥ 1-8)

మఱియొక రావణుని గూర్చి తెల్పుటకు నాకు సంకోచముగా నున్నది. వానిని వాలి చాలకాలము తన చంకలలో ఇరికించుకొనెను. వీరిలో నీవు ఏ రావణుడవు? కోపగింపక నిజము పలుకుము." (దో॥ 24)

రావణుడిట్లు పలికెను. ఓరీ! మూర్ఖుడా! నా భుజపరాక్రమమునుగూర్చి శివునికైలాసమునకు తెలియును. నా శిరస్సులను పుష్పములుగా ఉమాపతికి సమర్పించి పూజించితిని. నేను ఆ రావణుడను. నా శిరస్సులనెడి కమలములను పెక్కు పర్యాయములు త్రిపురారికి సమర్పించి, ఆయనను సేవించితిని. ఓరీ! శఠుడా! నా భుజ పరాక్రమము దిక్పాలురకు తెలియును. వారి హృదయములపై నేర్పఱచిన గాయములు ఈ నాటికిని ఉన్నవి. నా గుండెలగట్టితనము దిగ్గజములును ఎఱుంగును. ఏలనన నేను వాటితో తల పడినప్పుడు అవి తమభయంకరములైన కోఱలతో నా వక్షఃస్థలమును క్రుమ్మినవి. ఐనను ఒక్క మచ్చను గూడ ఏర్పఱచలేక పోయినవి. పైగా ఆ దంతములే ముల్లంగికాడలవలె ముక్కలు ముక్కలైనవి. మదపుటేనుగు ఎక్కిన చిన్న నావవలె నేను నడచునపుడు భూమి డోలాయమానమగును. జగత్ప్రసిద్ధుడైన ఆ రావణుడను నేను. ఓరీ! వ్యర్థప్రలాపీ! నా గుఱించి ఎప్పుడు విని యుండలేదా? (చౌ॥ 1-4)

అట్టి ప్రతాపశాలియైన రావణుని అల్పునిగా భావించి, ఒక మనుష్యమాత్రుని పొగడుచున్నావు. దుష్టుడా! అసభ్యవర్తనుడా? తుచ్ఛవానరుడా నీ బుద్ధి తెలిసినది." (దో॥ 25)

రావణుని వచనములను విని, అంగదుడు మిక్కిలి క్రుద్ధుడై పలికెను. "ఓరీ! అధముడా! దురభిమానీ! ఆలోచించుకొని మాట్లాడుము. తేజఃప్రతాపశాలియైన భార్గవ రామునిపరశువనెడి దావాగ్నికి సహస్ర బాహువుయొక్క భుజములనెడి వనము ఆహుతియైనది. ఆయన గండ్రగొడ్డలితీక్ష్ణధారాసముద్రములో అసంఖ్యాకులైన రాజులు మునిగి పోయిరి. అట్టి పరశురాముని గర్వము శ్రీరాముని చూడగానే పాఱిపోయెను. అట్టి మహితాత్ముడైన శ్రీరాముడు మానవమాత్రుడెట్లగును? మూర్ఖుడా! శ్రీరాముడు సామాన్య మానవుడా? మన్మథుడు సామాన్య ధనుర్ధారియగునా? గంగాదేవి సర్వ సాధారణ నదియా? కామధేనువు సామాన్యమైన పశువా? కల్పవృక్షమొక సాధారణ పాదపమేనా? అన్నదానము ఒక సామాన్య దానమా? అమృతమొక సాధారణ రసమా? గరుడుడు ఒక సామాన్య పక్షియా? సహస్ర ముఖుడైన శేషుడు ఒక సాధారణసర్పమా? చింతామణి ఒక సామాన్యమైన ఱాయియా? మూర్ఖుడా! వైకుంఠము ఒక సాధారణలోకమా? శ్రీ రఘురామునిపై గల అఖండభక్తి ఇతర లాభములవలె సర్వసామాన్యమైనదా? (చౌ॥ 1-4)

సైన్య సహితముగా నీ మదమణచి, అశోక వనమును ధ్వంస మొనర్చి, నీ 'అక్ష' కుమారుని హతమార్చి, లంకను గాల్చి, హాయిగా తిరిగి వెళ్లిన హనుమంతుడు వానరమాత్రుడనుకొంటివా? (దో॥ 26)

రావణా! కపటమును వీడి, కరుణాళువైన శ్రీ రఘురాముని భజింపుము. దుష్టుడా! నీవు శ్రీరామ ప్రభువుతో ఇట్లే శత్రుత్వమును పెంచుకొన్నచో నిన్ను ఆ బ్రహ్మ రుద్రాదులును కాపాడలేరు. మూఢుడా! వ్యర్థముగా నీ గొప్పలు చెప్పికొనవలదు. శ్రీరామునితో వైరము పెంచుకొనినచో ఆయన బాణముల తాకిడితో నీ శిరస్సులన్నియు తెగి, వానరుల పాదములముందు పడును. భల్లూకములు, వానరులు నీ తలలతో బంతులాటలాడెదరు. క్రుద్ధుడైన రఘురాముడును యుద్ధములో కోపగించి భయానకబాణములను సంధించి వదలినప్పుడు నీవిట్లే ప్రగల్భములాడెదవా? ఈ విషయమును యోచించి, కృపాళువైన శ్రీరాముని భజింపుము" అంగదుని వచనములను విని, మండుచున్న అగ్ని జ్వాలలలో ఆజ్యము పోసినట్లు రావణుడు పట్టరాని క్రోధముతో అత్యుగ్రుడాయెను.

(చౌ॥ 1-4)

అతడు పలికెను. "మహాబలశాలియైన కుంభకర్ణుడు నాకు సోదరుడు. ఇంద్రుని జయించి, వాసికెక్కిన మేఘనాదుడు నా కుమారుడు. నేను ఈ చరాచర జగత్తునంతయును జయించితిని. నా పరాక్రమమును గూర్చి నీవు వినలేదు. (దో॥ 27)

ఓరీ! శఠుడా! వానరులసహాయముతో నీ స్వామి సేతువును గట్టెను. ఇది యొక ఘనకార్యమా? సముద్రమును పెక్కుపక్షులు లంఘించును. కాని అవియన్నియును శూరులలో చేరవు. ఓరీ! మూర్ఖ వానరమా! వినుము. నా ఒక్కొక్క బాహువనెడి సాగరము బలమనెడి జలములతో నిండియున్నది. అందులో పెక్కుమంది వీరులైన దేవతలును, మనుష్యులును, మునిగి అసువులను వీడిరి. నా ఈ ఇఱువది అగాధ సముద్రములను దాటగల్గిన వీరుడును, శూరుడును అగు వాడెవ్వడో తెలుపుము. నేను దిక్పాలురతో వెట్టి చాకిరి చేయించుచున్నాను. నీవు ఒక రాజు కీర్తిని నాకు వినిపించుచున్నావు. నీచే పదే పదే కీర్తింపబడుచున్న గుణములను గల్గినవాడు నిజముగా యోధుడేయైనచో దూతను పంపుట యెందులకు? శత్రువునకు ప్రీతిగూర్చుటకు అతనికి సిగ్గు వేయుటలేదా? కైలాసపర్వతమునే పైకెత్తిన నా భుజములను మొదట చూడుము. ఓ మూర్ఖవానరుడా! తరువాత నీ ప్రభువును పొగడుము. (చౌ॥ 1-4)

ఈ రావణునితో సమానుడగు శూరుడు ఎవ్వడో చెప్పుము. నేను స్వయముగా నా చేతులతో నా తలలను కోసి, సంతోషముగా వాటిని పెక్కు మార్లు అగ్నికి ఆహుతిగానిచ్చితిని. గౌరీ పతియైన శివుడే ఇందులకు సాక్షి. (దో॥ 28)

నా మస్తకములు అగ్నిలో కాలునప్పుడు ఒక మానవునిచే నేను మరణించుదునని నా లలాటమున బ్రహ్మ వ్రాసిన వ్రాతను జూచి, నాకు నవ్వువచ్చినది. విధాతవ్రాతలు అసత్యములు. దానిని తలచినను నాకు భయము కలుగదు. ఏలనన వృద్ధుడైన బ్రహ్మ మతిభ్రమించి, అట్లు వ్రాసియుండునని నా అభిప్రాయము. ఓరీ! శఠుడా! మర్యాద లేకుండ సిగ్గు విడిచి నీవు నా యెదుట మాటిమాటికిని వేఱొక పురుషుని వీరునిగా పొగడుటకు నీకెన్ని గుండెలు?" అంగదుడు నుడివెను. "ఓరీ! రావణా! నీ వంటి సిగ్గుదప్పినవాడు ప్రపంచములో మఱియొకడు ఉండడు. తలవంపుల జీవనము నీకు సహజము. లేనిచో నీ గుణములను నీవే కీర్తించుకొనవు. తలలను నఱుకుకొనుట, కైలాసమునెత్తుట, ఈ రెండు విషయములే నీకు ఘనకార్యములుగా తోచుచున్నట్లున్నవి. అందులకే లెక్కలేనన్ని సార్లు వాటిని గూర్చి వల్లించుచుంటివి. ఆ భుజముల బలమునే హృదయమున దాచికొని యుంటివి. దానివలనే సహస్ర బాహువును, బలిని, వాలిని జయించితివి. ఓరీ మందబుద్ధీ! వినుము. ఎక్కువగా వదరకుము. మస్తకములను తెగగోసికొనుటవలన ఎవ్వడైనను. శూరుడగునా? తన చేతితోడనే తన దేహమును కోసికొను గారడీవాడు (ఇంద్ర జాలికుడు) వీరుడగునా? (చౌ॥ 1-5)

ఓరీ! బుద్ధి హీనుడా? దీపపు పురుగులు మోహవశమున అగ్నిలోబడి చనిపోవును. గాడిదలు బరువులు మోయుచు నడచును. వాటిని శూరులు, వీరులు అనియందుమా? (దో॥ 29)

ఓరీ! దుష్టుడా! ఇంక వివాదమును పెంచవలదు. నా మాట వినుము. గర్వమును మానుము. నేను దూత వలె సంధిచేయుటకు రాలేదు. శ్రీ రఘువీరుడు మఱియొక ఆలోచనతో నన్ను ఇక్కడికి పంపినాడు. 'గుంట నక్కను చంపుటవలన సింహమునకు కీర్తి రాదు.' అని, కృపాళువైన శ్రీరాముడు మాటి మాటికిని అనుచుండెడి వాడు. ఓరీ! దుర్మార్గుడా! ప్రభువులవచనములఅంతర్యమును గ్రహించి, నీ కఠోర వచనములను సహించినాను. లేనిచో నీ ముఖములను అన్నింటిని భగ్నములు గావించి, సీతాదేవిని తీసికొని పోయి యుండెడి వాడను. దుష్టుడా! ఓరీ! సురవైరీ! ఒంటరిగా నున్న పరస్త్రీని దొంగిలించినప్పుడే నీ శక్తి యెట్టిదో తెలిసినది. నీవు రాక్షసరాజువు. దురభిమానివి. కాని నేను శ్రీ రఘునాథుని సేవకుడైన సుగ్రీవుని దూతను. శ్రీరాముని యశస్సునకు భంగము వాటిల్లునను భయమున నేను మిన్నకుంటిని. (చౌ॥ 1-4)

లేనిచో నిన్ను భూమిపై పడగొట్టి, నీ సైన్యమును హతమార్చి, నీ నగరమును నాశమొనర్చి, సీతాదేవిని, నీ కుటుంబినులను తీసికొని వెళ్లియుండెడి వాడను. (దో॥ 30)

ఒకవేళ నేను అట్లొనర్చినను నాకే మాత్రమూ గొప్పదనము రాబోదు. ఏలనన చచ్చినవానిని చంపుటలో పౌరుషమేమున్నది? వామమార్గమును అనుసరించువాడు, కామాతురుడు, లోభి, అత్యంత మూఢుడు, అతి దరిద్రుడు, కళంకము గలవాడు, అతి వృద్ధుడు, దీర్ఘ రోగి, నిరంతర క్రోధి, శ్రీ మహా విష్ణువునకు విముఖుడు వేదములకును, సజ్జనులకును విరోధి, అనవరతము తనశరీరపోషణచేసికొనువాడు, పరనిందాపరుడు, మహా పాపి,- ఈ పదునాలుగు మందియు బ్రతికి యున్నను చచ్చిన వారితో సమానులే. ఓరీ! దుష్టుడా! ఇట్లు భావించుటవలన నిన్ను వధింపకుంటిని. ఇప్పుడు నాకు కోపము తెప్పింపవలదు." అంగదుని మాటలకు మండిపడుచు రావణుడు పండ్లు పటపటపట కొఱుకుచు, చేతులు నలుపు కొనుచు బిగ్గరగా అఱచెను. "ఓరీ! వానరాధమా! నీకు చావు మూడినది. 'పిట్టకొంచెము-కూత ఘనము'- అన్నట్లైనది. ఓ మూర్ఖ వానరుడా! నీవెవని బలము చూచుకొని, మిడిసిపడుచున్నావో అతనికడ బలము ప్రతాపము, బుద్ధి, తేజస్సు ఏమాత్రమూ లేవు. (చౌ॥ 1-4)

గుణహీనుడనియు, మానరహితుడనియు, ఎఱింగియే అతనితండ్రి అతనిని వనవాసమునకు పంపెను. ఒక వైపు ఈదుఃఖము, దానికితోడు తన భార్యావిరహ బాధ మఱియొకవైపు అహర్నిశలు నావలని భయము అతనిని పట్టి పీడించుచున్నవి. అట్టి వానిని (మానవుని) బలవంతుడనుకొని గర్వపడుచున్నావు. అట్టి మానవులను మా రాక్షసులు రాత్రింబవళ్లు భక్షించుచునేయున్నారు. నీవు హఠముమాని సరిగా ఆలోచింపుము. (దో॥ 31.క.ఖ.)

రావణుడు శ్రీరామ ప్రభువును నిందించుటచే కపివరుడైన అంగదుడు మిక్కిలి క్రుద్ధుడాయెను. ఏలనన హరి హరులనిందను వినువానికి గోహత్యా పాపము వచ్చును. వానర శ్రేష్ఠుడైన అంగదుడు కోపముతో పండ్లు పటపట కొఱికెను. తన రెండు హస్తములతో వేగముగా నేలను టపటప కొట్టెను. భూమి అదిరెను. సభాసదులు క్రింద పడిరి. భయవాయుగ్రస్తులై పరుగులు దీసిరి. రావణుడు పడుచు, లేచుచు తమాయించు కొని నిలబడెను. కాని అతని సుందర కిరీటములు నేల వ్రాలెను. కొన్నింటిని తీసికొని, రావణుడు తన తలలపై ధరించెను. మఱికొన్నింటిని అంగదుడు శ్రీరామచంద్రుని కడకు విసరివేసెను. ఆ మకుటముల రాకను జూచి, వానరులు గంతులు వేయుచు అఱచిరి. "విధాతా! పగలే చుక్కలు రాలుచున్నవా? లేక రావణుడు కోపముతో అతివేగముగా నాలుగు వజ్రాయుధములను పంపెనా?" శ్రీరామచంద్ర ప్రభువు నవ్వుచు పలికెను. "భయపడకుడు. ఇవి ఉల్కలుగావు.

వజ్రములు కానే కావు. రాహుకేతువులును గారు. ఇవి దశాననుని కిరీటములు, వాటిని అంగదుడు విసరివేయుటవలన అవి ఇచటికి వచ్చి పడుచున్నవి. (చౌ॥ 1-5)

వాయుసుతుడైన ఆంజనేయుడు ఎగిరి వాటిని తన చేతులతో పట్టుకొనెను, వాటిని తీసికొని వచ్చి ప్రభువు ముందుంచెను. సూర్యప్రభలవలె ప్రకాశించుచున్న ఆ కిరీటములను భల్లూకవానరులు ఆశ్చర్యముతో తిలకించిరి. అక్కడ క్రుద్ధుడైన దశాననుడు అందఱిపై కోపపడుచు 'ఈ వానరుని పట్టుకొనుడు, చంపి వేయుడు' అని అఱచెను. అది విని అంగదుడు ఆ (సరే! అని అనుకొని ఒక చిఱునవ్వు నవ్వెను. (దో॥ 32. క,ఖ)

రావణుడు మఱల పలికెను. "వీనిని చంపి, యోధులందఱును వెళ్లి, భల్లూకములను, వానరములను దొరకినచోట దొరకినట్లు పట్టుకొని, చంపుడు, తినుడు. ఈ నేలపై వానరజాతియే లేకుండునట్లు చేయుడు. ఆ తాపససోదరులిద్దఱిని బంధించి, ప్రాణములతో తీసికొని రండు" రావణుని క్రోధపూరితములైన అనుచితవచనములను విని, యువరాజైన అంగదుడు క్రుద్ధుడై పలికెను. "ఓరీ! ఈ విధముగా ప్రేలుటకు నీకు సిగ్గులేదా? లజ్జాహీనుడా! కులనాశకుడా! నీ గొంతును నీవే ఖండించుకొని చావుము. నా బలమును చూచిన తరువాతగూడ నీ గుండె పగులలేదా? ఓరీ! స్త్రీ చోరుడా! దుర్మార్గుడా! దుష్టుడా! మూర్ఖుడా! పాపాత్ముడా! కాముకుడా! సన్నిపాతవశమున దుర్భాషలాడుచున్నావు. నరభక్షకుడా! నీకు చావు మూడినది. వానరములు, భల్లూకములు నిన్ను చుట్టుముట్టి ముష్టిఘాతములు చేసినపుడు నీ పాపఫలమును అనుభవించెదవు. శ్రీరాముడు మానవుడా? ఇట్లు మాట్లాడిన నీనాలుకలు ఏల తెగిపడవు? అవి శిరస్సులతో గూడ రణభూమిలో క్రింద పడును. దీనికి సందేహమే లేదు. (చౌ॥ 1-5)

ఓరీ!దశకంఠా! ఒకే బాణముతో వాలిని వధించిన శ్రీరాముడు మానవమాత్రుడా? నీ ఇఱువది కన్నులు గూడ గ్రుడ్డివే. జడుడా! ఛీ! నీ జన్మగూడ నీచమైనదే. శ్రీరాముని బాణములు నీ రక్తమునకై దప్పిగొన్నవి. అందులకే నీ పిచ్చి పిచ్చి వాగుడును సహించి విడిచి పెట్టుచున్నాను. (సో॥ 33. క,ఖ)

నేను నీ పండ్లను ఊడగొట్టగలను. కాని అందులకు రఘునాథుని ఆజ్ఞ లేదు. నీ తలలను పగుల గొట్టవలెనన్నంతగా, నీలంకను సముద్రముతో ముంచివేయవలెనన్నంతగా కోపము వచ్చుచున్నది. నీ లంక మేడిపండు వంటిది. మీ రాక్షసులందఱును పురుగులవలె అజ్ఞానవశమున నిర్భయముగా అందు నివసించు చున్నారు. నేను వానరుడను. పండ్లను తినుటకు నాకెంతో కాలము పట్టదు. కాని ఉదారుడైన శ్రీరాముని ఆదేశము లేదు. "అంగదుని యుక్తి యుక్తములైన మాటలను విని, రావణుడు పరిహాసముతో పలికెను. "ఓరీ! మూఢుడా! ఇట్టి అబద్ధములను ఎచ్చట నేర్చితివి. వాలి సైతము ఎన్నడును ఇట్టి ప్రగల్భములను పలుక లేదు. బహుశా ఆ తాపసులతోగూడి అబద్ధములను, ప్రగల్భములను నేర్చితివేమో?" పిమ్మట అంగదుడు నుడివెను. "ఓరీ! ఇఱువది భుజముల రావణుడా! నీ పదినాల్కలను కోసి వేయనిచో నేను నిజముగా ప్రగల్భములను, అసత్యములను పలికెడి వాడనే." శ్రీరామచంద్రుని ప్రతాపమును స్మరించుచు, అంగదుడు క్రుద్ధుడై, సభామధ్యమున నేలపై పాదమును గట్టిగా మోపుచు ప్రతిజ్ఞా పూర్వకముగ ఇట్లు పలికెను. "ఓరీ శఠుడా! నీవు నాకాలిని కదిలింప గలిగినచో శ్రీరాముడు తిరిగి వెళ్ళి పోగలడు. సీతాదేవినిగూడ వదలుకొనగలడు-" రావణుడు తన యోధులతో అనెను. "ఓ వీరులారా! వినుడు. ఈ వానరుని కాళ్లను పట్టుకొని నేలపై పడగొట్టుడు" ఇంద్రజిత్తు మొదలగు పెక్కుమంది బలిష్ఠులైన యోధులు హర్షముతో ఎక్కడి వారక్కడ లేచినిలుచుండిరి. వారుతమబలమును పూర్తిగా ఉపయోగించి, కాలును కదుపుటకు పెక్కు ఉపాయములను నడిపిరి. కాలు కొంచెము గూడ కదలలేదు. మొగములను వ్రేలాడవేసికొని తిరిగి వెళ్లి తమ తమ ఆసనములపై కూర్చుండిరి. (కాక భుశుండి పలుకు చున్నాడు) ఆ దేవతా శత్రువులందఱును ఒక్క

సారిగా రివ్వున లేచి వచ్చి, అతని కాలిని పట్టుకొనిరి. కాని ఓ గరుడుడా! విషయవాసనాపరుడైన మనుజుడు తన మనస్సునుండి మోహవృక్షమును కదలింపలేనట్లు వారు అంగదుని పాదమును చీమంతైనను కదలింప లేకపోయిరి.

(చౌ॥ 1-7)

మేఘనాదునితో సమానమైన బలముగల అసంఖ్యాకులైన యోధులు హర్షముతో లేచి తలపడిరి. కాని అంగదుని కాలు ఏ మాత్రమూ కదలలేదు. వారందఱును సిగ్గుతో తలలు వంచుకొని, తమ తమ పీఠములపై ఆసీనులైరి. కోటి విఘ్నములు ఎదురైనను సజ్జనునిమనస్సు నీతిని వదలనట్లు అంగదుని చరణము ఆవంతైనను చలింపలేదు. ఇది చూచి శత్రువు యొక్క గర్వము అణగిపోయెను. (దో॥ 34. క,ఖ)

కపిరాజైన అంగదుని బలమును జూచి, రాక్షసులు తమ మనస్సులలోనే ఓటమిని అంగీకరించిరి. అపుడు వానరుని ప్రేరణతో రావణుడే స్వయముగా లేచెను. అతడు అంగదునిపాదమును పట్టుకొనుటకు సిద్ధపడగా వాలి పుత్రుడు పలికెను. "నా కాళ్లు పట్టుకొనినంత మాత్రమున నిన్ను ఎవ్వరును రక్షింపరు. ఓరీ! శఠుడా! నీవు వెళ్లి శ్రీరాముని పాదములను ఎందుకు పట్టుకొనవు?" ఇది విని మనస్సులోనే సిగ్గుపడుచు రావణుడు మఱలిపోయెను. అతడు తనతేజస్సును కోల్పోయెను. మధ్యాహ్నకాలమునందలి చంద్రునివలె అతడు కాంతిహీనుడయ్యెను. తలలు వంచుకొని తనసింహాసనముపై కూర్చుండెను. తన సంపదనంతయును పోగొట్టుకొనినవానివలె ఉండెను. (శివుడు పలుకుచున్నాడు) ఉమా! శ్రీరామచంద్రుడు జగత్తునకు ఆత్మ. అందఱి ప్రాణములకు స్వామి. అతనికి ప్రతికూలుడైన వానికి సుఖ శాంతులు ఎట్లు లభించును? ఆయనకనుసన్నలతోడనే (సంకల్ప మాత్రముననే) జగత్ సృష్టి, స్థితి, లయములు జరుగుచుండును. అతడు గడ్డిపోచను వజ్రముగను, వజ్రమును గడ్డిపోచగను మార్చగల మహిమాన్వితుడు. అతని దూతకు ప్రతిజ్ఞా భంగమెట్లగును? పిమ్మట అంగదుడు అనేకవిధముల నీతివాక్యములను పలికెను. కాని రావణుడు వాటిని పెడచెవిన బెట్టెను. ఏలనన వానికి చావు సమీపించినది. శత్రుగర్వమునణచి, అంగదుడు శ్రీరామునినిర్మలకీర్తిని వినిపించెను. మఱల వాలిపుత్రుడు ఈ విధముగా పలుకుచు పోయెను. "ఆడుచుపాడుచు (పిల్లి ఎలుకను వలె) రణభూమిలో నిన్ను హతమార్చునంత వఱకు నా గొప్పదనమును గూర్చి నేను తెల్పను." అంగదుడు రాజసభకు రాక పూర్వమే తన కుమారుని చంపినాడను విషయము నెఱింగి, రావణుడు మిగుల దుఃఖపడెను. అంగదుని ప్రతిజ్ఞ సఫలమగుటను జూచి, రాక్షసులందఱును భయకంపితులైరి. (చౌ॥ 1-7)

శత్రుబలమును నిర్వీర్యమొనర్చి, బలశాలియైన వాలిపుత్రుడు ప్రసన్నచిత్తుడై మఱలి వచ్చి శ్రీరామచంద్రుని చరణ కమలములపై వ్రాలెను. అతనితనువు పులకించెను. కనులు ఆనందాశ్రు పూర్ణములయ్యెను. సంధ్యా సమయమైనందున రావణుడు విచార గ్రస్తుడై తన భవనమునకేగెను. మందోదరి మఱల తనపతికి ఇట్లు నచ్చజెప్పసాగెను. (దో॥ 35. క,ఖ)

ప్రాణేశ్వరా! బాగుగా ఆలోచించి, మీ దురాలోచనలను వీడుడు. మీకును శ్రీ రఘునాథునకును మధ్య యుద్ధము తగదు. (అతనితో యుద్ధము చేయుటకు మీరు యోగ్యులు కారు.) అతని తమ్ముడైన లక్ష్మణుడు గీచిన గీతనుగూడ మీరు దాటలేకపోయితిరి. ఇదియే మీ సామర్థ్యము. అతని దూతయెన్నో ఘనకార్యములాచరించెను. అట్టి ప్రభువును మీరు యుద్ధమున జయింపగలరా? ప్రాణనాథా! ఆ కపిసింహము హనుమంతుడు అవలీలగా సముద్రమును లంఘించి, మీ లంకలో నిర్భయముగా ప్రవేశించెను. అశోకవనములోని రక్షకులను వధించి, దానిని ధ్వంసము చేసెను. మీరు చూచుచుండగనే అక్షకుమారుని వధించెను. లంకను పూర్తిగా కాల్చి బూడిద చేసెను. అప్పుడు మీ బలగర్వమేమైనది? స్వామీ! ఇప్పుడు ఈ అసత్యడంబములను పలుకవద్దు. నా మాటలను శ్రద్ధగా ఆలకింపుడు.

స్వామీ! శ్రీరామచంద్రుని కేవలము ఒక రాజుగా భావింపకుడు. అయనను చరాచరజగత్తునకు ప్రభువుగా, అద్వితీయపరాక్రమశాలిగా ఎఱుంగుడు. అతని బాణధాటిని మారీచుడు ఎఱింగియుడెను. కాని మీరు అతని సలహానుగూడ వినలేదు. అతని మాటలను చులకనచేసితిరి. జనకునిసభలో పెక్కుమంది రాజులుండిరి. అసమాన బలశాలురైన మీరుగూడ అక్కడనే యుంటిరి. ధనుర్భంగమొనర్చి, అతడు జానకిని వివాహమాడెను. అప్పుడు యుద్ధములో అతనిని మీరేల జయింపలేదు? ఇంద్రునికుమారుడైన జయంతుడు (వాయసము) అతని బలమును కొంత యెఱుగును. శ్రీరాముడు కేవలము ఒక కంటిని మాత్రమే పోగొట్టి, అతనిని ప్రాణములతో విడిచి పెట్టెను. శూర్పణఖదుర్దశను మీరు స్వయముగా చూడనే చూచితిరి. ఐనను 'అతనితో పోరాడగలన'ని తలంచుటకు మీకు సిగ్గువేయుట లేదా? (చౌ॥ 1-7)

ఓదశకంఠా! విరాధుని, ఖరదూషణాదులను చంపి, లీలా మాత్రముగా కబంధుని వధించి, ఒకే బాణముతో వాలిని సంహరించిన శ్రీరాముని అవక్రపరాక్రమమును స్మరింపుడు. ఈ సంఘటనలనన్నింటిని మీరును ఎఱుగుదురు. దీనివలననైనను శ్రీరాముని మహత్త్వ మును తెలిసికొనుడు. (దో॥ 36)

అనాయాసముగా సముద్రముపై వారధిని నిర్మించి, తనసైన్యముతోగూడి సువేలపర్వతముపై దిగిన సూర్యవంశ శ్రేష్ఠుడు కరుణామయుడును ఐన శ్రీరామచంద్ర ప్రభువు మీ హితమును గోరియే తనదూతను పంపెను. ఆ దూత నిండుసభలో ఏనుగుల గుంపులో సింహమువలె మీ బలమును నిస్తేజమొనర్చెను. అట్టి హనుమంతుడు, అంగదుడు మొదలగు మహాయోధులు పెక్కుమంది ఆయనకు సేవకులుగా ఉన్నారు. అట్టి మహావీరుని మీరు మాటి మాటికిని 'మానవుడు' 'తాపసుడు' అని పలుకుచు, అభిమానగర్వమమకార భారములను మూర్ఖముగా మోయుచున్నారు. ప్రియా! నాథా! శ్రీరామునితో వైరము పూనుట దుఃఖహేతువు. కాలుని వశమగుటచే మీకు జ్ఞానోదయమగుట లేదు. కాలుడు తన దండముతో నెవ్వరినీ కొట్టడు. కాని ధర్మమును, బలమును, బుద్ధిని విచక్షణాశక్తిని హరించును. స్వామీ! కాలము ఆసన్నమైనవాడు మీవలె స్వయముగా భ్రమలో పడిపోవును. (చౌ॥ 1-4)

మీ పుత్రులు ఇరువురును చంపబడిరి. నగరము అగ్నికి ఆహుతి చేయబడెను. నాథా! అయినదేదో ఐనది. ఇప్పుడైనను మీ తప్పును దిద్దుకొని, కృపాసింధువైన రఘునాథుని భజింపుడు. నిర్మల యశస్సును పొందుడు"

(దో॥ 37)

ములుకులవంటి తనభార్యపలుకులను వినియు వాటిని పట్టించుకొనక, తెల్ల వాఱగనే లేచి, యథా ప్రకారము రావణుడు తనసభాభవనమునకు చేరెను. భయమును మఱచి, గర్వముతో పొంగిపోవుచు అతడు సింహాసనముపై కూర్చుండెను. ఇక్కడ సువేలపర్వతముపై శ్రీరాముడు అంగదుని పిలిపించెను. అతడు వచ్చి శ్రీరాముని చరణ కమలములకు శిరసా ప్రణమిల్లెను. అంతట ఖరారి అతనిని సాదరముగా తన యొద్ద కూర్చుండ బెట్టుకొని, చిఱునవ్వుతో పలికెను. "ఓ వాలి పుత్రా! నాకు వినుటకు చాల కుతూహలముగా ఉన్నది. సత్యము వచింపుము. రావణుడు రాక్షసవంశశిరోమణి. అతని అతులిత భుజబలము జగత్ప్రసిద్ధము గదా! అతని నాలుగుకిరీటములను నాయొద్దకు విసరివేసితివి. నాయనా! అవి నీకెట్లు లభించినవి?"- అంగదుడు పలికెను. "ఓ సర్వజ్ఞా! శరణాగతవత్సలా! వినుడు. అవి మకుటములుగావు. అవి నాల్గును రాజ గుణములు. స్వామీ! సామ, దాన, భేద, దండోపాయములు నాల్గును రాజునందు నివసించుచుండునని వేదములు పల్కును. 'రావణుడు అధర్మపరుడు. మీచరణములు నీతిధర్మములచే శోభిల్లుచున్నవి. అని భావించియే అవి మీ యొద్దకు చేరినవి. మీ చరణములచెంత అవి శోభిల్లినవి. (చౌ॥ 1-5)

దశకంఠరావణుడు ధర్మహీనుడు, ప్రభుచరణములకు విముఖుడు. కాలవశుడు. కోసలాధీశ! అందులకే ఆ గుణములు రావణుని వీడి, మిమ్ము ఆశ్రయించినవి. అంగదునివాక్చాతుర్యమునకు శ్రీరామచంద్రుడు నవ్వసాగెను. పిమ్మట వాలిసూనుడు లంకావిశేషములన్నియును తెలిపెను. (దో॥ 38. క,ఖ)

లంకపై ముట్టడి-రాక్షసులతో వానర భల్లూకముల పోరాటము

శత్రుసమాచారము పూర్తిగా తెలియవచ్చిన పిదప శ్రీరాముడు తనమంత్రులందఱిని దగ్గరకు పిలిచి పలికెను." లంకకు నాలుగు పెద్ద దుర్గమద్వారములున్నవి. వాటిని ముట్టడించుట యెట్లో యోచన చేయుడు అపుడు వానరరాజైన సుగ్రీవుడు, భల్లూకరాజైన జాంబవంతుడు, లంకేశుడైన విభీషణుడు సూర్యవంశభూషణుడైన శ్రీరాముని స్మరించుచు కర్తవ్యమును ఆలోచించిరి. వారు వానరసేనను నాలుగుదళములుగా విభజించిరి. వాటికి సమర్థులైన సేనాపతులను నియమించిరి. వారు (సేనాపతులు) యూథపతులనందఱిని పిలిచి, శ్రీరామచంద్రప్రభుప్రతాపమును వినిపించి ప్రోత్సహించిరి. అది విని వానరులు అందఱును సింహగర్జనలను జేయుచు పరుగులు దీసిరి. మొదట ఆనందమున శ్రీరామునిపాదములకు శిరసా ప్రణమిల్లి, 'కోసలరాజు శ్రీరామచంద్రునకు జయము, జయము'- అనుచు భల్లూకములు, వానరులు పర్వత శిఖరములను మోయుచు గర్జించుచు, గంతులు వేయుచు ముందునకు సాగిరి. లంక అజేయమైన కోట అని తెలిసియు, శ్రీరామచంద్రుని పరాక్రమప్రభావముచే వారు నిర్భయముగా వెళ్లిరి. నలుదిశలయందును వ్యాపించిన మేఘములవలె లంకకు నలువైపుల చుట్టుముట్టి, వారు నోళ్లతోడనే నగారాభేరీధ్వనులను చేయసాగిరి. (చౌ॥ 1-5)

అపార బలశాలురైన భల్లూకవానరులు "శ్రీరామునకు జయము, లక్ష్మణునకు జయము, వానరరాజు సుగ్రీవునకు జయము"(1) అని గర్జించుచు సింహనాదములను గావించుచుండిరి. (దో॥ 39)

ఆ నినాదములకు లంకలో ఉవ్వెత్తుగా కోలాహలములు చెలరేగినవి. దురహంకారియైన రావణుడు వాటిని విని "ఈ వానరుల సాహసమును పరికింపుడు" అనియనుచు నవ్వుకొనుచు తన నిశాచరసేనను పిలిపించెను. "కాలుని ప్రేరణతో ఈ వానరులందఱును వచ్చినట్లున్నారు. నా రాక్షసులందఱును ఆకలి గొనియున్నారు. బ్రహ్మదేవుడు మనకందఱికిని, బయటికి పోకుండా ఇంటికే ఆహారమును సమకూర్చినాడు." అని పలికి ఆ మూర్ఖుడు వికటాట్టహాసముతో నుడివెను. "ఓ వీరులారా! నలుదెసలకును వెళ్లుడు. భల్లూకములను వానరములను పట్టుకొని భక్షింపుడు." (శివుడు పల్కుచున్నాడు) భవానీ! కాళ్లను పైకెత్తి పండుకొను టిట్టిభపక్షి వంటిదే రావణుని గర్వము. (రాత్రి వేళ ఆకాశము తన మీద పడునేమోయను భయముతో టిట్టిభ పక్షి తన కాళ్లతో ఆకాశమును నిలుపగలనని గర్వపడును- అని ఒక కథ) ఆజ్ఞయైన వెంటనే నిశాచరులు పదునైన ఈటెలను, తోమరములను, ముద్గరములను ప్రచండములైన పరశువులను, త్రిశూలములను, పాడవైన కత్తులను, పరిఘలను, తదితరములైన వివిధాయుధములను, పర్వత శిఖరములను గైకొని బయలుదేఱిరి. మాంసాహారులైన పక్షులు ఎఱ్ఱని శిలలను జూచి, మాంసభ్రమతో వాటిపైబడి, తమ ముక్కులకు బాధ కల్గించుకొనునట్లు బుద్ధిలేని నరమాంసభక్షకులైన రాక్షసులు వానర సైన్యముల మీదికి పరుగులు దీసిరి. (చౌ॥ 1-5)

నానావిధములైన అస్త్రశస్త్రములను ధనుర్బాణములను ధరించి, బలశాలురు, రణధీరులు, వీరులు ఐన అసంఖ్యాకులైన రాక్షసులు కోటగోడలను ఎక్కిరి. (దో॥ 40)

సుమేరు గిరిపై మేఘములు క్రమ్ముకొనినట్లు రాజ ప్రాసాదముల కోట గోడలు ఒప్పారెను. డోళ్లు, ఢంకాల మ్రోతలను విని, యోధులమనస్సులలో ఉత్సాహములు పెల్లుబికెను. అసంఖ్యాకములైన వాద్యఘోషలకు పిఱికివారిగుండెలు అదరుచుండెను. రాక్షసులు కొంత ముందుకు నడచి, అతికాయులైన భల్లూకవానర యోధులను గాంచిరి. వానరులు ఎత్తుపల్లములయందును, సమతలముగానుండు లోయలలోను లెక్కచేయక ఎగురుచూ పరుగెత్తుచుండుటను వారు

1. జయత్యతిబలో రామో లక్ష్మణశ్చమహాబలః ।
రాజాజయతి సుగ్రీవో రాఘవేణాభి పాలితః ॥
వాల్మీకి రామాయణము ॥ సుందర కాండము ॥

గాంచిరి. వానరయోధులు కొండలను చేతులతో పట్టుకొని, పగులగొట్టుచు మార్గములను ఏర్పఱచుచుండిరి. పండ్లను పటపట గొఱుకుచు వానరసహజములైన భయంకర ధ్వనులతో బెదరించుచు, గర్వించుచుండిరి. శత్రువులను భయపెట్టుచుండిరి. అక్కడ రావణునకును, ఇక్కడ శ్రీరామచంద్రునకును 'జయము, జయము' అను నినాదములు మిన్నుముట్టగా యుద్ధము ప్రారంభమాయెను. రాక్షసులు కొండలను, శిఖరములను దొర్లించుచుండిరి. వానరులు ఎగిరి వాటిని పట్టుకొని, మఱల వారి మీదనే విసరి వేయుచుండిరి. (చౌ॥ 1-4)

భయంకరముగానున్న వానరభల్లూకములు పర్వతశిలలను కోటలపై విసరుచుండిరి. నిశాచరులపైకి దూకి, వారి కాళ్లను చిక్కించు కొని, గిరగిర త్రిప్పి, వారిని నేలకేసి కొట్టుచుండిరి. పరుగెత్తుకొనిపోవువారిని యుద్ధమునకు కవ్వించుచుండిరి. అతిలాఘవము, పరాక్రమముగల వానరభల్లూకములు అవలీలగా కోటలపైకి, భవనములమీదికి ఎక్కి, శ్రీరాముని యశోవైభవములను కీర్తించుచుండిరి. (ఛం)

వానర వీరులు నిశాచరయోధులను పట్టుకొని, ఎత్తైన భవనములనుండి క్రిందికి పడద్రోయుచుండిరి. క్రిందబడిన రాక్షసులు నుగ్గునుగ్గగుచుండిరి. పైగా వానరులు వారిపై దుమికి, పిడికిళ్లతో మర్దించుచుండిరి. కొన ఊపిరితో మిగిలియున్న వారుకూడా ఈ ముష్టిఘాతములకు మట్టిగఱచుచుండిరి. (దో॥ 41)

శ్రీరామునిప్రతాపప్రభావమున ప్రబలమైన వానరసేన రాక్షసయోధులను నలిపివేయుచుండెను. అక్కడక్కడ వానరులు కోటగోడలపైకెక్కి, "సూర్యప్రతాపుడైన శ్రీరామచంద్రునకు జయము-జయము" అని నినాదములు చేయుచుండిరి. రాక్షసయోధులను మర్దించుచుండిరి. వాయువేగధాటికి తట్టుకొనలేక మేఘములు చెల్లాచెదరైనట్లు వానరసేనదెబ్బకు నిలువలేక రాక్షససైనికులు ఇటునటు పరుగులు దీసిరి. నగరము 'హాహాకారముల'తో నిండిపోయెను. బాలురు, స్త్రీలు ఆర్తనాదములతో అల్లాడుచుండిరి. 'రాజ్య పాలనకు మాఱుగా వీడు మృత్యువును ఆహ్వానించినాడు' అని అందఱును రావణుని తిట్టిపోయుచుండిరి. తన సేనలు 'చెల్లాచెదరు' ఐన విషయమును వినగానే రావణుడు క్రుద్ధుడై పాఱిపోవుచున్న యోధులతో ఇట్లనెను. "రణభూమికి వెన్నుచూపివచ్చినవారిని నా ఖడ్గమునకు బలియిచ్చెదను. ఇంతవఱకును నా ఉప్పుపులుసులను తిని, నానావిధభోగవిలాసములను అనుభవించినవారికి ఇప్పుడు రణభూమిలో 'ప్రాణములు తీపి' ఐనవా?" రావణునికఠోరవచనములను విని, వీరులందఱును సిగ్గుపడుచు బుసలు కొట్టుచు పోరాడసాగిరి. యుద్ధ భూమిలో పోరాడి అసువులను వీడుటవలననే వీరులకు శోభ కలుగునని తలంచి, వారు ప్రాణములపై ఆశలు వదలుకొనిరి. (చౌ॥ 1-5)

అనేక శస్త్రాస్త్రములను దాల్చి, ఆ రాక్షస వీరులు వానరవీరులను పిల్చుచు పోరుసల్పుచుండిరి. వారు పరిఘలతో, త్రిశూలములతో కొట్టి, భల్లూక వానరములను చికాకు పఱచుచుండిరి. (దో॥ 42)

(శివుడు పలుకుచున్నాడు) ఉమా! వానరులు భయవ్యాకులురై పాఱిపోసాగిరి. ఐనను చివరకు వారే గెలిచెదరు. వానరులు ఇట్లడుగు చుండిరి. " హనుమంతుడు ఎక్కడ? అంగదుడెక్కడ? బలశాలురైన నల, నీల, ద్వివిదులు ఎక్కడ?" తమసేనలు వికలమైనవని తెలిసినప్పుడు ఆంజనేయుడు పశ్చిమద్వారముకడ ఉండెను. అక్కడ మేఘనాదునితో పోరాడుచుండెను. ఆ ద్వారమును పగులగొట్టుట మిగుల కష్టముగా ఉండెను. కావున పావని మనస్సు మిక్కిలి క్రోధముతో నిండియుండెను. అప్పుడు కాలునితో సమానుడైన ఆ వానర యోధుడు గర్జించి, లంకకోటగోడపైకెగిరి, ఒక పర్వతశిలను దీసికొని మేఘనాదుని వైపు పరుగెత్తెను. అతడు మేఘనాదునిరథమును విఱుగగొట్టెను. సారథిని హతమార్చెను. మేఘనాదుని వక్షముపై తన్నెను. వ్యాకులుడైన మేఘనాదుని మఱియొక సారథి తన రథముపై చేర్చుకొని, ఇంటి ముఖముపట్టెను. (చౌ॥ 1-4)

పవనసుతుడు ఒంటరిగా కోటగోడపైకెక్కినాడని తెలిసి రణయోధుడైన అంగదుడు అవలీలగా ఎగురుచు ఒక్కగంతులో కోటమీదికి చేరెను. (దో॥ 43)

శత్రువులను ఎదిరించి పోరాడుచు, యోధులిద్దఱును మహావేశముతో శ్రీరాముని ప్రతాపమును స్మరించుచు పరుగెత్తుకొని పోయి, రావణుని ప్రాసాదముమీదికి చేరిరి. అక్కడ వారు 'శ్రీరామునకు జయము జయము' అని పలుకసాగిరి. వారు కలశములతోపాటు భవనమును ధ్వంసము చేసిరి. ఇది చూచి, రాక్షసరాజు రావణుడు భయభ్రాంతుడాయెను. స్త్రీలు తమగుండెలపై బాదుకొనుచు "అయ్యో! ఇదిగో! ఇప్పుడీ రెండు వానరములును ఒక్కుమ్మడిగా వచ్చినవి. ఎట్టి ఉత్పాతములను కల్గించునో- అని గగ్గోలుపెట్టసాగిరి. వారిద్దఱును కపిచేష్టలతో ఆ స్త్రీలను భయపెట్టిరి. శ్రీరామునిపావనయశమును వినిపించిరి. మఱల బంగారు స్తంభములను చేతులతో పట్టుకొని "ఇప్పుడు ఉపద్రవమును ప్రారంభించెదము"- అనియనిరి. వారు గర్జించుచు శత్రుసేనల మధ్యలో దూకి, బలీయములైన తమ బాహువులచే వారిని మర్దింప సాగిరి. కొందఱిని కాళ్లతో తన్నిరి. చేతులతో కొందఱిచెంపలను వాయించిరి. 'మీరు శ్రీరాముని భజింపరు. దానికి ఇదియే శాస్తి" అని నుడువుచుండిరి. (చౌ॥ 1-4)

రాక్షసులతలలను హేలగా పరస్పరము ఢీకొట్టించిరి. ఆ తలలను రావణునియొద్ద పడునట్లు విసరివేసిరి. అవి పెఱుగుకుండలవలె పగులుచుండెను. (దో॥ 44)

ఆ ఇరువురు వానరులును ప్రముఖరాక్షసయోధులను పట్టుకొని వారి కాళ్లను చిక్కించుకొని గిరగిరత్రిప్పుచు, శ్రీరామునిచెంత పడునట్లు వారిని విసరి వేయుచుండిరి. విభీషణుడు వారివారి పేర్లను ప్రభువునకు తెలుపుచుండెను. ప్రభువు వారికి తన ధామమును (వైకుంఠమును) అనుగ్రహించుచుండెను. బ్రాహ్మణులను చంపి, తినెడువారైనఆ నరమాంసభక్షకులు, యోగులు కోరుకొనునట్టి సద్గతిని పొందుచుండిరి. (శివుడు తెల్పుచున్నాడు) పార్వతీ! శ్రీరాముడు కోమలచిత్తుడు. కరుణానిధి. "రాక్షసులు వైరభావముతోనైనను సరే నా స్మరణ చేయుచుండెడివారుగదా!" అని తలంచి, ప్రభువు వారికి సర్వోత్తమగతిని (ముక్తిని) ప్రసాదించెను. భవానీ! ఇట్టి కృపాళువు ఎవరున్నారు? తెల్పుము. ప్రభువు యొక్క ఇట్టి ఉదారస్వభావమును ఎఱింగియు, మోహకారణముగ సాంసారికభ్రమలను వీడక ప్రభువును భజింపనివాడు మిక్కిలి మందబుద్ధి, భాగ్యహీనుడు" అయోధ్యాపతియైన శ్రీరాముడు (సుగ్రీవవిభీషణాదులతో) పలికెను." అంగదుడు, హనుమంతుడు కోటలోపలికి ప్రవేశించిరి. వారిద్దఱును లంకను విధ్వంసము చేయుచున్నప్పుడు రెండు మందరాచలములు సముద్రమును మథించుచున్నట్లు శోభిల్లు చున్నారు. (చౌ॥ 1-4)

తమబాహుబలములచే శత్రుసేనలను నుగ్గునుగ్గుగావించి, ఆ వానరవీరులిద్దఱును సాయం సమయమగుటవలన యుద్ధముచేయుట మాని, అవలీలగా దూకుచు శ్రీరామచంద్ర ప్రభువునొద్దకు వచ్చిరి. (దో॥ 45)

వారు ప్రభువుచరణకమలములకు శిరసా ప్రణమిల్లిరి. ఆ ఇద్దఱు వీరులను జూచి, శ్రీరామచంద్రుడు మిక్కిలి ప్రసన్నచిత్తుడై, వారిపై తనకృపాదృష్టిని ప్రసరింపజేసెను. వారు ప్రశాంతిని బొంది ఆనందభరితులైరి. హనుమంతుడు, అంగదుడు రణరంగమునుండి వెళ్లినారని యెఱింగి, భల్లూకవానరయోధులు అందఱును తమ గుడారములకు చేరిరి. ప్రదోషకాలమునందు బలమధికమగుటచే రాక్షసులు అప్పుడు రావణునకు 'జయము-జయము' అని, నినాదములు చేయుచు వానరులపై బడిరి. రాక్షససేనలు వచ్చుటను జూచి, వానరులు మఱల రణభూమికి చేరి, పండ్లు పటపట కొఱుకుచు అన్ని వైపులనుండియు శత్రువులను ఎదుర్కొనిరి. వారు ఒకరిని మఱియొకరు కవ్వించుకొనుచు పోరాడిరి. ఎవ్వరును వెనుకంజవేయలేదు. నిశాచరులందఱును నల్లనివారు,

అత్యంతవీరులు, అట్లే వానరులు విశాలదృఢకాయులు, అనేకవర్ణముల వారు. ఇరుసైన్యములును ప్రబలమైనవే. యోధులును సములే. వారు అత్యుత్సాహములతో విజృంభించి పోరాడుచుండిరి. వారిపోరాటము వర్షశరదృతుమేఘములు వాయుప్రేరణతో పరస్పరము తలపడుచున్నట్లు ఉండెను. తమ సైన్యములబలము సన్నగిల్లుట చూచి, అనిపుడు, అకంపనుడు, అతి కాయుడు-అను సేనాపతులు మాయోపాయములకు దిగిరి. ఒక్క క్షణములో నిబిడాంధకారము వ్యాపించెను. వారు రక్తము, రాళ్లు, బూడిదను వానరసేనలపై వర్షింప సాగిరి. (చౌ॥ 1-6)

దశదిశలయందును కాఱుచీకట్లు క్రమ్ముకొనుట జూచి, వానరసేనలు చెల్లాచెదరయ్యెను. ఒకరికొకరు కన్పింపకుండిరి. అంతటను అరపులే వినబడుచుండెను. (దో॥ 46)

శ్రీ రఘునాథుడీ రహస్యమును గుర్తించెను. అంగదుని, హనుమంతుని పిలిచి, విషయమును వివరించెను. అది వినగానే ఆ కపివీరులిద్దఱును కోపావేశములతో రణరంగమునకు పరుగెత్తిరి. పిమ్మట కృపాళువైన శ్రీరాముడు నవ్వి, ధనుస్సును ఎక్కుపెట్టి, అగ్నిబాణమును వేసెను. అంతటను వెలుగులు ప్రసరించెను. జ్ఞానోదయముతో సందేహములు దూరమైనట్లు చీకట్లు మాయమైపోయెను. భల్లూకములు, వానరములు వెలుగులను జూచి, శ్రమ, భయము తొలగినవారై ప్రసన్న చిత్తులై, సమరభూమికి సాగి పోయిరి. ఇంతలోనే హనుమంతుడు, అంగదుడు రణ గర్జనల నొనర్చుచుహుంకారములతో అచటికి రానేవచ్చిరి. వారిగర్జనలకు భీతిల్లి, నిశాచరులు కాలికి బుద్ధిచెప్పిరి. వానరులు పాఱిపోవుచున్నరాక్షసయోధులను పట్టుకొని, నేలకేసికొట్టుచుండిరి. అనేకాద్భుతయుద్ధనైపుణ్యములను ప్రదర్శించుచుండిరి. వారు రాక్షసులకాళ్లను చిక్కించుకొని, వారిని గిరగిర త్రిప్పుచు సముద్రములో పడవేయుచుండిరి. అచట వారిని మొసళ్లు, పాములు, చేపలు తినివేయుచుండెను. (చౌ॥ 1-4)

ఈ విధముగా కొందఱు రాక్షసులు మరణించిరి, కొందఱు గాయపడిరి. మఱి కొందఱు పాఱిపోయి, కోటగోడలనెక్కిరి. తమబలములతో శత్రుసైన్యములను కకావికలొనర్చి, వానరభల్లూకవీరులు రణోత్సాహముతో గర్జించిరి. (దో॥ 47)

బాగుగా అర్ధరాత్రి ప్రొద్దు పోయిన పిమ్మట నాలుగు దళముల వానరులును కోసలాధిపతి శ్రీరాముని కడకు చేరిరి. శ్రీరాముని చల్లనిచూపు వారిపై ప్రసరింపగానే వారు తమశ్రమలనే మఱచిపోయిరి. అక్కడ రావణుడు తన ఆంతరంగికులను పిలిచి, "వానరులు మనసైన్యములలో సగభాగమును హతమార్చిరి. పెక్కుమంది రాక్షసవీరులు రణరంగమునకు బలియైరి. వెంటనే కర్తవ్యమును దెల్పుడు" అని యడిగెను. రావణునకు మాతామహుడును, మంత్రివరేణ్యుడును ఐన మాల్యవంతుడను వృద్ధరాక్షసుడు చక్కని నీతి వాక్యములను ఇట్లు పలికెను. "నాయనా! నా ఉపదేశమును కొంచెమాలకింపుము. నీవు సీతను అపహరించి తెచ్చినప్పటినుండియు ఎదురైన అపశకునములకు లెక్కయే లేదు. వేదపురాణములచే ప్రస్తుతింపబడిన శ్రీరామచంద్రుడు మహామహితాత్ముడు. ఆయనను కాదనినవాడెవ్వడును బ్రతికి బట్టకట్టలేదు. (చౌ॥ 1-4)

హిరణ్యాక్షుని, అతనిసోదరుడైన హిరణ్యకశిపుని చంపినవాడును, మధుకైటభులను సంహరించిన వాడును ఐన శ్రీహరియే ఇప్పుడు శ్రీరాముడుగా అవతరించినాడు. (దో॥ 48. క.)

(మాస పారాయణము-ఇఱువదియైదవ విరామము)

అతడు కాలస్వరూపుడు. దుష్టసమూహమనెడి వనమును భస్మమొనర్చుటయందు అగ్నితుల్యుడు. గుణనిధి, జ్ఞానఖని, బ్రహ్మరుద్రాదులు అతనిని సేవింతురు. అతనితో వైరమేల? (దో॥ 48. ఖ)

మేఘనాదుని విజృంభణము - లక్ష్మణుడు మూర్ఛిల్లుట

కావున వైరమును మాని, వైదేహిని ఆయనకు అప్పగింపుము. దయాసాగరుడును, పరమస్నేహశీలియునైన శ్రీరాముని భజింపుము. "రావణునకీమాటలు బాణములవలె గ్రుచ్చుకొనెను. అతడిట్లనెను. "ఓరీ! దౌర్భాగ్యుడా! నీ ముఖానికి మసిపూసికొని వెళ్లు. దానిని నాకు చూపకుము. ముసలి వాడవు గావున నిన్ను చంపక వదలివేయుచున్నాను. ఇకమీదట నాకు కన్పింపవలదు. దూరముగా వెళ్లిపో" మాల్యవంతుడు తన మనస్సులో "కృపానిధియైన శ్రీరామునిచేతిలో వీనికి చావుతప్పదు" అని యనుకొనుచు రావణుని దుర్భాషలకు బాధపడుచు వెళ్లి పోయెను. పిమ్మట మేఘనాదుడు క్రోధావేశముతోనిట్లనెను. "తండ్రీ! రేపు ఉదయమున నేను చేయబోవు ఘనకార్యములను చూడుడు. నేను మాటలు చెప్పను. క్రియ చేసి చూపింతును. ఇప్పుడు ఎంత చెప్పినను తక్కువయే" పుత్రుని వచనములను విని, వానిపై రావణునకు నమ్మకము ఏర్పడెను. ప్రేమతో అతనిని తన యొడిలో కూర్చుండ బెట్టుకొనెను. వారు సమాలోచనములను చేయుచుండగనే తెల్లవారెను. వానరులు మఱల నాలుగు ద్వారములకడ గుమిగూడిరి. వారుదుర్గమమైన కోటలను ముట్టడించిరి. నగరమున కోలహలములు చెలరేగెను. రాక్షససైనికులు వివిధశస్త్రాస్త్రములతో కోటలపైకెక్కి పర్వత శిఖరములను శత్రు సైనికులపై విసరి వేసిరి. (చౌ॥ 1-5)

వారు అసంఖ్యాకములైన పర్వతశిఖరములను విసరివేసిరి. నానావిధమారణాయుధములను ప్రయోగించిరి. అవి వజ్రాయుధములవలె దిక్కులను పిక్కటిల్ల జేయుచు గర్జాధ్వనులతో వచ్చెను. యోధులు ప్రళయకాలగర్జనలను గావించిరి. భయంకర వానరయోధులు శత్రువులతో తలపడిరి. గాయపడినను, శరీరము జర్జరీ భూతమైనను వారు ఓడలేదు. ఓటమినంగీకరింప లేదు. వారు ఆశిఖరములనే చేతులతో పట్టుకొని, కోటమీదికి విసరి వేయుచుండిరి. రాక్షసులు అక్కడికక్కడే మరణించుచుండిరి. (ఛం)

వానరులు వచ్చి మఱల కోటను ముట్టడించినారని విని, మేఘనాదుడు కోట క్రింది భాగమునకు వచ్చి, ఢంకాలను మ్రోగించుచు వారిని ఎదుర్కొనెను. (దో॥ 49)

అతడు బిగ్గరగా అరచుచు పలికెను. "సమస్త లోకములలో ధనుర్ధారులుగా ప్రసిద్ధి గాంచిన సోదరులైన ఆ ఇద్దఱు కోసలరాజకుమారు లెక్కడ? నల, నీల, ద్వివిద, సుగ్రీవులును, అపార బలశాలురైన అంగద హనుమదాదులును ఎక్కడ? ఆ భ్రాతృద్రోహి విభీషణుడెక్కడ? నేడు వీరినందఱిని తప్పక చంపెదను." ఇట్లు పలికి, భయంకరములైన బాణములను సంధించి, ధనుస్సును ఆకర్ణాంతము లాగెను. బాణముల వర్షమును గురిపించెను. అవి రెక్కలున్న సర్పములవలె వేగముగా సాగిపోవుచుండెను. వానరులు ఎక్కడివారక్కడనే పడిపోవుచుండిరి. ఆ సమయమున అతనిని ఎదిరించువారు ఎవ్వరును అక్కడ లేకుండిరి. భల్లూకవానరులు నలుదెసలకును పాఱిపోయిరి. పోరాటవిషయమునే మఱచిరి. రణభూమిలో వారు మూర్ఛితులై, ప్రాణావశిష్టులై యుండిరి. (చౌ॥ 1-4)

పిమ్మట మేఘనాదుడు ఒక్కొక్కరిపై పదేసి బాణములను ప్రయోగించెను. వానర వీరులందఱును నేలపై పడిపోయిరి. అప్పుడు ప్రబలుడైన ధీర మేఘనాదుడు సింహగర్జన చేయసాగెను. (దో॥ 50)

తమ సైన్యమంతయును వ్యాకులపాటునకు గురియైనట్లు గమనించి, పవనసూనుడు అతిక్రోధముతో సాక్షాత్తు కాలునివలె శత్రువులమీదికి పరుగుదీసెను. అందఱును చూచుచుండగనే అతడు మిగుల క్రుద్ధుడై ఒక మహాపర్వతమును పెకలించి ఎత్తి, మేఘనాదునిపై కోపముతో విసరి వేసెను. తనమీదికి వచ్చుచున్న పర్వతమును జూచి అతడు ఆకాశమునకు ఎగిరెను. అంతట రథము ముక్కలాయెను. సారథి హతుడయ్యెను. గుఱ్ఱములు మరణించెను. హనుమంతుడతనిని మాటి మాటికిని యుద్ధమునకు రెచ్చగొట్టెను. కాని హనుమంతుని బల

రహస్యమును ఎఱిగిన వాడు గావున మేఘనాదుడు అతని కడకు రాలేదు. పిమ్మట మేఘనాదుడు శ్రీరాముని కడకు వచ్చి, పెక్కురీతుల దుర్భాషలాడెను. అతడు శ్రీరామునిపై అనేకశస్త్రాస్త్రములను, ఆయుధములను ప్రయోగించెను. కాని ప్రభువు వాటినన్నింటిని అవలీలగా వమ్ముగావించెను. శ్రీరాముని బలపరాక్రమములను జూచి, ఆ మూర్ఖుడు లజ్జితుడై, నానావిధములగు మాయలు పన్నెను. అతనిప్రయత్నము 'చిన్న పామును చేత బట్టుకొని గరుడుని బెదరించినట్లు' ఉండెను. (చౌ॥ 1-4)

తన మాయ చేత బ్రహ్మరుద్రాది మహామహులనే వశపఱచుకొనగలిగిన శ్రీరామచంద్రప్రభువుపై దుష్ట బుద్ధియైన ఆ నిశాచరుడు తనరాక్షసమాయలను ప్రయోగించెను. (దో॥ 51)

ఆకాశమునకెగిరి ఆ ఇంద్రజిత్తు నిప్పుల వర్షమును కురిపింపసాగెను. భూమినుండి జలధారలు బయటికి చిమ్మునట్లు చేసెను. నానా విధములైన పిశాచములు నాట్యము చేయుచు 'చంపుడు, నఱుకుడు' అని అఱవ సాగెను. ఒక్కొక్కసారి అతడు మలమూత్రములను చీము, నెత్తురు, వెంట్రుకలు, ఎముకలు మొదలగు వానిని వర్షించుచుండెను. మఱియొక సారి ఎడతెగని ఱాళ్లవర్షమును కురిపించుచుండెను. వేఱొకతరి ధూళిని గురిపించి, 'తమ చేతులనే తాము చూడలేనంతగా' చీకటిని సృష్టించెను. ఈ మాయలకు వానరులు తికమకలపాలై 'ఈ దెబ్బతో అందఱును మరణించుట తథ్యము' అని భావించిరి. ఈ దృశ్యమును జూచి, శ్రీరాముడు ఒక చిఱునవ్వు నవ్వెను. వానరులందఱును భయభ్రాంతులైనట్లు గ్రహించి, సూర్యుడు చిమ్మచీకట్లను పాఱద్రోలినట్లు ఒకేఒక బాణముతో వానిమాయలనన్నింటిని పటాపంచలు గావించెను. పిమ్మట భల్లూక వానరములపై తనకృపాదృష్టిని ప్రసరింపజేసెను. వారు మఱల శక్తిసంపన్నులై నిలువరింప రాని ఆవేశముతో పోరాడుచుండిరి. (చౌ॥ 1-4)

శ్రీరాముని ఆజ్ఞను పొంది, లక్ష్మణుడు ధనుర్బాణములను గైకొని, క్రుద్ధుడై అంగదాది వానర ప్రముఖులతో బయలుదేఱెను. (దో॥ 52)

అతని కన్నులు నిప్పులు కురియుచుండెను. వెడల్పైన వక్షస్థలముతో, దీర్ఘబాహువులతో హిమాలయ పర్వతమువలెనున్న అతనిగౌరవర్ణశరీరకాంతి ఎఱుపెక్కెను. రావణుడును మేఘనాదునకు బాసటగా సమరయోధులను కొందఱిని పంపెను. వారనేక శస్త్రాస్త్రములను దీసికొని, ఒక్కుమ్మడిగా రణరంగమున దూకిరి. 'శ్రీరామచంద్రునకు జయము జయము' అనుచు వానరులు పర్వతములను, వృక్షములను నఖములను ఆయుధములుగా జేసికొని వారిని ముప్పు తిప్పలు పెట్టుచుండిరి. వానరులును, రాక్షసులును ప్రబలమైన విజయ కాంక్షలతో వీరోచితముగా పోరాడుచుండిరి. వానరులు రాక్షసులపై విరుచుకొని పడి వారిని పిడికిళ్లతో పొడిచిరి, కాళ్ళతో తన్నిరి, పండ్లతో కొఱికిరి, కొట్టి కొట్టి బాధించిరి. "కొట్టుడు, కొట్టుడు, పట్టుకొని చంపుడు, చంపుడు, తలలు నఱకుడు, భుజములను ఖండింపుడు" ఇట్టి అఱుపులతో నవఖండములు నిండిపోయెను. తలలులేని మొండెములు అటునిటు పఱుగెత్తుచుండెను. దేవతలు ఆకాశము నుండి ఈ దృశ్యములను వినోదముగా చూచుచుండిరి. వారికి విస్మయానందములు కలుగు చుండెను. (చౌ॥ 1-4)

రణ భూమి రక్తసిక్తమయ్యెను. దానిపై ధూళి క్రమ్ముకొని నిప్పులపై బూడిద కప్పినట్లుండెను. (దో॥ 53)

గాయపడిన యోధులు పూలతోనిండిన మోదుగుచెట్లవలె ఒప్పుచుండిరి. లక్ష్మణుడును, మేఘనాదుడును (ఇరువురును) సమాన యోధులే. వారు అత్యంతావేశములతో పరస్పరము ఒడలు మఱచి, పోరాడుచుండిరి. రాక్షసుడైన మేఘనాదుడు మోసమునకును, అధర్మమునకును ఒడిగట్టుచుండెను. అనంతుడైన (శేషుడు) లక్ష్మణుడు భీకరకోపాకృతితో ఇంద్రజిత్తు రథమును భగ్నమొనర్చి, సారథిని కొట్టి క్రింద పడిపోవునట్లు చేసెను. అతని

ప్రహారములకు ఇంద్రజిత్తుప్రాణములు అన్నుబట్టెను. "ఇప్పుడు తీవ్ర సంకటపరిస్థితి వచ్చిపడినది. ఇతని చేతిలో నా ప్రాణములు దక్కవు" అని భావించి రావణ పుత్రుడు 'వీరఘాతిని' అను శక్తిని ప్రయోగించెను. తేజోరాశియైన ఆ శక్తి లక్ష్మణుని వక్షమునకు తగిలెను. లక్ష్మణుడు మూర్ఛితుడాయెను. అప్పుడు మేఘనాదుడు నిర్భయముగా అతనిని సమీపించెను. (చౌ॥ 1-4)

మేఘనాదునితో సమానమైన బలముగల అసంఖ్యాకయోధులు లక్ష్మణుని ఎత్తుకొనిపోవుటకు ప్రయత్నించిరి. కాని జగదాధారుడైన ఆదిశేషుని అవతారమును ఎవరెత్తగలరు? వారు సిగ్గుతో వెనుదిరిగిరి. (దో॥ 54)

(శివుడు పల్కుచున్నాడు) గిరిజా! వినుము. లక్ష్మణుని క్రోధాగ్ని పదునాలుగులోకములను భస్మమొనర్పగలదు. సమస్త స్థావరజంగమ ప్రాణులు, దేవతలు, మనుష్యులు, అతనిని సేవించుచుందురు. అట్టి మహావీరుని యుద్ధమున ఎవరు జయింపగలరు? శ్రీరాముని కృపకు పాత్రుడైనవాడే ఈ అద్భుత లీలలను తెలిసికొనగలడు. సాయంసమయమగుటచే ఉభయపక్షములవారును యథా స్థానములకు చేరిరి. సేనాపతులు తమతమసేనలను కూడగట్టుకొనసాగిరి. సర్వవ్యాపకుడును, పరబ్రహ్మయు, అజేయుడును, సకలభువనాధిపతియు, కరుణానిధియు ఐన శ్రీరాముడు 'లక్ష్మణుడు ఎక్కడ? అని యడిగెను. అప్పటికే హనుమంతుడు లక్ష్మణుని అచటికి తీసికొనివచ్చియుండెను. తన తమ్ముని స్థితిని జూచి, శ్రీరాముడు మిగుల దుఃఖితుడాయెను. జాంబవంతుడిట్లనెను. "లంకలోసుషేణుడు అనువైద్యుడు గలడు. అతనిని ఇచటికి ఎవరు తీసికొని రాగలరు?" వెంటనే హనుమంతుడు సూక్ష్మరూపియై వెళ్లి, ఇంటితో గూడ అతనిని తీసికొని వచ్చెను. (చౌ॥ 1-4)

సుషేణుడు శ్రీరామునిపాదపద్మములకు శిరసా ప్రణమిల్లెను. అతడు ఒక పర్వతము పేరును, దానిపై నుండెడి ఒక ఓషధినామమును దెలిపి, "ఆంజనేయా! నీవు వెళ్లి, ఆ ఓషధిని తీసికొని రమ్ము" అని పలికెను. (దో॥ 55)

ఓషధికై హనుమంతుడు వెడలుట - కాలనేమిని హతమార్చుట

వాయుసుతుడైన హనుమంతుడు "సరే! ఇప్పుడే తీసికొనిరాగలను" అనియనుచు-తన హృదయమున శ్రీరాముని పాదసరోజములను స్మరించుచు ఓషధికై బయలుదేరెను. అక్కడ ఒక దూత రావణునకు ఈ వృత్తాంతమునంతయు వివరించెను. దశముఖుడు 'కాలనేమి' అను రాక్షసునియింటికి వెళ్లి, విషయమును వివరించి, సహాయమడిగెను. కాలనేమి తలనెత్తి బాదుకొనుచు పలికెను. "మార్గమధ్యములో ఇప్పుడా హనుమంతుని ఆపగలవాడెవ్వడు? నీ కనులముందే అతడు లంకను కాల్చలేదా? శ్రీ రఘునాథుని ఆరాధించి, హాయిగా ఉండుము. ప్రభూ! ఈ మిథ్యాప్రగల్భములను మానుము. నేత్రానందకరుడు నీలోత్పలశ్యామసుందరుడు ఐన శ్రీరాముని నీ హృదయమున నిలుపుకొనుము. నేను, నీవు, అనెడి భేదభావమును, మమత్వమును, మూఢత్వమును త్యజింపుము. నీవు మహామోహములో నిద్రించుచున్నావు. ఇప్పుడైనను దానినుండి మేల్కొనుము. కాలసర్పమునుగూడ కబళింపగలవానిని కలలో నైనను యుద్ధమున ఎవడు జయింపగలడు.?" (చౌ॥ 1-4)

ఈ మాటలను వినినంతనే రావణుడు మిక్కిలి క్రుద్ధుడాయెను. అప్పుడు కాలనేమి తన మనస్సులో ఇట్లనుకొనెను. "ఈ దుష్టుడు పాపకృత్యములలో మునిగినాడు. నేను శ్రీరామునిదూతచేతిలో మృతిచెందుటయే మేలు." (దో॥ 56)

ఇట్లాలోచించి కాలనేమి ఆంజనేయుడు వెళ్లుచున్నమార్గములో మాయలు పన్నెను. ఒక అందమైన వనమును, అందు ఒక సరోవరమును, మందిరమును కల్పించెను. పవనసుతుడు ఆశ్చర్యకరమైన ఒక సుందర-ఆశ్రమమును గాంచి, 'ఇక్కడ మునియనుమతితో దాహము తీర్చుకొని బడలికను తొలగించు కొందును' అని తలంచెను. కాలనేమి

అచట కపటముని వేషముతో ఉండెను. అతడు తనమాయచేత మాయాపతియైన శ్రీరామునిదూతను మోహింప జేయదలచెను. పావని ఆయనకు నమస్కరించెను. ఆ రాక్షసుడు శ్రీరామునిగుణములను గానముచేయుచు ఇట్లు పల్కెను. "రామరావణులమధ్య ఘోరమైన యుద్ధము జరుగుచున్నది. శ్రీరాముడు గెలుచును. ఇందు సందేహము లేదు. సోదరా! నాజ్ఞాన దృష్టితో ఇక్కడినుండియే అన్నింటిని చూచుచున్నాను." హనుమంతుడతనని నీరడుగగానే అతడు తన కమండలమును ఇచ్చెను. హనుమంతుడు "ఈ కొంచెము జలముతో నా దాహము తీరదు" అని పలికెను. కాలనేమి "ఈ చెఱువులో స్నానము చేసిరమ్ము. నేను నీకు దీక్షను ఇచ్చెదను." నీకు జ్ఞానోదయమగును అని పలికెను. (చౌ॥ 1-4)

హనుమంతుడు సరోవరమున దిగగానే అతి శీఘ్రముగా ఒక మొసలి ఆయన పాదమును గట్టిగా ఒడిసిపట్టుకొనెను. మారుతి దానిని చంపి వేసెను. అది దివ్యశరీరమును దాల్చి అప్సరసయై విమానముపై ఆకాశ మార్గమున వెళ్లెను. (దో॥ 57)

ఆ సుందరి వెళ్లుచు ఇట్లు పలికెను. "ఓ వానరా! నీ దర్శనమువలన నాకు పాపవిముక్తి కలిగినది. నాకు మునీశ్వరుడిచ్చిన శాపముకూడ తొలగినిది. ఓ కపీశ్వరా! ఇతడు మునిగాడు ఘోరరాక్షసుడు నా మాట సత్యము, నమ్ముము" అట్లు పలికి ఆ అప్సరస వెళ్లిపోయిన పిమ్మట హనుమంతుడు ఆరాక్షసుని కడకు వచ్చి ఇట్లనెను "ఓ మునీశ్వరా మొదట మీరు గురుదక్షిణ స్వీకరింపుడు. ఉపదేశమును ఆ పిమ్మట చేయవచ్చును" అంజనేయుడు అతనితలచుట్టును వాలమునుచుట్టి అతనిని నేలకేసి కొట్టెను. మరణ సమయమున కాలనేమి తననిజరూపమును దాల్చి 'రామ రామ' అనుచు ప్రాణములను వదిలెను. అతనినోటినుండి రామనామమును విని మారుతి ప్రసన్న మనస్కుడయ్యెను. అచ్చట నుండి బయలు దేఱి, ఆ పర్వతము పైకి చేరెను. కాని ఓషధిని గుర్తింపలేకపోయెను. అప్పుడు ఆ హనుమంతుడు ఆ పర్వతమునే పెకలించుకొని, రాత్రికి రాత్రే దానిని దీసికొని ఆకాశ మార్గమున బయలు దేఱెను. ఆయన ప్రయాణము అయోధ్యా నగరము మీదుగా సాగుచుండెను. (చౌ॥ 1-4)

సంజీవని పర్వతముతో వచ్చు మారుతితో భరతుని సమాగమము

ఆకాశమున ఒక బృహత్స్వరూపము వెళ్లుచుండగా దానిని భరతుడు గాంచెను. అతడొక రాక్షసుడై యుండవచ్చునని అనుమానించెను. ధనుస్సును ఆకర్ణాంతములాగి, ములికిలేని బాణమును వదలెను. (దో॥ 58)

ఆ బాణము యొక్క ధాటికి సంజీవని పర్వతమును దీసికొని వచ్చుచున్న హనుమంతుడు 'రామా! రామా! రఘుపతీ!' అనుచు నేలపై బడి మూర్ఛితుడాయెను. ఈ ప్రియవచనములను వినిన వెంటనే భరతుడు మిక్కిలి ఆతురతతో పరుగెత్తుకొని హనుమంతునికడకు వచ్చెను. వికలుడైన ఆ మారుతిని జూచి భరతుడు అతనిని తనహృదయమునకు హత్తుకొనెను. అతనికి స్పృహ తెప్పించుటకై పెక్కు ప్రయత్నములను జేసెను. కాని స్పృహరాలేదు. భరతునిముఖము వెలవెలబోయెను. మనస్సులో బాధ పడెను. కన్నుల నీరు నిండెను. అతడిట్లనెను. "విధాత నన్ను శ్రీరామునకు విముఖునిగా జేసెను. మఱల ఈ ఆపదగూడ సంభవించినది. త్రికరణశుద్ధిగా నాకు శ్రీరామునిచరణకమలములయందు నిశ్చలమైన భక్తి యున్నచో, శ్రీరామచంద్రునికృప నాపై ప్రసరించుచున్నచో, ఈ వానరుడు శ్రమనుండియు ఈ బాధనుండియు బయటపడుగాక". ఈ మాటలు చెవిన బడినంతనే కపీశ్వరుడైన హనుమంతుడు అయోధ్యానాథుడైన శ్రీరామచంద్రునకు 'జయము, జయము' అనియనుచు లేచి కూర్చొనెను.

(చౌ॥ 1-4)

భరతుడు పావనిని తన హృదయమునకు హత్తుకొనెను. అతని శరీరము పులకించెను. నేత్రములలో ఆనందాశ్రువులు నిండెను. రఘువంశతిలకుడైన శ్రీరామచంద్రుని స్మరణముతో అతని హృదయము ప్రేమతో నిండిపోయెను. (సో॥ 59)

భరతుడు పలికెను. "నాయనా! తమ్ముడైన లక్ష్మణుడును, తల్లి జానకీ దేవియు, శ్రీరామచంద్ర ప్రభువూ క్షేమమే గదా!" హనుమంతుడు సంక్షిప్తముగా జరిగిన కథనంతయును దెలిపెను. దానిని విని, భరతుడు దు:ఖితుడై మనస్సులోనే పశ్చాత్తాపపడెను. "ఓ దేవా! నేనీ ప్రపంచములో ఎందులకు జన్మించితిని? శ్రీరాముని కార్యములలో ఒక్కదానికిగూడ నేను ఉపయోగపడలేక పోయితిని." పరిస్థితులు తనకు అనుకూలముగా లేవని యెటింగి, ధైర్యము వహించి, పరాక్రమశాలియైన భరతుడు హనుమంతునితో పలికెను. "నాయనా! నీవు అక్కడికి చేరుటలో ఆలస్యమగును. తెల్లవాటినచో నీప్రయత్నము సఫలముగాక పోవచ్చును. కావున పర్వతముతో గూడ నా బాణముపై అధిరోహించుము. నేను కృపానిధియైన శ్రీరాముడున్న చోటికి నిన్ను చేర్చెదను. ఈ మాటలను విని "నా బరువుతో ఈ బాణము ఎట్లు పోగలదు." అని మారుతి మనస్సున సందేహించెను. కాని శ్రీరామచంద్ర ప్రభావమును తలచి కొని, భరతుని పాదములను ఆరాధించి, చేతులు మోడ్చి పలికెను. (చౌ॥ 1-4)

"ప్రభూ! మీ ప్రతాపమును నా హృదయమున నిడుకొని, నేను వేగముగా వెళ్ళగలను." అని పలికి, భరతుని ఆజ్ఞను గైకొని, అతనిచరణములకు ప్రణమిల్లి, హనుమంతుడు బయలుదేఱెను. భరతుని భుజ బలమును, గుణశీలములను, శ్రీరామచంద్రప్రభుచరణములపై ఆతనికిగల అపారప్రేమను మాటి మాటికిని ప్రశంసించుచు పావని ముందునకు సాగెను. (దో॥ 60. క,ఖ)

సోదరుడైన లక్ష్మణునికై శ్రీరాముని ఆవేదన

అక్కడ లక్ష్మణుని స్థితిని జూచి, శ్రీరాముడు సామాన్య మానవునివలె పరితాపమునకు లోనగుచు పలికెను. "అర్ధరాత్రి గడిచినది, హనుమంతుడు ఇంకను రాలేదు" అంతట అతడు లక్ష్మణుని అక్కున జేర్చుకొని, మఱల మఱల వగచుచు పల్కెను. "సోదరా! నీవు నన్నెప్పుడును దుఃఖతునిగా చూడకుంటివి. నా దు:ఖభారమును ఎల్లప్పుడును నీపై వేసికొనుచుంటివి. నీ స్వభావము మిక్కిలి కోమలమైనది. నన్ను సుఖపెట్టుటకై నీవు తల్లిదండ్రులను గూడ వీడి వచ్చితివి. వనములలో శీతవాత-ఆతపబాధలనుగూడ ఓర్చుకొంటివి. ఆకలి దప్పులను సైతము విస్మరించి, ప్రేమతో నన్ను సేవించుచు వచ్చితివి. సోదరా! ఇప్పుడా ప్రేమ ఏమైనది? నా వ్యాకులవచనములను వినిగూడ నీవు ఏలలేవవు? నాతో మాట్లాడవేమి? ఇప్పుడు నేను మిక్కిలి దు:ఖితుడనై యున్నాను. సోదరా! నీవు ఆదర్శసేవా పరాయణుడవు. వనవాసమున అహర్నిశలు అన్నివిధముల నీవు నాకు కుడిభుజముగా నుంటివి. అట్టి నిరుపమాన సోదరుడవైన నీ వియోగము ఈ వనవాసమున సంభవించునని ఊహకైనను అందినచో తండ్రిగారి ఆజ్ఞను కూడ తలదాల్చి, యుండెడివాడను గాను.[1] సంతానము, సంపద, భార్య, ఇల్లు పరివారము మొదలగునవి అన్నియును ప్రపంచములో పదే పదే లభించుచుండును, దూరమగు చుండును. కాని నాయనా! జగత్తులో నీవంటి సహోదరుడుమాత్రము లభింపడు.[2] ఈ విషయమును ఆలోచించి లెమ్ము. సోదరా! జడుడైన విధాత ఒక వేళ నన్ను జీవితునిగా ఉంచినచో నీవు లేని నా జీవితము ఱెక్కలులేని పక్షివలె, మణిలేని సర్పమువలె, తొండములేని గజరాజువలె దీనము, దుఃఖ ప్రదము అగును. భార్య కారణముగ తమ్ముని పోగొట్టుకొని, నేనేముఖము పెట్టుకొని అయోధ్యకు చేరగలను? స్త్రీని కాపాడుకొనలేక పోయితినను అపకీర్తినైనను

1. సోదర ప్రేమాతిరేకముచే శ్రీరాముడు ఇట్లు పల్కుచున్నాడేగాని కలలో సైతము అతడు పితృాజ్ఞను ఉల్లంఘించెడివాడు కానేకాడు.!

2. దేశే దేశే కళత్రాణి, దేశే దేశేచ బాంధవాః తం తు దేశం నపశ్యామిఇ, యత్ర భ్రాతా సహోదరః ॥ వాల్మీకి రామాయణము ॥యుద్ధ 102/ 12,13

సహించియుండెడివాడను. సోదరుని కోల్పోవుట కంటెను. స్త్రీని కోల్పోవుట ఎక్కువ హానికరము గాదు. నాయనా! ఇప్పుడు నా కఠోరహృదయము ఈ అపకీర్తిని భ్రాతృశోకమును రెండింటిని సహింపవలసియున్నది. సుమిత్రాదేవికి నీవు అద్వితీయ పుత్రుడవు. ముద్దుల కుమారుడవు. ఆమెకు ప్రాణతుల్యుడవు. నేను అన్నివిధముల సుఖకారకుడననియు, హితైషిననియు తెలిసి, తల్లి సుమిత్రాదేవి నిన్ను నాకప్పగించినది. ఇప్పుడు వెళ్లి, ఆమెకు నేనేమి సమాధానమును చెప్పగలను? సోదరా! నీవు స్పృహను పొంది, నాకు తగినసలహాను ఏల ఇయ్యవు?" భక్తులు తనను స్మరించినంతమాత్రముననే వారిశోకములను తొలగించు శ్రీరాముడే పెక్కుభంగుల శోకించెను. కమలదళములవంటి ఆయనకన్నులనుండి అశ్రువులు ప్రవహించెను. (శివుడు పల్కుచున్నాడు) పార్వతీ! శ్రీ రఘునాథుడు అఖండుడు, అద్వితీయుడు. భక్తవత్సలుడైన భగవంతుడు తనలీలలను మనుష్యునిగా ప్రదర్శించుచున్నాడు. (చౌ॥ 1-9)

శ్రీరామచంద్రప్రభు విలాపవచనములను ఆలకించి, వానరసమూహములు మిక్కిలి వికలములయ్యెను. ఇంతలో హనుమంతుడు సంజీవని పర్వతముతో రానేవచ్చెను. కరుణరసముతో వీర రసము చేరినట్లాయెను. (సో॥ 61)

కుంభకర్ణుని వధ

శ్రీరాముడు సంతుష్టుడై హనుమంతుని ఆలింగనము చేసికొనెను. ప్రభువు అత్యంతకృతజ్ఞుడు, విజ్ఞుని, వైద్యుడైన సుషేణుడు వెంటనే చికిత్స చేయగా లక్ష్మణుడు స్పృహలోనికి వచ్చి, హర్షితుడై యథారీతిగా కూర్చొనెను. శ్రీరామచంద్రుడు ప్రేమపారవశ్యముతో తమ్ముని గాఢాలింగనము చేసికొనెను. వానర భల్లూకములు మిక్కిలి సంతసించెను. పిమ్మట పావని వైద్యుని యథారీతి హాయిగా ఇంటికి చేర్చివచ్చెను. ఈ సమాచారమునంతయును విని, రావణుడు అతివిషాదముతో తలలను బాదుకొనెను. వ్యాకులితుడై కుంభకర్ణుని యొద్దకు వెళ్లి, వివిధోపాయముల ద్వారా అతనిని నిద్రనుండి మేల్కొల్పెను. సాక్షాత్తు మృత్యువే శరీరధారణచేసి వచ్చినదా? అనునట్లు కుంభకర్ణుడు మేల్కొని రావణుని అడిగెను. "సోదరా! తెలుపుము. నీ ముఖములు వాడిపోయినవేల?" దురభిమానియైన రావణుడు తాను సీతను అపహరించి తీసికొనివచ్చిన విధమును, తదాదిగా జరిగిన వృత్తాంతములను తెలిపి, ఇట్లనెను. "సోదరా! వానరులు రాక్షసులందఱిని మట్టిగరపించిరి. గొప్పగొప్ప యోధులనుగూడ మట్టుపెట్టిరి. దుర్ముఖుడు, దేవాంతకుడు, నరాంతకుడు, మహాయోధులైన అతికాయుడు, అకంపనుడు, మహోదరుడు మొదలగు రణధీరులు, వీరులు అందఱును రణరంగమున నేలకొరిగిరి. (చౌ॥ 1-6)

దశాననుని వచనములను విని, కుంభకర్ణుడు మిక్కిలి విచారముతో నుడివెను. "మూర్ఖుడా! జగన్మాతయైన జానకీదేవిని అపహరించి, ఇప్పుడునీకుమేలు జరుగునని తలంచుచున్నావా? (దో॥ 62)

ఓ రాక్షసరాజా! నీవు చేసినది మంచిపనిగాదు. ఇప్పుడు నన్నేల మేల్కొల్పితివి? నాయనా! ఇప్పటికైనను అహంకారమును వీడి శ్రీరాముని భజింపుము. దశాననా! నీకు శుభమగును. హనుమంతునివంటి సేవకులుగల శ్రీరఘునాథుడు సామాన్య మానవుడా? సోదరా! నీవు చేసినది ఘోరమైన తప్పిదము. మొదటనే ఈ సంగతిని నాకేల తెలుపలేదు? శివుడు, బ్రహ్మ మొదలగు దేవతలచే సేవింపబడు దేవదేవునితో నీవు వైరము పెట్టుకొంటివి. నారదుడు నాకు చేసిన జ్ఞానోపదేశములను నీకు వివరించి యుండెడివాడను. కాని ఇప్పుడు సమయము మించిపోయినది. సోదరా! చివరిసారిగా నన్ను గాఢముగా ఆలింగనము చేసికొనుము. నేను వెళ్ళి, నా కన్నులను సార్థకముచేసికొందును. తాపత్రయములను రూపుమాపువాడును, శ్యామలగాత్రుడును, కమలనేత్రుడును ఐన శ్రీరాముని దర్శింతును."

(చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుని రూపగుణములను స్మరించుచు కుంభకర్ణుడు ఒక్క క్షణకాలముపాటు ప్రేమ పరవశుడాయెను. పిదప రావణుడు కుంభకర్ణునికొఱకై అసంఖ్యాకములైన దున్నపోతులను, మదిరా భాండములను తెప్పించెను. (దో॥ 63)

దున్నపోతులను భక్షించి, మదిరను పానముచేసి, అతడు వజ్రఘాతమువలె గర్జించెను. మదోన్మత్తుడైన కుంభకర్ణుడు రణోత్సాహముతో కోటను వీడి, బయటికి వచ్చెను. తన సేననుగూడ వెంటబెట్టుకొనలేదు. కుంభకర్ణునిజూచి, విభీషణుడు ముందుకు వచ్చి, తన పేరు చెప్పికొని, అతని చరణములపై వ్రాలెను. తమ్ముడైన విభీషణుని లేవనెత్తి కుంభకర్ణుడు అతనిని అక్కున జేర్చుకొనెను. అతడు శ్రీరఘునాథుని భక్తుడని యెఱింగి మిక్కిలి సంతసించెను. విభీషణుడు నుడివెను. "అన్నా! పరమ హితకరమైన సలహాను ఇచ్చినందున రావణుడు నన్ను కాలితో తన్నెను. ఆ బాధతో నేను శ్రీ రఘునాథుని శరణుజొచ్చితిని. ప్రభువునన్ను ఆర్తునిగా ఎఱింగి, ఆత్మీయునిగా భావించి, ఆశ్రయమునిచ్చెను." కుంభకర్ణుడు పలికెను. "నాయనా! వినుము. రావణుడు మృత్యుముఖమునకు చేరువగా ఉన్నాడు. అతడు మరణించుట తథ్యము. ఇప్పుడు సౌమ్యములైన నీ హితవచనములను వినునా? విభీషణా! నీవు ముమ్మాటికిని ధన్యుడవు. రాక్షసకులభూషణుడవు. సుందరసుఖనిధానుడైన శ్రీరాముని భజించి, సోదరా! మన వంశముయొక్క పరువు ప్రతిష్ఠలను ఇనుమడింపజేసితివి. (చౌ॥ 1-5)

త్రికరణశుద్ధిగా కపటములేనివాడవై రణధీరుడైన శ్రీరాముని సేవింపుము. సోదరా! నేనైతే ప్రాణములపై ఆశవదలుకొన్నాను. నాకు తనవారెవరో పెఱవారెవరో తెలియుట లేదు. నీవు ఇప్పుడు, ఇక వెళ్లుము." (దో॥ 64)

సోదరుడైన కుంభకర్ణునివచనములను విని, విభీషణుడు త్రిజగద్భూషణుడైన శ్రీరాముని చేరువకుచేరి నుడివెను. "ప్రభూ! పర్వతాకారుడును, రణధీరుడును ఐన కుంభకర్ణుడు వచ్చుచున్నాడు". ఈ మాటలను విన్నంతనే శక్తిశాలురైన వానరులు, హర్షధ్వనులతో సమరాంగణమునకు పరుగులు పెట్టిరి. వారు పండ్లు కొఱుకుచు, వృక్షములను, పర్వతములను పెకలించి, అతనిపై వేయసాగిరి. భల్లూకవానరములు ఒక్కొక్కసారి పెక్కు పర్వత శిఖరములను అతనిపై విసరిరి. కాని కించిత్తైనను అతని మనస్సు చలింపలేదు. శరీరము కదలలేదు. అర్కఫలములచే (జిల్లేడు కాయలచే) కొట్టబడిన ఏనుగువలె నిశ్చలముగా నుండెను. అప్పుడు పవనపుత్రుడు అతనికి ఒక్క ముష్టిఘాతమును రుచిచూపించెను. దానిచే అతడు నేలపైబడి, వ్యాకులుడై తలబాదుకొనెను. పిదప లేచి అతడు హనుమంతుని కొట్టెను. దానిచే నతడు గిరగిర తిరిగి నేలపై బడెను. ఆ పిమ్మట కుంభకర్ణుడు నలుని, నీలుని,నేలపై పడగొట్టెను. ఇతర యోధులను అందఱిని ఒకరి తరువాత ఒకరిని పట్టుకొని నేలపై విసరివేసెను. కపి సేనయంతయు పాఱిపోయెను. భయభ్రాంతులై వారిలో ఎవ్వరును అతనిని ఎదుర్కొనుటకు సాహసింపరైరి.

(చౌ॥ 1-5)

సుగ్రీవుడు, అంగదుడు మొదలగువారినందఱిని మూర్ఛితులనుగాజేసి, అపారబలశాలియైన కుంభకర్ణుడు వానరరాజైన సుగ్రీవుని తనచంకలో ఇరికించుకొని పోయెను. (దో॥ 65)

(శివుడు పలుకుచున్నాడు) భవానీ! సర్పసమూహములమధ్య గరుడునివలె శ్రీరఘునాథుడు మానవలీలలను ప్రదర్శించుచున్నాడు. తన బొమముడితోడనే కాలునిగూడ కబళించి వేయగల ప్రభువునకు ఇట్టి యుద్ధము ఒక లెక్కలోనిదా? భగవంతుడు జగమును పావనమొనర్చు తనయశస్సును ఈ సమరముద్వారా విస్తరింపజేసెను. దానిని గానము చేసెడివారు భవసాగరమును దాటగలరు. మూర్ఛనుండి తేరుకొనిన వాయునందనుడు సుగ్రీవునకై వెదకెను. ఇంతలో స్పృహనుపొందిన సుగ్రీవుడు కుంభకర్ణుని చంకలోనుండి జారెను. అతడు మరణించి యుండెనని

కుంభకర్ణుడు తలచియుండెను. కాని సుగ్రీవుడు అతని, ముక్కు చెవులను కొఱికి ఘోరముగా గర్జించి, ఆకాశమునకెగిరెను. అప్పుడు సుగ్రీవుడు తప్పించుకొనినాడుఅనువిషయమును కుంభకర్ణుడు గ్రహించెను. వెంటనే అతడు సుగ్రీవునికాలుపట్టుకొని నేలకేసి కొట్టెను. బలశాలియైన సుగ్రీవుడు శీఘ్రముగాలేచి, అతనిని కొట్టి, ప్రభువునొద్దకు వచ్చి, "కృపానిధియైన ప్రభువునకు 'జయము జయము' అని పలికెను. తన ముక్కుచెవులు కొఱుకబడినవని తెలిసికొనిన కుంభ కర్ణుడు మిక్కిలి బాధపడెను. అతి క్రుద్ధుడై, మార్గమునుండి మఱలివచ్చెను. సహజముగా భయంకరాకృతిగలయతడు ముక్కు చెవులు లేక పోవుటచే ఇంకను వికృతముగా కనబడెను. అతనిని జూచిన వానరసైన్యము భయభ్రాంతమాయెను. (చౌ॥ 1-5)

"రఘువంశమణికి జయము జయము" అని జయజయ ధ్వానములనుగావించుచు వానరులందఱును పరుగెత్తి, 'హోహోహూహూ' అనుచు అందఱును ఒక్కసారిగా వృక్షములను, పర్వతములను కుంభకర్ణుని మీదికి విసరిరి. (దో॥ 66)

మూర్తీభవించిన వీరరసమా? అనునట్లున్న కుంభకర్ణుడు వారియెదుట నడచుచు కాలుడే క్రుద్ధుడై వచ్చు చున్నట్లు ఒప్పెను. అతడు అసంఖ్యాక వానరులను ఒకరి తరువాత మఱియొకరిని పట్టుకొని, భక్షింపసాగెను. మిడుతలదండు పర్వతగుహలోనికి పోవుచున్నట్లు వారతనిముఖములోనికి ప్రవేశించిరి. లెక్కలేనంత మంది వానరులను పట్టుకొని, అతడు తన దేహముతో అణచివేసెను. కొందఱిని చేతులతో నలిపి మట్టిలో గలిపెను. పొట్టలోనికి పోయిన వానరులు, భల్లూకములు అతనినోరు, ముక్కు చెవులనుండి బయటికి వచ్చి, పరుగెత్తసాగిరి. విధాత సమస్తవిశ్వమును తనకప్పగించినట్లును, దానిని తాను మ్రింగుచున్నట్లును భావించుచు కుంభకర్ణుడు రణోన్మత్తుడై గర్వించెను. యోధులందఱును వెన్ను చూపి పరుగులు దీసిరి. తిరిగి రమ్మన్నను వారు రారైరి. ఎవ్వరినీ చూడరైరి. ఎవ్వరిమాటలనూ వినరైరి. కుంభకర్ణుడు వానరసేనను చెల్లాచెదరు చేసినాడని విని, రాక్షససేన ఉత్సాహముతో ముందునకు దూసికొనిపోవుచుండెను. తమ సైన్యము కలవరపాటుతో చెదరిపోయినట్లును, శత్రుసైన్యము ముందడుగు వేయుచున్నట్లును శ్రీరాముడు గమనించెను. (చౌ॥ 1-4)

అప్పుడు కమలనయనుడైన శ్రీరాముడు వచించెను. "సుగ్రీవా! విభీషణా! లక్ష్మణా! వినుడు మీరు సేనలను సమాయత్తపఱచుడు. నేనీ దుష్టుని శక్తిని, వాని సైన్యబలమును చూచెదను. (దో॥ 67)

చేతిలో శార్ఙ్గధనువును, నడుమున తూణీరమును ధరించి, శ్రీరఘునాథుడు శత్రుసేనను పరిమార్చుటకు బయలుదేఱెను. ప్రభువు మొదట ధనుష్టంకారమును గావించెను. దాని భయంకరధ్వనితో శత్రుసైనికులు బధిరులైరి. సత్యప్రతిజ్ఞుడైన శ్రీరాముడు శరములను పరంపరగా ప్రయోగించెను. అవి రెక్కలున్న కాలసర్పములవలె నలుదెసల దూసికొనిపోయెను. వాటి శక్తికి ఘోరరాక్షసయోధులు ముక్కలు ముక్కలైరి కాళ్లు, వక్షములు, మస్తకములు, భుజదండములు తెగిపడెను. పెక్కుమంది రాక్షసులు గిరగిర తిరుగుచు నేలకొరిగిరి. కొందఱుయోధులు మఱలలేచి, పోరాడుచుండిరి. వారందఱును బాణములు తగులగానే మేఘములవలె గర్జించుచుండిరి. పెక్కుమంది రాక్షసయోధులు బాణములను అల్లంతదూరమున చూడగానే పలాయనము చిత్తగించుచుండిరి. శిరస్సులులేని మొండెములు భయంకరముగా ఎగిరెగిరిపోవుచుండెను. తెగిన తలలు 'పట్టుకో, పట్టుకో, చంపుము చంపుము' అని కేకలు వేయుచుండెను. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రప్రభువు విడిచిన బాణములు క్షణకాలములో ఆ ఘోరరాక్షసులను ముక్కలు ముక్కలుగావించి, మఱలివచ్చి, ప్రభువుయొక్క తూణీరమున ప్రవేశించెను. (దో॥ 68)

కుంభకర్ణుడు తనలో "నాకనులయెదుటనే శ్రీరాముడు ఒక్కక్షణములో రాక్షససేనను పూర్తిగా హతమార్చెను." అని అనుకొనుచు అత్యంత క్రుద్ధుడై, భీకరముగా సింహనాదమొనర్చెను. పర్వతములను పెకలించి, వానరములపై

వేయుచుండెను. అది గమనించిన ప్రభువు ఆ పర్వతములను తన బాణములతో పొడిపొడిగావించి, దూరముగా పడిపోవునట్లు చేయుచుండెను. పిదప శ్రీ రఘువీరుడు అతిక్రుద్ధుడై ధనుస్సును ఎక్కుపెట్టి, అత్యంత భయానకములైన బాణములను పెక్కింటిని ప్రయోగించెను. ఆ ఆశుగములు (బాణములు) కుంభకర్ణుని శరీరములోనికి 'విద్యుల్లతలు మేఘములలోనికి ప్రవేశించునట్లు' చొచ్చుకొని పోవుచుండెను. కుంభకర్ణుని నల్లనిశరీరమునుండి కారెడి రక్తపు జాలులు నల్లని కాటుక కొండనుండి స్రవించు గైరికధాతు ప్రవాహములవలెనుండెను. అతడు వికలుడగుట చూచి వానర భల్లూకములు అతని మీదికి దాడికి వెడలుచుండెను. వానరములు సమీపింపగనే అతడు వికటాట్టహాసము చేయుచుండెను. (చౌ॥ 1-4)

ఘోరగర్జనలనుజేయుచు, అతడు అసంఖ్యాకములైన వానరములను పట్టుకొని, మదపుటేనుగువలె నేలకేసి కొట్టుచుండెను. 'రావణునకు జయము, జయము' అని బిగ్గరగా అరచుచుండెను. (దో॥ 69)

తోడేలును జూచిన గొఱ్ఱెలవలె ఆ వానరభల్లూకములు కుంభకర్ణునిజూచి, పరుగులు దీయసాగెను. (శివుడు పలుకుచున్నాడు) భవానీ! వానరభల్లూకములు చెల్లాచెదరై ఆర్తనాదములతో పిక్కబలము చూపెను. వారు " ఓ కృపానిధీ! ఖరారీ! ప్రణతార్తిహరా! శ్రీరామా! ఈనిశాచరుడు వానరలోకమును సర్వనాశనము చేయుటకై వచ్చిన కాటకమువలె ఉన్నాడు. మమ్ము రక్షింపుము, రక్షింపుము" అని ఆర్తితో వేడుకొనిరి. వారిదీనాలాపములనువినిన భగవంతుడు ధనుర్బాణములను ధరించి, వానరభల్లూకసేనను తన వెంట నిడుకొని, ముందునకు సాగెను. ధనుస్సును లాగి, నూఱుబాణములను ఒక్కసారి ప్రయోగింపగా అవి ఆ రాక్షసునిశరీరమున గ్రుచ్చుకొనెను. బాణములు తగులగానే కుంభకర్ణుడు క్రోధావేశముతో శ్రీరామునివైపు వేగముగా దూసికొని రాసాగెను. అతని వేగమునకు పర్వతములు గిరగిర తిరిగెను. భూమి కంపించెను. కుంభకర్ణుడొకపర్వతమును చేతబట్టి వచ్చుచుండెను. రఘువీరుడు వాని ఆభుజమును ఖండించెను. అప్పుడతడు ఎడమచేతితో పర్వతమునెత్తికొని వచ్చుచుండెను. ప్రభువు ఆతనిఎడమచేతిని గూడ ముక్కలు ముక్కలుగావించి అతనిని నేలపై పడగొట్టెను. భుజములను కోల్పోయిన ఆ దుష్టరాక్షసుడు ఱెక్కలుతెగిన మందరాచలమువలె ఒప్పుచుండెను. ముల్లోకములను మ్రింగివేయునంతటిక్రూరదృష్టితో అతడు ప్రభువును జాచెను. (చౌ॥ 1-6)

అతిఘోరముగా కేకలుపెట్టుచు అతడు నోరు తెఱచుకొని ముందునకు పరుగెత్తెను. ఆకాశమున సిద్ధులు, దేవతలు భయభ్రాంతులకులోనై హాహాకారములు చేసిరి. (దో॥ 70)

దేవతలు భీతచిత్తులైనట్లు ఎఱింగి, దయాళువైన రఘునాథుడు ధనుస్సును ఆకర్ణాంతములాగి, రాక్షసుని ముఖమును బాణములతో నింపెను. ఐనను మహాబలుడైన ఆ రాక్షసుడు నేలగూలలేదు. ముఖమునిండా బాణములు గ్రుచ్చుకొనియున్నను మృత్యువే సజీవమైన తూణీరముగా వచ్చుచున్నట్లు అతడు ప్రభువుముందునకు వేగముగా ఏతెంచెను. అప్పుడు ప్రభువు క్రుద్ధుడై ఒక తీవ్రమైన బాణముతో వాని తలను మొండెమునుండి వేఱుచేసెను. ఆ కుంభకర్ణుని శిరస్సు ఎగిరిపోయి, రావణుని ముందుపడెను. దానిని జూచి దశాననుడు మణిని పోగొట్టుకొన్న సర్పమువలె హతాశుడయ్యెను. తలలేని కుంభకర్ణుని కళేబరము రణరంగమున పఱుగెత్తుచుండెను. దాని భారమునకు భూమి క్రుంగిపోయెను. రామచంద్రప్రభువు దానిని రెండు ముక్కలుగా జేసెను. ఆ రెండు ఖండములును ఆకాశమునుండి రెండు పర్వతములు కూలిపోయినట్లు నేలపై పడిపోయెను. వాటిక్రిందబడి పెక్కుమంది భల్లూకవానరులు, నిశాచరులు నలిగిపోయిరి. ఆ శరీరఖండములనుండి ఒక తేజస్సు వెడలి, శ్రీరామునిలో లీనమాయెను. ఆ దృశ్యమునుగాంచి, దేవతలును, మునులును ఆశ్చర్యచకితులైరి. దేవతలు హర్షముతో దుందుభులను మ్రోగించిరి. శ్రీరామునిగుణములను కీర్తించుచు పుష్పములను వర్షించిరి. అనేక స్తోత్రములను చేసి, దేవతలు వెళ్లిన పిదప దేవర్షి నారదుడు విచ్చేసెను. అతడు ఆకసమున నిలబడి, భగవంతుని వీర్యపరాక్రమములను, దివ్యగుణములను గానము చేసెను, ప్రభువు ప్రసన్నుడాయెను. 'ఆలసింపక దుష్టరావణునిగూడ సంహరింపుడు' అని పలికి నారదుడు వెళ్ళిపోయెను. ఆసమయమున శ్రీరామచంద్రుడు సమరాంగణమున దివ్యతేజస్సులతో విరాజిల్లెను. (చౌ॥ 1-6)

అతులితబలధాముడైన కోసలపతి శ్రీరామచంద్రుడు రణరంగమున విరాజమానుడైయుండెను. ఆయన ముఖముపై శ్రమబిందువులు రుచిరములైయుండెను. కమలములవంటిలోచనములు ఎఱ్ఱబాఱెను. తనువుపై రక్తబిందువులు ఒప్పుచుండెను. కరద్వయమున ధనుర్బాణములు తిరుగుచుండెను. నలువైపులయందును వానరభల్లూకములచే పరివేష్టితుడై యుండెను. అప్పటి ప్రభు సౌందర్యమును వేయిముఖములుగల ఆదిశేషుడుగూడ వర్ణింపజాలడని తులసీదాసునుడువుచున్నాడు. (ఛం)

(శివుడు పలుకుచున్నాడు) గిరిజా! నీచనిశాచరుడును, పాపాలపుట్టయు ఐన కుంభకర్ణునకును శ్రీరాముడు పరమపదమును అనుగ్రహించెను. అట్టి స్వామిని భజింపనివాడు నిజముగా మందబుద్ధియని భావింపవలెను. (దో॥ 71)

లక్ష్మణ మేఘనాదుల సమరము

సాయంసమయమగుటవలన ఉభయసేనలును తమతమ శిబిరములకు జేరెను. ఆనాటియుద్ధమున యోధులు మిక్కిలి అలిసిపోయిరి. కాని అగ్నిసహాయమున గడ్డిపోచలుగూడ బాగుగా ప్రజ్వరిల్లునట్లు శ్రీరామునికృపవలన వానరసేనలబలము ప్రబలమాయెను. చేసిన ఘన (పుణ్య) కార్యములను గూర్చి తామే స్వోత్కర్షతో నిరంతరము చెప్పికొనుటవలన అపుణ్యఫలములు నశించి పోవునట్లు రాక్షసులబలము క్రమముగా క్షీణించుచుండెను. రావణుడు కుంభకర్ణునిశిరస్సును తనగుండెకు మాటిమాటికిని హత్తుకొనుచు మిక్కిలి విలపింపసాగెను. స్త్రీలు కుంభకర్ణునితేజస్సును, బలమును విశేషముగా వర్ణించుచు తమ గుండెలను బాదుకొనుచు ఏడువసాగిరి. ఆదే సమయమున మేఘనాదుడు అచటికి వచ్చి ధైర్యోత్సాహములను గూర్చు పెక్కుకథలను వినిపించి, రావణునకు ఊరట గూర్చుచు ఇట్లు పలికెను. "రేపు నా పరాక్రమమును చూడుడు. ఇప్పుడే నన్ను నేనేల ప్రశంసించుకొనవలెను? నా ఇష్టదైవమునుండి నేను పొందిన బలమును రథమును మీకింతవఱకు చూపలేదు. ఈ విధముగా అతడు ప్రగల్భములను పలుకుచుండగా తెల్లవాఱెను. లంకయొక్క నాలుగుద్వారములకడ వానరసైన్యములు సమీకరించియుండెను. కాలునివలె ప్రళయ భయంకరులైన భల్లూకవానరులీవైపునను, అత్యంతరణధీరులైన రాక్షససైనికులావైపునను యుద్ధసన్నద్ధులై యుండిరి. ఉభయపక్షముల యోధులును విజయకాంక్షతో వీరోచితముగా పోరాడుచుండిరి. ఓ గరుడుడా! అట్టి భీకర యుద్ధమును వర్ణింపజాలము. (చౌ॥ 1-6)

మేఘనాదుడు తనఇష్టదైవమునుండిపొందిన మాయారథమునెక్కి, ఆకసమునకు ఎగిరెను, అట్టహాసముతో గర్జించెను. ఆ గర్జనలను విని, వానరసేనలు భయకంపితములయ్యెను. (దో॥ 72)

మేఘనాదుడు శక్తి, శూలము, ఖడ్గము, కృపాణము, మున్నగు అస్త్రశస్త్రములను, వజ్రాయుధ తుల్యములగు వివిధాయుధములను శత్రుసైన్యములపై ప్రయోగించెను. పరశువు, పరిఘ, శిలలు, మున్నగువాటిని, వివిధశరములను వర్షింపసాగెను. ఆకాశమును మఖకార్తెలో మేఘములు కప్పివేసినట్లు, ఇంద్రజిత్తుబాణములు దశదిశలను కప్పివేసెను. 'పట్టుకొనుము, పట్టుకొనుము, చంపుము, చంపుము' అను అఱపులుఅంతట వినబడుచుండెను. కాని ఇంద్రజిత్తుమాయవలన ఆ శస్త్రాస్త్రములను ప్రయోగించెడి ఇంద్రజిత్తుమాత్రము ఎవ్వరికిని కనబడుటలేదు. ఆ ఇంద్రజిత్తునకు మాత్రము అందఱును కనబడుచుండిరి. పర్వతములను, వృక్షములను గైకొని, వానరవీరులు ఆకసమునకెగిరిరి. కాని ఎవ్వరును కనబడనందున నిరాశతో మఱలివచ్చిరి. తనమాయాప్రభావమున మేఘనాదుడు దుర్గమములైన లోయలను, మార్గములను, కొండగుహలను శరపంజరములలో బంధించెను. వానరులు దిక్కుతోచక ఇంద్రునకు పర్వతములు బందీలైనట్లు మిక్కిలి వ్యాకులపాటునకు లోనైరి. మేఘనాదుడు పవనసుతుడైన హనుమంతుని, అంగదుని, నలుడు, నీలుడు మొదలగు బలశాలురైన మహా యోధులందఱిని కలవరపఱచెను. పిదప లక్ష్మణుని, సుగ్రీవుని, విభీషణుని, తన బాణములతో బాధించి, వారి శరీరములను జర్జరితములుగాజేసెను. పిదప అతడు శ్రీరఘునాథునితో యుద్ధము చేయసాగెను. అతడు వదలిన బాణములు సర్పములై

వచ్చిపడుచుండెను. స్వతంత్రుడు అనంతుడు, అఖండుడు, నిర్వికారుడు, ఖరారియైన శ్రీరాముడు లీలగా నాగపాశబద్ధుడయ్యెను. శ్రీరామచంద్రుడు సర్వదా స్వతంత్రుడు, అద్వితీయుడైన భగవంతుడు అతడు ఒక నటునివలె అనేక ప్రకారముల లీలావిలాసములను ప్రదర్శించుచుండును. కనుక యుద్ధమునకు శోభను గూర్చుటకై ప్రభువు తనకుతానై ఇప్పుడు నాగపాశమునకు కట్టుబడెను. ఆ దృశ్యమును గాంచి, దేవతలు భయపడిరి. (చౌ॥ 1-7)

(శివుడు పలుకుచున్నాడు) ఓ గిరిజా! రామనామమును జపించినంత మాత్రముననే మునులు భవ బంధములనుండి విముక్తులయ్యెదరు. సర్వవ్యాపకుడును, జగన్నివాసుడును ఐన అట్టి ప్రభువు ఎవరి బంధములకైనను చిక్కునా? (దో॥ 73)

శర్వాణీ! సగుణస్వరూపుడైన శ్రీరామునిలీలలు వాక్కునకును, బుద్ధికిని అతీతములు. దీనిని గ్రహించియే తత్త్వజ్ఞానులును, విరాగులును తర్కములజోలికిపోక శ్రీరాముని ఆరాధించెదరు. మేఘనాదుడు వానరసైన్యములను తికమకల పాలుచేసెను. పిమ్మట అందరికిని కనబడుచు దుర్భాషలాడసాగెను. అప్పుడు జాంబవంతుడు "ఓరీదుష్టుడా! నిలువుము." అనిపలికెను. ఈ మాటను విని, మేఘనాదుడుక్రుద్ధుడై "ఓరీ మూర్ఖుడా! ముసలివాడవని నిన్ను నేను వదలివేసితిని. ఇప్పుడు నన్ను కవ్వించుచున్నావు." అని పలికి నిశితమైన త్రిశూలమును ప్రయోగించెను. జాంబవంతుడు ఆత్రిశూలమును చేతితో పట్టుకొని, ముందునకు పరుగెత్తి, దానితోడనే అతని వక్షస్థలముపై దెబ్బతీసెను. దేవతలకు శత్రువైన మేఘనాదుడు ఆదెబ్బకు గిరగిర తిరిగి నేలపై వ్రాలెను. జాంబవంతుడు క్రుద్ధుడై, అతని కాలిని చిక్కించుకొని, గిరగిర త్రిప్పి, నేలకేసికొట్టి తన బలమును ప్రదర్శించెను. కాని ఇంద్రజిత్తు కొట్టబడినను వరప్రభావమున చావలేదు. జాంబవంతుడు అతని కాలిని చిక్కించుకొని లంకలోనికి విసరివేసెను. ఇంతలో దేవర్షినారదుడు శ్రీరామునికడకు గరుడుని పంపెను. (చౌ॥ 1-5)

పక్షిరాజైన గరుత్మంతుడు మాయారచిత సర్పములనన్నింటిని పట్టుకొని తినివేసెను. అప్పుడు వానరులందఱును మాయావిముక్తులై, ప్రసన్నులైరి. పర్వతములను వృక్షములను, ఱాళ్లను, నఖములను ఆయుధములుగా గలిగి, వానరులు క్రుద్ధులై యుద్ధ భూమికి పరుగెత్తిరి. రాక్షసులు వారి ధాటికి తట్టుకొనలేక వ్యాకుల పాటుతో పాఱిపోయి కోటలపైకెక్కిరి. (దో॥ 74 క,ఖ)

యజ్ఞ భంగము - మేఘనాదుని వధ

మేఘనాదుడు మూర్ఛనుండి లేవగానే తండ్రిని జూచి సిగ్గుపడెను. "నేను 'అజేయయజ్ఞము'ను జేసెదను"- అని సంకల్పము చేసి, వెంటనే ఒక పర్వతగుహలోనికి వెళ్లెను. ఇక్కడ విభీషణుడు శ్రీరామునకు సలహానిచ్చెను. "అతులిత బలశాలీ! ఉదారగుణనిధీ! ప్రభూ! దుష్టుడును మాయావియు ఐన మేఘనాదుడు అపవిత్ర యజ్ఞమును జేయుచున్నాడు. ఆ యజ్ఞము ఫలించినచో అతనిని జయించుట కష్టము."- ఈ మాటలను విని, రఘునాథుడు మిక్కిలి సంతుష్టుడై అంగదాదివానరులనుబిలిచి పలికెను. "వానర వీరులారా! మీరందఱును లక్ష్మణునితో వెళ్లి, అయజ్ఞమును ధ్వంసము చేయుడు. లక్ష్మణా! నీవు వానిని యుద్ధములో సంహరింపుము. భయభ్రాంతులకు లోనైన దేవతలను జూచి నేను మిక్కిలి విచార పడుచున్నాను. సోదరా! నీ బలము, బుద్ధి, ఉపాయములచే ఆ రాక్షసుని ఏదోక విధముగా తుదముట్టింప వలెను. జాంబవంతా! సుగ్రీవా! విభీషణా! మీరు ముగ్గురును మీమీసేనలతోగూడి ఇతనికి తోడుగా చనుడు"- శ్రీరామునిఆజ్ఞమేరకు రణధీరుడైన లక్ష్మణుడు నడుమునకు తూణీరమును కట్టుకొని, ధనుర్బాణములను చేబూని, శ్రీరాముని ప్రతాపమును మనస్సులో నిలుపుకొని, మేఘగంభీరస్వరముతో ఇట్లనెను. "నేను శ్రీ రఘునాథునకు నిజమైన సేవకుడనేఐనచో ఆ దుష్టుని వధింపక మఱలిరాను. రఘు వీరునిపై శపథము చేయుచున్నాను. ఆ శంకరుడే అతనికి తోడై నిలిచినను మేఘనాదునకు నా చేతిలో చావు తప్పదు." (చౌ॥ 1-7)

శ్రీ రఘునాథుని చరణములకు శిరసా ప్రణమిల్లి, శేషావతారుడైన లక్ష్మణుడు వెంటనే రణభూమికి చేరెను. అతనితోపాటు అంగదుడు, నలుడు, నీలుడు, మయందుడు, హనుమంతుడు మొదలగు మహా యోధులు వెళ్లిరి. (దో॥ 75)

వానరులు వెళ్లి చూడగా మేఘనాదుడు దున్నపోతులను ఆహుతిగా ఇచ్చుచుండెను. రక్తముతో హోమము చేయుచుండెను. వానరులు వానియజ్ఞమును ధ్వంసమొనర్చిరి. ఐనను అతడు యజ్ఞ పీఠము నుండి లేవలేదు. అప్పుడు వారు అతనిని వ్యంగ్యముగా పొగడదొడగిరి. ఈ వ్యంగ్యోక్తులకును అతడు చలింపకుండెను. అప్పుడు వారతనికేశములను పట్టుకొని, కాళ్లతో తన్ని పరుగెత్తిరి. త్రిశూలముతో అతడు వారిని వెంబడింపగా వారు లక్ష్మణుని కడకు చేరిరి. మేఘనాదుడు మిక్కిలి క్రోధావేశములతో భయంకరముగా గర్జించెను. పవనసుతుడును, అంగదుడును, కోపముతో వానిని ఎదుర్కొనిరి. అతడు వారిగుండెలపై త్రిశూలముతో కొట్టి నేలపై పడిపోవునట్లు చేసెను. అనంతరము అతడు త్రిశూలమును లక్ష్మణునిపై విసరెను. అనంతుడైన ఆ లక్ష్మణుడు త్రిశూలమును తనబాణముతో కొట్టి, రెండు ముక్కలు గావించెను. హనుమంతుడును, అంగదుడును, క్రోధముతో అతనిని కొట్టసాగిరి. ఎంతగా కొట్టినను అతనికి దెబ్బతగులుటలేదు. ఏవిధముగను అతడు తమచేతులలో మరణింపడని భావించి, ఆ వానర వీరులందఱును తిరిగి వచ్చిరి. అతడు ఘోరముగా గర్జించుచు ముందునకు వచ్చెను. క్రుద్ధుడై మృత్యువువలె వచ్చుచున్న అతనిని జూచి, లక్ష్మణుడు అతనిపై తీక్ష్ణములైన బాణములను వదలెను. వజ్రతుల్యములైన ఆ బాణములు వచ్చుటను జూచి, వెంటనే అతడు అంతర్ధాన మాయెను. మాయతో వివిధ రూపములను ధరించి, యుద్ధము చేయసాగెను. ఒక్కొక్కసారి ప్రకటితుడగుచుండెను. మఱియొకపర్యాయము దాగుకొనుచుండెను. శత్రువు అజేయుడని తెలిసి, వానరులు భయపడుచుండిరి. కోపోద్రిక్తుడైన లక్ష్మణుడు" ఇంక ఈ పాపితో ఆటలు చాలును. వీనిని ఇప్పుడు చంపుటయే యుక్తము" అని తలంచెను. శ్రీరాముని ప్రభావమును తలంచుకొని, లక్ష్మణుడు వీరోచిత దర్పముతో బాణమును సంధించి, వదలెను. అది సూటిగా వెళ్లి మేఘనాదుని గుండెలో గ్రుచ్చుకొనెను. మరణ సమయమున అతడు కపటమును త్యజించెను. (చౌ॥ 1-8)

(అతని హృదయములో ఈ భావము కలిగెను) "రాముని తమ్ముడు లక్ష్మణుడు ఎక్కడ? రాముడెక్కడ?" అనుచు అతడు అసువులు వీడెను. అంగదుడును, హనుమంతుడును ఇట్లు పలికిరి. "నీ తల్లి ధన్యురాలు. ధన్యురాలు. నీవు లక్ష్మణుని చేతిలో మరణించితివి. మరణసమయమున రామలక్ష్మణనామములను స్మరించితివి" (దో॥ 76)

హనుమంతుడు మేఘనాదుని కళేబరమును అనాయాసముగ తీసికొని పోయి, లంకాద్వారముకడనుంచి తిరిగి వచ్చెను. మేఘనాదుని మరణవార్తవిని, దేవతలును, గంధర్వాదులును విమానములపై ఆకాశ మార్గమున వచ్చిరి. వారు దుందుభులను మ్రోగించుచు పూలను వర్షించిరి. శ్రీ రఘునాథుని నిర్మల కీర్తిని గానము చేసిరి. "ఓ అనంతా! నీకు జయము. ఓ జగదాధారా! నీకు జయము. ప్రభూ! మీరు మహావిపత్తు నుండి దేవతలను ఉద్ధరించితిరి." దేవతలు, సిద్ధులు మొదలగువారును స్తుతులొనర్చి, వెళ్లినపిమ్మట లక్ష్మణుడు దయాళువైన శ్రీరాముని చెంతకు వచ్చెను. రావణుడు తన కుమారునిమరణవార్తను వినగానే మూర్ఛితుడై నేలపై పడెను. మందోదరి గుండెలు బాదుకొనుచు అనేకవిధముల విలపించెను. లంకా నివాసులందఱును 'అయ్యో! పాపము' అని రోదించుచు శోక విహ్వలురైరి. రావణుడు పరమనీచుడని తిట్టసాగిరి. (చౌ॥ 1-4)

అప్పుడు దశకంఠుడైన రావణుడు స్త్రీలనందఱిని ఓదార్చెను. "దృశ్యమానమగు బాహ్యజగత్తంతయు నశించునదియే. ఈ విషయమును గ్రహించి, ధైర్యమును వహింపుడు"- అనెను. (దో॥ 77)

రావణుడు వారికి జ్ఞానోపదేశము గావించెను. అతడు నీచుడైనను, ఆతనిఉపదేశము మాత్రము హితమును గూర్చునదియై పవిత్రమైనదిగా ఉండెను. లోకములో ఇతరులకు ఉపదేశములనిచ్చువారికి లోటు లేదు. కాని తమ ఉపదేశములను తాము ఆచరించువారు మాత్రము తక్కువగా ఉందురు. రాత్రి గడచినది, తెల్లవాఱినది. భల్లూకవానరులు మఱల లంకయొక్క నాలుగుద్వారములనొద్ద చేరిరి. దశముఖుడు క్రుద్ధుడై తన వీర యోధులను

పిలిచి ఇట్లనెను. "యుద్ధములో శత్రుసేనలను జూచి, మనస్సులో భీతిల్లుచు తటపటాయించువారు ఇప్పుడే వెనుదిఱుగుట మంచిది. రణరంగమునకు వచ్చిన పిదప వెన్ను చూపుట తగదు. నేను నా భుజబలమును నమ్మి వైరమును పెంచుకొన్నాను. మన్పై దండెత్తి వచ్చిన శత్రువునకు తగినసమాధానమును నేనే ఇయ్యగలను." ఇట్లు పలికి వాయువేగముతో సాగిపోగల తనరథమును సిద్ధముగావింపజేసెను. యుద్ధభేరీలు మ్రోగినవి. అసమానబలశాలురైన వీరులు కాటుక తుఫానువలె బయలుదేఱిరి. ఆ సమయమున పొడసూపిన అపశకునములకు అంతులేకుండెను. కాని తనభుజబలగర్వమున రావణుడు వాటిని లెక్క చేయకుండెను. (చౌ॥ 1-5)

రావణుడు వానరయోధులతో తలపడుట

అత్యంత గర్వ కారణమున అతడు శుభాశుభ శకునములను ఏమాత్రమూ పట్టించుకొనలేదు. చేతుల నుండి ఆయుధములు జారిపడెను. యోధులు తమతమ రథములనుండి క్రిందపడిరి. గుఱ్ఱములు సకిలించుచును, ఏనుగులు ఘీంకరించుచును యుద్ధభూమిని వీడి, పాఱిపోయెను. నక్కలు, రాబందులు, తీవ్రస్వరముతో కర్ణకఠోరముగా కూయసాగెను. కుక్కలు అంతులేకుండ మొఱుగుచుండెను. గ్రుడ్లగూబలు కాలునిదూతలాయనునట్లు భయంకరశబ్దములు చేయుచుండెను. భీకరములైన ఈ అపశకునములన్నియును మృత్యువుయొక్క రాకను సూచించుచుండెను. (ఛం)

ప్రాణులయెడ వైరముపూనువాడును, మోహమునకు వశుడగువాడును శ్రీరామునకు విముఖుడును, కామమునకు దాసుడును అగువాడు కలలోగూడ శుభశకునములను, సంపదలను, మనశ్శాంతిని ఎన్నడునూ, ఏ విధముగనూ పొందజాలడు. (దో॥ 78)

అపారమైన నిశాచరసేన ముందునకుసాగెను. చతురంగబలములు అనేకదళములుగా విభజింపబడెను. ఆ దళములు వివిధవాహనములను, రథములను, విమానములను, నానావర్ణములధ్వజపతాకములను కలిగి యుండెను. మదపుటేనుగుల గుంపులు పవన ప్రేరితములైన వర్షాకాలమేఘములవలె వడివడిగా కదలుచుండెను. వీరులు చిత్రవిచిత్రములైన దుస్తులను ధరించి యుండిరి. వారు అందఱును రణ విద్యాకుశలురు, మాయావులు. సేన అత్యంత విచిత్రముగను, వీర వసంతుడే తన సైన్యముతో వచ్చినట్లుగనుఉండెను. ఆ సేన నడచుచుండుట చూచి, దిగ్గజములే త్రుళ్ళిపడుచుండెను. సముద్రము అల్లకల్లోలమాయెను. పర్వతములు కంపించెను. సేనలు నడుచునప్పుడు చెలరేగుచున్న ధూళి సూర్యుని కప్పి వేయుచుండెను. అకస్మాత్తుగా గాలి ఆగిపోయెను. పృథ్వి వ్యాకులతనొందెను. ప్రళయకాలమేఘములు గర్జించినట్లు డోళ్ళు, నగారాలు భయంకరముగా మ్రోగింపబడెను. నగారాలు, మేళములు, సన్నాయిలు యోధులకు ఉత్సాహమును ఇనుమడింప జేయు 'కదన కుతూహల' రాగమును ఆలపించుచుండెను. వీరులందఱును సింహనాదములను జేయుచు తమతమబలపౌరుషములను ప్రకటించుచుండిరి. అప్పుడు దశకంఠుడు తన సేనలను సంబోధించుచు ఇట్లు పలికెను. "ఉత్తమ మహాయోధులారా! వినుడు. భల్లూక వానరసమూహములను మర్దించి, నలిపివేయుడు. నేను ఆ యిద్దఱు రాజకుమారులను హతమార్చెదను." ఇట్లనుచు అతడు తనసైన్యమును ముందునకు నడిపెను. ఈ వార్త తెలియగనే వానరులు 'శ్రీరామునకు జయము, జయము' అనుచు రణరంగమున దూకిరి. (1) (చౌ॥ 1-7)

కాలునితోసమానులైన భీకరభల్లూకవానరులు పెక్కురంగులుగల ఱెక్కలపర్వతములవలె ఎగురసాగిరి. నఖములు, దంతములు, పర్వతములు, వృక్షములు వారి శస్త్రాస్త్రములు. వారు గొప్ప బలశాలురు, నిర్భయులు. రావణుడనెడి మదపుటేనుగుపాలిటిసింహమైన శ్రీరామునకు జయజయ నాదములను బల్కుచు అతని యశో వైభవములను గానము చేయుచుండిరి. (ఛం)

1) రఘువంశ సుధాంబుధి చంద్రశ్రీ రామరాజ రాజేశ్వరా! ॥రఘు॥
అఘమేఘ మారుత శీకరా! ॥రఘు॥ (త్యాగరాజ)

ఇరుపక్షముల వారును జయ జయ ధ్వానములు చేయుచు, తమతమప్రతివీరులతో యుద్ధము చేయసాగిరి. ఈపక్షమున భల్లూకవానరులు శ్రీరామచంద్రుని, ఆపక్షమున రక్కసుల మూకలు రావణుని, కొనియాడుచు పరస్పరము భయంకరముగా పోరాడసాగిరి. (దో॥ 79)

రావణుడు రథముపై నుండెను. శ్రీరాముడు రథములేకుండ ఉండుట చూచి, విభీషణుడు భీతిల్లి, అధైర్యమునకు లోనయ్యెను. ప్రేమాతిశయమువలన అతని మనస్సులో సంశయము గలిగి, శ్రీరామునకు పాదాభివందనమొనర్చి, ఇట్లు పలికెను. "ప్రభూ! మీకు రథము లేదు. శరీర రక్షణకు కవచమూ లేదు. కాళ్లకు పాదరక్షలును లేవు. బలశాలియు, వీరుడునుఐన రావణుని ఎట్లు జయింపగలరు?"- కృపాళువైన శ్రీరాముడు పలికెను. "మిత్రమా! వినుము. విజయమును పొందుటకు అవసరమైన రథము వేఱొకటి గలదు. పరాక్రమము, ధైర్యము ఆ రథమునకు చక్రములు, సత్యశీల (సదాచార)ములే దానిదృఢమైన ధ్వజపతాకములు. బలము, వివేకము, దమము, పరోపకారము అను నాలుగూ దాని గుఱ్ఱములు. క్షమ, దయ, సమతా సూత్రములతో అవి రథమునకు పూన్చబడును. భగవద్భజన (ఆరాధన)యే ఆ రథమునకు సమర్థుడైన సారథి. వైరాగ్యమే డాలు. సంతోషమే ఖడ్గము. దానమే పరశువు. బుద్ధియే ప్రచండశక్తి. ఉత్తమవిజ్ఞానమే కఠోరధనుస్సు. సర్వదోషములనుండియు విముక్తమైన స్థిరమైన మనస్సే తూణీరము. శమము, యమనియమములే బాణ సమూహములు. బ్రాహ్మణుల, గురువుల పూజయే అభేద్యకవచము. విజయమునకు ఇట్టి రథముతో సమానమైన సాధనము మఱియొకటి లేదు.మిత్రుడా! ధర్మమయమైన ఇట్టి రథముగలవానిని ఎవ్వరును జయింప జాలరు. అట్టివానికి శత్రువుకూడ ఉండడు. (యుద్ధ సమయమున భగవంతుడు విభీషణునకిచ్చిన ఈ ఉపదేశము అపూర్వము.) (చౌ॥ 1-6)

ఓ ధీరమతీ! మిత్రమా! ఇట్టి దృఢమైనరథముగలబలశాలి జననమరణరూపమైన గొప్ప అజేయశత్రువునుగూడ గెలువగలడు." శ్రీరామచంద్ర ప్రభువచనములను విని, విభీషణుడు ప్రసన్న చిత్తుడై, ఆయనపాదపద్మములపై మోకరిల్లి, ఇట్లనెను. "కృపానిధీ! సుఖనిధానా! శ్రీరామా! ఈ నెపముతో నాకొక అమూల్యమైన మహోపదేశమును ప్రసాదించితిరి. ఆ పక్షమున రావణుడు యుద్ధసన్నద్ధుడై వానర భల్లూకయోధులను రెచ్చగొట్టుచుండెను. ఈ పక్షమున అంగదుడు, ఆంజనేయుడు ప్రతియోధులను కవ్వించుచు యుద్ధమునకు సిద్ధముగా ఉండిరి. రాక్షసులు, భల్లూక వానరులు తమ తమ ప్రభువులకు 'జయ జయ ధ్వానములను' పల్కుచు పోరాడుచుండిరి.

(దో॥ 80. క,ఖ,గ.)

బ్రహ్మాది దేవతలు, సిద్ధులు, మునులు ఆకాశమున విమానములలో కూర్చొని, యుద్ధ దృశ్యములను దర్శించుచుండిరి. (శివుడు నుడువుచున్నాడు.) "ఉమా! నేనును వారితోపాటు శ్రీరాముని రణరంగ విశేషములను, శౌర్య ప్రదర్శనలీలలను తిలకించుచుంటిని. ఇరుపక్షముల వీరయోధులు రణోన్మత్తులై యుండిరి. వానరులు జయశీలురు. ఏలనన వారికి ధర్మ స్వరూపుడైన శ్రీరామునిబలము గలదు. ఉభయ పక్షముల యోధులు పరస్పరము కవ్వించుకొనుచు ఒకరి నొకరు అణచి వేయుచు, నేలపై పడగొట్టుచుండిరి. వారు కొట్టుచు, కొఱుకుచు, పట్టుకొనుచు, నేలకేసి కొట్టుచు పోరుసల్పుచుండిరి. తలలను నఱికి, వాటిచే వాటిని ఢీకొట్టించుచు, వైరి శిరములను పగులగొట్టుచుండిరి. పొట్టలను చీల్చివేయుచుండిరి. భుజములను నఱుకుచుండిరి. యోధుల కాళ్లను చిక్కించుకొని, నేలకేసి బాదుచుండిరి. భల్లూకములు నిశాచరులను చంపి, భూమిలో పాతి పెట్టి, పైన ఇసుకతో కప్పుచుండిరి. శత్రువులను యుద్ధమునకు ప్రేరేపించుచు మిక్కిలి క్రుద్ధమైన మృత్యువువలె కన్పట్టు చుండిరి. (చౌ॥ 1-4)

శరీరములపై రక్తము ఓడికలుగట్టుచుండగా వానరులు క్రుద్ధులై భయంకరకాలసదృశులై కన్పట్టు చుండిరి. వారు బలశాలురైన వీర రాక్షససేనలోని యోధులను నలిపి, అణచి వేయుచుండిరి. మేఘములవలె గర్జించుచు వారిని గద్దించుచు చెంపలువాయించుచుండిరి. దంతములతో కొఱుకుచుండిరి. వారిని పడద్రోసి, కాళ్లతో త్రొక్కుచుండిరి. భల్లూక వానరులు 'ఛీత్కారముల' జేయుచు దుష్టరాక్షసులను చంపి వేయుటకు బలప్రదర్శన చేయుచుండిరి. నిశాచర యోధుల దవడలను పట్టుకొని, చీల్చివేయుచుండిరి. వారి ఔొమ్ములను చీల్చి, ప్రేగులను మెడలలో వేసికొనుచుండిరి. రణోత్సాహభరితులైన వానరులు ప్రహ్లాదునకుస్వామియైన నృసింహుడే పెక్కురూపములను

ధరించి రణమొనర్చుచున్నట్లు కనబడుచుండిరి. 'పట్టుకొనుడు, చంపుడు, కొఱుకుడు, నలుపుడు' మొదలగు భీకర శబ్దములు భూమ్యాకాశములయందు నిండెను. 'తృణమును వజ్రాయుధముగాను, వజ్రాయుధమును తృణముగాను చేయసమర్థుడైన శ్రీరామచంద్రునకు జయము' అని పల్కుచుండిరి. (ఛం॥ 1,2)

దశముఖుడైన రావణుడు తనసైన్యము తత్తరపడుటచూచి తనఇఱువది బాహువులతో పది ధనుర్బాణములను ధరించి, రథముపైనెక్కి గర్వముతో (యుద్ధభూమినుండి పాఱిపోవుచున్న తన సైన్యమును తిరిగి రణరంగమునకు మఱలించుటకై) 'రండు, రండు' అని అఱచుచు ముందునకు సాగెను. (దో॥ 81)

అత్యంతక్రుద్ధుడైన దశకంధరుడు పరుగెత్తుచు ముందునకుసాగెను. యుద్ధతత్పరులైన వానరులు హుంకరించుచు అతనిముందుకు పోయిరి. వారు వృక్షములను, ఱాళ్లను, పర్వతములను తీసికొని, ఒక్కుమ్మడిగా రావణునిపై విసరి వేసిరి. వజ్రసదృశమైన అతని దేహమునకు తగులగానే అవి ముక్కలు ముక్కలాయెను. రణోన్మత్తుడైన రావణుడు మిక్కిలి క్రోధావేశములతో బుసలుకొట్టుచు, రథమునాపి నిశ్చలుడై నిలబడెను. ఏ మాత్రము కదలలేదు. అతడు మిక్కిలిక్రుద్ధుడై, ఇటునటు తిరుగుచు శత్రువులపై విరుచుకొనిపడి, వానర యోధులను నలిపివేయుచుండెను. పెక్కుభల్లూకవానరములు "అంగదా! ఆంజనేయా! రక్షింపుడు, రక్షింపుడు" అని మొఱపెట్టుకొనుచు తోకలెత్తుకొని, పరుగులుదీయుచుండెను. "ఓ రఘునాథా! ప్రభూ! రక్షింపుము. యమునివలె ఈ దుష్టుడు మమ్ములను భక్షించుచున్నాడు" అని ఆక్రందించుచుండెను. వానరులందఱును పాఱిపోవుట చూచి, రావణుడు తన పది ధనుస్సులపై బాణములను ఎక్కుపెట్టెను. (చౌ॥ 1-4)

రావణుడు ధనుస్సులపై అనేకబాణములను సంధించి, ఒకేసారి వాటిని వదలెను. అవి సర్పములవలె ఎగురుచు పోయి, ఆ వానరులకు తగిలెను. భూమ్యాకాశములయందును, ఎనిమిది దిశలలోను బాణములు నిండిపోయెను. వానరభల్లూకము లెక్కడికి వెళ్లగలవు? కనుక అచట కోలాహలము చెలరేగెను. వారు భయముతో ఆర్తనాదములు చేయసాగిరి. 'ఓ రఘువీరా! కరుణాసింధూ! దీనబంధూ! భక్త రక్షకా! ఆర్తత్రాణపరాయణా! శ్రీహరీ! రక్షింపుము రక్షింపుము' అని ప్రార్థించిరి. (ఛం)

తనసైన్యములు వికలమగుట చూచి, లక్ష్మణుడు నడుమున తూణీరమును ధరించి, ధనుస్సును చేతబట్టి, శ్రీరాముని చరణములకు మ్రొక్కి, కుపితుడై రణరంగమున అడుగిడెను. (దో॥ 82)

అతడు రావణుని సమీపించి, ఇట్లనెను. " ఓరీ! దుష్టుడా! భల్లూక వానరులను ఏల కొట్టెదవు? నాతో పోరాడుము. నేను నీ పాలిట మృత్యువును". రావణుడు పలికెను." "ఓరీ! నా పుత్రుని వధించినవాడా! నేను నిన్నేవెదకుచుంటిని. నేడు నిన్ను చంపి నా మనస్సునకు ఊరట గల్గింతును." అనంతరము అతడు ప్రచండ బాణవర్షమును గురిపించెను. వాటినన్నింటిని లక్ష్మణుడు ముక్కలు ముక్కలుగావించెను. అప్పుడు రావణుడు బాణములను అసంఖ్యాకముగా ప్రయోగించెను. లక్ష్మణుడు వాటినన్నింటిని నువ్వులవలె తుత్తునియలుగా జేసెను. పిమ్మట లక్ష్మణుడు రావణుని తనబాణములతో కొట్టెను. అతని రథమును ముక్కలుగావించి, సారథిని చంపివేసెను. అతని పదితలలలో ప్రతి శిరస్సుపై నూటేసి బాణములను వేసెను. పర్వత శిఖరములలో పాములు ప్రవేశించినట్లు అవి అతని శిరస్సులలో దూరెను. పిదప లక్ష్మణుడు అతని వక్షస్థలమున వందలకొలది బాణములను ప్రయోగించెను. రావణుడు స్పృహనుకోల్పోయి నేలపై పడెను. మూర్ఛనుండి తేరుకొనిన పిమ్మట అతడు బ్రహ్మతనకు ఇచ్చిన 'శక్తి'ని వదలెను (చౌ॥ 1-4)

బ్రహ్మదత్తమైన ఆ'ప్రచండశక్తి' లక్ష్మణుని గుండెలమధ్య గ్రుచ్చుకొనెను. వీరుడైన లక్ష్మణుడు వికలుడై పడిపోయెను. అపుడు దశకంఠుడు అతనిని ఎత్తుకొని పోవ ప్రయత్నించెను. లక్ష్మణుని నిరుపమానబలము చెక్కుచెదరక యథాతథముగ నుండెను. ఆ ప్రచండశక్తిగాని, రావణుని ప్రయత్నముగాని లక్ష్మణుని బలముముందు ఏ మాత్రము పనిచేయలేకపోయెను. మహామహితాత్ముడైన వేయి శీర్షములుగల ఆ ఆదిశేషుని ఒకే ఒక్క మస్తకముపై బ్రహ్మాండమనెడి భవనము ధూళికణమువలె విలసిల్లుచుండును. అట్టి ఆదిశేషునిఅవతారమైన లక్ష్మణుని ఎత్తుటకు మూఢరావణుడు పూనుకొనెను. లక్ష్మణుడు ముల్లోకములకును ప్రభువని అతడెరుగడు. (ఛం॥)

నేలపై పడియున్న లక్ష్మణుని జూచిన పిమ్మట పవనసుతుడు రావణునివైపు మఱలి కఠోరవచనములను పల్కుచు అతని మీదికి పరుగెత్తెను. మారుతి వచ్చుచుండగనే రావణుడు అతనికి భయంకరమైన ఒక ముష్టి ప్రహారము నిచ్చెను. (దో॥ 83)

ఆ పిడికిలిదెబ్బకు హనుమంతుడు క్రిందపడకుండ నిలువరించుకొని, మోకాళ్లపై కూర్చుండెను. అతి క్రోధావేశముతో లేచి, అతడు రావణునకు ఒక ముష్టిఘాతమునిచ్చెను. దానితో అతడు వజ్రప్రహారమున పడిపోవు పర్వతమువలె క్రిందబడెను. మూర్ఛనుండి తేరుకొని లేచిన పిదప అతడు హనుమంతునిగొప్ప బలమును కొనియాడసాగెను. అప్పుడు హనుమంతుడిట్లనెను. "ఓ సురద్రోహీ! నీవింకను జీవించి యుండుట నాకును, నా పౌరుషమునకును తీరని కళంకము." ఈ విధముగా పలికి, హనుమంతుడు లక్ష్మణుని దీసికొని, శ్రీ రఘునాథుని యొద్దకు వెళ్లెను. రావణుడు ఈ దృశ్యమును జూచి, మిక్కిలి ఆశ్చర్యపడెను. (ఏలనన రావణుడు తన ఇఱువది చేతులతో గూడ లక్ష్మణుని ఎత్తుటకు సమర్థుడు కాలేక పోయెను. కాని ఆంజనేయుడు అతనిని అవలీలగా ఎత్తుకొని పోవుటను జూచి, రావణుడు ఆశ్చర్యపడెను.) అంతట శ్రీ రఘురాముడు పలికెను. "సోదరా! నీవు మృత్యువునుగూడ మ్రింగెడివాడవు. దేవతలను సైతం రక్షింపగలవాడవు." శ్రీరాముని వచనములను వినగానే లక్ష్మణుడు లేచి కూర్చుండెను. ఆ భయంకరశక్తి ఆకాశమునకు చేరెను. లక్ష్మణుడు మఱల ధనుర్బాణములను గైకొని , పరుగుపరుగున వెళ్లి, శత్రువునెదుర్కొనెను. (చౌ॥ 1-4)

లక్ష్మణుడు అతిశీఘ్రముగా రావణునిరథమును ముక్కలుచేసి, సారథిని హతమార్చెను. రావణుని వ్యాకులపఱచెను. నూఱుబాణములతో రావణుని వక్షస్థలములను చీల్చెను. దానితో అతడు అతి వ్యాకులుడై నేలపై బడెను. అంతట మఱియొక సారథి అతనిని రథమున కూర్చుండబెట్టుకొని, లంకకు దీసికొని పోయెను. మహాప్రతాపశాలియైన లక్ష్మణుడు శ్రీరామచంద్రునిజేరి, ఆయన పాదములకు ప్రణమిల్లెను. (ఛం)

మూర్ఛనుండి తేరుకొనిన రావణుడు ఒక యజ్ఞమును చేయనారంభించెను. మూర్ఖుడు, అజ్ఞానియైన అతడు శ్రీరామునితో వైరమును బూని, విజయకాంక్షతో పట్టుబట్టి, యజ్ఞమును కొనసాగించుచుండెను. (దో॥ 84)

యజ్ఞముయొక్క పొగను జూచిన విభీషణుడు వెంటనే శ్రీరామునితో ఇట్లుపలికెను. "ప్రభూ! రావణుడు ఒక యజ్ఞమును చేయుచున్నాడు. అది సిద్ధించినచో ఆ దుష్టుని చంపుట కష్టము. స్వామీ! వెంటనే వానరయోధులను పంపుడు. వారువెళ్లి, ఆ యజ్ఞమును ధ్వంసమొనర్చినచో దశాననుడు మఱల యుద్ధమునకు రాగలడు". ప్రాతః కాలమున ప్రభువు తనవీరయోధులను యజ్ఞమును ధ్వంసము చేయుటకు పంపెను. హనుమంతుడు, అంగదుడు, మొదలగువారందఱును పరుగెత్తుచు పోయిరి. వానరులు అవలీలగా ఎగురుచు వెళ్లి, లంకను జేరిరి. రావణభవనములో నిర్భయముగా ప్రవేశించిరి. అతడు యజ్ఞమును చేయుచుండుట చూచి, వానర వీరులు క్రుద్ధులై పల్కిరి. "ఓరీ! సిగ్గులేని వాడా! రణభూమి నుండి పాఱిపోయి వచ్చి, ఇక్కడ కొంగ జపము చేయుచున్నావా?" ఇట్లు పలికి అంగదుడు అతనిని కాలితో తన్నెను. ముష్టిఘాతములతో మర్యాదచేసెను. కాని అతడు వీరివైపు కన్నెత్తియైనను చూడలేదు. ఆ దుష్టుని మనస్సు స్వార్థముతో నిండియున్నది గదా!

(చౌ॥ 1-4)

రావణుడు వారి వైపు చూడకుండుటచే వానరులు కుపితులై, అతనిని పండ్లతో కొఱికిరి, కాళ్లతో తన్నిరి. స్త్రీలను కొప్పుపట్టుకొని, బయటికి ఈడ్చుకొని వచ్చిరి. వారు అతిదీనముగా విలపింపసాగిరి. అప్పుడు రావణుడు కాలునివలె క్రుద్ధుడై లేచి, వానరుల కాళ్లు పట్టుకొని నేలపై కొట్టసాగెను. ఈ లోగా వానరులు అతని యజ్ఞమును ధ్వంసమొనర్చిరి. ఇది చూచి రావణునిధైర్యము సడలెను. (ఛం)

యజ్ఞమును ధ్వంస మొనర్చిన పిమ్మట రణ కోవిదులైన వానరులు శ్రీ రఘునాథుని యొద్దకు వచ్చిరి. ఆ నిశాచరుడు క్రోధాగ్నిలో మండుచు తన జీవితముపై ఆశలువదలు కొనెను. (దో॥ 85)

రామ రావణ యుద్ధము

రావణుడు బయలుదేఱుసమయమున పెక్కుఅపశకునములు ఎదురయ్యెను. గ్రద్దలు అటునిటు తిరుగుచు అతనితలలపై కూర్చొనుచుండెను. మృత్యువు ఆసన్నమగుచుండుటచే అతడు వాటిని లెక్క చేయలేదు. 'యుద్ధ భేరీలు మ్రోగింపుడు' అని అఱచెను. పెక్కు ఏనుగులు, రథములు, అశ్వములు, కాల్బలములునుగల వాని అపారములైన చతురంగబలములు యుద్ధోన్ముఖములై బయలు దేఱెను. శలభములు అగ్ని వైపు పరుగెత్తినట్లు ఆ దుష్ట రాక్షసులు తమ నాశము కొఱకు స్వయముగా ప్రభు సమ్ముఖమునకు పరుగులుదీయుచు వచ్చిరి. ఈలోగా దేవతలందఱును అచటికి చేరి, ప్రభువును ప్రార్థించిరి. "శ్రీరామా! ఇతడు మమ్ములను మిక్కిలి బాధించినాడు. ఇక వీనిని ఇంక ఎక్కువగా ఆడింపవలదు త్వరగా వధింపుము. జానకీదేవి మిక్కిలి దుఃఖితురాలైయున్నది" దేవతల వచనములను విని, శ్రీరామచంద్ర ప్రభువు ఒక చిఱునవ్వు చిందించెను. పిమ్మట లేచి, తనబాణములు సిద్ధము చేసికొనెను. తలపై జటాజూటమును సవరించుకొనెను. వాటిమధ్యగల పూవులు అతిమనోహరముగా ఉండెను. ఆయన నేత్రములు ఎఱ్ఱబాఱియుండెను. ఆయన యొక్క మేఘశ్యామలశరీరశోభలు లోకమునకు నేత్రానందమును గూర్చుచుండెను. నడుమున తూణీరమును, చేత కోదండమును (ధనుస్సును) ధరించెను. (చౌ॥ 1-5)

శ్రీ రాముడు చేతిలో కోదండమును, నడుమున తూణీరమును దాల్చెను. పరిపుష్టములైన భుజదండములతో మనోహరవిశాలవక్షస్థలముపై భృగుమహర్షిపదచిహ్నములతో ప్రభువు శోభిల్లుచుండెను. ధనుర్బాణములను చేపట్టి, త్రిప్పగనే బ్రహ్మాండములు, దిగ్గజములు, ఆది కూర్మము, శేషుడు, పృథ్వి, సముద్రములు, పర్వతములు అన్నియు డోలాయమానములాయెనని తులసీదాసు పలుకుచున్నాడు. (ఛం)

శ్రీరామచంద్రప్రభుశోభలను జూచి, దేవతలు ప్రసన్నచిత్తులై, పూలవానను అపరిమితముగా కురిపించిరి. శోభాశక్తిగుణముల నిధానము, కరుణాళువు ఐన ప్రభువునకు 'జయము, జయము' అనుచు నినాదముల జేసిరి. (దో॥ 86)

ఈ లోపున అత్యంత ఘనమైన నిశాచర సైన్యము యుద్ధావేశముతో అతివేగముగా రణభూమికి వచ్చెను. వానరయోధులు ప్రళయకాలమేఘసమూహములవలె వారిని ఎదుర్కొనిరి. అనేకకృపాణములు, ఖడ్గములు అన్ని దిశలయందును తళుకులీనుచు మెఱయుచుండెను. ఏనుగుల ఘీంకారములు, గుఱ్ఱముల సకిలింపులు, రథచక్రముల శబ్దములు, మేఘగర్జనలవలె మిక్కిలి భయమును గొల్పుచుండెను. వానరుల లాంగూలములు (వాలములు) ఆకాశమును కప్పివేసి, సుందరమైన ఇంద్రధనుస్సులు ఉదయించి నట్లుండెను. జలధారలు పైకి ఉబుకుచున్నట్లు రణధూళి ఎగురుచుండెను. బాణపరంపరలు వర్షధారలవలె కురియుచుండెను. ఉభయపక్షములనుండి పర్వత ప్రహారములు నిరంతర వజ్రపాతములవలె ఒప్పుచుండెను. శ్రీరఘునాథుడు క్రుద్ధుడై తనశరములను పరంపరగా ప్రయోగించెను. అవి నిశాచరసేనలను గాయ పఱచెను. రామబాణములతాకిడికి తట్టుకొనలేక రాక్షసవీరులు ఛీత్కారముల జేయుచు, గిరిగిర తిరుగుచు మూర్ఛితులై నేలకొరుగు చుండిరి. పర్వతములనుండి జలపాతములవలె వారిశరీరములనుండి రక్తములు ప్రవహించుచుండెను. పిఱికివారిని భయభ్రాంతులకు లోనుగావించుచు నెత్తుటేరులు ప్రవహించు చుండెను. (చౌ॥ 1-5)

పిఱికివారిని భయపెట్టుచు అపవిత్రరక్తనదీప్రవాహములు కొనసాగుచుండెను. రెండు దళములును ఈ రక్తనదికి తీరములు. రథములు ఇసుక తిన్నెలు. చక్రములు ఆవృత్తములు. ఈ నది అత్యంత భయంకరమైనది. ఏనుగులు, గుఱ్ఱములు, గాడిదలు, భటులు, వివిధవాహనములు ఈ నదియందలి అసంఖ్యాక జలజంతువులు. బాణ, శక్తి, తోమరములు సర్పములు, ధనుస్సులు తరంగములు, డాళ్లు (డాలు+లు) తాబేళ్ళు- (ఛం)

నదీప్రవాహవేగమునకు తటమునందలి మహావృక్షములు పడిపోవుచున్నట్లు మహావీరులు పెక్కుమంది నేలగూలుచుండిరి. వారియెముకలయందుండు మజ్జ నుఱుగుగా నుండెను. పిఱికివారు ఈ దృశ్యములను జూచి భయపడుచుండిరి. ధైర్యము గలవారు ఆనందించుచుండిరి. (దో॥ 87)

భూత పిశాచ భేతాళులును, భయంకరమైన వెంట్రుకలుగల దయ్యములును, ప్రమథగణములును ఈసమరనదిలో స్నానముచేయుచుండిరి. కాకులు, గ్రద్దలు చనిపోయిన వారిభుజములను నోటగఱచుకొని, ఎగిరిపోవుచుండెను. అవి ఒకదానినుండి మఱియొకటి లాగుకొని తినుచుండెను. "ఓరీ మూర్ఖులారా! ఇన్ని కళేబరములు పుష్కలముగా ఇచ్చట పడియుండగా మీ దారిద్ర్యము తీరుటలేదా?" అనుపలుకులు వినబడుచుండెను. గాయపడిన వీరులు ఈరక్తనదీతీరమున మూల్గుచు పడియుండిరి. వారి ఆర్తిని చూచినచో వారు అర్ధజలములో ఉంచబడినట్లు కనబడిరి. (మృత్యువాసన్నమైనప్పుడు అర్ధజలములో అనగా సగముశరీరము నీటిలోను, తక్కిన సగము తీరమునందును ఉంచినట్లుండిరి.) నదీతీరమున నుండు బెస్తవారు గాలమును లాగినట్లు రాబందులు ప్రేగులను లాగుచుండెను. పెక్కుమంది యోధుల కళేబరములు ఈ నదీప్రవాహమున కొట్టుకొనిపోవుచుండెను. వాటిపై పక్షులు కూర్చొనియుండెను. ఆ పక్షులు నదిలో నౌకావిహారము సలుపుచున్నట్లుండెను. యోగినులు (భూత పిశాచములు) పుఱ్ఱెలలో రక్తమును సేకరించుచుండిరి. భూతపిశాచములపత్నులు ఆకాశమున నాట్యము సేయుచున్నట్లు ఉండిరి. చాముండులు యోధుల పుఱ్ఱెలతో తాళములు వేయుచు నానావిధములగు పాటలు పాడుచుండిరి. నక్కలగుంపులు శవములను కొఱుకుచు 'కటకట' శబ్దములను చేయుచుండెను. అవి వాటిని భక్షించుచు పలురకములైన శబ్దములను చేయుచు, కూతలు కూయుచుండెను. కడుపులు నిండగా ఒక దానినొకటి గద్దించుచుండెను. తలలులేని అసంఖ్యాకములైన మొండెములు యుద్ధభూమిలో పఱుగులు పెట్టుచుండెను. తలలు నేలపై దొర్లుచు జయజయ ధ్వానములను కావించుచుండెను. (చౌ॥ 1-5)

తెగినతలలు జయజయ నాదములు చేయుచుండగా, తలలులేని మొండెములు పఱుగులు దీయు చుండెను. పక్షులు పుఱ్ఱెలకై పరస్పరము కలహించు కొనుచుండెను. యోధులు ఇతర యోధులను పడగొట్టు చుండిరి. శ్రీరామునిబలమును జూచుకొని దర్పితులైన వానరులు రాక్షసులను నలిపివేయుచుండిరి. శ్రీరామునిబాణ సమూహములతాకిడికి గురియైన యోధులు యుద్ధభూమిలో దీర్ఘనిద్రలో మునిగి పోవుచుండిరి. (ఛం)

రావణుడు తీవ్రవిచారములో పడెను. "రాక్షసులందఱును నిహతులైరి. నేనొక్కడనే మిగిలి యుంటిని. వానర భల్లూకములు అనేకములున్నవి. కావున ఇప్పుడు అపారమైన మాయను కల్పించి పోరాడెదను." (దో॥ 88)

రథములేకుండ రణరంగమున నేలపై నిలబడి, యుద్ధము చేయుచున్న ప్రభువును దేవతలు చూచిరి. వారిహృదయములు మిగుల క్షోభించెను. ఇంద్రుని ఆజ్ఞతో మాతలి వెంటనే ఒకరథమును తీసికొని వచ్చెను. నిరుపమానమైన, తేజోమయమైన ఆ దివ్యరథమును కోసలాధిపతియైన శ్రీరాముడు హర్షముతో అధిరోహించెను. దానికి పూన్చబడిన గుఱ్ఱములు మనోహరమైనవి. అవి చంచలములు. అజరామరములు, అంతే గాదు, మనోవేగముతో సాగిపోవునవి. రఘువీరుడు రథారూఢుడగుటను జూచి, వానరులు విశేషమైన బలమును పొంది, హర్షోల్లాసములతో పరుగెత్తుకొనివచ్చిరి. వానరుల దెబ్బలకు తట్టుకొనలేక రావణుడు తన మాయను విస్తరింప జేసెను. ఆమాయలు శ్రీరఘురాముని ముందు ఏమియు పని చేయజాలక పోయెను. లక్ష్మణుడును, వానరులును ఆ మాయలను నిజమని నమ్మిరి. మాయా ప్రభావమున ఆ వానరులు నిశాచర సైన్యమున పెక్కుమంది రామలక్ష్మణులను గాంచిరి. (చౌ॥ 1-4)

వానరులు పెక్కుమంది రామ లక్ష్మణులను జూచి, మిథ్యా భయములకు లోనైరి. లక్ష్మణునితో గూడ ఎక్కడి వారక్కడ భ్రమకులోనై, చిత్రములలోని బొమ్మలవలె నిలబడిపోయిరి. తనసేనలు ఆశ్చర్య చకితులగుట జూచి, కోసలాధిపతి నవ్వి, బాణములను సంధించి, క్షణములో ఆ మాయను తొలగించెను. సమస్త వానరులును ప్రసన్నులైరి. (ఛం)

అనంతరము అందఱి వైపు చూచుచు శ్రీరాముడు గంభీరముగా పల్కెను. "వీరులైన మీరందఱును చాల డస్సి యుంటిరి. కావున నాకును రావణునకును మధ్య జరుగబోవు ద్వంద్వ యుద్ధమును జూడుడు. (దో॥ 89)

ఈ విధముగా పలికి, శ్రీ రఘునాథుడు బ్రాహ్మణచరణకమలములను మనస్సులో స్మరించుచు వారికి శిరసా ప్రణమిల్లి, రథమును ముందునకు నడిపెను. అపుడు రావణుడు క్రోధముతో మండిపడుచు గర్జించుచు ముందుకు వచ్చి పలికెను. "ఓరీ! తాపసీ! వినుము. నేను యుద్ధములో నీచే విజితులైన యోధుల వంటివాడను కాను. నా పేరు రావణుడు. నా యశస్సు జగద్విదితము. దిక్పాలురు సైతము నా చేతిలో బందీలు. నీవు ఖర, దూషణ, త్రిశిరులను, విరాధుని గూడ వధించితివి. పాపము, వాలిని వేటగానివలె చెట్టు చాటుననుండి చంపితివి. గొప్ప గొప్ప నిశాచర వీరులను సంహరించితివి. కుంభకర్ణ, మేఘనాదుల ప్రాణములను దీసితివి. ఓరీ! రాకుమారా! నేడు నీవు యుద్ధ రంగమునుండి పాఱిపోకుండ నిలిచియున్నచో ఆ పగను అంతయును తీర్చుకొందును. ఈనాడు నిజముగా నేను నిన్ను యమునకు అప్పగించెదను. ఏలనన నీవు కఠినాత్ముడైన రావణునిపాలబడితివి." రావణునిదుర్భాషలను విని, వాడు యముని కదీనుడైనాడని భావించి, కృపాళువైన శ్రీరాముడు నవ్వి, ఇట్లనెను "నీవు చెప్పినట్లు నీ గొప్పదన మంతయు సత్యమే. కాని ఇంక ప్రేలకుము. నీ పౌరుషమును జూపుము. (చౌ॥ 1-5)

నిరర్థకముగా వాగుచు నీ కీర్తిని పాడుచేసికొనవద్దు. క్షమింపుము. నీకు నీతిని గఱపుచున్నాను. వినుము. ప్రపంచములో మూడు విధములగు పురుషులున్నారు. వారు గులాబీ, మామిడి, పనస చెట్లవంటివారు. గులాబీ కేవలము పూవులను మాత్రమే ఇచ్చును. మామిడి పూవుల(పూత)ను, పండ్లను గూడ ఇచ్చును. పనస కేవలము పండ్లను ఇచ్చును. అట్లే పురుషులలో కొందఱు మాట్లాడెదరు (కాని వారుక్రియా శూన్యులు) మఱికొందఱు మాట్లాడెదరు, వాటిని ఆచరించెదరు. మూడవ వర్గము వారు మాట్లాడరు కాని చేసి చూపించెదరు (క్రియా శూరులు.)

(ఛం)

శ్రీరాముని వచనములను విని, రావణుడు నవ్వి, ఇట్లనెను. "నీవు నాకు జ్ఞానబోధ చేయుచుంటివా? మొదట నాతో వైరము పూని, ఏ మాత్రము భయములేక యుద్ధమునకు సిద్ధమైతివి. ఇప్పుడు నీకు ప్రాణములపై తీపి ఏర్పడినదా?" (దో॥ 90)

ఇట్లు కటువుగా పలికి, రావణుడు కుపితుడై వజ్రతుల్యమైన బాణములను ప్రయోగించెను. అనేకాకారములుగల ఆ బాణములు దిశావిదిశలయందును, భూమ్యాకాశములయందును సర్వత్ర నిండెను. శ్రీరఘునాథుడు ఆగ్నేయాస్త్రము ప్రయోగింపగా అది రావణుని బాణములను అన్నింటిని ఒక్కక్షణములో భస్మమొనర్చెను. అప్పుడతడు లజ్జితుడై కోపముతో తీక్ష్ణమైన ఒక 'శక్తి'ని వదలెను. శ్రీరామచంద్రుడు ఒక బాణముతో దానిని త్రిప్పికొట్టెను. రావణుడు అసంఖ్యాకములైన చక్రములను త్రిశూలములను రాముని మీదికి పంపెను. కాని ప్రభువు వాటినన్నింటిని అనాయాసముగా ముక్కలు ముక్కలుగా జేసెను. ఖలుని మనోరథములవలె రావణునిబాణములు అన్నియును నిష్ఫలములాయెను. పిమ్మట అతడు నూఱు బాణములతో రాముని రథసారథియైన మాతలిని కొట్టెను. అతడు 'శ్రీరామునకు జయము' అనుచు క్రిందికొరిగెను. శ్రీరాముడు కృపతో సారథిని లేపెను, పిమ్మట ప్రభువు మిక్కిలి క్రుద్ధుడయ్యెను. (చౌ॥ 1-4)

శ్రీరాముడు శత్రువుపై క్రుద్ధుడుకాగా తూణీరములోని బాణములు తమంతట తామే బయటికి వచ్చుటకు త్వరపడుచుండెను. శ్రీరాముని ప్రచండమైన ధనుష్టంకారమును విని, నరభక్షకులైన రాక్షసులందఱును వాతగ్రస్తులై, వణకి పోవుచుండిరి. మండోదరి హృదయము కంపించెను. సముద్రములు కల్లోలితములైనవి. ఆదికూర్మము చలించెను. భూమి అదిరెను. పర్వతములుక్రక్కదలెను. దిగ్గజములు మిక్కిలి భీతిల్లి దంతములతో నేలను పట్టుకొని, ఘీంకారములు సల్పుచుండెను. ఈ అద్భుతములను చూచి, దేవతలు సంబరపడిరి. (ఛం)

ధనుస్సును ఆకర్ణాంతము లాగి శ్రీరామచంద్రుడు అనేక భయానకబాణములను ప్రయోగించెను. అవి సర్ప సదృశములై వేగముగా సాగిపోయెను. (దో॥ 91)

ఆ బాణములు ఱెక్కలుగల సర్పములవలె పరుగు పరుగున బోయెను. మొదట ప్రభువు రావణుని సారథిని, గుఱ్ఱములను సంహరించెను. పిమ్మట రథమును ముక్కలు ముక్కలుగావించి, ధ్వజపతాకములను ధ్వంసమొనర్చెను. రావణుడు బిగ్గరగా గర్జించెను. కాని అతనిగుండెబలము సన్నగిల్లెను. వెంటనే క్రుద్ధుడై మఱియొక రథముపైనెక్కి వివిధాస్త్రశస్త్రములను ప్రయోగింపసాగెను. కాని అతని ప్రయత్నములన్నియును వమ్మగుచుండెను. పరద్రోహమునందు నిరతుడైనవానిప్రయత్నములన్నియును నిష్ఫలములగుట సహజమే గదా! అప్పుడు రావణుడు పది త్రిశూలములను వదలగా శ్రీరాముని నాలుగు గుఱ్ఱములును దెబ్బతిని క్రిందపడెను. శ్రీరాముడు గుఱ్ఱములను లేవనెత్తి, క్రుద్ధుడై ధనుస్సునెక్కుపెట్టి ఆకర్ణాంతము లాగి బాణములను వదలెను. రావణుని శిరస్సులనెడి కమలవనములో శ్రీరాముని బాణములనెడి తుమ్మెదలగుంపులు చరింపసాగెను. శ్రీరాముడు రావణుని ఒక్కొక్క తలపై పదేసి బాణములను ప్రయోగింపగా అవి ఇటునుండి అటు దూసికొని పోయెను. శిరస్సులనుండి రక్తధారలు ప్రవహించుచుండెను. బలశాలియైన రావణుడు ఆరక్తధారలతోడనే పరుగుపరుగున రామునిమీదికి వచ్చెను. ఇంతలో ప్రభువు మఱల ధనుస్సును ఎక్కుపెట్టి ముప్పది శరములను ప్రయోగించి ఆతని ఇరువది భుజములను, పది శిరస్సులను ఖండించి, నేలపై బడగొట్టెను. కాని ఆ శిరస్సులును, భుజములును వెంటనే మఱల ఉత్పన్నములాయెను. శ్రీరాముడు మఱల వాటిని ఖండించెను. ఎప్పటివలె వెంటనే అవి మఱల ఉత్పన్నము లాయెను. ఈ విధముగా శ్రీరాముడు మఱల మఱల వాటిని ఖండించుచుండుటయు, వెంట వెంటనే అవి పుట్టుకొని వచ్చుచుండుటయు పెక్కుమాఱులు జరిగెను. ఇట్లు శ్రీరాముడు పెక్కు పర్యాయములు తన లీలా విలాసములను ప్రదర్శించెను. ఖండింపబడిన తలలు, భుజములు ఆకాశమును గప్పి, అసంఖ్యాక రాహుకేతువులుగా కన్పించెను. (చౌ॥ 1-7)

పెక్కుమంది రాహుకేతువులు ఆకాశమునజేరి రక్తమును ప్రవహింపజేసి పరుగెత్తుచున్నారా యనునట్లుండెను. శ్రీ రఘువీరుని ప్రచండమైన బాణములు నిరంతరము తగులుచుండుటచే అవి క్రింద బడుట లేదు. శ్రీరాముని ప్రతిబాణమునకు గ్రుచ్చుకొనియున్న తలలసమూహములు ఆకాశమున తీవ్ర సూర్యకిరణములకు గ్రుచ్చుకొనియున్న రాహువుల సముదాయమువలె కనబడుచుండెను. (ఛం)

విషయభోగములను అనుభవించిన కొలది వాటిపై కాంక్ష పెఱిగినట్లే ప్రభువు ఆ శిరస్సులను ఖండించిన కొలదియు అవి అపారముగా పెఱిగి పోవుచుండెను. (దో॥ 92)

శిరస్సులు పునరుత్పన్నములగుచుండుటచే రావణుడు తనమృత్యు భయమును మఱచిపోయెను. మహా దురభిమానియు, మూర్ఖుడును, ఐన రావణుడు గర్జించుచు పదిధనుస్సులను ఒక్కసారిగా, ఎక్కుపెట్టి ఆకర్ణాంతము లాగి బాణముల వర్షమును గురిపించి, శ్రీరఘునాథుని రథమును కప్పివేసెను. ఒక్క క్షణ కాలముపాటు మంచుతో కప్పబడిన సూర్యునివలె రథము కన్పడలేదు. దేవతలు హాహా కారములు చేసిరి. అప్పుడు ప్రభువు క్రుద్ధుడై ధనుస్సును ఎక్కుపెట్టి తనబాణములతో శత్రుశరములను తొలగించి, అతని మస్తకములను ఖండించి, అన్ని దిశలయందును, పృథివ్యాకాశములయందును పఱచెను. ఖండింపబడిన శిరస్సులు ఆకాశమార్గమున పరుగెత్తుచు జయ జయ ధ్వానములను గావించుచు అందఱి హృదయములలో భయోత్పాతములను గలిగించెను. ఆ తలలు "లక్ష్మణుడు ఎక్కడ? వానర రాజు సుగ్రీవుడెక్కడ? కోసల పతి రఘువీరుడెక్కడ?" అని గర్జించు చుండెను. (చౌ॥ 1-4)

'రాముడెక్కడ' అని అఱచుచు ఖండింపడిన రావణుని తలలు ఆకాశమున ఎగురుచుండెను. వాటిని జూచి, వానరులు పాఱిపోయిరి. అప్పుడు రఘుకులమణి శ్రీరాముడు ధనుస్సును ఎక్కుపెట్టి, నవ్వుచు బాణములకు ఆ శిరస్సులను గ్రుచ్చి,మాలలుగా జేసెను. అప్పటి ఆదృశ్యము దుర్గాదేవియే రాక్షస సంహారమునకై పెక్కుమంది చెలులతోగూడిన కాళికగా ఆకపాలమాలికలను చేతబట్టి, రక్తనదిలో స్నానమాచరించి, సంగ్రామమను వటవృక్షమును పూజించుటకై బయలుదేఱినదా? అన్నట్లు ఉండెను. (ఛం)

పిమ్మట దశాననుడు క్రుద్ధుడై ఒక ప్రచండశక్తిని విభీషణుని పైకి వదలెను. అది యమదండమా? అనునట్లు విభీషణుని మీదికి వచ్చుచుండెను. (దో॥ 93)

శ్రీరాముడు శరణాగతులను రక్షించెదనని ప్రతిజ్ఞ చేసియుండెను. కావున విభీషణుని వెనుకకు పొమ్మని తానే ముందుకువచ్చి, శ్రీరాముడు అతిభయంకరముగా వచ్చుచున్న ఆ శక్తిని ఎదిరించెను. ప్రభువు ఆశక్తి తాకిడికి కొంతతడవు మూర్ఛిల్లినట్లు లీలలను ప్రదర్శించెను. కాని దేవతలుమాత్రము ఆ లీలలను తెలిసికొనలేక వ్యాకులత నొందిరి. విభీషణుడు ప్రభువు యొక్క శ్రమను జూచి, తానే గదను చేబూని క్రుద్ధుడై ముందుకు పరుగెత్తుచు పలికెను. "ఓరీ! దౌర్భాగ్యుడా! నీచుడా! నీవు నర సుర ముని నాగులందరితో విరోధమును పెట్టుకొంటివి. సాదరముగా శివునకు నీతలలను అర్పించితివి. అందువలన ఒక్కొక్క శిరస్సునకు మాఱుగా పెక్కు శిరస్సులను పొందుచుంటివి. దుష్టుడా! ఆ కారణమువలన ఇప్పటివఱకును నీవు రక్షింపబడితివి. ఇప్పుడు మృత్యువు నీతలపై నాట్యము చేయుచున్నది. శఠుడా! నీవు రామునకు విరోధివై సుఖ సంపదలను కోరుకొనుచున్నావా?" అని పలికి విభీషణుడు రావణుని వక్షస్థలమున గదతో కొట్టెను. (చౌ॥ 1-4)

కఠోరమైన గదాప్రహారమువలన రావణునితొమ్మున మిక్కిలి బలమైన దెబ్బతగిలెను. అతడునేలపై బడెను. పదిముఖములనుండియు రక్తముప్రవహించెను. కాని అతడు తమాయించుకొని క్రుద్ధుడై ముందుకు పరుగెత్తెను. ఇద్దఱును మిక్కిలి బలశాలురే. పరస్పరము ఎదుర్కొని మల్లయుద్ధము కావించిరి. శ్రీ రఘువీరునిబలప్రభావమున విభీషణుడు జగత్ప్రసిద్ధబలశాలియైన రావణుని ఏమాత్రమూ లెక్కచేయలేదు. (ఛం)

(శివుడు పలుకుచున్నాడు) ఉమా! ఇంతకుముందు విభీషణుడు ఎప్పుడైనను రావణునివైపు కన్నెత్తి చూడగలిగి యుండెనా? కాని ఇప్పుడు ఆ విభీషణుడే కాలునివలె అతనిని ఎదిరించుచున్నాడు. ఇది శ్రీ రఘువీరుని ప్రతాప ప్రభావము. (దో॥ 94)

విభీషణుడు మిక్కిలి అలిసియున్నట్లు గ్రహించిన హనుమంతుడు చెంతనున్న ఒక పర్వతమునుగైకొని పరుగుపరుగున వచ్చెను. దానితో అతడు రావణుని రథమును, గుఱ్ఱములను, సారథిని కొట్టి, క్రింద పడవేసి, అతని ఱొమ్ముపై కాలితో తన్నెను. కాలితన్నులవలన రావణునిశరీరము వణకసాగెను. ఐనను అతడు నిలదొక్కుకొనెను. ఇంతలో శరణాగత రక్షకుడగు శ్రీరామునికడకు విభీషణుడు వెళ్లెను. రావణుడు మఱల యుద్ధమునకు పిలుచుచు హనుమంతుని కొట్టెను. ఆంజనేయుడు తనవాలమును పెంచి, ఆకాశమున కెగిరెను. రావణుడతని వాలమును పట్టుకొనెను. హనుమంతుడు అతనితోపాటు పైకెగిరెను. మహాబలశాలియైన మారుతి ఆకాశమునందే రావణునితో పోరాడసాగెను. ఆఇద్దఱు యోధులు ఆకాశమున పోరాడుచు ఒకరినొకరు కొట్టుకొనసాగిరి. తమతమబలములను యుక్తి ప్రయుక్తులను ప్రదర్శించిరి. ఒక కాటుక కొండయు సుమేరుగిరియు పరస్పరము ఢీకొనుచున్నట్లు శోభిల్లిరి. బుద్ధి బలములచేగూడ రాక్షసుని పడగొట్టుటకు సాధ్యముకాక పోవుటచే పవనసుతుడు ప్రభువును స్మరించెను. (చౌ॥ 1-4)

ధీరుడైన హనుమంతుడు శ్రీ రఘురాముని స్మరించి యుద్ధమునకు రావణుని పిలిచెను. ఇద్దఱును నేలపై పడుచు లేచుచు పోరాడుచుండిరి. ఈ దృశ్యమును గాంచుచు దేవతలు ఉభయులకును (భయముతో రావణునకును భక్తితో ఆంజనేయస్వామికిని) 'జయము, జయము' అని పలికిరి. హనుమంతుని సంకటస్థితిని జూచి, భల్లూకవానరులు క్రుద్ధులై పరుగెత్తుకొనివచ్చిరి. కాని రణమదోన్మత్తుడైన రావణుడు యోధులందఱిని తన ప్రచండభుజములతో అణచివేసెను. (ఛం)

అప్పుడు శ్రీ రఘువీరుడు పిలువగానే ప్రచండవీరులైన వానరులు పరుగెత్తుకొనివచ్చిరి. ప్రబలమైన వానర సైన్యమును జూచి, రావణుడు తన మాయను ప్రదర్శించెను. (దో॥ 95)

ఒక్క క్షణము అతడు అంతర్ధానమయ్యెను. పిమ్మట ఆ దుష్టుడు తనఅనేక రూపములను ప్రకటించెను. శ్రీరాముని సైన్యములోని భల్లూకవానరులందఱికిని రావణుడు వేర్వేఱుగా అంతటను కనిపించెను. అసంఖ్యాకులైన

రావణులను జూచి, భల్లూకవానరులు భయముతో ఇటునటు పాఱిపోయిరి. వారి ధైర్యము సడలెను. వారు "ఓ లక్ష్మణా! ఓ రఘువీరా! రక్షింపుడు, రక్షింపుడు" అని అఱచుచు పాఱిపోవుచుండిరి. దశదిశలయందును కోట్లాదిరావణులు పరుగిడుచు భయంకరగర్జనలను గావించుచుండిరి. దేవతలందఱును భీతిల్లుచు "సోదరా! ఇపుడు గెలుపునపై మనము ఆశలు వదలుకొనవలసినదే." అనియనుచు పరుగెత్తిరి. "మునుపు ఒక్క రావణుడే దేవతలపై విజయమును సాధించెను. ఇప్పుడు పెక్కుమంది రావణులైరి. కనుక మనము పర్వతగుహలను ఆశ్రయింపవలసినదే. అక్కడ బ్రహ్మ, శివుడు, జ్ఞానులైనమునులు నిర్భయులై యుండిరి. ఏలనన వారు ప్రభుమహిమనెఱిగినవారు.

(చౌ॥ 1-4)

వారు ప్రభుప్రతాపమునుగూర్చి తెలిసినవారే. కనుక నిర్భయముగా నిలువగలిగిరి. వానరులు నిజముగనే అసంఖ్యాకులైన రావణులు ఉన్నట్లు తలంచిరి. వారు విచలితులై 'ఓ కృపాళూ! రక్షింపుము' అని అఱచుచు భయాతురులై పాఱిపోవుచుండిరి. అత్యంత బలశాలురు, రణకోవిదులును ఐన హనుమంతుడు, అంగదుడు, నలుడు, నీలుడు సాహసముతో పోరాడుచుండిరి. వారు కపటరూపభూమినుండి అంకురించిన కోట్ల కొలది మాయా రావణులను నలిపినలిపి వేసిరి. (ఛం)

సురలు, వానరులు వ్యాకులురగుటచూచి, కోసలాధిపతి శ్రీరాముడు దరహాసముచేసి, శార్ఙ్గధనువునెక్కుపెట్టి, మాయా రావణులందఱిని ఒకే బాణముతో మట్టుపెట్టెను. (దో॥ 96)

సూర్యోదయముతో అంధకారము పటాపంచలైనట్లు ప్రభువు ఒక్క క్షణములో మాయను పూర్తిగా అంత మొందించెను. ఇప్పుడు ఒకే రావణుడుండుట చూచి, దేవతలు ప్రశాంత చిత్తులై, ప్రభువుపై పుష్పవర్షమును గురిపించిరి. శ్రీ రఘునాథుడు చేతులుచాచి, అభయమునిచ్చుచు వానరులందఱిని పిలిచెను. వారు ఒకరినొకరు పిలుచుకొనుచు అందఱును ప్రభువుబలమును పొంది, రణోత్సాహముతో అక్కడికి పరుగు పరుగున జేరిరి. దేవతలు శ్రీరాముని స్తుతించిరి. అంత రావణుడు "నేను ఒంటరి వాడనని ఈ దేవతలు భావించుచున్నారు." (వీరిని హతమార్చుటకు నేనొక్కడనే చాలునని వీరెరుగరు) అని ఆలోచించి, "ఓ మూర్ఖులారా! మీరు ఎల్లప్పుడును నాదెబ్బలకు లోనగుచుండువారే!" అని పల్కుచు క్రోధావేశముతో అతడు ఆకాశమార్గమున వారిపైకి ఉరికెను. హాహాకారములు చేయుచు దేవతలు పాఱిపోయిరి. రావణుడు పలికెను. "ఓ దుష్టులారా! నానుండి తప్పించుకొని, మీరెక్కడికి పోగలరు?" దేవతలు వ్యాకులురై యుండుట చూచి, అంగదుడు ఎగిరిపోయి, రావణుని కాలు చిక్కించుకొని, వానిని భూమిపై విసరి వేసెను. (చౌ॥ 1-4)

అంగదుడు అతనిని పట్టుకొని భూమిపై పడవేసి కాళ్లతో తన్నెను. పిదప అతడు ప్రభువు నొద్దకువచ్చెను. రావణుడు తమాయించుకొని లేచిన పిదప భయంకరముగా గర్జింపసాగెను. పిమ్మట బలదర్పితుడై పది చేతులతో ధనుస్సులనెక్కుపెట్టి బాణములను అసంఖ్యాకముగా వర్షింపసాగెను. వానర యోధులనందఱిని గాయపఱచెను. వారు వ్యాకులపాటునకులోనైరి. రావణుడు తనబలమును చూచుకొని పొంగిపోయెను. (ఛం)

అప్పుడు రఘువీరుడు రావణుని తలలను, భుజములను ధనుర్బాణములను ఖండించెను. కాని తలలు భుజములు తీర్థస్థానములలో చేసిన పాపములవలె పెఱుగజొచ్చెను. (దో॥ 97)

శత్రువుయొక్క తలలు, భుజములు మఱల పెఱుగుటచూచి, భల్లూకవానరములు మిక్కిలి క్రుద్ధములాయెను. "ఈ మూర్ఖుని తలలు, భుజములు తెగినను ఇతడు మరణించుటలేదు." అని మిగులవగచిరి. అంగదుడు, మారుతి, నలుడు, నీలుడు, సుగ్రీవుడు, ద్వివిదుడు మొదలగు మహాబలశాలురు అతనిపై వృక్షములను, పర్వతములను విసరివేసిరి. అతడు ఆ వృక్షములను, పర్వతములను పట్టుకొని, వాటితోడనే వానరములను కొట్టెను. ఒకడు అతనిశరీరమును గోళ్లతో చీరి పరుగెత్తెను. మఱియొకడు అతనిని కాళ్లతో తన్నెను. అపుడు నలుడు, నీలుడు

రావణుని తలలపైనెక్కి గోళ్లతో అతని లలాటములను చీల్చిరి. లలాటములనుండి రక్తము స్రవించుచుండుట జూచి అతడు మిక్కిలి బాధపడెను. వారిని పట్టుకొనుటకు అతడు చేతులు చాచెను. కాని వారు అతనికి అందలేదు. కమలవనముపై భ్రమరములు తిరుగుచున్నట్లు అతని చేతులు పైపైనే తిరుగుచుండెను. చివరకు అతడు క్రోధముతో వారిపైకి దూకి పట్టుకొనెను. కాని నేలకేసి కొట్టకముందే వారు అతని చేతులను మెలిపెట్టి తప్పించుకొనిపోయిరి. పిదప అతడు తనపది చేతులతోడను ధనుస్సులు పట్టుకొని, బాణములతో కొట్టి వానరములను గాయపఱచెను. హనుమదాదివానరులందఱిని మూర్ఛితులను గావించి, సంధ్యా సమయమగుటచే రావణుడు సంతసించెను. వానరులందఱును మూర్ఛపోవుట చూచి, రణధీరుడైన జాంబవంతుడు పరుగెత్తుకొని రావణునిమీదికి వచ్చెను. అతని అనుచరభల్లూకములు పర్వతములను వృక్షములను దీసికొని, రావణుని పిలిచి, పిలిచి కొట్టసాగిరి. శక్తిశాలియైన రావణుడు భల్లూకములకాళ్ళను పట్టుకొని , వారిని కోపముతో నేలకేసి కొట్టసాగెను. జాంబవంతుడు తనసైన్యము విధ్వంసమగుచుండుట చూచి, క్రుద్ధుడై అతని ఱొమ్ముపై కాలితో తన్నెను. (చౌ॥ 1-8)

జాంబవంతుని కాలితాకిడికి బాధకలిగి రావణుడు వికలుడై, భూమిపై పడెను. అతడు తన ఇఱువది చేతులతో భల్లూకములను పట్టుకొనియుండెను. అవి రాత్రులయందు భ్రమరములు కమలములలో చిక్కుకొనినట్లుండెను. అతడు మూర్ఛితుడైనాడని గమనించి, అతనిని కాలితో తన్ని, భల్లూకరాజైన జాంబవంతుడు ప్రభువుకడకు వెళ్లెను. రాత్రియైనదని తెలిసికొని, సారథి రావణుని రథముపై చేర్చుకొని, అతనిని మేల్కొలుపుటకు ప్రయత్నించెను. (ఛం)

మూర్ఛనుండి తేరుకొనిన భల్లూకవానరములన్నియును ప్రభువునొద్దకు చేరెను. అక్కడ నిశాచరులందఱును భయగ్రస్తులై రావణుని చుట్టును జేరిరి. (దో॥ 98)

(మాసపారాయణము-ఇఱువది ఆఱవ విరామము)

త్రిజట సీతాదేవిని ఓదార్చుట

ఆదేరాత్రి త్రిజట సీతాదేవియొద్దకు వచ్చి, ఆమెకు యుద్ధ విషయములను వినిపించెను. శత్రు శిరములు, భుజములు పెఱుగుచున్న సమాచారమును విని సీతాదేవి, మిక్కిలి భయాందోళనలకు గురియయ్యెను. ఆమె ముఖము వాడిపోయెను. మనస్సు చింతాక్రాంతమయ్యెను. సీతాదేవి త్రిజటతో ఇట్లనెను. "మాతా! ఏమి జరుగనున్నదో? ఏల చెప్పవు? విశ్వమునకే దుఃఖకారకుడైన ఇతడు ఎట్లు మరణించును? శ్రీ రఘునాథుని బాణములచే అతనితలలు తెగిపోవుచున్నను అతడు మరణించుట లేదు. విధాతలీలలన్నియును విపరీతముగానున్నవి. నా దురదృష్టమువలననే అతడు బ్రతుకగల్గుచున్నాడు. అదియే నన్ను శ్రీహరి చరణములనుండి వేఱుచేసినది. నా దౌర్భాగ్యకారణముననే అచటికి కపట స్వర్ణమృగమువచ్చినది. ఆ దైవమే ఇంతవఱకు నాపై క్రుద్ధుడైయున్నాడు. నేను ఈ దుఃఖములను తట్టుకొనియుండుటకు విధివైపరీత్యమే కారణము. నేను కఠినవచనములతో లక్ష్మణుని బాధపెట్టుట, శ్రీ రఘునాథుని విరహబాణములు నన్ను మాటిమాటికిని కొట్టుచుండుట, ఇప్పటిసంకటపరిస్థితులలోగూడ నా ప్రాణములు ఇంకను పోకుండుట, వీటన్నింటికిని ఆ దైవమే కారణము. ఆ రావణుడు ఇంకను జీవించియుండుటకును ఆ దైవమే కారణము, వేఱెవ్వరునుగాదు. " కృపాళువవైన శ్రీరాముని మాటిమాటికిని స్మరించుచు జానకీదేవి పరిపరివిధముల విలపింపసాగెను. త్రిజట పలికెను. "ఓరాజకుమారీ! వినుము. హృదయమునందు బాణము తగిలినంతటనే దేవతలకు శత్రువైన రావణుడు మరణించును. కాని అతని హృదయమున వైదేహి నివసించుచున్నది. (నీవు నివసించుచున్నావు) కావున శ్రీరామచంద్ర ప్రభువు అతని హృదయముపై కొట్టుటలేదు. (చౌ॥ 1-7)

(ప్రభువు ఆలోచించుచున్నాడు) "ఇతని హృదయములో జానకీదేవి యున్నది. జానకీ హృదయమున నా నివాసమున్నది. నా ఉదరములో అనేక భువనములున్నవి. కావున రావణునిహృదయమున బాణము తగిలినచో

సర్వనాశనమగును" త్రిజట పలికిన ఈ మాటలు వినగానే సీతాదేవి మనస్సున హర్షవిషాదములు ముసురుకొనెను. ఇది చూచి త్రిజట మఱలపల్కెను. "ఓసుందరీ! నీ మిథ్యా సందేహమును వీడుము. శత్రువు ఏ విధముగా మరణించునో వినుము." (ఛం)

తనతలలు మాటిమాటికిని తెగిపడుచుండుటవలన రావణుడు వికలమనస్కుడై నీ ధ్యాసమఱచి పోవును. అపుడంతర్యామియైన శ్రీరాముడు అతని (రావణుని) హృదయముపై బాణము వేయును." (దో॥ 99)

ఈ విధముగా అనేకవచనములతో సీతాదేవిని ఊరడించి, త్రిజట తననివాసమునకేగెను. శ్రీరామచంద్రుని స్వభావమును దలచుకొని జానకీదేవిహృదయమున భరింపరానివిరహవ్యథ కలిగెను. ఆమె రాత్రిని, చంద్రుని పరిపరి విధముల నిందించుచు పలికెను. "రాత్రులు యుగములవలె దీర్ఘములగు చున్నవి, కడచుట కష్టముగా నున్నది." శ్రీరామవియోగవ్యథకులోనై జానకీదేవి లోలోన మిక్కిలి పరితపించెను. విరహాగ్ని అధికమగుచుండగా ఆమె ఎడమకన్ను, భుజము అదిరెను. అది శుభసూచకమని తలంచి, కృపాళువైన రఘువీరుడు తనను కలిసికొనునని, భావించి, ఆమె ధైర్యము వహించెను. అక్కడ అర్ధరాత్రి సమయమున రావణుడు మూర్ఛనుండి తేరుకొని, తన సారథిపై కోపముతో పలుకసాగెను. "ఓరీ మూర్ఖుడా! నీవు నన్ను రణరంగమునుండి వేఱుచేసితివి. అథముడా! జడుడా? ఛీ!ఛీ! ధిక్కారము" అతడు రావణుని పాదములను పట్టుకొని, 'క్షమింపుడు' అనుచు పదేపదే ప్రార్థించెను. తెల్లవాఱగనే రావణుడు రథముపైనెక్కి మఱల రణభూమికి పరుగులుదీసెను. రావణుడు వచ్చినవార్తను వినగానే వానరులలో రణోత్సాహము చెలరేగెను. వారెక్కడెక్కడనుండియో పర్వతములను, వృక్షములను పెకలించుకొని, కోపముతో పండ్లు గొఱుకుచు పరుగెత్తికొనివచ్చిరి. (చౌ॥ 1-6)

రావణ వధ - మందోదరీ విలాపము

భయంకరులు, వీరులునైన వానరభల్లూకములు పర్వతములను చేతబట్టి పరుగుపరుగునవచ్చి, కోపముతో రాక్షసులను చావమోదుచుండిరి. వారు కొట్టుటచే రాక్షసులు ధైర్యముసడలి పిక్కబలము చూపిరి. ఆ విధముగా శత్రుయోధులను విచలితులనుగాజేసి, వానరులు రావణుని చుట్టుముట్టిరి. నాలుగువైపులజేరి, చెంపలు వాయించుచు, కొట్టుచు, తిట్టుచు, గోళ్లతో ఱక్కుచు అతని శరీరమును గాయపఱచి, వారు అతనిని మిక్కిలి వ్యాకులపఱచిరి. (ఛం)

మహాప్రబలురైన వానరులను జూచి, రావణుడు విచారముతో అంతర్థానమాయెను. తన మాయను ఒక్క క్షణములో విస్తరింపజేసెను. (దో॥ 100)

అతడు మాయాశక్తిని విస్తరింపజేయగనే భయంకరభేతాళభూతపిశాచములు చేతులలో ధనుర్బాణములను ధరించి, ప్రకటితులైరి. యోగినులు ఒక చేతితో కత్తినిబూని, మఱియొక చేతితో మానవ కపాలములను బూనుచు వాటియందలి సద్యోరక్తమును త్రాగుచు, నాట్యములతో పాటలు పాడుచుండిరి. "పట్టుకొనుము, వధింపుము" అను భీకర శబ్దములు అన్ని దిశలయందును ప్రతిధ్వనించెను. వారు నోళ్ళు తెఱచి, మ్రింగుటకు ప్రయత్నించుచుండిరి. అపుడు వానరులు పాఱిపోసాగిరి. వారు పాఱిపోయిన ప్రదేశములయందెల్లెడల అగ్ని జ్వాలలను గాంచిరి. ఇట్లు వానరభల్లూకములు వ్యాకులపాటునకు లోనుకాగా రావణుడు ఇసుకను కురిపించెను. కపటోపాయములచే అతడు వానరులను స్తంభింపజేసి గర్జించెను. లక్ష్మణ సుగ్రీవాదులతోసహా వీరులందఱును స్పృహనుగోల్పోయిరి. "హా రామా! హా రఘునాథా!" అనుచు ఆ మహాయోధులందఱును ఏమియుతోచక చేతులునలుపుకొనుచుండిరి. ఈ విధముగా వారిని దుర్బలులగావించి, రావణుడు మఱియొక మాయను సృష్టించెను. ఆ మాయా ప్రభావమున అసంఖ్యాకులైన హనుమంతులు పాషాణములను చేతబట్టి ప్రకటితులైరి. వారందఱును వేలసంఖ్యలో గుమిగూడి శ్రీరాముని చుట్టుముట్టిరి. వాలములను ఎత్తుకొని, పండ్లుగొఱుకుచు వారు "వధింపుము, పట్టుకొనుము' పోనియ్యవద్దు," అని అఱచుచుండిరి. వారివాలములు దశదిశలయందును విలసిల్లుచుండెను. వారివాలవలయములమధ్య కోసల రాజు శ్రీరాముడు విరాజమానుడయ్యెను. (చౌ॥ 1-8)

ఆ వాలములమధ్య శ్యామసుందరగాత్రుడై, కోసలరాజు అనేకములైన హరివిల్లులమధ్య ఎత్తైన తమాల వృక్షమువలె శోభిల్లుచుండెను. ప్రభువును గాంచి, దేవతలు హర్షవిషాదహృదయులై 'జయ జయ ధ్వానములను' జేసిరి. అప్పుడు శ్రీ రఘువీరుడు క్రుద్ధుడై ఒక్క క్షణములో ఒకే బాణముతో రావణుని మాయను హరించెను. మాయ తొలగిపోయిన పిమ్మట భల్లూక వానరులు ప్రసన్నచిత్తులైరి. వారు వృక్షములను, పర్వతములను దీసికొని మరల యుద్ధ రంగమునకు ఏతెంచిరి. శ్రీరాముడు బాణ పరంపరను ప్రయోగింపగా రావణునిశిరస్సులు, భుజములు తెగి క్రిందబడెను. శ్రీరామరావణ యుద్ధమును వందలకొలది శేషులుగాని, శారదాది దేవతలుగాని, వేదములుగాని, కడకు కవీశ్వరులుగాని కల్పములకొలది వర్ణించినను దానిని సమగ్రముగా తెలుపజాలరు. (ఛం॥ 1,2)

అల్పశక్తిగల ఒక దోమ అనంతాకాశమును కొలుచుటకు పూనుకొనినట్లు మందబుద్ధియైన తులసీదాసు ఆ అపూర్వయుద్ధవిశేషములలో కొన్నింటిని వర్ణించెను. శిరస్సులు, భుజములు పెక్కుపర్యాయములు తెగిపడినను వీరుడైన రావణుడు చావలేదు. శ్రీరామచంద్రునకు అదియొక లీలమాత్రమే కాని మునులు, సిద్ధులు దేవతలు ఆ దృశ్యములను జూచి, శ్రీరాముడు క్లేశములకు లోనైనాడని భావించి, వ్యాకులపడిరి. (దో॥ 101 క.ఖ)

ధనలాభము కలిగినకొలదియు లోభము అధికమైనట్లు ఖండింపబడిన కొలదియు రావణుని శిరస్సులు పెరుగుచు వచ్చెను. శత్రువు చనిపోవుటలేదు. శ్రమ అధికమగుచుండెను. అప్పుడు శ్రీరామచంద్రుడు విభీషణుని వైపు చూచెను. (శివుడు పలుకుచున్నాడు) ఓ ఉమా! ఇచ్ఛామాత్రముననే మృత్యువునుగూడ సమయింపజేయగల శ్రీరాముడు తన భక్తులప్రేమను పరీక్షించుచున్నాడు. విభీషణుడు పలికెను. "ఓ సర్వజ్ఞా! చరాచర ప్రభూ! శరణాగత సంరక్షకా! దేవతలకును, మునులకును సుఖములను ప్రసాదించువాడా! వినుడు. రావణునినాభికుండములో అమృతకలశమున్నది. ప్రభూ! దానిప్రభావమున అతడు జీవించియున్నాడు." విభీషణుని వచనములను విని, కృపాళువైన శ్రీరాముడు ప్రసన్నుడై భీషణశరమును చేతబట్టెను. అప్పుడనేక విధముల అపశకునములాయెను. పెద్ద సంఖ్యలో గాడిదలు, నక్కలు, కుక్కలు ఏడువ సాగెను. దుఃఖములను సూచించుచు పక్షులు కూసెను. ఆకాశములో అంతటను తోకచుక్కలు కనబడెను. అన్నిదిశలయందును అగ్నిజ్వాలలు ప్రజ్వలించెను. పర్వదినము (అమావాస్య) కాకున్నను సూర్యగ్రహణము సంభవించెను. మందోదరి హృదయము మిగులకంపించెను. విగ్రహముల నేత్రములనుండి అశ్రుధారలు స్రవించెను. (చౌ॥ 1-5)

ప్రతిమలు రోదించుచుండెను. ఆకాశమునుండి వజ్రపాతము సంభవించెను. వాయువులు అత్యంత ప్రచండములై వీవసాగెను. పృథ్వి డోలాయమానమగుచుండెను. మేఘములు రక్తమును, వెంట్రుకలను, ధూళులను వర్షించుచుండెను. లెక్కింపసాధ్యముకానన్ని అపశకునములు పొడసూపెను. అంతులేని ఉత్పాతములనుజూచి, ఆకాశమున దేవతలు వికలులైరి. 'జయజయధ్వానములు' చేసిరి. దేవతలు భయభ్రాంతులగుట చూచి, కృపాళువైన రఘునాథుడు ధనుస్సున బాణములను సంధించెను. (ఛం)

ధనస్సును ఆకర్ణాంతములాగి, శ్రీ రఘువీరుడు ఒకేసారి ముప్పదియొక్క బాణములను వదిలెను. అవి కాలసర్పములవలె వెళ్లెను. (దో॥ 102)

ఒక బాణము రావణుని నాభియందలి అమృతభాండమును శుష్కింపజేసెను. మిగిలిన ముప్పది బాణములు అతని పదిశిరస్సులను, ఇరువది చేతులను ఖండించి, వాటిని తమతో పాటు తీసికొనిపోయెను. శిరస్సులు, భుజములు లేని మొండెము నేలపై నాట్యమాడసాగెను. మొండెము ప్రచండవేగముతో పరుగెత్తుచుండగా భూమి కంపించెను. అప్పుడు ప్రభువు ఒక బాణముతో దానిని రెండు ముక్కలుగాజేసెను. మరణ సమయమున రావణుడు గర్జించుచు రాముడెక్కడ? రాముడెక్కడ? నేను అతనిని యుద్ధమున చంపవలెను' అని పలికెను. దశకంధరుడు పడిపోగానే భూమి దద్దరిల్లెను. సముద్రములు, నదులు, దిగ్గజములు, పర్వతములు క్షోభించెను. మొండెము యొక్క

రెండు ముక్కలును తమ క్రిందబడిన భల్లూక వానరములను అణచివేసెను. శ్రీరాముని బాణములన్నియును రావణుని భుజములను, మస్తకములను మందోదరి ముందుంచి, తిరిగివచ్చి రామునితూణీరమున జేరెను. ఈ దృశ్యమునంతయును గాంచి, దేవతలు దుందుభులను మ్రోగించిరి. రావణుని తేజస్సు ప్రభుముఖమున ప్రవేశించెను. దీనిని గాంచి, శివుడు, బ్రహ్మయు ప్రసన్నులైరి. బ్రహ్మాండమంతయును 'జయ జయ ధ్వానములతో మారుమ్రోగెను. " ప్రబలభుజదండములుగల శ్రీరఘువీరునకు జయము జయము, కృపాళువైన ముకుందునకు జయము జయము. "అనుచు దేవతలు, మునులు, పుష్పములను వర్షించిరి.(1) (చౌ॥ 1-6)

(శ్రీరాముని వారు ఇట్లు స్తుతించిరి) "ఓ కరుణానిధీ! మోక్షప్రదాయకా! ముకుందా! రాగద్వేషములు, హర్ష శోకములు, జనన మరణములు మొదలగు ద్వంద్వములను హరించువాడా! శరణాగతులకు సుఖ ప్రదాతా! ప్రభూ! ఖలులసమూహమును నాశమొనర్చువాడా! కారణకారణా! కరుణామయా! సర్వసమర్థా! శాశ్వతా! నీకు 'జయముగుగాక' ఇట్లు స్తుతించుచు దేవతలు ఆనందాతిరేకముతో పూలవానకురిపించిరి. ఘనమైన నగారాలను మ్రోగించిరి. సంగ్రామరంగమున విజేతయైన శ్రీరామచంద్రుని అందచందములు కోటిమన్మథ సౌందర్యములను మించి ప్రకాశించుచుండెను. శ్రీరాముని జటామకుటముపై అలరారుచున్న పుష్పములు అత్యంత మనోహర శోభలను విరజిమ్ముచుండెను. శ్రీరాముని మేనికాంతులు నీలగిరి శోభలవలెను, జటా జూటచ్ఛటలు విద్యుల్లతా ప్రభలవలెను, జటలపై విలసిల్లుచున్న పుష్పద్యుతులు నక్షత్రశోభలవలెను మనోహరములై భాసిల్లుచుండెను. శ్రీరాముడు తన బాహువులతో ధనుర్బాణములను త్రిప్పుచుండెను. శ్యామసుందరుని మేనిపైగల రక్తబిందువులు తమాల వృక్షముపై నిశ్చలముగా హాయిగా కూర్చునియున్న రాయముని పక్షులవలె మనోజ్ఞములై అలరారుచుండెను. (ఛం)

శ్రీరామచంద్ర ప్రభువుతనకృపాదృష్టివర్షముతో దేవతలకు అభయమొసంగెను. వానరులందఱును. హర్షోల్లాసములతో "ఓ సుఖ నిధానా! ముకుందా! నీకు జయము జయము" అని పలికిరి. (దో॥ 103)

తన భర్త శిరస్సులను చూడగనే మందోదరి శోక విహ్వలయై మూర్ఛిల్లి, పడిపోయెను. తక్కిన రాణులు విలపించుచు లేచి పరుగిడి ఆమెను లేవనెత్తి, రావణుని కళేబరము నొద్దకు తీసికొని వచ్చిరి. తమ పతికి పట్టిన ఈస్థితిని జూచి, వారు బిగ్గఱగా వాపోవుచు విలవిలలాడిరి. వారి కొప్పులు చెదరిపోయెను, శరీరములపై స్పృహ లేకుండెను. గుండెలపై బాదుకొనుచు, విలపించుచు వారు అనేక విధముల రావణుని ప్రతాపమును ప్రస్తుతించిరి. "ఓ నాథా! నీ బలమునకు నిత్యము పృథ్వీ గడగడలాడుచుండెను. సూర్యచంద్రాగ్నులు నీ ముందు తేజో విహీనులగుచుండిరి. శేషుడు, కూర్మము గూడ నీ భారమును మోయ జాలకుండిరి. అట్టి నీ మహోన్నత శరీరము అయ్యో! ధూళి ధూసరితమై నేలపై బడియున్నది. ఇంద్ర వాయు వరుణ కుబేరులలో ఎవ్వరును యుద్ధములో నిన్ను ఎదురించుటకు సాహసింపకుండిరి. స్వామీ! నీవు నీభుజబలముచే మృత్యువును, యమధర్మరాజునుగూడ జయించితివి. అట్టి నీవు ఇప్పుడు దిక్కులేని స్థితిలో పడియుంటివి. నీప్రతాపము జగద్విదితము. నీపుత్రులబలము, కుటుంబసభ్యుల పరాక్రమము వర్ణనాతీతము. జగత్ప్రభువైన శ్రీరామచంద్రునితో వైరముపెట్టుకొనుటచే నీకీదుస్థితి దాపురించినది. నేడు నీ వంశములో నీకై విలపించు వారు ఎవ్వరును మిగుల లేదు. నాథా! విధాత సృష్టి యంతయును నీ యధీనములో ఉండెను. దిక్పాలురు నీకు భయపడి నీ ముందు తలలు వంచుకొనుచుండిరి. కానీ నేడు నీ శిరస్సులను, భుజములను అయ్యయ్యో!! నక్కలు తినుచున్నవి. శ్రీరాముని విరోధికి ఇట్టి గతి పట్టుట అనుచితము గాదు. నాథా! కాలుని వశమైయుండుటచే నీవు ఎవ్వరి మాటలనూ వినకుంటివి. చరాచర సృష్టికి ప్రభువైన పరమాత్మను మానవ మాత్రునిగా భావించితివి. (చౌ॥ 1-7)

సరససామదానభేదదండచతుర సాటి దైవమా వేగ్రబోవవే ॥సరస॥

పరమ శాంభవాగ్రేసరుండననుచు పలుకు రావణుడు తెలియలేక పోయె ॥సరస॥ (త్యాగరాయ)

దైత్యలోకమనెడివనమును కాల్చి, భస్మమొనర్చుటకు అగ్నియైన శ్రీరాముని సామాన్య మానవుడనుకొంటివి. బ్రహ్మరుద్రాది దేవతలచే సేవింపబడు, కరుణామయుడైన శ్రీరాముని నీవు భజింప కుంటివి. పుట్టినది మొదలుకొని ఈ శరీరము ఇతరులకు ద్రోహము చేయుటలోనే నిమగ్నమై యుండెను. ఇది అనేక పాపములకు కూడలి. ఐనను శ్రీరాముడు నీకు తనలోకమున స్థానమును ప్రసాదించెను. అట్టి నిర్వికార పరబ్రహ్మకు నేను ప్రణమిల్లుచున్నాను. (శ్రీరామునియెడ నీవు పరమద్రోహమునకు ఒడిగట్టినను రాగద్వేషములకు అతీతుడైన ఆకృపాళువు నీకు పరమగతిని ప్రాప్తింపజేయుట ఆయన నిర్వికారస్వభావమునకు పరమతార్కాణము). (ఛం)

అహో! నాథా! యోగులకుకూడ దుర్లభమైన పరమపదమును నీకు అనుగ్రహించిన భగవంతుడే ఆ శ్రీరాముడు. అట్టి దయాళువు మఱియొకడు లేనే లేడు." (దో॥ 104)

మందోదరి వచనములను చెవులార విని, దేవతలు, సిద్ధులు, మునులు సంతసించిరి. బ్రహ్మ, పరమ శివుడు, నారదమహర్షి, సనకాది మహామునులు ఇతర తత్త్వజ్ఞులు మొదలగు వారందఱును శ్రీ రఘునాథుని కన్నులపండువుగా జూచి, ప్రేమమగ్నులై, తన్మయులై అపారమైన ఆనందమును అనుభవించిరి. తన కుటుంబ స్త్రీలు అందఱును విలపించుటను జూచి, విభీషణుడు మిక్కిలి దుఃఖితుడై వారి యొద్దకు వెళ్లెను. సోదరుని ఈస్థితిని జూచి, అతడు మిగుల బాధపడెను. ప్రభువు యొక్క ఆజ్ఞ మేరకు లక్ష్మణుడు విభీషణుని పెక్కురీతుల ఓదార్చెను. అపుడు విభీషణుడు ప్రభువు నొద్దకు వచ్చెను. ప్రభువు తనకరుణాపూరిత దృష్టితో అతనిని జూచి పలికెను. "ఇప్పుడు శోకమును వీడి, రావణునకు అంత్యక్రియలను నెఱపుము. ప్రభువు యొక్క ఆజ్ఞను శిరసావహించి, దేశకాలపరిస్థితులను గమనించి, విభీషణుడు విధ్యుక్తముగా రావణునకు అంత్యక్రియలను జరిపెను. (చౌ॥ 1-4)

మందోదరి మొదలగు రాణులందఱును రావణునకు తిలాంజలులనిచ్చి, మనస్సులో శ్రీరాముని దివ్యగుణములను కొనియాడుచు తమభవనములకు చేరిరి. (దో॥ 105)

విభీషణుడు రాజ్యాభిషిక్తుడగుట

అంత్యక్రియలు ముగిసినపిమ్మట విభీషణుడు వచ్చి ప్రభువునకు పాదాభివందనమాచరించెను. కృపానిధానమైన శ్రీరాముడు లక్ష్మణుని బిలిచి పలికెను. "నీవు, వానరరాజైన సుగ్రీవుడు, అంగదుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు, హనుమంతుడు అందఱును నీతి కుశలురు. మీరు విభీషణునితో గూడి పోయి, అతనిని రాజ్యాభిషిక్తుని గావింపుడు." పిమ్మట విభీషణునితో, "తండ్రిగారి ఆజ్ఞమేరకు నేను స్వయముగా నగరములోనికి రారాదు. కాని నాతో సమానులైన వానరులను, నా అనుజుడైన లక్ష్మణుని పంపుచున్నాను" అని పలికెను. ప్రభు వచనములను వినగానే వానరులు వెంటనే వెళ్లి, రాజ్యపట్టాభిషేకమునకు ఏర్పాట్లుగావించిరి. విభీషణుని సాదరముగా సింహాసనముపై కూర్చుండ బెట్టి, రాజ్యాభిషిక్తునిగా జేసి, సందోర్భోచితముగా శ్లాఘించిరి. పిమ్మట అంజలి ఘటించి, అందఱును ఆయనకు నమస్కరించిరి. విభీషణునితోపాటు అందఱును ప్రభువు నొద్దకు వచ్చిరి. శ్రీ రఘువీరుడు వానరులను పిలిచి, వారిని తన మధురవచనములతో సంతృప్తి పఱచెను. (చౌ॥ 1-4)

"మీ బలపరాక్రమములవలననే రావణునియంతటి శత్రువుగూడ వధింపబడెను. విభీషణుడు రాజయ్యెను. మీ యశస్సు ముల్లోకములలో చిరస్థిరముగా నుండును. అమృత ప్రాయములైన ఇట్టి మధుర వచనములతో వారినందఱిని సంతృప్తి పఱచెను. నాతోపాటు మీ బలపరాక్రమ యశోవైభవములను గూడ ప్రేమ పూర్వకముగా గానము చేయువారు ఎట్టి శ్రమయులేకుండగనే అపారభవసాగరమును దాటెదరు. (ఛం)

ప్రభు వచనములను ఎంతగా విన్నను వానరులకు తనివితీరలేదు. వారందఱును మాటిమాటికి ప్రభు చరణములకు శిరసా ప్రణమిల్లిరి. (దో॥ 106)

పిదప ప్రభువు హనుమంతుని బిలిచి ఇట్లనెను. "నీవు లంకకు వెళ్లి, విషయము నంతయును జానకీ దేవికి తెలుపుము. ఆమె క్షేమ సమాచారములను గూడ తెలిసికొని రమ్ము"- పిమ్మట హనుమంతుడు నగరమునకు వెళ్లెను. ఆ విషయము నెఱిగిన రాక్షస స్త్రీ పురుషులందఱును ఆయనకు స్వాగతము పలుకుటకై పరుగెత్తుకొనివచ్చిరి.

హనుమంతుని అనేకవిధముల గౌరవించి, జానకీదేవిని చూపించిరి. హనుమంతుడు సీతామాతకు దూరమునుండి నమస్కరించెను. జానకీదేవి అతనిని శ్రీరాముని ప్రత్యేకదూతగా ఎఱింగి పలికెను. "నాయనా! తెలుపుము. కృపానిధియైన నా స్వామి, సోదరుడు లక్ష్మణుడు, వానరసేనతో సహా కుశలమే గదా?"- హనుమంతుడు పలికెను. "మాతా! కోసలాధీశుడును తక్కిన వారందఱును అన్ని విధముల కుశలమే. ప్రభువు యుద్ధములో దశాననుని సంహరించెను. అఖండ లంకారాజ్యమునకు ఇప్పుడు విభీషణుడు రాజు". హనుమంతుని మాటలను విని, సీతాదేవిహృదయము ఆనందభరితమాయెను. (చౌ॥ 1-4)

శ్రీ జానకీదేవిహృదయము హర్షభరితమాయెను. ఆమెశరీరము పులకరించెను. నేత్రములు ఆనందాశ్రువులతో నిండెను. పదే పదే ఇట్లు పలికెను. "హనుమ! నేను నీకేమి ఇయ్యగలను? ఇట్టి సంతోషకరమైన సమాచారము ముల్లోకములలో ఏదియును లేదు." హనుమంతుడు పలికెను. "అమ్మా! వినుడు. సంగ్రామములో శత్రుసేనలను జయించి, సోదరునితో సహా నిర్వికారుడైయున్న శ్రీరాముని చూచి, నేను నిస్పందేహముగా విశ్వమునకే ఆధిపత్యము వహించిన వాడనైతిని.- (ఇట్టి ప్రబల శత్రువును వధించినను కోమలస్వభావుడైన శ్రీరామచంద్రప్రభువు నిర్వికారుడై ఉన్నాడని ఆంజనేయస్వామి వచించెను.) (ఛం)

జానకీ దేవి పలికెను. "కుమారా! వినుము. నీ హృదయము సర్వసద్గుణములకును నివాసమైయుండు గాక. అనంత(లక్ష్మణ)సహితుడైన కోసలాధిపతి నీయెడల సదాప్రసన్నుడై యుండుగాక. (దో॥ 107)

వత్సా! ఇప్పుడీకన్నులతో ప్రభువు యొక్క కోమలశ్యామలశరీరమును దర్శించు ఉపాయమును జూడుము. "అపుడు హనుమంతుడు శ్రీరాముని యొద్దకు వెళ్లి, జానకీదేవి కుశల సమాచారమును దెలిపెను. సూర్యవంశ భూషణుడైన శ్రీరాముడు సీతాదేవి సందేశమును విని, యువరాజైన అంగదుని లంకాధిపతియైన విభీషణుని పిలిచి, "మీరు పావనితోపాటు వెళ్లి, జానకీదేవిని సాదరముగా తీసికొని రండు"- అని పలికెను. వెంటనే వారు సీతాదేవి కడకేగిరి. రాక్షస స్త్రీలందఱును వినమ్ర భావముతో సీతాదేవికి సేవలొనర్చుచుండిరి. విభీషణుడు వెంటనే వారందఱికిని తగుసూచనలను ఇచ్చెను. వారు ఆమెకు సంప్రదాయానుసారముగా స్నానము చేయించి, ఆమెను వివిధాభరణములతో అలంకరించిరి. ఒక అందమైన పల్లకీని అలంకరించి, తీసికొని వచ్చిరి. సుఖనిధానమై, ప్రియతముడైన శ్రీరామచంద్రప్రభువును స్మరించుచు సీతాదేవి ఆనందముగా ఆ పల్లకీని ఎక్కెను. వేత్రహస్తులైన రక్షకభటులు పరమోల్లాసముతో నాలుగు వైపుల నడిచిరి. భల్లూక వానరములు సీతాదేవిని దర్శించుటకై ముందుకు రాగా భటులు వారిని వారించిరి. అప్పుడు శ్రీ రఘువీరుడు పలికెను. "మిత్రమా! నా మాటలను వినుము. సీతాదేవిని కాలినడకతోడనే రానిమ్ము. దాని వలన వానరులందఱును ఆమెను తల్లివలె చూడగలరు." అనంతరము ఆ ప్రభువు దరహాసము చేసెను. ప్రభు వచనములను విని, భల్లూక వానరములు ప్రసన్నచిత్తులైరి. ఆకాశమునుండి దేవతలు పూలను వర్షించిరి. నిజమైన సీతాదేవి అగ్నిదేవునికడ ఉంచబడెను. సర్వసాక్షియైన శ్రీరాముడు ఇప్పుడు ఆమెను ప్రకటిత మొనర్పదలచెను. (చౌ॥ 1-7)

అవని జాతకు - అగ్నిపరీక్ష

ఈ కారణముచే కరుణానిధియైన శ్రీరాముడు కొన్ని పరుషవచనములను లీలగా నుడివెను. ఆ మాటలకు రాక్షస్త్రీలందఱును దుఃఖితలైరి. (దో॥ 108)

ప్రభు వచనములను శిరసావహించి, మనోవాక్కర్మలచే పరమ పవిత్రురాలైన సీతాదేవి పలికెను. "లక్ష్మణా! ఈ ధర్మరక్షణకార్యమునందు నీవు నాకు సహాయకుడవుగా ఉండుము. వెంటనే అగ్నిని ప్రజ్వరిల్ల జేయుము." విరహము, వివేకము, ధర్మము, నీతియుక్తములైన సీతాదేవి పలుకులను వినగానే లక్ష్మణుని కన్నులనుండి దుఃఖాశ్రువులు దొరలెను. చేతులు జోడించి మౌనముగా నిలబడిమిన్నకుండెను- శ్రీరాముని సంకేతమును గమనించి, లక్ష్మణుడు వెంటనే కట్టెలను దెచ్చి, అగ్నిని ప్రజ్వాలింప జేసెను. ప్రజ్వాలింపజేయబడిన అగ్నిని జూచి సీతాదేవి ప్రసన్న చిత్తురాలాయెను. లేశమాత్రమైనను భయపడక ఆమెయిట్లు వచించెను. మనోవాక్కర్మలచే నా హృదయము సర్వధర్మజ్ఞుడైన శ్రీ రఘువీరుని మాత్రమే ఆశ్రయించియున్నచో అందఱి మనస్సులను ఎఱింగిన అగ్ని దేవుడా! నీవు చందనము వలె చల్లబడుము." (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రప్రభుచరణములు ఆ మహాదేవునిచే సర్వదా పూజలనందుకొనుచుండును. అవి సీతాదేవికి అత్యంత ప్రీతిపాత్రములు. అట్టి పవిత్ర పాదపద్మములను స్మరించుచు "కోసలాధిపతికి జయము' అని పల్కుచు సీతాదేవి అగ్నిలో ప్రవేశింపగనే అది చందనము వలె చల్లదనమును వహించెను. అంతట సీతాదేవి ప్రతిబింబము బింబములో గలిసెను. లౌకికకళంకము ఆ ప్రచండాగ్నిలో భస్మమాయెను. ప్రభులీలారహస్యమెవ్వరికిని గోచరముగాలేదు. దేవతలు సిద్ధులు మునులుగూడ ఆకసమునుండి చూచుచుండిరి. అప్పుడు అగ్నిదేవుడు స్వయముగా ఆకృతిని దాల్చి, వేదప్రకటితమైన, జగత్ప్రసిద్ధమైన వాస్తవ 'శ్రీ'ని (సీతాదేవిని) తనయొడిలో కూర్చుండబెట్టుకొని వచ్చి, క్షీరసాగరుడు లక్ష్మీదేవిని విష్ణుమూర్తికి సమర్పించినట్లు, సీతాదేవిని శ్రీరామచంద్రునకు సమర్పించెను. సీతాదేవి శ్రీరాముని వామభాగమున సుశోభితయయ్యెను. ఆమెయొక్క పరమశోభ అతిమనోజ్ఞమయ్యెను. నవవికసితనీలకమలమునరసన బంగారు కమలముకుళము (మొగ్గ) వలె ఆమె శోభిల్లెను.

(ఛం॥ 1,2)

హర్షోల్లాసములతో దేవతలు పుష్పములను వర్షించిరి. ఆకాశమున దుందుభులు మ్రోగెను. కిన్నరులు గానము చేసిరి. విమానములయందు నిలిచి, దివ్యాంగనలు నాట్యములాడిరి. శ్రీ జానకీదేవితోగూడిన శ్రీరామచంద్రుని అపారసౌందర్యమును దర్శించి, భల్లూక వానరులు సంతోషమును పట్టజాలక పోయిరి. 'సుఖనిధి' యైన 'రఘురామునకు జయము జయము' అని పలికిరి. (దో॥ 109. క,ఖ)

పిమ్మట శ్రీ రఘురాముని అనుమతిగైకొని, ఇంద్రునిరథసారథియగు మాతలి ప్రభుచరణములకు ప్రణమిల్లి సురపురికి జేరెను. తదనంతరము స్వకార్యఫలనిరతులైన దేవతలు వచ్చి, తత్త్వజ్ఞానులవలె, పరోపకారులరీతి మాట్లాడిరి. "ఓ దీనబంధూ! కృపాళూ! శ్రీ రఘునాథా! దేవా! మీరు దేవతలపై మిగుల కృప జూపితిరి. ఈ దుష్టరావణుడు విశ్వద్రోహి, కామాతురుడు, కుపథవర్తనుడు తాను చేసికొనిన మహా పాపములకు తగినఫలమును పొందినాడు. మీరు సమరూపులు, పరబ్రహ్మ స్వరూపులు, నాశరహితులు, నిత్యులు, రసానందైక స్థితులు, శత్రుమిత్రభావములకు అతీతులు, అఖండస్వరూపులు, గుణాతీతులు, జన్మరహితులు, అనఘులు, నిర్వికారులు, అజేయులు, అమోఘశక్తిశాలురు, కరుణామయులు, మీరు మత్స్య కూర్మ వరాహ నారసింహ వామన పరశురామావతారములను స్వీకరించియుంటిరి. ప్రభూ! దేవతల సంకటనివారణమునకై అనేకావతారములనెత్తి, మీరు వారిని రక్షించితిరి. ఈ దుష్టుడు మహాపాపి, దేవతలకు నిత్యశత్రువు, కామ, లోభ, మద నిరతుడు. అతి క్రోధనుడు, ఇట్టి అధమాధమునకు మీరు పరమ పదమును ప్రసాదించితిరి. ఇది జగదాశ్చర్యకరము. దేవతలమైన మేము ఉత్తమ-అధికారములను కలిగియున్నను స్వార్థపరులమై నీ భక్తిని మఱచి, నిరంతరము భవసాగర ప్రవాహములో మునకలు వేయుచున్నాము. ప్రభూ! ఇప్పుడు మేము మీకు శరణాగతులము. మమ్ము ఆదుకొనుడు."

(చౌ॥ 1-6)

బ్రహ్మస్తుతి

ఈ విధముగా ప్రార్థించి, దేవతలు అంజలి ఘటించి, ఎక్కడి వారక్కడనే నిలబడి పోయిరి. అప్పుడు బ్రహ్మ దేవుడు పులకిత శరీరుడై, అత్యంత భక్తి ప్రపత్తులతో స్వామిని స్తుతింప సాగెను. (దో॥ 110)

"సదా సుఖధామా! హరీ! ధనుర్బాణధారీ! రఘునాయకా! శ్రీరామా! నీకు జయము "ప్రభూ! నీవు జననమరణ రూపగజములకు సింహమువంటి వాడవు. సద్గుణసాగరుడవు. సర్వసమర్థుడవు. నీవు కోటిమన్మథ సుందరాకారుడవు. సిద్ధులు, మునులు, కవులు నీ గుణములను నిరంతము గానముచేయుచుందురు. నీయశస్సు ఉజ్జ్వలమైనది. రావణుడను మహాసర్పమును అవలీలగా క్రోధావేశముతో హతమార్చిన గరుత్మంతుడవు, ప్రభూ! సేవకులకు ఆనందప్రదాయకుడవు, శోకభయనాశకుడవు, క్రోధరహితుడవు, నిత్య జ్ఞాన స్వరూపుడవు. నీ అవతారము ఉదార-అపారదివ్యగుణశోభితము. పృథ్వీ భారమును తొలగించునది. జ్ఞాననిధానము, అవతారము దాల్చినను మీరునిత్యులు, జన్మరహితులు, సర్వవ్యాపకులు, అద్వితీయులు, అనాది. ఓ కరుణాకరా! శ్రీరామా! మిక్కిలి హర్షముతో నీకు ప్రణమిల్లు చున్నాను. రఘువంశ భూషణా! దుష్టరాక్షససంహారకా! సమస్తదోషాపహారీ! దీనుడై శరణుజొచ్చిన

విభీషణుని రాజుగా జేసితివి. జ్ఞానగుణనిధానా! నిరభిమానీ! అజ! సర్వ వ్యాపీ! నిర్వికారా! శ్రీరామా! నీకు సమస్కారములు. నీ భుజ దండ ప్రతాప బలములు ప్రచండములైనవి. దుష్టసమూహములను మట్టుపెట్టుటలో నిరుపమానుడవు. దీనులపై అవ్యాజ కరుణ జూపుచు వారికి శుభములను గూర్చువాడవు. ఓ శోభానిధానా! జానకీసహితుడవై విలసిల్లు నీకు నమస్కారములు. నీవు సంసారసాగరమునుండి ఎల్లరను తరింపజేయువాడవు. కారణ(మాయ) కార్యముల (జగత్తు)లకు అతీతుడవు. మనస్సులయందుత్పన్నములగు దారుణ దోషములను హరించువాడవు. మంజులతూణీరధనుర్బాణధారీ! జలజారుణలోచనా! రాజశిరోమణీ! సుఖనిధానా! సుందరశ్రీరమణా! నీవు మమతాహంకారకామములను నశింపజేయువాడవు. అనవద్యుడవు, అఖండుడవు, ఇంద్రియములకు గోచరము కానివాడవు. అన్ని రూపములును నీవేయైనను ఏ రూపమునను ఒదుగనివాడవు, అని వేదములు తెలుపుచున్నవి. ఇది కల్పితము గాదు. సూర్యుడును, సూర్యకాంతియు ఒకటేయైనను వేర్వేఱైనట్లు, నీవు జగత్తునందు భిన్నుడవు, అభిన్నుడవు, ఓ సర్వవ్యాపకప్రభూ! ఈ వానరులందఱును కృతార్థులు. సాదరముగా మీముఖశోభలను దర్శించుచున్నారు. మా అమరజీవనము దివ్యశరీరము వ్యర్థములు. ఏలనన మేము మీయెడ భక్తిని మఱచి, సంసార విషయలంపటులమైతిమి. ఓ దీనశరణ్యా! విపరీతక్రియలను ఆచరించుచు విభేదములను సృష్టించు నా బుద్ధిని దయతో హరింపుము. దుఃఖమునే సుఖమని భావించి అందులోమునిగితేలుచున్నాను. నీవు దుష్టసంహారకుడవు. పృథ్వికి మనోహరాలంకారమైనవాడవు. మీ చరణకమలములను సర్వదా శివపార్వతులు సేవింతురు. ఓ రాజాధిరాజా! మీ పాద పద్మములను సేవించునట్టి అనన్యభక్తిని నాకు ప్రసాదింపుడు."(ఛం॥ 1-11)

అత్యంతభక్తితో పులకితగాత్రుడై బ్రహ్మదేవుడు ప్రార్థన చేసెను. అతని నేత్రములు ఆనందాశ్రుపూరితములాయెను. శ్రీరాముని సౌందర్యమును ఎంతగా దర్శించుచున్నను ఆయనకు తనివి తీరుటలేదు. (దో॥ 111)

అదే సమయమున దశరథుడు అచటికి విచ్చేసెను. పుత్రులను చూడగానే ఆయన కన్నులు చెమర్చెను. రామ లక్ష్మణులిద్దఱును తండ్రికి ప్రణమిల్లిరి. అతడు వారిని ఆశీర్వదించెను. శ్రీరాముడిట్లనెను. "తండ్రీ మీ పుణ్య ప్రభావముననే నేను అజేయుడైన రాక్షసరాజును జయించితిని." పుత్రునివచనములను విని, అతని ప్రేమ ఇనుమడించెను. కన్నులు సజలములాయెను. శరీరము రోమాంచమాయెను. దశరథుని జీవిత కాల ప్రేమను స్మరించుకొని, శ్రీ రఘునాథుడు ఆయనకు తన నిజరూపజ్ఞానమును ప్రసాదించెను. దశరథుడు భేదభక్తియందు తనమనస్సును లగ్నము చేసెను. అందువలన ఓ ఉమా! ఆయనకు కైవల్యము లభింపలేదు. సగుణరూపమును ఉపాసించు భక్తులు మోక్షమును కాంక్షింపరు. వారికి ప్రభువు తన భక్తిని ప్రసాదించును. ప్రభువునకు మాటి మాటికిని నమస్కరించి, దశరథుడు సంతుష్టుడై దేవలోకమునకు వెళ్లెను. (చౌ॥ 1-4)

ఇంద్రుడు శ్రీరాముని స్తుతించుట

సీతాలక్ష్మణసమేతుడైన కోసలాధీశుని పరమశోభలను గాంచి, సురరాజైన ఇంద్రుడు హర్షాతిరేకముతో స్తుతింప సాగెను. (దో॥ 112)

ఓ శోభానిధీ! శరణాగత వత్సలా! శ్రేష్ఠ తూణీర ధనుర్బాణధారీ! ప్రబల ప్రతాప శోభిత భుజ బలశాలీ! శ్రీ రామా! 'నీకు జయము' నీవు ఖరదూషణాదిరాక్షసులను జయించినవాడవు. ప్రభూ! రాక్షసరాజైన రావణునివధించి, దేవతలకు ఆత్మీయుడవుగా నిలిచితివి. పృథ్వీభారమునుబాపువాడా! అపారమహిమాన్వితా! నీకు జయము. ఓ రావణారీ! కృపాళూ! నీవు రాక్షసులను మట్టి కఱపించితివి. నీకు జయము. లంకేశుడు అతి మదోన్మత్తుడై దేవతలను, గంధర్వులను అతని అధీనులనుగా చేసికొనెను. మునులను, సిద్ధులను, మనుష్యులను, పక్షులను, నాగులను నిర్దాక్షిణ్యముగా తఱిమి తఱిమి కొట్టెను. ఆ దుష్టుడు ఇతరులందఱికిని ద్రోహము చేయుటలోనే నిరతుడై యుండెను. అతడు ఆ పాపఫలమును అనుభవించి నాడు. ఓ దీనదయాళూ! కమలములవలె

విశాలనయనములుగలవాడా! 'నాతో సమాన బల సంపదలు గల వాడెవ్వడును లేదని నేను మిగుల గర్వపడుచుంటిని. మీ పాదపద్మ దర్శనముచే ఆ గర్వము తొలగి పోయినది. 'అవ్యక్తము' అని వేదములచే పొగడబడిన నిర్గుణ పరబ్రహ్మను కొందఱు ఉపాసింతురు. కాని శ్రీరామా! నాకు మాత్రము సగుణ స్వరూపుడైన శ్రీరాముడే పరమ దైవము. శ్రీ జానకీ దేవితో లక్ష్మణ స్వామితోగూడి మీరు నా హృదయమున వసింపుడు. ఓ శ్రీనివాసా! నన్ను మీ సేవకునిగా భావించి, మీ భక్తిని అనుగ్రహింపుడు. (ఛం॥ 1-8)

ఓ రమాపతీ! శరణాగతులభయమును తొలగించి, వారికి సుఖములను ప్రసాదించు వాడా! నీ భక్తిని అనుగ్రహింపుడు. ఓ సుఖనిధానా! కోటిమన్మథసుందరా! రఘుకులశిరోమణీ! రామచంద్రా! నీకు నమస్కారము. దేవతలకు ఆనందమును గూర్చువాడా! జన్మ మృత్యు సుఖదుఃఖాదిద్వంద్వములను రూపు మాపువాడా! మాయామానుష విగ్రహా! అతులిత బలశాలీ! బ్రహ్మ రుద్రాదులచే సేవింపబడువాడా! కరుణా మూర్తీ! కోమలస్వభావా! శ్రీరామా! నీకు ప్రణమిల్లెదను. (ఛం)

ఓ కృపాళూ! నాపై నీ కరుణా దృష్టిని ప్రసరింపజేసి, నా కర్తవ్యమును దెలుపుడు." ఇంద్రుని ప్రియ వచనములను విని, దీనదయాళువైన ప్రభువు నుడివెను. (దో॥ 113)

"ఓ దేవేంద్రా! వినుము. రాక్షసులచే కొట్టబడిన భల్లూకవానరులందఱును రణభూమిలో బడియున్నారు. వీరు నాకు తోడ్పడుటకై తమ ప్రాణములనొడ్డిరి. వీరిని బ్రతికింపుము. (కాకభుశుండి పలుకుచున్నాడు) గరుడుడా వినుము. ప్రభువచనములు అత్యంత నిగూఢములు, గంభీరములు. జ్ఞానులైన మునులే వాటినిగ్రహింపగలరు. శ్రీరామచంద్ర ప్రభువు ముల్లోకములను సమయింప జేసి, తిరిగి బ్రతికింపగలరు. కాని ఇంద్రుని ఔన్నత్యమును నిలుపదలచెను. ఇంద్రుడు అమృతమును వర్షింపజేసి, భల్లూక వానరులను బ్రతికించెను. అందఱును లేచి, ఆనందముతో ప్రభువు నొద్దకు వచ్చిరి. అమృతవర్షము ఉభయపక్ష బలములపై కురిసినను కేవలము భల్లూక వానరులే జీవించిరి. రాక్షసులు పురజ్జీవితులు కాలేదు. ఏలనన చనిపోవునపుడు రాక్షసులమనస్సులలో శ్రీరాముని ఆకారము నిలియుండెను. కావున వారు భవబంధ విముక్తులైరి. కాని భల్లూక వానరులు దైవాంశ సంభూతులు. కనుక రఘుపతికోరికననుసరించి వారు ఉజ్జీవితులైరి. రాక్షసులందఱికిని ముక్తిని ప్రసాదించిన శ్రీరామచంద్రునివంటిదీనజనసంరక్షకులెవరున్నారు? దుష్టుడును, మహాపాపియు, కామాతురుడును ఐనప్పటికిని రావణుడు రామానుగ్రహమున మునీశ్వరులుగూడ పొందజాలని పరమగతిని పొందగలిగెను. (చౌ॥ 1-5)

దేవతలు పుష్పవృష్టిని గురిపించి, తమ విమానములపై వెళ్లి పోయిరి. ఇదియే తగిన సమయమని భావించి, విజ్ఞానియైన శివుడు శ్రీరాముని కడకు ఏతెంచెను. అత్యంత భక్తితో చేతులు మోడ్చి, తన నేత్ర కమలముల నుండి ఆనందాశ్రువులు పెల్లుబుకుచుండగా పులకిత గాత్రుడై, గద్గద కంఠముతో త్రిపురారియైన శివుడు విన్నపము చేయసాగెను. (దో॥ 114. క,ఖ)

పరమశివుని విన్నపము

"ఓ రఘువంశశిరోమణీ! మీ దివ్యహస్తములతో ధనుర్బాణములను ధరించి, నన్ను రక్షింపుడు, మోహమనెడి మేఘ సమూహములకు మీరు ప్రభంజనస్వరూపులు. సంశయ వనములకు మీరు అగ్నికల్పులు. దేవతలకు ఆనందప్రదాతలు. మీరు నిర్గుణులు, సగుణులు, దివ్యగుణ సంపన్నులు. పరమసుందరులు భ్రమయనెడి అంధకారమునకు ప్రచండభానుసదృశులు. కామక్రోధమదములనెడి గజయూథములను సంహరించుటలో సింహసమానులు. ఈ సేవకునిమనోవనమున నిత్యము విహరింపుడు. విషయవాసనాసమూహములనెడి కమలవనమునకు మీరు మంచువంటివారు, ఉదారులు, మనస్సునకు అగోచరులు. భవసాగరమును మథించుటయందు మందరాచలసదృశులు. మాభయములను తొలగించి, దుస్తరసంసారసాగరమును దాటింపుడు. ఓ శ్యామసుందరా! కమలదళవిశాలనేత్రా! దీనబంధూ! ప్రణతార్తిహరా! శ్రీరామచంద్రా! సహోదరుడైన లక్ష్మణునితో,

జానకీదేవితోగూడి నాహృదయమున వసింపుడు. మీరు మునీశ్వరులకుఆనందదాయకులు, పృథ్వికే అలంకారమైనవారు. భయనివారకులు. తులసీదాసునకు ప్రభువులు. (ఛం॥ 1-5)

ఓ ప్రభూ! అయోధ్యా నగరమునందు మీ పట్టాభిషేకసమయమున నేనచటికి వచ్చి మీ మహోదార లీలా విలాసములను గాంచెదను." (దో॥ 115)

ఇట్లు ప్రార్థించి, పరమశివుడు కైలాసమునకేగెను. పిమ్మట విభీషణుడు ప్రభువుచెంతకు వచ్చి, పాదములకు ప్రణమిల్లి, ఇట్లు మృదువచనములు పలికెను. "ఓ శార్ఙపాణీ! నా వినతిని ఆలకింపుడు. మీరు రావణుని, అతని పరివారములను సంహరించితిరి. మీ విమలయశస్సును ముల్లోకములలో విస్తరింపజేసితిరి. నావంటిదీనుని, పాపిని, మంద బుద్ధిని రాక్షసుని అనేకవిధముల కనికరించితిరి. ప్రభూ! ఇప్పుడు ఈ సేవకుని గృహమునకు ఒక్కసారి దయచేసి, పావనమొనర్చుడు. స్నానముచేసి, సమరశ్రమను దీర్చుకొనుడు. కృపాళూ! ఈకోశాగారమును, ధనమును, భవనమును, సంపదలనుజూచి, మీ యిష్టప్రకారము వాటిని భల్లూక వానరులకు కానుకలుగా ఇచ్చివేయుడు. స్వామీ! నన్ను మీవానిగా పరిగణించి, మీతో పాటు అయోధ్యానగరమునకు కొనిపొండు" విభీషణుని వినమ్రవచనములను విని, దీనదయాళువైన ప్రభువిశాలనేత్రములు ప్రేమాశ్రువులతో నిండెను. (చౌ॥ 1-4)

శ్రీరాముడు నుడివెను. "సోదరా! వినుము నీసంపద, భవనములు, మొదలగునవి అన్నియును నావియే. ఇది నిజము. కాని భరతునిస్థితి నాతలంపునకు వచ్చినప్పుడెల్ల ప్రతిక్షణము నాకు ఒక యుగముగా గడచుచున్నది. తాపసివేషములో కృశించినశరీరముతో అతడు అనుక్షణము నా నామమునే జపించుచున్నాడు. సఖా! నేను అతనిని త్వరగా చూచెడి ఉపాయమును ఆలోచింపుము. మిత్రమా! ఇదియే నా ప్రార్థన. ఈపదునాలుగు సంవత్సరముల అవధి ముగిసినపిదప వెళ్లినచో నా సోదరుని సజీవునిగా చూడలేను." తనతమ్ముడైన భరతుని ప్రేమను గూర్చి తలంచినకొలదియు ప్రభువు శరీరము పదేపదే రోమాంచిత మాయెను. శ్రీరాముడు మఱల పలికెను. "విభీషణా! నీవు ఈ కల్పాంతమువఱకును నా నామమును స్మరించుచు రాజ్యపాలన చేయుచుండుము. పిమ్మట సజ్జనులు మరణానంతరము పొందెడి పరమధామమును చేరెదవు". (దో॥ 116 క,ఖ,గ,ఘ)

పుష్పకవిమానముపై శ్రీరాముడు సపరివారముగా అయోధ్యకు బయలుదేఱుట

శ్రీరామచంద్రుని పలుకులు వినగానే విభీషణుడు ప్రసన్నచిత్తుడై, దయానిధియైన శ్రీరాముని పాదములకు ప్రణమిల్లెను. భల్లూకవానరులందఱును సంతోషముతో ప్రభుపాదములను పట్టుకొని, ఆయననిర్మలగుణములను కీర్తించిరి. తదనంతరము విభీషణుడు తన భవనముచేరి, మణులతో వినూత్న వస్త్రములతో విమానమును నింపెను. పిదప ఆ పుష్పక విమానమును తెచ్చి ప్రభువు ముందుంచెను. అపుడు దయాసింధువైన శ్రీరాముడు నవ్వుచు పలికెను. "మిత్రమా! విభీషణా! విమానముపైనెక్కి, ఆకాశమునుండి వస్త్రములను, భూషణములను వర్షించుము." వెంటనే విభీషణుడు ఆకాశమునుండి మణులను, వస్త్రములను వెదజల్లెను. వానరులు తమకు ఇష్టమైన వాటిని తీసికొనిరి. మణులను తినదగిన పదార్థములుగా భావించి, వాటిని తమ నోటనుంచుకొనిరి. నిజమును గ్రహించి, ఉమిసిరి. ఈ లీలావినోదములనుజూచి, సీతారామ లక్ష్మణులు ఆనందించిరి. (చౌ॥ 1-4)

మునీశ్వరులు తమ ధ్యానములద్వారాకూడా శ్రీరాముని దర్శింపజాలరు. వేదములు ఆయనను 'నేతి నేతి' అని వర్ణించినవి. అట్టి కృపానిధియైన పరమాత్మ వానరులతో పలువిధముల వినోదములను గావించెను. (శివుడు పలుకుచున్నాడు) ఉమా! నిర్మలభక్తితో లభించు శ్రీరాముని కృప నానావిధములైన యోగజపదాన తపోయజ్ఞవ్రత నియమములచేతను లభింపదు. (దో॥ 117 క,ఖ)

భల్లూకవానరులు వస్త్రములను, ఆభరణములను దీసికొని, వాటిని ధరించి, శ్రీరఘునాథునికడకు వచ్చిరి. అనేకజాతుల వానరులను జూచి, కోసలపతి శ్రీరాముడు మాటిమాటికి నవ్వుకొనెను. శ్రీరఘునాథుడు తనకృపాదృష్టిని

అందఱిపై ప్రసరింపజేసి, మృదుమధురస్వరముతో ఇట్లనెను. "సోదరులారా! మీ బల పరాక్రమములవలననే నేను రావణుని వధించి, విభీషణుని రాజును గావించితిని. ఇప్పుడు మీరు మీ గృహములకు చేరుడు. అక్కడనన్ను స్మరింపుడు. ఎవ్వరికిని భయపడవలదు." ఈ మాటలను వినినంతనే వానరులు ప్రేమ విహ్వలురై, చేతులు జోడించి, సాదరముగా పలికిరి. "ప్రభూ! మీరేమిచెప్పినను అది మీకే తగును. కాని మీ మాటలను విని, మేము మోహవశులమైతిమి. శ్రీరఘునాథా! మీరు ముల్లోకములకును ప్రభువులు, వానరులమైన మమ్ము దీనులనుగా ఎఱింగి, మాకు మీ అండదండలను సమకూర్చితిరి. ప్రభువచనములను విని, మేము సిగ్గుపడుచున్నాము. ఎప్పుడైనను దోమలు గరుడునకు సహాయపడగలవా?" శ్రీరాముని ముఖ కమలమును జూచి భల్లూక వానరులు ప్రేమవిహ్వలురైరి. తమ ఇండ్లకు వెళ్లుటకు వారికి ఏ మాత్రము ఇష్టములేదు. (చౌ॥ 1-5)

కాని ప్రభునాజ్ఞను శిరసావహించి, భల్లూక వానరులు శ్రీరాముని రూపమును తమ హృదయములలో నిలుపుకొని, అనేకవిధముల ప్రార్థించి, హర్షవిషాదములతో తమతమ నివాసములకు జనిరి. వానరరాజు సుగ్రీవుడు, నలుడు, నీలుడు, భల్లూకరాజు జాంబవంతుడు, అంగదుడు, హనుమంతుడు, విభీషణుడు, మహాబలశాలురైన ఇతరసేనాపతులు ఏమియు చెప్పలేక మిన్నకుండిరి. ప్రేమ వశమున కన్నులలో నీరు నిండగా ఱెప్పలార్పక శ్రీరాముని తదేక దృష్టితో చూచుచుండిరి. (దో॥ 118 క,ఖ,గ)

శ్రీ రఘునాథుడు వారిగాఢప్రేమను జూచి, వారందఱిని విమానములో కూర్చుండుడనెను. సీతాలక్ష్మణులతో తానును ఆ విమానమున ఆసీనుడయ్యెను. తదనంతరము మనస్సులోనే బ్రాహ్మణులకు నమస్కరించి, ఉత్తరదిశగా వెళ్లుటకు విమానమునకు ఆజ్ఞనిచ్చెను. పుష్పకవిమానము మిక్కిలి కోలాహలముతో చూడముచ్చట గొల్పుచు బయలుదేఱగానే అందఱును 'శ్రీరఘువీరునకు జయము, జయము' అని నినాదములను గావించిరి. విమానములో ఒక ఎత్తైన మనోహరసింహాసనముపై సీతాదేవితోగూడి, శ్రీరామచంద్రుడు విరాజిల్లుచుండెను. పత్నీసమేతుడైన శ్రీరాముడు సుమేరుపర్వతముపై విద్యుల్లతతో గూడిన మేఘమువలె శోభిల్లెను. ఆ సుందరవిమానము అతివేగముగా వెళ్లుచుండెను. దేవతలు ప్రసన్నులై పూలను వర్షించిరి. శీతలమందసుగంధపవనములు ఆహ్లాదకరముగా వీవసాగెను. సముద్రనదీతటాకముల జలములు నిర్మలములాయెను. నలుదెసల శుభశకునములు పొడసూపెను. అందఱి మనస్సులు ప్రసన్నములాయెను. ఆకాశము, దిక్కులు స్వచ్ఛములై విలసిల్లుచుండెను. శ్రీరఘునాథుడు ఇట్లనెను. "ఓ సీతా! ఈరణభూమిని చూడుము. ఇంద్రుని జయించిన మేఘనాదుడు ఇచ్చట లక్ష్మణునిచే సంహరింపబడెను. హనుమంతునిచే, అంగదునిచే హతులైన నిశాచరవీరులు ఈ యుద్ధభూమిలో నేలపాలైరి. దేవతలను, మునులను బాధించు రావణ కుంభకర్ణులు ఇచటనే హతులైరి. (చౌ॥ 1-6)

"నేనిచట వారధిని నిర్మించితిని. సుఖధాముడైన పరమేశ్వరుని ఇచటనే ప్రతిష్ఠించితిని." ఇట్లు పలికి కృపానిధి శ్రీరాముడు సీతాసమేతుడై మహదేవుడైన శ్రీరామేశ్వరునకు ప్రణమిల్లెను. కృపానిధియైన శ్రీరాముడు వనములలో తాను నివసించిన ప్రదేశములను, విశ్రమించిన స్థలములను సీతాదేవికి చూపించుచు, వాటిపేర్లను గూడ తెలిపెను.

(దో॥ 119 క,ఖ)

పుష్పకవిమానము త్వరగా అగస్త్యాదిమునులు నివసించు దండకారణ్యమునకు జేరెను. శ్రీరాముడు ఆయాస్థానాములయందు ఋషీశ్వరుల ఆశీర్వాదములను స్వీకరించి, చిత్రకూటమును జేరెను. అచట మునీశ్వరులను ప్రసన్నులనుగావించెను. పిమ్మట, విమానమును వేగముగా ముందునకు పోనిచ్చెను. అనంతరము శ్రీ సీతారాములు కలియుగ పాపములను కడిగివేయు యమునానదిని దర్శించిరి. తదుపరి పవిత్రగంగానదిని దర్శించి, శ్రీరాముడు "సీతా! ఈమెకు నమస్కరింపుము దర్శనమాత్రమున అనేక జన్మలసంచితపాపములనుగూడ ప్రక్షాళనచేయు తీర్థరాజమైన ప్రయాగను తిలకింపుము. శోకములను హరించునదియు, శ్రీహరిపదమునకు

సోపానమైనదియుఐన త్రివేణీసంగమమును దర్శింపుము. పిమ్మట తాపత్రయములను, భవరోగములను రూపు మాపునట్టి పవిత్ర-అయోధ్యానగరము అదిగో! కనబడుచున్నది, తిలకింపుము. (చౌ॥ 1-5)

కృపాళువైన శ్రీరామచంద్రుడును, సీతాదేవియు అయోధ్యానగరమునకు నమస్కరించిరి. వారి నేత్రములు ఆనందాశ్రుపూర్ణములయ్యెను. శరీరములు పులకితములయ్యెను. వారు పదేపదే మిగుల హర్షోల్లాసములను ప్రకటించిరి. త్రివేణీసంగమమున ప్రభువు వానరములతోసహా స్నానములనాచరించెను. బ్రాహ్మణులకు అనేకదానములను ఒనర్చెను. (దో॥ 120. క,ఖ)

శ్రీరామచంద్రుడు హనుమంతుని ఇట్లాదేశించెను. "నీవు బ్రహ్మచారివేషమున అయోధ్యానగరమునకు వెళ్లుము. అచ్చట భరతునకు మా క్షేమములను దెలిపి, అతని క్షేమసమాచారములను తెలిసికొనిరమ్ము." వెంటనే పవనసుతుడు అయోధ్యకు బయలుదేఱెను. ప్రభువు భరద్వాజమహర్షికడకు వెళ్లెను. మహర్షి నిండుమనస్సుతో ప్రభువును అనేకవిధముల పూజించి, స్తుతించి, ఆశీర్వదించెను. శ్రీరామచంద్రప్రభువు భరద్వాజమునికి పాదాభివందనములనాచరించి, ఆయనను వీడ్కొని విమానమునెక్కి, ముందునకు సాగెను. ఇక్కడ నిషాదరాజు ప్రభుని ఆగమన వార్తనువిని " నావ ఎక్కడ? నావ ఎక్కడ?" అనియనుచు తన వారిని పిలిచెను. ఇంతలో విమానము గంగానదిని దాటి ఆ నదీతీరమున దిగెను. సీతాదేవి గంగాదేవిని అనేకవిధముల పూజించి, ఆమె పాదములపై వ్రాలెను. ప్రసన్నమనస్కురాలైన గంగానది "ఓ సుందరీ! నీ సౌభాగ్యము శాశ్వతముగుగాక" అని ఆశీస్సులను పలికెను. నిషాదరాజైన గుహుడు భగవంతుడు నదీతీరమునకు చేరినాడని విని, ప్రేమపరవశుడై, పరుగెత్తుకొని వచ్చి, ప్రభువును సమీపించి, పరమానందభరితుడయ్యెను. జానకీసమేతుడైన శ్రీరామునిజూచి గుహుడు ఆనందాతిరేకముతో భూమిపై సాగిలపడెను. అతనికి శరీరముపై ధ్యాసయేలేదు. శ్రీరఘునాథుడు అతనిప్రేమపారవశ్యమునుగాంచి లేవనెత్తి, ప్రసన్నత్వముతో హృదయమునకు హత్తుకొనెను. (చౌ॥ 1-6)

విజ్ఞాన శిరోమణియు, లక్ష్మీపతియు, కృపానిధానమునైన శ్రీరామచంద్రుడు నిషాదరాజును అక్కునజేర్చుకొని, తన ప్రక్కనే కూర్చుండ బెట్టుకొని, కుశల సమాచారములను అడిగెను. గుహుడు ఇట్లు విన్నవించెను. " ఓ ప్రభూ! బ్రహ్మ పరమేశ్వరులచే సేవింపబడు మీచరణ కమలములదర్శనముచే నేనిప్పుడు కుశలిని. ఓ సుఖధామా! పూర్ణకామా! శ్రీరామా! మీకు నమస్కారములు". అనేక విధముల అతిసామాన్యుడైన నిషాదుని శ్రీరామచంద్రప్రభువు తనసోదరుడైన భరతునివలె అక్కునజేర్చుకొనెను. తులసీదాసు చెప్పుచున్నాడు. "మందబుద్ధినైన నేను మోహవశమున అట్టి కరుణామూర్తియైన స్వామిని మఱచితిని. రావణశత్రువైన శ్రీరాముని యొక్క ఈ పవిత్రచరిత్రము సర్వదా శ్రీరాముని చరణములపై అనురాగమును కల్గించును. ఇది కామాది- అంతశ్శత్రువులను నాశనమొనరించును. భగవత్స్వరూపజ్ఞానమును గూర్చును. దేవతలు, సిద్ధులు, మునులు, దీనిని ఆనందముతో గానము చేయుదురు. (ఛం॥ 1,2)

శ్రీరఘువీరుని సమరవిజయగాథను వినునట్టి సజ్జనులకును, భగవంతుడు శాశ్వతముగా సంపదలను, జయమును, వివేకమును అనుగ్రహించును. ఓ మనసా! ఆలోచింపుము. ఈ కలియుగము. పాపముల పుట్ట. ఇందు శ్రీ రఘునాథుని నామస్మరణము తప్ప జీవులకు వేఱొక తరణోపాయమేలేదు. (దో॥ 121 క,ఖ)

(మాసపారాయణము-ఇఱువది యేడవ విరామము)

కలియుగ సమస్త పాపములను నాశనమొనరించు
శ్రీరామచరితమానసము నందలి ఆఱవ సోపానము సమాప్తము.

- లంకాకాండము సమాప్తము -

శ్రీ రామచరిత మానసము

సప్తమ సోపానము - ఉత్తరకాండము

భగవన్నుతి

పుష్పక విమానమును అధిరోహించి యున్నవాడును, రఘువంశశిరోమణియు, జానకీ నాథుడునగు శ్రీరామచంద్రప్రభువునకు నిరంతరము నమస్కరించుచుందును. ఆ మహితాత్ముడు మయూరకంఠశోభాసదృశమైన హరితనీలవర్ణుడు, దేవతలలో శ్రేష్ఠుడు, బ్రాహ్మణోత్తముడైన భృగుమహర్షి యొక్క పాదపద్మముల చిహ్నములు హృదయమున విలసిల్లు వాడు, శోభాసంపన్నుడు, పీతాంబరధారి, కమలనయనుడు, చేతులయందు ధనుర్బాణములను ధరించియున్నవాడు, వానరసమూహములతో ఒప్పుచున్నవాడు, సహోదరుడైన లక్ష్మణస్వామిచే సేవింపబడుచున్నవాడు, స్తుతింపదగిన వాడు. అంతేగాదు అతడు సర్వకాలములయందును నిరంతరము చిఱునవ్వులను చిందించుచు ప్రసన్నుడై యుండెడి జగత్ప్రభువు. (1)

కోసలేంద్రుడైన శ్రీరామచంద్రప్రభు పాదపద్మములు మిక్కిలి మనోహరములు, అతి సుకుమారములు, బ్రహ్మ పరమశివులచే సర్వదా సేవింపబడుచుండునవి. జానకీదేవి యొక్క సుతిమెత్తనికరకమలములచే నిరంతరము లాలింపబడుచుండునవి. స్మరించువారిమనస్సులనెడి తుమ్మెదలకు ఆశ్రయములైనవి. మహామహిమోపేతములైన ఆ ప్రభుచరణకమలములు నా మనోభృంగమునకును ఆశ్రయమిచ్చుగాక. (2)

కామ వికారములనుండి ముక్తిని ప్రసాదించు (అరిషడ్వర్గములను పాఱద్రోలి ముక్తిని అనుగ్రహించు) నట్టి ఆ పరమశివునకు నమస్కరించుచున్నాను. అతడు మల్లెపూవులు, చంద్రుడు, శంఖమువలె శ్వేతవర్ణ శోభితుడు, జగజ్జనని పార్వతీదేవికి స్వామి, భక్తుల కోరికలను సిద్ధింప జేయువాడు. మనోహరమైన కమలనయనశోభితుడు, అంతేగాదు దీనులను, దుఃఖితులను కనికరముతో కాపాడు కారుణ్యమూర్తి. (3)

అయోధ్యలో శ్రీరామభరత సమాగమము

శ్రీరామచంద్రుడు అయోధ్యకు తిరిగి వచ్చుటకు ఒక్కదినము మాత్రమే వ్యవధియుండెను. కావున నగరప్రజలు ఆ ప్రభుదర్శనమునకై ఆతురతతో ఎదురుచూచుచుండిరి. శ్రీరాముని వియోగముచే స్త్రీ పురుషులందఱును వసివాడి యుండిరి. "శ్రీరాముడింకను ఏల తిరిగి రాలేదు?" అని తమలో తాము చర్చించుకొనుచుండిరి. అంతలోనే శుభ శకునములాయెను. నగరప్రజలు ప్రసన్నులైరి. ప్రభువు యొక్క ఆగమనమును సూచించుచున్నవా? అనునట్లు నగరము నాలుగు వైపుల శోభలు విరజిమ్ముచుండెను. శ్రీరామచంద్ర ప్రభువు సీతాలక్ష్మణ సమేతుడై వచ్చుచున్నాడని ఎవరో తెలుపుచున్నట్లు కౌసల్యాది రాజమాతలు మానసోల్లాసములను పొందిరి. భరతునకు కుడి భుజము, కుడి కన్ను అదరెను. అది శుభశకునముగా భావించి, అతడు మనస్సులో మిక్కిలి సంతసించెను. కాని వెంటనే అతడిట్లు తలంపసాగెను. (దోహా)

"నా ప్రాణములకు ఆధారమైన వ్యవధి ఒక్కదినము మాత్రమే మిగిలియున్నది" ఇట్లు ఆలోచించుచుండగనే భరతునిమనస్సు మిక్కిలి దుఃఖాక్రాంతమయ్యెను. "స్వామి ఇంకను రాకుండుటకుగల కారణమేమి? నన్ను కుటిలునిగా భావించి మఱచిపోయెనా? శ్రీరాముని చరణకమలములనాశ్రయించుకొనియున్న లక్ష్మణుడు ఎంత

ధన్యుడు? ఆహా! ఎంత భాగ్యశాలి? ప్రభువు నన్ను కపటిగాను, కుటిలునిగాను భావించి యుండవచ్చును. అందువలననే అతడు నన్ను తనతో పాటు తీసికొని పోలేదు. నా కృత్యములను ఆయన తనమనస్సులో పెట్టుకొన్నచో ఎన్ని కల్పములవఱకైనను నాకు నిష్కృతి యుండదు. కాని ప్రభువు తనసేవకులదోషములను ఎన్నడును లెక్కింపడు. అతడు దీనజనబంధువు. ఆయన స్వభావము అతి కోమలము. శ్రీరామచంద్ర ప్రభువు తప్పకరాగలడని నా మనస్సు విశ్వసించుచున్నది. ఏలనన అన్నియు శుభశకునములే యగుచున్నవి. కాని గడువు ముగిసినపిమ్మటగూడ నేను ప్రాణములతో మిగిలి యున్నచో నా వంటి అధముడెవ్వడును ఉండడు, ఉండబోడు. (చౌపాఈ॥ 1-4)

భరతునిమనస్సు శ్రీరామునివిరహసముద్రమున మునిగిపోవుచుండగా రక్షించుటకు వచ్చిన ఓడవలె హనుమంతుడు బ్రాహ్మణవేషముతో వచ్చెను. దుర్బలశరీరుడై జటామకుటధారియై నిరంతరము 'రామరామ' అని జపించుచు అశ్రువులను గార్చుచు కుశాసనముపై కూర్చున్న భరతుని ఆంజనేయుడు చూచెను. (దో॥ 1. క,ఖ)

భరతుని జూడగనే హనుమంతుడు అమితానందమునొందెను. శరీరము పులకితమయ్యెను. కన్నుల ప్రేమాశ్రువులు స్రవింపసాగెను. మనస్సు ఆనందమగ్నము కాగా అతడు వీనులవిందు గావించుచు మధురవచనములను పలికెను. "శ్రీరామచంద్రుని వియోగములో మీరు రాత్రింబవళ్ళు చింతాక్రాంతులైయున్నారు. ఆయనమహోన్నతగుణములనే మీరు సంతతము స్మరించుచున్నారు. ఆ మహానుభావుడు భక్తులకు సుఖప్రదుడు, దేవతలకును మునులకును రక్షకుడు, అట్టి రఘువంశశిరోమణి అదిగో! క్షేమముగా రానే వచ్చినాడు. యుద్ధమున శత్రువులను పరిమార్చి, సీతాలక్ష్మణసమేతుడై ఆప్రభువు నగరమునకు విచ్చేయుచున్నాడు. ఆయనపవిత్రకీర్తిని దేవతలు గానముచేయుచున్నారు." ఈ మాటలను, వినగానే దప్పిగొన్నవాడు అమృతము లభింపగా దాహార్తిని మఱచినట్లు భరతుడు తనదుఃఖమునంతయును మఱచి, ఇట్లు పలికెను. "ఓ మహాత్మా! మీరు ఎవరు? ఎక్కడనుండి వచ్చుచున్నారు? అమృత ప్రాయములైన వచనములను నాకు వినిపించితిరి." మారుతి ప్రత్యుత్తరమును ఇచ్చెను. "కృపానిధీ! నేను పవన పుత్రుడను, వానరుడును, నాపేరు హనుమంతుడు. దీనబంధువైన శ్రీరామునకు నేను దాసుడను." ఇది వినగానే భరతుడు లేచి, సాదరముగా హనుమంతుని కౌగిలించుకొనెను. అగాఢాలింగనమున హృదయమున ప్రేమ ఉప్పొంగెను, ఆనందాశ్రువులను స్రవింపజేసెను. గాత్రము పులకితమయ్యెను. భరతుడు నుడివెను. "ఆంజనేయా! నీ దర్శనమాత్రమున నా దుఃఖములన్నియును దూరములైనవి. ఏలనన నీ పలుకులుద్వారా నా రాముని చూచినట్లైనది." మాటి మాటికిని కుశలములను అడుగుచు భరతుడు "సోదరా! శుభవార్తను వినిపించి, నీవొర్చిన ఈ యుపకారమునకు మాఱుగా నీకు నేను ఏమీయగలను? ఆలోచించి చూడగా ఈ సందేశముతో సరితూగగలవస్తువు ఈ జగత్తులోనే లేదని తోచుచున్నది. కావున ఎట్టిపరిస్థితిలోను నేను ఋణవిముక్తుడను కాలేను. ఇప్పుడు ప్రభువుచరితమును వినిపింపుము." అని పలికెను. అపుడు హనుమంతుడు భరతునిచరణములకు ప్రణమిల్లి, రఘుపతియైన శ్రీరాముని గుణ గాథనంతయును వినిపించెను. భరతుడు అడిగెను. "వాయుసుతా! దయాళువైన శ్రీరాముడు ఎప్పుడైనను నన్ను తనసేవకునిగా జ్ఞాపకము ఉంచుకొనెనా? (చౌ॥ 1-8)

రఘుకులభూషణుడైన శ్రీరాముడు ఎన్నడైనను నన్ను తనదాసునివలె తలచుకొనెనా?" భరతుని వినమ్రవచనములను విని, హనుమంతుడు పులకితగాత్రుడై ఆయనపాదములపై బడెను. మనస్సున అతడు ఇట్లనుకొనెను. "చరాచర జగత్తునకు స్వామియైన శ్రీ రఘునాథుడు భరతునిగుణసమూహములనే నిరంతరము వర్ణించుచుండును. అట్టి భరతుడు వినయమునకును, పరమపవిత్రసద్గుణములకును నిలయుడేలకాకుండును? (ఛంద్)

హనుమంతుడు పలికెను. "ప్రభూ! శ్రీరామునకు మీరు బహిఃప్రాణము. నా పలుకులు నిజము." ఇది వినగానే భరతుడు ఆయనను పదే పదే కౌగిలించుకొనుచు పట్టలేని ఆనందమును అనుభవించెను. (దో॥ 2. క)

భరతునిచరణములకు ప్రణమిల్లి, హనుమంతుడు వెంటనే శ్రీరామునియొద్దకు వచ్చి, ఆయనకు భరతుని క్షేమ సమాచారములను దెలిపెను. అప్పుడు శ్రీరామచంద్రప్రభువు ప్రసన్నుడై, విమానమునధిరోహించి, అయోధ్యకు బయలుదేతెను. (సోరఠ॥ 2. ఖ.)

భరతుడానందముతో (నందిగ్రామమునుండి) అయోధ్యానగరమునకు వచ్చి, విషయములను గురువుగారికి వినిపించెను. శ్రీ రఘురాముడు క్షేమముగా నగరమునకు వచ్చుచున్నాడని రాజ భవనములోని వారందఱికిని తెల్పెను. ఈ విషయము చెవులబడినంతటనే రాజమాతలు లేచి, ఆనందముతో ఉప్పొంగిపోవుచు పరుగుపరుగున భరతునికడకు వచ్చిరి. భరతుడు ప్రభువు యొక్క కుశలములను తెలిపి, వారిని తృప్తిపఱచెను. నగరవాసులును ఈ సంతోషవార్తను వినినంతనే హర్షోల్లాసములతో పరుగులుదీయుచు అచటికి వచ్చిరి. సౌభాగ్యవతులైన స్త్రీలు శ్రీరామునకు స్వాగతమును పలుకుటకై పెఱుగు, గరికెలు, గోరోజనము, పండ్లు, పూలు, పవిత్రములైన తులసీదళములు మొదలగు మంగళద్రవ్యములను బంగారుపళ్లెరములలో దీసికొని, మంగళగీతములను గానముచేయుచు ఉన్నవారున్నట్లే బయలు దేఱిరి. ఆవేగవశమున పిల్లలను, వృద్ధులనుగూడ తమవెంట తీసికొనిపోవుట మఱచిపోయిరి. "సోదరా! నీవు కృపాళువైన శ్రీరఘునాథుని చూచితివా?" అని ఒకరినొకరు అడుగుచుండిరి. ప్రభువుయొక్క ఆగమన వార్తను విని, అయోధ్యానగరము సకలసౌందర్యనిధియయ్యెను. సరయూనదీ జలములు నిర్మలములాయెను. శీతలమందసుగంధపవనములు వీవసాగెను. (చౌ॥ 1-5)

గురువైన వసిష్ఠుడు, ఆత్మీయులైన కుటుంబసభ్యులు, తమ్ముడైన శత్రుఘ్నుడు, బ్రాహ్మణ సమూహములు వెంటరాగా భరతుడు మిక్కిలి ప్రసన్నహృదయుడై కృపాధాముడైన శ్రీరామునకు స్వాగతమిచ్చుటకు భక్తిపరిపూర్ణుడై బయలుదేఱెను. స్త్రీలు మేడలమీద, మిద్దెలపైన చేరి, విమానమునకై ఆకసము వైపు నిరీక్షించుచుండిరి. ఇంతలో ఆ విమానము రానేవచ్చెను. దానిని చూడగానే వారు ఆనందపరవశులై మధురస్వరములతో మంగళగీతములను పాడిరి. పూర్ణ చంద్ర దర్శనమున సముద్రమువలె శ్రీరఘుపతిని గాంచిన అయోధ్యా నగరము కోలాహలముతో ఉప్పొంగిపోయెను. ఇటునటు పరుగిడుచున్న స్త్రీలు ఆ సముద్రపుటలలవలె విలసిల్లిరి. (దో॥ 3. క,ఖ,గ)

విమానములో ఆసీనుడైయున్న సూర్యవంశభూషణుడైన శ్రీరాముడు వానరులకు మనోహరమైన అయోధ్యానగరమును చూపించుచుండెను. "ఓ సుగ్రీవా! అంగదా! లంకాపతి విభీషణా! వినుడు. ఈ ఆయోధ్యానగరము అతిపవిత్రమైనది. ఈ దేశము అతిసౌభాగ్యవంతమైనది. అందఱును వైకుంఠమును పొగడెదరు. అది వేదపురాణప్రసిద్ధము, జగద్విదితము. కాని నాకుమాత్రము వైకుంఠముకంటెను అయోధ్యానగరమే మిగులప్రీతిపాత్రము. ఈ రహస్యమును కొద్ది మంది మాత్రమే యెఱుంగుదురు. ఈ సుందరనగరము నా జన్మభూమి. దీనికి ఉత్తరమున పవిత్ర సరయూనది ప్రవహించును. దీనియందు స్నానములనాచరించువారు అనాయసముగా నన్ను సమీపింతురు. (సామీప్యముక్తిని పొందెదరు.) అయోధ్యావాసులు నాకు అత్యంతప్రియులు. ఈ పురము సర్వసుఖములకును కాణాచి. ఇది నా పరమపదమును ప్రాప్తింపజేయును." ప్రభు వచనములను విని, వానరులు ప్రసన్నచిత్తులైరి. శ్రీరామచంద్రప్రభువుయొక్క ప్రశంసలకు నోచుకొనిన ఈ అయోధ్యానగరము మిక్కిలి ధన్యమైనది" అనిరి. (చౌ॥ 1-4)

ప్రజలందఱును తనను దర్శించుటకై పరుగెత్తుచు వచ్చుచుండుటను జూచి, కృపాసింధువైన శ్రీరామచంద్రప్రభువు నగరసమీపమున క్రిందికి దిగవలసినదిగా విమానమునాదేశించెను. అప్పుడది భూమిపైన దిగెను. అందఱును విమానమునుండి దిగినపిదప "నీవు కుబేరుని కడకు వెళ్లుము" అని పుష్పకమును ఆదేశించెను. శ్రీరాముని ఆజ్ఞమేరకు అది అలకాపురి దిశగా బయలు దేఱెను. తనయజమానికడకువెళ్లుచున్నాననుసంతోషము, శ్రీరాముని వీడి వెళ్లుచున్నందులకు విరహవేదన కలుగగా అది తిన్నగా ముందునకు సాగెను. (దో॥ 4. క,ఖ)

ప్రజలందఱును భరతుని అనుసరించి వచ్చిరి. శ్రీ రఘువీరునియెడబాటుచే వారిదేహములు కృశించియుండెను. వామదేవుడు, వసిష్ఠుడు మొదలగు మునీశ్వరులను జూచి, ప్రభువు ధనుర్బాణములను నేలపై నుంచి, సోదరుడైన లక్ష్మణునితోగూడి పరుగిడుచు వెళ్ళి, గురువుగారి పాదపద్మములకు ప్రణమిల్లెను. వారిదేహములు అణువణువునను రోమాంచితమయ్యెను. ముని శ్రేష్ఠుడైన వసిష్ఠుడు వారిని ఆలింగనము చేసికొని, కుశలమడిగెను. "మీ కృపవలన మేము క్షేమమే" అని ప్రభువు పలికెను. ధర్మధురంధరుడైన రఘుకులస్వామి బ్రాహ్మణులనందఱిని కలిసి, వారికెల్లరకును ప్రణమిల్లెను. దేవతలు మునులు బ్రహ్మరుద్రాదులు సేవించు ప్రభుపాదములకు భరతుడు ప్రణమిల్లెను. పాదములపై వ్రాలియున్న భరతుడు ఎంత లేపినను లేవలేదు. అపుడు కృపానిధియైన శ్రీరాముడు బలవంతముగా అతనిని లేవనెత్తి తన హృదయమునకు హత్తుకొనెను. అతనిశ్యామలశరీరము పులకితమయ్యెను. నవనీరజసమమైన నేత్రములయందు ఆనందాశ్రువులు నిండెను. (చౌ॥ 1-4)

కమలములవంటి కన్నులనుండి ప్రేమాశ్రువులు ప్రవహింపసాగెను. శరీరము పులకించెను. ముల్లోకములకును స్వామియైన శ్రీరామచంద్రప్రభువు తమ్ముడగు భరతుని అత్యంత ప్రేమతో హృదయమునకు హత్తుకొనెను. సోదరునితో కలియుసమయమున ఆ ప్రభుశోభను వర్ణించుట నాతరము గాదు. ప్రేమవాత్సల్యములు ఆకృతిదాల్చినట్లుండెను. దయానిధియైన స్వామి భరతుని కుశల ప్రశ్నలడిగెను. కాని ఆనంద పారవశ్యముచే భరతుని నోట మాటరాలేదు. (శివుడు పల్కుచున్నాడు) పార్వతీ! వినుము. భరతుని సుఖము మనోవాక్కులకు అతీతము. అది అనుభవైక వేద్యము. భరతుడు పలికెను. "కోసలాధీశా! నన్ను ఆర్తునిగా గుర్తించి, దర్శన మొసంగినారు. కావున నేను ఇప్పుడుకుశలినే. విరహసముద్రములో మునిగిపోవుచున్న నన్ను కృపాళువులై చేయూత నిచ్చి కాపాడితిరి. (ఛం॥ 1-2)

పిమ్మట శ్రీరామచంద్ర ప్రభువు ప్రసన్నతతో శత్రుఘ్నుని అక్కున జేర్చుకొనెను. లక్ష్మణుడును, భరతుడును అత్యంత ప్రేమతో పరస్పరము ఆలింగనమొనర్చుకొనిరి. (దో॥ 5)

పిదప లక్ష్మణుడు శత్రుఘ్నుని కౌగిలించుకొని వియోగజనితమైన దుస్సహదుఃఖమును దూరమొనర్చెను. అనంతరము భరతశత్రుఘ్నులు సీతాదేవిచరణములకు ప్రణమిల్లి, పరమానంద భరితులైరి. శ్రీరామచంద్ర ప్రభువును గాంచి, అయోధ్యావాసులు ఆనందజలధిలో ఓలలాడిరి. వారివిరహజనితదుఃఖము మటుమాయమయ్యెను. ప్రేమ విహ్వలురైన వారిని జూచి దయాళువైన శ్రీరాముడు ఒక లీలనుప్రదర్శించెను. ఒకే సమయమున ప్రభువు అనేక రూపములలో ప్రకటితుడై ప్రతివ్యక్తికిని ఒకేసమయమున వారివారి యోగ్యతలకు అనుగుణముగ దర్శనమిచ్చెను. శ్రీరఘువీరుని దయాదృష్టిచే స్త్రీపురుషులందఱును శోకరహితులైరి. ఒక్క క్షణముననే భగవంతుడు అందఱిని ఆనందింప చేసెను. ఉమా! ప్రతి యొక్కరును 'ప్రభువు మొట్ట మొదట తననే కలిసికొన్నాడు' అని భావించిరి. ఎవ్వరును ఈ లీలా రహస్యమును ఎఱుగరు. శీల గుణనిధానమైన శ్రీరామచంద్రుడు ఈ విధముగా సుఖసంతోషములను పంచియిచ్చి, ముందుకు నడిచెను. ఇంతలో కౌసల్యాది రాజమాతలు ప్రభువును జూచి, తమ వత్సములకై పరుగెత్తు గోవులవలె త్వరపడుచు వచ్చిరి. (చౌ॥ 1-5)

నూతనముగా ప్రసవించినగోవులు దూడలను ఇంటికడనే వదలి, మనస్సులు వాటిపైననే ఉన్నను, వనమున గడ్డిమేసి, సాయంసమయమున దూడలను చేరుటకు తహతహ పడుచుండును. అప్పుడు వాటి పొదుగులయందు పాలుగారుచుండగా 'అంబా' అని అఱచుచు ఆవులు పరుగులుదీయుచు వచ్చునట్లు రాజమాతలు వారికడకు వచ్చిరి. ప్రభువు అత్యంత ప్రేమానురాగములతో తల్లులనందఱిని కలిసి, అనేకవిధముల మృదుమధుర వచనములను పలికెను. వియోగముచే ఉత్పన్నమైన భయానకవిపత్తు దూరమై, వారికి అపార సుఖసంతోషములు ప్రాప్తించెను. (ఛం)

శ్రీరామునిచరణములకే అంకితమైన లక్ష్మణుని సుమిత్రాదేవి అక్కున జేర్చుకొనెను. కైకేయి మనస్సుమాత్రము శ్రీరాముని కలియునపుడు మిక్కిలి సంకోచమునకు లోనయ్యెను. లక్ష్మణుడు తల్లులందఱికిని ప్రణమిల్లి, వారి ఆశీస్సులను పొంది, ఆనందించెను. అతడు కైకేయితో మాటిమాటికి కలిసినను ఆమెమానసిక క్షోభ(పరితాపము) మాత్రము తొలగలేదు. (దో॥ 6. క,ఖ)

జానకీదేవి తనఅత్తలనందఱిని కలిసి, అమితానందముతో వారిపాదములకు అభివాదము చేసెను. వారు ఆమెకుశమములనడిగి "నిత్య సుమంగళీ భవ" అని ఆశీర్వదించిరి. తల్లులందఱును శ్రీరఘునాథుని ముఖకమలమును జూచుచుండిరి. అది శుభసమయమని తెలిసికొని, అశ్రువులను అపుకొనుచుండిరి. బంగారు పళ్లెములలో హారతులెత్తిరి. మాటిమాటికిని ప్రభుదివ్య మంగళవిగ్రహమును తనవితీర దర్శించుచుండిరి. వారు ప్రభువునకు అనేకవిధముల కాన్కలను సమర్పించిరి. హృదయములు పరమానందభరితములయ్యెను. కౌసల్యాదేవి దయాసాగరుడు, రణధీరుడు ఐన రఘువీరుని పదేపదే కన్నులార చూచుచుండెను. నాకుమారులిద్దఱును అత్యంత సుకుమారులు. ఆ రాక్షసులు మిక్కిలి పరాక్రమశాలురు, యోధులు. వారిని, ఆ దుష్ట రావణుని వీరు ఎట్లు వధించియుండ వచ్చును?" అని ఆమె ఆలోచించుచుండెను. (చౌ॥ 1-4)

సీతాలక్ష్మణసహితుడైన శ్రీరామచంద్రుని గాంచుచు, కౌసల్యాదేవి ఆనందడోలికలలో ఊగి పోయెను. ఆమెతనువు మాటిమాటికిని పులకాంకితమయ్యెను. (దో॥ 7)

లంకాపతి విభీషణుడు, వానరరాజు సుగ్రీవుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు, అంగదుడు, హనుమంతుడు, మొదలగు ప్రముఖవానరోత్తములందఱును సుందర మానవాకృతులను ధరించిరి. వారందఱును భరతునిస్నేహసౌశీల్యస్వభావములను, అతని వ్రతనియమదీక్షాపటిమలను మిక్కిలి ప్రేమాదరములతో కొనియాడిరి. నగరవాసులప్రేమ వినయశీలములు చూచి, ప్రభువునెడ వారికిగల భక్తి విశ్వాసములను మెచ్చుకొనిరి. పిదప శ్రీ రఘునాథుడు తన మిత్రులందఱిని పిలిచి, "వసిష్ఠ మునీశ్వరుని చరణములకు నమస్కరింపుడని సూచించుచు, వీరు మనకులగురువులు, పూజ్యులు, వీరికృపచేతనే యుద్ధములో రాక్షసులు హతులైరి."- అని పలికెను. "మునీశ్వరా! వీరందఱును నా మిత్రులు. సంగ్రామసాగరమునుండి గట్టెక్కుటకు వీరు నాకు ఓడలవలె తోడ్పడిరి. నాహితముకొఱకు వారు తమ ప్రాణములను సైతము పణముగా పెట్టిరి. వీరు నాకు భరతునికంటెను ఎక్కువగా ప్రీతి పాత్రులు" అని పలికెను. ప్రభువచనములను విని, వారందఱును భక్తిపరవశులైరి. ఈ విధముగా వారు అనుక్షణము నూతనసుఖములను అనుభవించిరి. (చౌ॥ 1-5)

పిమ్మట ఆ వానరులు కౌసల్యాదేవి చరణములకు ప్రణమిల్లిరి. ఆమె ప్రసన్నురాలై, ఆశీర్వదించి, 'మీరందరును నాకు రఘునాథునితో సమానముగా ప్రియమైనవారు" అని పలికెను. ఆనంద కందుడగు శ్రీరఘునాథుడు తనభవనమునకు పోవునపుడు ఆకాశము పుష్పవృష్టిచే నిండి పోయెను. నగరవాసులు మేడలపై నుండి, మిద్దెల మీద నుండి ప్రభువును దర్శించుచుండిరి. (దో॥ 8. క,ఖ)

వారు స్వర్ణకలశములను చిత్రవిచిత్రములుగా అలంకరించి, తమతమ గుమ్మములయందుంచిరి. మంగళతోరణములతో ధ్వజపతాకములతో గృహములను అలంకరించిరి. వీధులలో సుగంధ ద్రవ్యములతో కలాపి చల్లిరి. ప్రాంగణములు గజముత్యములతో అలంకరింపబడెను. అనేకవిధములైన శుభప్రదములగు అలంకారములు చేయబడెను. హర్షముతో నగరమున ఢంకాలు మ్రోగింపబడెను. ప్రభువు నడచుమార్గమున ప్రతిప్రదేశమునందును స్త్రీలు కాన్కలను సమర్పించిరి. ఆనందహృదయులై ఆశీర్వాదములను పలికిరి. సౌభాగ్యవతులైన యువతులు బంగారుపళ్లెములతో అనేకవిధములగుహారతులను ఇచ్చుచు, మంగళగీతములు పాడిరి. దుఃఖములను హరించువాడును, సూర్యవంశమనెడి కమలవనమును వికసింపజేసెడి సూర్యుడును ఐన శ్రీరామునకు హారతులెత్తిరి.

ఆ నగర సౌందర్యములను, వైభవములను, సౌభాగ్యములను, వేదములును, శేషుడును, సరస్వతీ దేవియు మాత్రమే వర్ణింపగలరు. కాని వారు గూడ ఈ దృశ్యములను గాంచి చకితులైరి. ఓ ఉమా! మనుష్యులు నాటిని ఎట్లు వర్ణింపగలరు? (చౌ॥ 1-5)

అయోధ్యయను సరోవరమున వనితలనెడి కలువలు శ్రీరామవిరహమనెడి సూర్యతాపముచే వసివాడినవి. ఇప్పుడు ఆ విరహతాపమును దూరముచేయు శ్రీ రఘునాథుడనెడి పూర్ణచంద్రుని కిరణస్పర్శచే ఆ కలువలు వికసించెను. అనేకములైన శుభశకునములయ్యెను. ఆకాశమున నగారాలధ్వనులు నిండెను. నగరమునందలి స్త్రీ పురుషులందఱిని ధన్యులనుగా జేసి, శ్రీరామచంద్రుడు తనభవనమునకేగెను. (దో॥ 9. క,ఖ)

శ్రీరామ పట్టాభిషేకము

(శివుడు పలుకుచున్నాడు) ఓ భవానీ! కైకేయి మిక్కిలి లజ్జితురాలైనదనువిషయమును ప్రభు వెఱుంగును. కావున ప్రభువు మొదట ఆమెభవనమునకు వెళ్లెను. ఆమెను అనేకవిధముల ఓదార్చి, పూర్తిగా తృప్తిపఱచెను. పిమ్మట ఆ కృపానిధి తనభవనమునకు వెళ్లెను. శ్రీరాముడు తన భవనమున ప్రవేశింపగనే అయోధ్యయందలి స్త్రీ పురుషులు సంతుష్టులైరి. గురువైన వసిష్ఠుడు బ్రాహ్మణులను పిలిచి, "ఈనాడు ఈవేళ శకునములన్నియును శుభావహములైయున్నవి. శ్రీరామచంద్రుడు సింహాసనమును అధిష్ఠించుటకు మీరందఱును అనుజ్ఞనొసంగుడు" అని వారిని ప్రార్థించెను. వసిష్ఠమహర్షి పలికినమధురవచనములను విని, బ్రాహ్మణులందఱును పరమానందమును పొందిరి. వారు మృదుమధురముగా ఇట్లు పలికిరి. "శ్రీరామచంద్రుని రాజ్యాభిషేకము విశ్వమునకే ఆనందదాయకము. మునీశ్వరా! ఇంక ఏ మాత్రమూ ఆలసింపక శ్రీరాముని పట్టాభిషిక్తునిగా జేయుడు" అని యనిరి. (చౌ॥ 1-4)

అంతట వసిష్ఠమహాముని సుమంత్రునితో పట్టాభిషేకమునకు తగినయేర్పాట్లు చేయుమని పలికెను. అతడు హర్షముతో వెళ్లెను. అనేకరథగజతురగములు అలంకరింపబడెను. పిమ్మట సుమంత్రుడు నలుదిశలకును దూతలను పంపి, మంగళద్రవ్యములను తెప్పించెను. పిమ్మట ఆనందముతో అతడు వసిష్ఠునికడకేగి, ఆయనచరణములకు ప్రణమిల్లెను. (దో॥ 10. క,ఖ)

(నవాహ్నిక పారాయణము-ఎనిమిదవ విరామము)

అయోధ్యా నగరము మిక్కిలి అందముగా అలంకరింపబడెను. దేవతలు నిరంతరము పుష్పవృష్టి కురిపించుచుండిరి. శ్రీరామచంద్రుడు సేవకులను పిలిచి, "మొదట నా మిత్రులకు స్నానములను చేయింపుడు" అని పలికెను. ప్రభువచనములను వినగానే ఎక్కడివారక్కడ పరుగెత్తుకొని పోయి, సుగ్రీవాదులకు స్నానములు చేయించిరి. పిదప కరుణాళువు శ్రీరాముడు భరతుని పిలిచి, తన మృదువైన కరకమలములతో స్వయముగా అతని జటాజూటమును విప్పి దువ్వెను. ఆ సమయమున రామునిహృదయమున భరతునియెడ గూడుకట్టికొనియున్న అపారప్రేమ ఉప్పొంగుచుండెను. పిమ్మట భక్తవత్సలుడైన రఘునాథుడు తనముగ్గురుసోదరులకును స్నానములను జేయించెను. భరతునిభాగ్యమును ప్రభుకారుణ్యమును ఎంతమంది శేషులైనను వర్ణింపజాలరు. పిమ్మట శ్రీరాముడు తనజటాజూటమును విప్పుకొని, గురునాజ్ఞప్రకారము స్నానమునాచరించెను. స్నానానంతరము భూషణములను ధరించెను. ప్రభువుయొక్క ప్రత్యంగము కోటిమన్మధసౌందర్యములనుగూడ త్రోసిరాజని శోభించెను. (చౌ॥ 1-4)

ఇక్కడ సీతాదేవిని అత్తగార్లు వెంటనే సాదరముగా స్నానముచేయించి, దివ్య వస్త్రములను ధరింపజేసి, ప్రత్యంగమును ఆభరణములచే అలంకరింపజేసిరి. శ్రీరామునివామభాగమున సుగుణాలరాశియైన సీతాదేవి శోభిల్లెను. వారిని జూచి తల్లులు తమజన్మలు ధన్యములైనవని తలంచుచు సంతసించిరి. కాకభుశుండి పలుకుచున్నాడు. ఓ పక్షిరాజా! గరుడుడా! వినుము. అదే సమయమున బ్రహ్మదేవుడు, శివుడు, మునిబృందములు, విమానములపైవచ్చినదేవతలు, ఆనందకందుడగు భగవంతుని దర్శనమునకై విచ్చేసిరి. (దో॥ 11.క,ఖ,గ)

శ్రీరామచంద్రుని గాంచి, వసిష్ఠమహర్షి ప్రేమపరవశుడాయెను. వెంటనే ఆయన ఒక దివ్య సింహాసనమును దెప్పించెను. అది సూర్యతేజస్సును మించి ప్రకాశించుచుండెను. దాని సౌందర్యము వర్ణనాతీతము. శ్రీరామచంద్రప్రభువు బ్రాహ్మణులకు నమస్కరించి, ఆ సింహాసనముపై ఆసీనుడయ్యెను. జనకసుతయైన సీతతోగూడిన శ్రీరామచంద్రుని జూచి, మునులు అత్యంత హర్షోల్లాసములతో విలసిల్లిరి. బ్రాహ్మణులు వేదమంత్రములను పఠించిరి. ఆకాశమునుండి దేవతలు, మునులు 'శ్రీరామునకు జయము, జయము' అను నినాదములను గావించిరి. మొట్టమొదట వసిష్ఠమహాముని శ్రీరామునకు తిలకము దిద్దెను. పిమ్మట బ్రాహ్మణులందఱిని 'తిలకమునుంచుడ'ని ఆదేశించెను. పుత్రునిపట్టాభిషేక మహోత్సవమును జూచి, తల్లులు అత్యంతానందమునొందిరి. వారు మాటిమాటికిని మంగళహారతులనెత్తిరి. బ్రాహ్మణులకు అనేకదానములనొసంగిరి. అర్థులకు తృప్తికరముగా దానములనిచ్చిరి. ముల్లోములకును ప్రభువగు శ్రీరామచంద్రుడు సింహాసనముపై విరాజిల్లుచుండగా ఆవైభవమునుగాంచి, దేవతలు నగారాలను మ్రోగించిరి. (చౌ॥ 1-4)

ఆకాశమున దుందుభిధ్వానములు వీనులవిందుగా వినిపించెను. గంధర్వులు కిన్నరులు ప్రభువుయొక్క యశోవైభవములను కీర్తించుచుండిరి. దివ్యాంగనలు నాట్యములు చేయుచుండిరి. దేవతలు, మునులు పరమానందభరితులైరి భరతలక్ష్మణశత్రుఘ్నులును విభీషణుడు, అంగదుడు, హనుమంతుడు, సుగ్రీవుడును వరుసగా ఛత్రము, చామరములు, వ్యజనము, ధనుస్సు, ఖడ్గము, డాలు, శక్తినిగైకొని ప్రభువును సేవించుచుండిరి.(1) సూర్యవంశభూషణుడైన శ్రీరామచంద్రుడు సీతాదేవితోగూడి కోటిమన్మథులసౌందర్యములతో శోభిల్లుచుండెను. సజలమేఘమువలెనున్న ప్రభువుయొక్క సుందరనీలశరీరముపై శోభిల్లుపీతాంబరము దేవతలమనస్సులను గూడ ముగ్ధమొనర్చెను. మస్తకమున కిరీటము, బాహువులయందు భుజకీర్తులు మొదలగు అద్భుతాభరణములు సర్వాంగములయందును అలంకరింపబడియుండెను. ప్రభువుయొక్క కమలదళములవంటి విశాలనేత్రములను, విపులవక్షస్థలమును, పొడవైన బాహువులను దర్శించు మానవులజన్మములు ధన్యములు. (ఛం॥ 1,2)

(కాకభుశుండి పలుకుచున్నాడు) ఓ పక్షి రాజా! గరుడుడా! ఆ దృశ్యశోభ, ఆ సమాజ ప్రత్యేకత, ఆ సందర్భ వైశిష్ట్యము వర్ణనాతీతములు. వాటిని నేను వర్ణింపజాలను. వేదములు, శేషుడు, సరస్వతీదేవి దీనిని నిరంతరము వర్ణించుచుందురు. ఆ దృశ్యానందము పరమేశ్వరునకే యెఱుక. దేవతలు అందఱును వివిధరీతుల స్తుతించి, తమతమ స్థానములకు వెళ్లిపోయిరి. అప్పుడు వేదపురుషులు వందిమాగధులవేషములలో వచ్చిరి. కృపానిధియు, సర్వజ్ఞుడును ఐన ప్రభువు వారిని సాదరముగా ఆహ్వానించెను. ఈ వచ్చినవారు వేదపురుషులు అను రహస్యమును ప్రభువు తప్ప ఎవ్వరును ఎఱుంగరు. వారు ప్రభుగుణములను గానము చేయసాగిరి. (దో॥ 12. క,ఖ,గ)

కనుగొంటిని శ్రీరాముని నేడు కనుగొంటిని
ఇనకులమందు ఇంపుగాను పుట్టిన ఇలలోన సీతానాయకుని నేడు ॥కను॥
భరతలక్ష్మణశత్రుఘ్నులును గొలువపవమానసుతుడు పాదముల బట్టధీరులైన
సుగ్రీవుప్రముఖులు వినుతిసేయ త్యాగరాయనుతుని నేడు ॥కను॥ (త్యాగరాజ)

వేదపురుషులు శ్రీరాముని స్తుతించుట

ఓ సగుణనిర్గుణరూపా! నిరుపమలావణ్యభూషితా! ఓ రాజశిరోమణీ! నీకు జయము. నీవు రావణాది ప్రచండప్రబలదుష్టరాక్షసులను నీ బాహుబలముచే వధించితివి. నీవు మానవావ తారమును దాల్చి, సంసారభారమును బాపి, దారుణ దుఃఖములను భస్మమొనర్చితివి. ఓ దయాళూ! ప్రణతపాలా! ప్రభూ! నీకు జయము. శక్తి(సీతాదేవి)తో గూడిన సర్వసమర్థుడవగు నీకు మేము నమస్కరించుచున్నాము. (1) శ్రీహరీ! నీ దుస్తరమైనమాయకు వశులై దేవతలు, రాక్షసులు, నాగులు, మనుష్యులు చరాచరజీవులందఱును కాలకర్మగుణములచే నిండిన జనన మరణరూపభవాటవిలో రాత్రింబవళ్లు పరిభ్రమించుచుందురు. స్వామీ! మీ కృపాదృష్టి ప్రసరించినవారు తాపత్రయములనుండి విముక్తులయ్యెదరు. జననమరణక్లేశములను ఛేదించుటలో దక్షుడవైన శ్రీరామా! మమ్ము రక్షింపుము. నీకు నమస్కరించెదము. (2)శ్రీహరీ! మిథ్యాజ్ఞానాభిమానమత్తులై భవహారిణియైన నీ భక్తికి నోచుకొననివారు దుర్లభమైన పదవిని (మానవజన్మను) పొందియు, పదవీ భ్రష్టులగుచుండుటను మేము చూచుచున్నాము. కాని ఆశలన్నింటిని త్యజించి, నీపై విశ్వాసముఉంచి, నీకు దాసులగువారు కేవలము నీనామజపముచేతనే ఎట్టిశ్రమయు లేకుండ భవసాగరమును తరించెదరు- అట్టినిన్ను స్మరించుచున్నాము. (3) నీ చరణములు పరమేశ్వరునకును, బ్రహ్మకును పూజ్యములు. వాటి మంగళప్రదధూళిస్పర్శమాత్రముననే గౌతమమహర్షిధర్మపత్ని అహల్య ఉద్ధరింపబడినది. ఆ పవిత్రచరణనఖములనుండి ఉద్భవించిన గంగానది ఋషులచే గౌరవింపబడి ముల్లోకములను పావనమొనర్చుచున్నది. వజ్రాయుధము, ధ్వజము, అంకుశము, కమలము మొదలగు దివ్యచిహ్నములుగల ఈ పాదములకు వనభూములలో తిరుగటవలన కంటకములగుర్తులు ఏర్పడినవి. అట్టి పాదములను ఓ ముకుందా! రమాపతీ! శ్రీరామా! మేము సర్వదా భజించెదము. (4) ఈ సంసారవృక్షమునకు పరబ్రహ్మవైన నీవే మూలము. నీస్వరూపము అవ్యక్తము, అనాది (శాశ్వతము). ఈ సంసారవృక్షస్వరూపమునందును నీవే విరాజమానుడవై యున్నావు. ఈ వృక్షమునకు చతుర్విధ (ధర్మార్థకామమోక్షములనెడి) పురుషార్థములు నాల్గును కవచములు. దీనికి షడ్భావవికారములు (జాయతేఽస్తి వర్ధతే విపరిణమతేఽపక్షీయతే వినశ్యతే! (నిరుక్త 1/1/2) ఉత్పత్తి, అస్తిత్వము, వృద్ధి, విపరిణామము, అపక్షయము, వినాశము -అను) ఆఱును స్కంధములు. జడచేతనాత్మకమైన ఈ జగత్తునకు ఇఱువదియైదు (పంచవింశతి) తత్త్వములు (పంచమహాభూతములు, పంచ తన్మాత్రలు, దశేంద్రియములు, మనోబుద్ధ్యహంకారచిత్తములు అను ఇఱువదినాలుగును జడములు, చేతనుడైన జీవుడు ఒక్కడు- వెరసి ఇఱువదియైదు తత్త్వములు-) శాఖలు. అసంఖ్యాకములైన భోగ్యవస్తువులు పత్రములు. పుష్పములు. భోగము, మోక్షము అనురెండును ద్వివిధఫలములు. ధర్మ, మోక్షరూపఫలము మధురము, శాశ్వతము. అర్థ, కామఫలము కటువు, క్షణికము. మాయ అనెడి లత ఈ జగద్వృక్షమునందు అంతటను అల్లుకొనియుండును. ఇది భగవంతుని ఆశ్రయించి, తదధీనమున ఉండును. భగవంతునకు ప్రసన్నులైనవారు ఈ మాయను అధిగమింపగలరు. (మామేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే॥ (గీత. 7/14) ఈమాయా విస్తృతి నిత్యనూతనముగా జరుగుచునే యుండును- అని వేదములు, ఆగమములు పేర్కొనుచున్నవి. ఈ సంసారవృక్షరూపమున నీవే విలసిల్లుచున్నావు.(1) సంసారవృక్షరూపుడవైన ఓ రామా! నీకు నమస్కారము. (5) పరబ్రహ్మను జన్మరహితుడనియు, అద్వైతుడనియు, మనస్సునకు గోచరముకానివాడనియు,

---

అంతా రామమయం జగమంతా రామమయం ॥అంతా॥
అంతరంగమున ఆత్మారాముడనంతరూపముల వింతలు సల్పగ ॥అంతా॥
సోమ సూర్యులును, సురలు తారలును ఆ మహాంబుధులు నవనీజంబులు ॥అంతా॥
అండాండంబులు, పిండాండంబులు, బ్రహ్మాండంబులు, బ్రహ్మలు మొదలుగ
నదులు వనంబులు నానామృగములు, విదితకర్మములు, వేదశాస్త్రములు ॥అంతా॥ (రామదాసు)

అనుభవగమ్యుడనియు కొందఱు భావించి, ధ్యానింతురు. అట్లు తలంచువారిని తలంపనిండు. కాని మేము మాత్రము నిత్యము నీ సగుణ యశోవైభవములనే, గానము చేయుచుందుము. ఓ కరుణానిధీ! సద్గుణ రాశీ! ప్రభూ! నిర్వికారులమై, త్రికరణశుద్ధిగా సర్వదా నీచరణములనే భక్తితో సేవించుచుండునట్లు వరములను గోరుచున్నాము. (ఛం॥ 1-6)

అందఱి సమక్షమున వేదపురుషులు ప్రభువును ఇట్లు ప్రార్థించి, బ్రహ్మలోకమునకు వెళ్ళిరి. (కాకభుశుండి పలుకుచున్నాడు) ఓ గరుడా! వినుము. వేదపురుషులు వెళ్ళిన పిదప శివుడు శ్రీరాముని సన్నిధికి వచ్చెను. పులకితగాత్రుడై గద్గదస్వరముతో ఇట్లు స్తుతింపసాగెను. (దో॥ 13. క,ఖ)

పరమేశ్వరుడు శ్రీరాముని స్తుతించుట

"ఓ రామా! రమారమణా! నీకు జయము. ఓ భవతాపవిదారకా! పునర్జన్మ భయ పీడితులైన జనులను రక్షింపుము. ఓ అయోధ్యాపతీ! దేవదేవా! రమానాథా! విభూ! ప్రభూ! శరణాగతుడను, నన్ను రక్షింపుము. పదితలలు, ఇఱువదిభుజములుగల రావణుని అవలీలగా వధించితివి. భువిలోని భయానకరోగములనన్నింటిని రూపుమాపు శ్రీరామా! నిశాచరశలభములన్నియును నీ బాణాగ్నిలో ప్రచండతేజస్సులో భస్మమైనవి. నీవు ఈ భూమండలమునకు ఒక మనోహర భూషణమైనవాడవు. ఉత్తమమైన ధనుర్బాణములను, తూణీరమును ధరించినవాడవు. నీతేజస్సనెడి సూర్యకిరణసమూహము. అహంకారమోహమమకారములనెడి అంధకారములను దూరమొనర్చును. మన్మథుడనెడి వేటగాడు మనుష్యులనెడి మృగములహృదయములపై భోగేచ్ఛాబాణములతో గొట్టుచున్నాడు. శ్రీహరీ! మీరు ఆ వేటగానిని వధించి, విషయవాంఛలనెడి వనములలో సంచరించెడి పామరజనులను రక్షింపుడు. మీ చరణకమలములను నిరాదరణచేసిన ఫలితముగా జనులు అనేకరోగవియోగములచే కొట్టబడుచున్నారు. మీ పాదపద్మములను ప్రేమింపని వారు అగాధభవసాగరమున మునిగియుందురు. సర్వదా వారత్యంతదీనులు, మలినులు, దుఃఖితులు. కాని మీ లీలావిలాసకథను ఆశ్రయించువారు సజ్జనులు. భగవత్ప్రీతిపాత్రులు. రాగ లోభాభిమానమదములు వారిని దరిజేరవు. సంపద, ఆపద, రెండును వారికి సమానములే. అందువలననే మునులు యోగసాధనపై విశ్వాసమును వీడి, నిశ్చింతగా ఆనందముతో మీ సేవకులయ్యెదరు. వారు ప్రేమాదరములతో, నియమనిష్ఠలతో, పవిత్రహృదయములతో నిరంతరము నీ చరణకమలములనే సేవించెదరు. వారు ఆదరనిరాదరములను సమముగా భావింతురు. అట్టి సజ్జనులందఱును ఈ భువిపై హాయిగా సంచరింతురు. మునిమానసపంకజ భృంగమా! రణధీర! అజేయా! రఘువీరా! నిన్ను భజించెదను. నీ నామమును జపించెదను. హరీ! నీకు ప్రణమిల్లెదను. నీవు భవరోగములకు దివ్యౌషధమైనవాడవు. అభిమానమునకు వైరివి. నీ గుణములను ఎవ్వరును వర్ణింపజాలరు. నీవు గుణశీలములకును కృపకును పరమనిధానము. లక్ష్మీపతీ! నిరంతరము నీకు ప్రణమిల్లెదను. రఘునందనా! జననమరణసుఖదుఃఖ రాగద్వేషాది ద్వంద్వములను నాశముచేయుము. ఓ మహీపాలా! ఈ దీనసేవకునిపై నీ కృపాదృష్టిని ప్రసరింప జేయుము. (ఛం॥ 1-10)

నీ పదకమలములయందు అనన్యభక్తియు, నీ భక్తులసత్సాంగత్యమూ నాకు నిరంతరము కలుగు గాక- అని పదే పదే నిన్ను ప్రార్థించుచున్నాను. లక్ష్మీశా! ప్రసన్నుడవై నాకు ఈవరమును ప్రసాదింపుము." శ్రీరామచంద్రునిమహోన్నతగుణవైభవములను వర్ణించి, ఉమాపతి, మహా దేవుడు హర్షముతో కైలాసమునకు ఏగెను. పిమ్మట ప్రభువు వానరులకు సుఖప్రదమైన నివాస స్థానములను ఏర్పాటు చేసెను. (దో॥ 14. క,ఖ)

(కాకభుశుండి పలుకుచున్నాడు) ఓ గరుడా! వినుము. ఈ కథ శ్రోతలను పునీతులను గావించుటయే గాక వారిదైవిక, దైహిక, భౌతికపాపములను, జననమరణభయములను, భవ బాధలను తొలగించును.

శ్రీరామచంద్రునిరాజ్యపట్టాభిషేకవర్ణనను నిష్కామభావముతో భక్తిశ్రద్ధలతో వినిన మానవులు జ్ఞాన వైరాగ్యములను పొందగలరు. సకామభావముతో ఈ కథను గానము చేయువారు, వినువారు అనేక సుఖసంపదలను పొందెదరు. వారు దేవతలకును దుర్లభమైన సుఖములను అనుభవించి, అంత్యకాలమున రఘురామునిపరమపదమును చేరుదురు. జీవన్ముక్తులు, విరాగులు, విషయలోలురు ఈ కథను విన్నచో వారు క్రమముగా భక్తిని, ముక్తిని, సంపదలను పొందెదరు. ఓ పక్షిరాజా! నేను నా బుద్ధిననుసరించి, ఇంతవఱకు శ్రీరామగాథను వినిపించితిని. ఇది జననమరణభయమును, దుఃఖములను రూపుమాపును. ఈకథ వైరాగ్యవివేకములను, భక్తిని సుదృఢమొనర్చి, మోహనదిని దాటించు చక్కనినౌక. అయోధ్యలో నిత్యనూతన మహోత్సవములు జరుగుచుండెను. అన్నివర్గములప్రజలు ఆనందముగానుండిరి. మహాదేవుడు, బ్రహ్మ, మునీశ్వరులు సర్వదా సేవించుచుండెడి శ్రీరామచరణములపై ప్రజలకు నిత్యనూతనముగా భక్తితత్పరత్వములు వర్ధిల్లుచుండెను. బ్రాహ్మణులకు అనేకదానములు ఒసంగ బడెను. అర్థులకు నానా విధములైన వస్త్రాభరణములు ఇయ్యబడెను. (చౌ॥ 1-5)

వానరులు బ్రహ్మానందమగ్నులైరి. ప్రభుచరణములయందే వారికి అనన్యభక్తి స్థిరపడెను. రాత్రింబవళ్లు గడచి పోవుటయు వారు గమనింపరైరి. చూచుచుండగనే ఆఱు మాసములు దొర్లి పోయెను. (దో॥ 15)

వారు స్వగృహములను విస్మరించిరి. సజ్జనులమనస్సులలో పరద్రోహచింత రానట్లు వారికి స్వప్నములోగూడ ఇంటిధ్యాస కలుగుట లేదు. అంతట ఒకనాడు శ్రీ రఘునాథుడు మిత్రులందఱిని పిలిచెను. వారందఱును వచ్చి, సాదరముగా ప్రణమిల్లిరి. శ్రీరాముడు అత్యంత ప్రేమతో వారిని తనదగ్గర కూర్చుండబెట్టుకొని, భక్తులకు సుఖప్రదమైన అత్యంతమృదుమధుర వచనములను పలికెను. "మీరు నాకు ఎంతో సేవచేసియుంటిరి. మీ యెదుట మిమ్ము ఎట్లు ప్రశంసింపవలెను? నాహితముకొఱకు మీరు ఇండ్లను, కుటుంబములను, సర్వసుఖములను త్యజించియుంటిరి. అందువలన మీరు నాకెంతో ప్రియమైనవారు. నాకు నా సోదరులును, రాజ్యమూ, సంపదయు, జానకీదేవియు, నా శరీరము, ఇల్లు, కుటుంబమూ, మిత్రులు వీరందఱును ప్రియమైన వారే. కాని వారు మీ తరువాతనే. నేను సత్యము వచించెదను. ఇది నాకు సహజము. ప్రతియజమానియు తనసేవకుని ప్రేమతో చూడవలెననుట సాధారణ నియమము. కాని నాకు దాసులపైగల ప్రేమ విశిష్టమైనది. (చౌ॥ 1-4)

సుగ్రీవాదులకు వీడ్కోలు

మిత్రులారా! ఇప్పుడు మీరు మీ గృహములకు తరలి పొండు. దృఢమైన నియమముతో నన్ను భజింపుడు. నన్ను సర్వవ్యాపకునిగా, సర్వహితకరునిగా భావించి, ప్రేమింపుడు. (దో॥ 16)

ప్రభువచనములను వినగానే అందఱును ప్రేమవిహ్వలురైరి. "మేము ఎవరము? ఎక్కడ నున్నాము?" అనియు వారు ఎఱుగరైరి. వారికి తమ శరీరములపైననే ధ్యాస లేకుండెను. ప్రభువు నెదుట చేతులు జోడించి, ఱెప్పవాల్చక చూడసాగిరి. ప్రేమాతిరేకమువలన వారికి నోట మాట రాకుండెను. ప్రభువు వారిప్రేమాధిక్యమును గమనించి, వారికి పెక్కురీతుల విశేషజ్ఞానమును బోధించెను. స్వామియెదుట వారు ఏమియు పలుకజాలక మిన్నకుండిరి. మాటి మాటికిని ప్రభు చరణములపైపే చూచుచుండిరి. అంతట ప్రభువు నిరుపమానసౌందర్యశోభితములైన భూషణములను, వివిధవర్ణములుగలవస్త్రములను తెప్పించెను. భరతుడు స్వయముగా వస్త్రభూషణములతో సుగ్రీవుని అలంకరించెను. పిమ్మట ప్రభునాదేశమునుసరించి, లక్ష్మణుడు విభీషణుని వస్త్రభూషణాలంకృతునిగా జేసెను. రఘునాథుని మనస్సు మిక్కిలి తృప్తి చెందెను. అంగదుడు కూర్చొనియే యుండెను. అతడు తనస్థలమునుండి ఏమాత్రమూ కదలకయుండెను. అతని ప్రగాఢప్రేమను గ్రహించి, ప్రభువు అతనిని పిలువలేదు. (చౌ॥ 1-4)

జాంబవంతుడు, నలుడు,నీలుడు మొదలగు వారినందఱిని శ్రీ రఘునాథుడు స్వయముగా వస్త్రభూషణములతో అలంకరించెను. వారందఱును తమహృదయములలో శ్రీరామచంద్రుని రూపమునే నిలుపుకొని, ప్రభుచరణములకు ప్రణమిల్లి వెళ్లిపోయిరి. అప్పుడంగదుడు లేచి, నతమస్తకుడై, సజలనేత్రుడై చేతులు జోడించి, మిక్కిలి వినయముతో ప్రేమార్ద్రహృదయుడై మధురముగ ఇట్లనెను. (దో॥ 17. క,ఖ)

"ఓ సర్వజ్ఞా! కృపాసాగరా! సుఖనిధానా! దీనదయాళూ! దుఃఖజనబంధూ! ప్రభూ! వినుడు. అసువులు వీడునపుడు మా తండ్రిగారైన వాలి నన్ను మీ చేతులలో పెట్టిపోయెను. కావున ఓ భక్త మందారమా! ఆశరణ శరణ్యులు' అను మీ బిరుదమును మనస్సులో ఉంచుకొని, నన్ను వీడకుడు, నాకు ప్రభువు, గురువు, తల్లియు, తండ్రియు అన్నియు మీరే. మీ చరణకమలములను వదలి నేనెక్కడికి వెళ్లను? ఓ మహారాజా! మీరే ఆలోచించి వచింపుడు. ప్రభువైన మిమ్ము వదలి ఇంటిలో నాకేమి పని? జ్ఞానము, బుద్ధి, బలము లేని ఈ పసివానిని దీనుని, సేవకుని మీ శరణుజొచ్చిన వానినిగా భావింపుడు. నేను మీ ఇంటిలో చిన్నసన్నపనులనుసైతము చేయుదును. మీ చరణ కమలములను సేవించుచు, దర్శించుచు భవసాగరమును దాటెదను." ఇట్లు పలికి, అంగదుడు ప్రభుపాదపద్మములపై వ్రాలెను. "ప్రభూ! నన్ను రక్షింపుడు. నన్ను ఇంటికి వెళ్లుమని ఆజ్ఞాపింపకుడు" అని నుడివెను. (చౌ॥ 1-4)

అంగదుని వినమ్రవచనములను విని, కరుణానిధియగు శ్రీరామచంద్రుడు అతనిని లేవనెత్తి, తనహృదయమునకు హత్తుకొనెను. ప్రభు నేత్రకమలములయందు ప్రేమాశ్రువులు నిండెను. తన వక్షఃస్థలమునందలి మాలను, అనేక వస్త్రములను, మణులను అంగదునకు అలంకరించి, అతనికి అనేకవిధముల నచ్చజెప్పి, శ్రీరాముడు అతనికి వీడ్కోలును ఇచ్చెను. (దో॥ 18. క,ఖ)

భక్తితో నిండిన అంగదుని సేవలను గుర్తించి, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు అతని వెంట కొంత దూరము వెళ్ళి, అతనిని వీడ్కొలిపిరి. అంగదుని హృదయము ప్రేమపూర్ణమై యుండెను. అతడు మాటి మాటికి వెనుదిరిగి, శ్రీరాముని జూచుచు, ప్రణామములను సమర్పించుచు వెళ్లుచుండెను. శ్రీరామచంద్రుడు తనను నిలిపి, 'అయోధ్యలోనే ఉండుము' అని పలుకునను విశ్వాసము అతని మనస్సులో ఉండెను. శ్రీరాముని చూపులను, పలుకులను, నడకలను, దరహాసములను, తలచి తలచి, అంగదుడు ప్రేమవిహ్వలుడాయెను. కాని ప్రభువుయొక్క మనోభావములను ఎఱింగి, పెక్కు వినయవచనములను పలుకుచు ప్రభుచరణకమలములను తనమనస్సున నిలుపుకొని, అంగదుడు వెడలిపోయెను. వానరులందఱికిని అత్యంతాదరముతో వీడ్కోలునిచ్చి, భరతుడు, అతని సోదరులు తిరిగివచ్చిరి. పిమ్మట హనుమంతుడు సుగ్రీవుని పాదములకు నమస్కరించి, వినమ్రముగా ఇట్లనెను. "ప్రభూ! నేను ఒక పదిదినములు శ్రీరాముని సేవలలో గడిపి, మఱల మీ పాదములసన్నిధికి చేరెదను." సుగ్రీవుడు సమాధానమును ఇచ్చెను. "ఓ ఆంజనేయా! నీవు పుణ్యరాశివి. (శ్రీరామచంద్రుడు నిన్ను తనసేవలలో నిలుపుకొనెను) వెళ్లి, దయానిధియైన శ్రీరామచంద్రుని సేవించుచుండుము." పిమ్మట వానరులందఱును వెంటనే బయలుదేఱిరి. అంగదుడు పల్కెను. "మారుతీ! వినుము. (చౌ॥ 1-5)

చేతులు జోడించి, నిన్ను ప్రార్థించెదను. ప్రభువునకు నా ప్రణామములను దెల్పుము. అప్పుడప్పుడు నన్ను ప్రభువునకు జ్ఞాపకముచేయుచుండుము." ఈ విధముగా పలికి, వాలి పుత్రుడైన అంగదుడు ప్రయాణమయ్యెను. హనుమంతుడు తిరిగి వచ్చి, అంగదునిఅనన్యభక్తిని గూర్చి ప్రభువునకు నివేదించెను. అది విని భగవంతుడు అమితానందము నొందెను. (కాక భుశుండి పలుకుచున్నాడు) ఓ గరుడుడా! శ్రీరాముని హృదయము వజ్రముకంటెను కఠినము. పూవులకంటెను కోమలము. ఈ విషయమును ఎవరెఱుంగుదురు? మీరే తెల్పుడు. (వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి) (దో॥ 19. క,ఖ,గ)

పిమ్మట కృపాళువైన శ్రీరామచంద్రప్రభువు నిషాదరాజును పిలిపించి, వస్త్రాభరణములను ప్రసాదరూపముగా సమర్పించి పలికెను. "ఇప్పుడు మీరు ఇంటికి వెళ్లి, నన్ను స్మరించుచు త్రికరణ శుద్ధిగా ధర్మమును ఆచరింపుడు. మీరు నా మిత్రులు. భరతునితోసమానులు. తఱచుగా అయోధ్యకు వచ్చుచుండవలెను." ఈ మాటలు వినినంతనే నిషాదరాజునకు అపరిమితానందము గల్గెను. నేత్రములు ప్రేమాశ్రువులతో నిండెను. అతడు ప్రభుచరణములపై వ్రాలెను. శ్రీరామచంద్ర ప్రభుచరణకమలములను తనహృదయమున నిలుపుకొని, అతడు తనఇంటికి చేరెను. అచట తన కుటుంబ సభ్యులందఱికిని ప్రభుస్వభావమును గూర్చి వినిపించెను. శ్రీ రఘునాథునిలీలలను జూచిన అయోధ్యావాసులందఱును "సర్వసుఖములరాశియైన శ్రీరామచంద్రుడు ధన్యుడు" అని మాటి మాటికిని తలంచు కొనుచుండిరి. శ్రీరాముడు సింహాసనాసీనుడగుటచే సర్వలోకములును సంతసించెను. వారిశోకసంతాపములు మటుమాయములయ్యెను. వైరభావమునకేమాత్రమూ తావులేని సోదరభావముతో వారు మసలుకొనుచుండిరి. శ్రీరామచంద్రుని మహిమచే అందఱును పరస్పరప్రేమానురాగములతో తమ జీవితములను కొనసాగించుచుండిరి. (చౌ॥ 1-4)

రామరాజ్యము

రామరాజ్యమునందు ప్రజలందఱును తమతమవర్ణాశ్రమనియమములను అనుసరించి, ధర్మ తత్పరులై యుండిరి, వేద మార్గమున సంచరించుచు సుఖులై యుండిరి. భయము, రోగము, శోకము అనునవి వారికి తెలియకుండెను. (దో॥ 20)

శ్రీరాముని పాలనమున ఎవ్వరును దైవిక, దైహిక, భౌతిక తాప(త్రయ)ములకు లోను కాకుండిరి. జనులెల్లరును పరస్పరప్రేమానురాగములతో వేదోక్తనీతిమార్గతత్పరులై, తమతమ ధర్మములను నిర్వహించుచుండిరి. ధర్మము నాల్గుపాదములపై (సత్యము, శౌచము, దయ, దానము-అను వానిపై) పరిపూర్ణముగా నడచుచుండెను. స్వప్నములోనైనను పాపమనునదియే కానరాకుండెను. స్త్రీ పురుషులు రామభక్తిలో లీనమైయుండిరి. రామానుగ్రహమున అయోధ్యావాసులు అందఱును పరమపదమునకు పాత్రులై యుండిరి. ప్రజలెవ్వరును అకాల మృత్యువునకు గురి కాకుండిరి. ఎవ్వరికిని ఎట్టి బాధలును లేకుండెను. అందఱి శరీరములును స్వాస్థ్యము, సౌందర్యము కలిగియుండెను. రామరాజ్యమున దరిద్రులు, దీనులు, దుఃఖితులు, మూర్ఖులు, శుభలక్షణహీనులు ఏమాత్రము లేకుండిరి. అందఱును దంభరహితులై, ధర్మపరాయణులై, పుణ్యాత్ములై యుండిరి. స్త్రీ పురుషులెల్లరును నీతినిపుణులు, గుణవంతులు. గుణములను సముచితముగాఆదరించెడివారు. వారు పండితులు, జ్ఞానులు, కృతజ్ఞులు, కపటమునెఱుగని వారు. (చౌ॥ 1-4)

(కాకభుశుండి పలుకుచున్నాడు) పక్షిరాజా! వినుము. రామరాజ్యమునందు చేతనాచేతన జగత్తులోని కాల, కర్మ, స్వభావగుణజనితములైన దుఃఖములెవ్వరినీ బాధింపకుండెను. (దో॥ 21)

సప్తసముద్రములమధ్యగల భూములన్నింటికిని కోసలపతి శ్రీరఘునాథుడే ఏకచ్ఛత్రాధిపతిగానుండెను. భగవంతుని ప్రతిరోమమునందును అనేకబ్రహ్మాండములున్నవి. అట్టి ప్రభువునకు సప్తసముద్రవలయితసప్తద్వీపములపై అధికారముండుట గొప్పగాదు. పైగా ప్రభు మహిమను ఎఱింగిన వారికి ఇట్లు వర్ణించి చెప్పుట స్వల్పవిషయముగా కన్పించును. కాని గరుడా! ఆ రామునిమహత్త్వమునెఱింగినవారికిగూడ ఈ లీలలపైనను ప్రేమాదరములుండును. ఈ మహిమను తెలిసికొనుటవలన గలుగుఫలము ఈ లీలలను అనుభవించుటయే యని సంయమీంద్రులు నుడువుదురు. రామరాజ్యమునందలిసుఖసంపదలను శేషుడును సరస్వతీదేవియు వర్ణింపజాలరు. అచటి స్త్రీపురుషులందఱును ఉదారులు, పరోపకారులు, బ్రాహ్మణ చరణములను సేవించువారు. పురుషులు ఏకపత్నీవ్రతులు, స్త్రీలు త్రికరణశుద్ధిగా పతిహితమునకై పాటుపడువారు. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రునిపాలనలో 'దండము' సన్న్యాసుల చేతులలోనే యుండెడిది. 'భేదము' అను పదము కేవలము నర్తక సమాజములలో రాగ, తాళముల యందే వినబడు చుండెడిది. 'జయము' అను పదము కేవలము మనస్సును జయించుట (కామక్రోధాది వికారములను జయించుట) అనుసందర్భమున మాత్రమే ప్రయోగింప బడుచుండెడిది. (దో॥ 22)

వనములలోని వృక్షములు అన్నికాలములయందును పుష్పఫలభరితములై యుండెను. ఏనుగులు, సింహములు పరస్పరవైరములు మాని, ప్రేమతో మసలుకొనుచుండెను. పక్షులును, వన్యమృగములును సహజవైరములను మఱచి, నిర్భయముగా కలిసి మెలిసి తిరుగుచుండెను. పక్షులు మధురముగా కూయుచుండెను. నానావిధ పశుసమూహములు భయరహితముగా సంచరించుచు ఉల్లాసముగా ఉండెను. శీతలమందసుగంధపవనములు అంతటను వీచుచుండెను. భ్రమరములు పుష్పమకరందపానములచే మత్తిల్లి, ఝుంకారములు సేయుచుండెను. లతలు, వృక్షములు కోరినంతనే తేనెలను కురియుచుండెను. గోబృందములు సమృద్ధిగా పాలనిచ్చుచుండెను. భూములు పాడిపంటలతో తులతూగుచుండెను. త్రేతాయుగములో కృతయుగ లక్షణములు ప్రత్యక్షమగు చుండెను. సమస్తజగత్తునకుప్రభువైన శ్రీరాముడు సాక్షాత్తుగా ఆ పరమాత్మయేయని యెఱింగి, పర్వతములు అనేకములైన మణులను ఒసంగుచుండెను. నదులన్నియును ఉత్తమ, శీతల, నిర్మల సుఖ ప్రదములైన మధుర జలములతో ప్రవహించుచుండెను. సాగరములు తమపరిధిలోనుండి మనుష్యులకై తీరములయందు రత్నములను చేర్చుచుండెను. తటాకము (సరస్సు)లన్నియును కమలములతో విలసిల్లుచుండెను. దశ దిశలయందుగల సర్వప్రదేశములలోను ఆనందము వెల్లివిరియుచుండెను. (చౌ॥ 1-5)

శ్రీరామరాజ్యములో చంద్రుడు తనచల్లని అమృతమయకిరణములను పృథ్వియందు అంతటను ప్రసరింపజేయుచుండెను. సూర్యుడు అవసరమగునంత వేడినే ఒసంగుచుండెను. మేఘములు వలసినమేరకు వర్షములను కురియుచుండెను. (దో॥ 23)

శ్రీరామచంద్రప్రభువు పెక్కు అశ్వమేధయాగములను జేసి, బ్రాహ్మణులకు అనేకదానముల నొసంగెను. ఆయన వైదికమార్గపరిరక్షకుడై, ధర్మధురంధరుడై, త్రిగుణాతీతుడై అలరారుచుండెను. ఐశ్వర్యమున శ్రీరామునకు ఇంద్రుడుగూడ సాటికాజాలడు. సౌందర్యరాశి, సుశీల, వినయశోభితయైన సీతాదేవి సదా పతి మనస్సును ఎఱింగి ప్రవర్తించుచుండెను. దయానిధియైన శ్రీరామచంద్రునిమహిమను ఆమె యెఱుంగును. శ్రీరాముని చరణ కమలములకు ఆమె తనమనస్సును అంకిత మొనర్చి, సేవించుచుండెను. గృహమున కుశలురైన సేవాపరాయణులైన పెక్కుమంది దాసదాసీజనులు ఉన్నను సీతాదేవి తనపతిసేవలను తానే నిర్వర్తించుకొనుచుండెను. కృపానిధియైన శ్రీరాముని ఆజ్ఞలను పాలించుచు ఆయనకు ఆమె సుఖానందములను గూర్చుచుండెను. సేవా విధులలో ఆమె మిక్కిలి సమర్థురాలు. గర్వము గాని, అహంకారముగాని లేకుండ ఆమె కౌసల్యాదేవి మొదలగు అత్తగార్లకు చక్కని సపర్యలను చేయుచుండెను. శివుడు పలుకుచున్నాడు. ఓ ఉమా! బ్రహ్మాది దేవతలకు పూజ్యురాలు, సంతతము అనిందిత, దోషరహిత, జగజ్జనని యైన రమాదేవియే సీతాదేవి. (చౌ॥ 1-5)

దేవతలందఱును ఆమెకృపాకటాక్షములను కోరుకొనుచున్నను, ఆమె వారిని కన్నెత్తియైనను చూడదు. అట్టి లక్ష్మీదేవి తనసహజచాంచల్యములనుగూడ మఱచి శ్రీరామచంద్రప్రభుచరణ కమలములయందు అచంచలప్రేమ కలిగియుండెను. (దో॥ 24)

సోదరులందఱును శ్రీరామునిపాదపద్మములను మిగులప్రేమతో సేవించుచుండిరి. కృపాళువైన ప్రభువు ఎప్పుడేయాజ్ఞను ఇచ్చునోయని నిరీక్షించుచుండిరి. శ్రీరాముడుగూడ సోదరులపై ఎంతేని అనురాగము గలిగియుండెను.

వారికి అనేకరీతుల అనువగు నీతిమార్గములను బోధించుచుండెను. నగరవాసులు ప్రసన్నచిత్తములతో దేవతలకును దుర్లభమైన సౌఖ్యములను అనుభవించుచుండిరి. శ్రీరామచంద్రప్రభుచరణములపై భక్తిని ప్రసాదింపుమని నిరంతరము వారు బ్రహ్మదేవుని ప్రార్థించుచుండిరి. సీతాదేవికి, 'లవకుశులు' అను ఇరువురు (కవల) కుమారులు ఉదయించిరి. వారు రణకోవిదులు, వినయమునకును సద్గుణములకును నిధానములు, అత్యంత సుందరులు. శ్రీరామునకు ప్రతిబింబములు. శ్రీరాముని సోదరులకును ఒక్కొక్కరికి ఇద్దఱేసి కుమారులు కలిగిరి. వారందఱును సుందరులు, సుశీలురు, సద్గుణ సంపన్నులు. (చౌ॥ 1-4)

శ్రీరాముడు జ్ఞానమునకును, వాక్కునకును, ఇంద్రియములకును, అగోచరమైనవాడు, జన్మరహితుడు మాయకును, మనస్సునకును, త్రిగుణములకును అతీతుడైన సచ్చిదానంద పరబ్రహ్మ. అతడు మానవునిగా మనోహర లీలలను ప్రదర్శించుచు అందఱిని ఆహ్లాదపఱచుచుండెను. (దో॥ 25)

శ్రీరామచంద్రుడు ఉషఃకాలమునందే సరయూనదిలో స్నానములనాచరించి, బ్రాహ్మణులతో సజ్జనులతో సభాసీనుడగుచుండును. వసిష్ఠమహర్షి వేదపురాణములను పఠించును. సర్వజ్ఞుడైన శ్రీరాముడు వాటిని శ్రద్ధగా వినును. ప్రభువు సోదరులతోగూడి భుజించుచుండును. ఈ దృశ్యము మాతలకు నయనానందమును గూర్చును. భరతశత్రుఘ్నులిద్దఱును హనుమంతునితో గలిసి, ఉపవనములకు వెళ్లెదరు. అచటగూర్చొని, శ్రీరామచంద్రుని లోకోత్తరకథలను అడిగెదరు. హనుమంతుడు తనబుద్ధి బలమునననుసరించి, ప్రభుగుణగానమున నిమగ్నుడగు చుండును. ప్రభువు యొక్క నిర్మలగుణములను విని, సోదరులిద్దఱును అతి ప్రసన్నులై వాటిని మాటిమాటికిని తెల్పుమని సవినయముగా ప్రార్థింతురు. నగరవాసులఇండ్లలో పౌరాణికగాథలు శ్రీరాముని పవిత్రకథలు అనేకములువినబడుచుండును. స్త్రీపురుషులందఱును శ్రీరామునిగుణ విశేషములను ప్రస్తుతించుచు, ఆనందమగ్నులై రాత్రింబవళ్లు గడచిపోవుటను గమనింపకుండిరి. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుడు విరాజమానుడైయున్న అయోధ్యాపురమునందలి జనులసుఖసంపదలను వేలకొలది శేషులుసైతము వర్ణింప జాలరు. (దో॥ 26)

నారదాదిమహర్షులును, సనకాదిమునీశ్వరులును, కోసలాధీశుడగు శ్రీరాముని దర్శనమునకై నిత్యము అయోధ్యకు ఏతెంచుచుండిరి. నగర వైభవమును జూచి, వారు తమ వైరాగ్యమును గూడ మఱచుచుండిరి. బంగారుమణులతో నిర్మింపబడిన పైఅంతస్థులు, చిత్రవిచిత్ర వర్ణములతో కనువిందుగావించుచున్న భవనములలోపలిభాగములు, సందర్శకులను ఆకర్షించు చుండెను. నగరమునకు నాలుగువైపులయందునుగల సుందరప్రాకారములపై వివిధవర్ణములతో చిత్ర విచిత్రములైన బురుజులు నిర్మింపబడియుండెను. నవగ్రహములు అసంఖ్యాకబలములతో గూడి అమరావతీనగరమును చుట్టియున్నారా? అనునట్లుగ అవి శోభిల్లుచుండెను. అనేక వర్ణముల స్ఫటికశిలలు పఱచబడినవీధులను, కూడళ్లను గాంచి మునీశ్వరులమనస్సులును ఆనందహేలలలో తేలియాడుచుండెను. ధవళకాంతులను విరజిమ్ము సౌధములు ఆకాశమును ముద్దాడుచుండెను. వాటిపైగల కలశములు తమకాంతులచే సూర్యచంద్రులనుగూడ అధఃకరించుచుండెను. భవనములయందలి కిటికీలు మణిఖచితములై యుండెను. ప్రతి గృహములో మణులు దీపకాంతులను విరజిమ్ముచుండెను. (చౌ॥ 1-4)

భవనములలో మణులదీపద్యుతులు దేదీప్యమానముగా వెలుగుచుండెను. పగడములచే పొదగబడిన కడపలకాంతులు కన్నులకు మిఱుమిట్లుగొలుపుచుండెను. మణిస్తంభములు, మరకతములతో విలసిల్లు బంగారుగోడలు, అతి సుందరములై బ్రహ్మ దేవుని శిల్పకౌశలమును ప్రకటించుచుండెను. భవనములు అతిసుందరములు, మనోజ్ఞములు, అతివిశాలములు. వాటి ప్రాంగణములు అత్యంత రుచిరస్ఫటికనిర్మితములు. ప్రతిద్వారకవాటము వివిధవజ్రములచే పొదగబడి, బంగారముతో నిర్మింపబడి యుండెను. (ఛం)

ప్రతియింటిలో చిత్రశాలలు గలవు. వాటిలో శ్రీరామునిలోకోత్తరలీలలు రమణీయకుడ్యములపై మనోజ్ఞముగా చిత్రితములై యుండెను. అవి మునులచిత్తములనుగూడ ఆకర్షించుచుండెను. అనగా వాటిని చూచి మునులు భగవల్లీలలయందు మునిగి, తమ ధ్యాసలనే మఱచిపోవుచుండిరి. (దో॥ 27)

ప్రజలు నానావిధపుష్పవాటికలను పెంచియుండిరి. వాటియందనేకజాతులకు చెందిన మనోహరలతలు పుష్పించి, సర్వదా వసంత-ఋతుశోభలను వెలార్చుచుండెను. వాటిపై వ్రాలిన తుమ్మెదలు మధురఝుంకారములను వినిపించుచుండెను. శీతలమందసుగంధపవనములు ఎల్లవేళల వీచుచుండెను. బాలురు అనేకవర్ణములపక్షులను పెంచుచుండిరి. అవి మధురముగా కూయుచుండెను. ఎగురునపుడు వాటి సౌందర్యము ఇనుమడించుచుండెను. భవనములపై అతి సుందరములైన నెమళ్లు, హంసలు, కొంగలు, పావురములు, మణిఖచితకుడ్యములపై తమ ప్రతిబింబములను జూచుకొనుచు, కూజితములనొనర్చుచు, నాట్యములాడుచుండెను. బాలురు చిలుకలకును, గోర్వంకలకును "రఘుపతి రాఘవ రాజారామ్, పతిత పావన సీతారామ్" అను పాటను నేర్పుచుండిరి. రాజభవనప్రవేశద్వారములు అతిసుందరములు. వీధులు, కూడళ్లు, అంగళ్లు అతిమనోహరములు. (చౌ॥ 1-4)

సాక్షాత్తు లక్ష్మీపతియే అక్కడి పరిపాలకుడు అగుటవలన వస్తువులన్నియు సమృద్ధములై యుండెను. నానావిధసంపదలకును కొదువలేకుండెను. కనుక సమస్తవస్తువులును సమృద్ధిగా ఉచితముగా (మూల్యముతో పనిలేకుండ) లభ్యమగుచుండెను. అక్కడి సంపదలును, అంగళ్ల సౌందర్యములును, వర్ణనాతీతములు. వస్త్రవ్యాపారులు, వెండి, బంగారు వర్తకులు కుబేరులవలె ఉండిరి. స్త్రీ పురుషులును, బాలురును, వృద్ధులును, అందఱును సచ్చరిత్రులై, అందచందములు గలిగి హాయిగానుండిరి. (ఛం)

అయోధ్యకు ఉత్తరదిశయందు సరయూనది ప్రవహించుచున్నది. అందలి జలములు నిర్మలములు, గంభీరములు,మధురములు. ఘట్టములు అతిసుందరములు. తీరములయందు ఏమాత్రము బురదయే లేకుండెను. (దో॥ 28)

కొద్ది దూరమున ఒక విశాలమైన ఘట్టము గలదు. అక్కడ గజాశ్వముల సమూహములు నీరు త్రాగుటకై వచ్చును. స్త్రీలు నీరు తీసికొని పోవుటకు వేఱుగా అనేకఘట్టములు గలవు. అవి మిక్కిలి మనోహరములు. పురుషులచట స్నానములు చేయరు. అన్నిటికంటెను సుందరమైనది, శ్రేష్ఠమైనది రాజ ఘట్టము. అచట అన్ని వర్ణములపురుషులు స్నానము చేసెదరు. సరయూ తీరముల యందు అనేక దేవాలయములు గలవు. వాటికి నాలుగు వైపుల సుందరోద్యానములు గలవు. సరయూ నదీ తీరమున అచ్చటచ్చట విరాగులైన మునులు, సన్న్యాసులును నివసించుచుందురు. వారు సర్వదా జ్ఞానవిషయనిరతులైయుందురు. నదీతీరములయందు వారు తులసిమొక్కలను నాటిరి. అయోధ్యానగరశోభ వర్ణనాతీతము. నగరమువెలుపలగూడ అంతటి సౌందర్యమే అలరారుచున్నది. అయోధ్యానగరసౌందర్యదర్శనమాత్రముననే సకలపాపములు తాపములు ఉపశమించును. అది వనములు, ఉపవనములు, వాపీకూప తటాకములచే సుశోభితమై విలసిల్లుచున్నది. (ఛం॥ 1-4)

వాపీకూపతటాకములు మిక్కిలి శోభాసంపన్నములై యున్నవి. అవి అతివిశాలములై మనోహరముగానున్నవి. వాటిసుందరసోపానములను నిర్మలజలములను జూచి, దేవతలు మునులుగూడ ముగ్ధులగుచుండిరి. తటాకములయందు వివిధవర్ణములుగల కమలములు వికసించుచుండెను. పెక్కుపక్షులు కలరవములు చేయుచుండెను. భ్రమరములు ఝుంకారములను గావించుచుండెను. కోకిలలు మొదలగు పక్షులు తమ మధురస్వరములతో రమణీయములైన ఆ వనములకు బాటసారులను ఆహ్వానించుచున్నవా? అనునట్లుండెను. (ఛం)

సాక్షాత్తు లక్ష్మీపతి ప్రభువుగా నున్న ఆ నగరమును వర్ణించుటకెవరితరము? అణిమాది-అష్ట సిద్ధులకును, సుఖసంపదలకును, ఆ పురము నెలవైయుండెను. (దో॥ 29)

అచటి ప్రజలందఱును శ్రీరామునిగుణములనే కీర్తించుచుండిరి. శరణాగతరక్షకుడు, రూపగుణశీల శోభాయుతుడు ఐన శ్రీరాముని భజింపుడని ఒకరికొకరు ఉపదేశములను చేయుచుండిరి. ఇంకను వారు ఇట్లు నుడువుచుండిరి." కమల నేత్రుడు శ్యామసుందరుడు ఐన ప్రభువును భజింపుడు. తనభక్తులను కంటికిఱెప్పవలె కాపాడెడి ఆ ప్రభువును భజింపుడు. అతడు సుందరములైన ధనుర్బాణములను, తూణీరమును ధరించిన వాడు, సజ్జనులనెడి కమల వనమును వికసింపజేయు సూర్యుడు, మృత్యువనెడి భయంకరసర్పమును కబళించుఖగరాజు, స్వార్థభావరహితులై ప్రణమిల్లినవారిఅహంకారమమకారములను దూరముచేయు ప్రభువు, లోభము, మోహము అను మృగములను రూపుమాపు వేటగాడు, కామమనెడి గజమును పరిమార్చెడి సింహము, సేవకులకు సుఖములను చేకూర్చుచు, వారి శోకసంకటములనెడి చిమ్మ చీకట్లను పటాపంచలొనర్చు సూర్యుడు, రాక్షసులనెడి వనమును భస్మమొనర్చుటలో అగ్ని తుల్యుడు. జననమరణభయమును దూరమొనర్చునట్టి జానకీరాముని భజింపుడు. అనేకపూర్వ జన్మవాసనలనెడి దోమలను నాశమొనర్చు హిమరాశియైన శ్రీరాముని సేవింపుడు. సదా పరిణామరహితుడు, జన్మమృత్యువులు లేనివాడు, మునులకు బ్రహ్మానందమును గూర్చువాడు, పృథ్వీభారమును బాపువాడు, ఉదారగుణసంపన్నుడునై తులసీదాసునకు ప్రభువగు శ్రీ సీతారామచంద్రుని స్మరింపుడు." (చౌ॥ 1-5)

ఈ విధముగా నగరప్రజలందఱును శ్రీరామచంద్రునిగుణములను గానము చేయుచుండిరి. కృపానిధియైన శ్రీరాముడు వారియెడల అత్యంతప్రసన్నుడై యుండెను. (దో॥ 30)

(కాకభుశుండి తెలుపుచున్నాడు) ఓ పక్షిరాజా! గరుడుడా! శ్రీరామచంద్రునిప్రభుత్వమనెడి ప్రచండసూర్యోదయమైనప్పటినుండియు ముల్లోకములయందంతటను నిరుపమానప్రకాశము నిండెను. దీనివలన పెక్కుమందికి సుఖము, ఇతరులకు దుఃఖము కలిగెను. దుఃఖితులైన వారిని గూర్చి వివరింతును. (ముల్లోకములును ప్రకాశమానములు కాగానే) అవిద్యయను రాత్రి అంతరించెను. పాపములనెడి గ్రుడ్లగూబలు ఎక్కడివక్కడ దాగుకొనెను. కామక్రోధములనెడి కుముదములు ముకుళించుకొనెను. బంధకారకములగు వివిధకర్మలు, గుణములు, కాలస్వభావములు అనెడి చకోరపక్షులు సుఖములను కోల్పోయెను. అభిమానము, మోహము, మదము, మత్సరము అనెడి చోరులు తమ చాతుర్యమును చూపుటకు అవకాశమే లేకుండెను. కాని ధర్మమనెడి సరోవరమున జ్ఞానవిజ్ఞానములనెడి నానావిధ కమలములు వికసించెను. సుఖ సంతోషములు, వివేక వైరాగ్యములు అను చక్రవాక పక్షులు శోకరహితములాయెను. (చౌ॥ 1-4)

ఎవరి హృదయకమలములపై శ్రీరామభద్రుని ప్రభుత్వమనెడి సూర్యకిరణములు ప్రసరించునో వారిలో ధర్మము, జ్ఞానవిజ్ఞానములు వివేకవైరాగ్యములు, సుఖసంతోషములు పెంపొందును, అవిద్య, పాపము, కామ క్రోధములు, కాల కర్మగుణ స్వభావములు అంతరించును. (దో॥ 31)

ఒకసారి శ్రీరామచంద్రప్రభువు సోదరులను వెంటబెట్టుకొని, హనుమంతునితో గూడి, అందమైన ఒక ఉపవనమును జూచుటకు వెళ్లెను. ఆ తోటలోని వృక్షములన్నియును సుమశోభితములై యుండెను. అవి చిగురుటాకులతో రమణీయములై యుండెను. అది సరియైన సమయమని గ్రహించి, సనకాది మహామునులచ్చటికేతెంచిరి. వారుతేజోరాసులు, సద్గుణ శీల సంపన్నులు, సర్వదా బ్రహ్మానందనిమగ్నులు. చూచుటకు బాలురవలెనున్నను జ్ఞాన వయోవృద్ధులు, చతుర్వేదములే సాక్షాత్కరించినట్లుండిరి. ఆ మునులు

సమదృష్టిగలవారు, భేద భావములకు అతీతులు, (సర్వత్ర బ్రహ్మమునే దర్శించువారు.) దిసమొలలవారు. శ్రీ రఘునాథుని కథా ప్రసంగములు జరుగు చోట వారు వాటిని ప్రత్యక్షముగా వినుచుందురు. అది వారి స్వభావము (శివుడు పలుకుచున్నాడు) శర్వాణీ! సనకాదిమునులు అంతకుముందు అగస్త్యుని ఆశ్రమమునకు వెళ్లియుండిరి. అచ్చట అగస్త్యమహాముని వారికి శ్రీరామునిగాథను వివిధరీతుల వర్ణించి చెప్పియుండెను. శ్రీరామకథాశ్రవణమువలన వారిలో 'రామ దర్శనాభిలాష' పెల్లుబికెను. ఆ కోరికతో వారు శ్రీరాముని జూడవచ్చిరి. అరణి అగ్నిని ఉత్పన్నము చేయునట్లు రామకథలు జ్ఞానోదయమును కలిగించును. (చౌ॥ 1-4)

శ్రీరాముడు సనకాదిమునులను చూడగానే వారికి సాష్టాంగప్రణామములను ఆచరించి, కుశలములనడిగి, వారికి (కూర్చొనుటకు) ఆసనముగా తనపట్టు పీతాంబరమును పఱచెను. (దో॥ 32)

తదనంతరము హనుమంతునితోగూడి ముగ్గురుసోదరులును వారికి దండప్రణామముల నాచరించిరి. అందఱును ప్రసన్నులైరి. శ్రీ రఘురాముని నిరుపమానసౌందర్యము వారి మనస్సులను దోచెను. ఆ దర్శనానందములో వారు పరవశులైయుండిరి. మనసులు వారి అధీనములో లేకుండెను. భవభయమును పాఱద్రోలు నట్టి శ్యామ శరీరుడు, కమలనయనుడు, సౌందర్య రాశియునైన శ్రీరామచంద్రుని వారు ఱెప్పలార్పక తనివితీరజూచుచు నిలబడిపోయిరి. అంజలి ఘటించి, ప్రభువు వారియెదుట వినమ్రుడై నిలిచి యుండెను. వారిప్రేమపారవశ్యస్థితిని చూచి, రఘురాముని కన్నులలో ప్రేమాశ్రువులు నిండెను. తనువు రోమాంచమయ్యెను. ప్రభువు వారిచేతులను బట్టుకొని కూర్చుండబెట్టి, మధురముగా పలికెను. "మునీశ్వరులారా! నేడు నేను ధన్యుడను. మీ దర్శనమాత్రముననే పాపములన్నియును నశించును. సజ్జనులసాంగత్యము మహద్భాగ్యవశమున లభించును. దానివలన ఎట్టిశ్రమయు లేకుండగనే జననమరణచక్రము భంగమగును. (చౌ॥ 1-4)

సజ్జనుల సాంగత్యము మోక్షమును ప్రసాదించును. కాముకుల సాంగత్యము భవబంధములలో చిక్కుపడజేయును. సజ్జనులు, కవులు, పండితులు, వేదపురాణాదిగ్రంథములు ఇట్లే నుడువు చుండుట లోకవిదితము. (దో॥ 33)

సనకాదులు శ్రీరాముని స్తుతించుట

శ్రీరామచంద్రప్రభువచనములను విని, నలుగురు మునీశ్వరులును హర్షించిన వారై, పులకిత గాత్రులై స్తుతింపసాగిరి. "భగవన్! మీకు జయము. మీరు అనంతులు, నిర్వికారులు, అనఘులు, అనేకరూపములు గల్గియున్నను మీరద్వితీయులు. కరుణామయులు, త్రిగుణరహితా! గుణ సాగరా! మీకు జయము. మీరు సుఖధాములు, సుందరులు, కడుసమర్థులు. ఓ ఇందిరారమణా! భూధరా! మీకు జయము. మీరు నిరుపమానులు, జన్మ రహితులు, అనాది, సౌందర్య నిధులు. జ్ఞానమునకు ఆధారులు. అహంభావము, మదము లేనివారు. గౌరవయశస్సులను గూర్చువారు. వేదపురాణములు మీ పావనయశోవైభవములను స్తుతించుచుండును. మీరు తత్త్వజ్ఞులు, సేవకుల సేవలను గుర్తించువారు. అజ్ఞానమును పాఱద్రోలువారు. నిరంజనులు, మీకనేక నామములున్నను నామమునకు అతీతులు. సర్వరూపులు, సర్వవ్యాప్తులు. అందఱి హృదయములలో నివసించియుండువారు. మమ్ము పాలింపుడు. రాగద్వేషములు, హర్షవిషాదములు, జన్మమృత్యువులు మొదలగు ద్వంద్వములనుండియు, సంసారవ్యామోహములనుండియు మమ్ము కాపాడుడు. శ్రీ రామా! మీరు మా హృదయములలో నివసించి, కామమును, మదమును తొలగింపుడు. (చౌ॥ 1-4)

ఓ పరమానంద స్వరూపా! కృపానిధానా! మనోభీష్ట ప్రదాతా! శ్రీరామా! మాకు మీ నిశ్చలభక్తిని ప్రసాదింపుడు. (దో॥ 34)

ఓ రఘునాథా! మాకు మీ నిర్మలభక్తిని ప్రసాదింపుడు. అది మమ్ము అత్యంత పవిత్రులనుగా చేయును, తాపత్రయములనుండియు, జననమరణక్లేశములనుండియు రక్షించును. శరణుజొచ్చినవారికోరికలను దీర్చు కామధేనువు, కల్పతరువు ఐన ప్రభూ! ప్రసన్నుడవై మాకు ఈ వరమును ప్రసాదింపుము. ఓ రఘునాథా! మీరు జన్మమృత్యురూపసముద్రమును శుష్కింపజేయుటయందు అగస్త్యులవంటివారు. సేవకులకు సులభుడవు, సుఖప్రదాతవు. దీన బంధూ! మనోజనితదుస్సహదుఃఖములను రూపుమాపువాడవు. మాలో సమదృష్టిని విస్తరింప జేయుడు. ఆశాభయములను, ఈర్ష్యను తొలగించి, మీరు వినయవివేకవైరాగ్యములను విస్తరింప జేయువారు. రాజమకుట మణీ! పృథ్వీ భూషణమా! జనన మరణ నిరంతర ప్రవాహమును దాటుటకు నౌకయైన మీ పరమభక్తిని ప్రసాదింపుడు. మునిమానససరోవర హంసమా! బ్రహ్మ శివులకును మీ చరణకమలములు పూజనీయములు. రఘువంశశిరోమణీ! నీవు వేదమర్యాదలను రక్షించువాడవు, కాల, కర్మ, స్వభావ, గుణబంధములనుండి ముక్తిని ప్రసాదించువాడవు, సంసారసాగరమునుండి తరింపజేయువాడవును, ముక్తి స్వరూపుడవును నీవే. నీవు సర్వదోషములను తొలగించువాడవు. తులసీదాసునకు స్వామివి. త్రిభువనములకును అలంకారమైన వాడవు."
(చౌ॥ 1-5)

ఈ విధముగా స్వామిని అనేకవిధముల స్తుతించి, భక్తి ప్రపత్తులతో ప్రణమిల్లి, తాము కోరుకొనిన వరములను పొంది, సనకాది మహామునులు బ్రహ్మలోకమునకు చేరిరి. (దో॥ 35)

సనకాదిమునులు బ్రహ్మలోకమునకు వెళ్లిన పిదప సోదరులందఱును శ్రీరామచంద్రునకు శిరసా ప్రణమిల్లిరి. (ఒక విషయమును గూర్చి) ప్రభువునడుగుటకు సంకోచించుచు ఆసోదరులు మారుతి వైపు చూచిరి. అన్ని భ్రమలను నివారించు ప్రభువాణిని 'ఆయన ముఖతః' వినదలిచిరి. అంతర్యామియైన ప్రభువునకు అన్నియు తెలియును. ఐనను ఆయన 'మారుతీ! విషయమేమి? తెలుపుము-' అని పలికెను. అపుడు వాయుసుతుడు చేతులు జోడించి, ఇట్లనెను. "దీనదయాళూ! ప్రభూ! భరతులవారేదియో అడుగదలచినారు. కాని అడుగుటకు వారిమనస్సు సంకోచ పడుచున్నది." శ్రీరామచంద్రుడు నుడివెను. "హనుమా! నీవు నాస్వభావమును ఎఱుగుదువు. నాకును భరతునకును మధ్య ఎట్టి భేదమూలేదు." ప్రభు వచనములను విని, భరతుడు ఆయన పాదములను పట్టుకొని వచించెను. "ప్రభూ! శరణాగత దుఃఖహరణా! వినుము. (చౌ॥ 1-4)

సోదరులకు శ్రీరాముని ఉపదేశము

ప్రభూ! ఎట్టి సందేహము గాని, శోక మోహములు గాని, స్వప్నములోగూడ నాకు కలుగవు. దయానిధీ! ఆనంద స్వరూపా! ఇది కేవలము మీ కృపాఫలమే. (దో॥ 36)

ఐనప్పటికిని ఓ దయానిధానా! సాహసించి ఒక విన్నపమును జేసెదెను. నేను మీ సేవకుడను. మీరు సేవకులకు సుఖప్రదాతలు. రఘునాథా! వేదపురాణములు సజ్జనుల మహత్త్వమును గూర్చి మిగుల ప్రస్తుతించినవి. మీరుగూడ 'మీ ముఖతః' వారిని ప్రశంసించితిరి. వారిపై మీ ప్రేమ అపారము. ప్రభూ! నేను సజ్జనులలక్షణములను వినగోరెదను. మీరు దయానిధులు, జ్ఞాన గుణ సముద్రులు. శరణాగతరక్షకా! సాధు-అసాధువులలోగల భేదములను వివరింపుడు." శ్రీరాముడు పలికెను. "సోదరులారా! వినుడు. సజ్జనుల లక్షణములు అనేకములు. అవి వేదపురాణములలో ప్రసిద్ధములు. సజ్జనులు చందనవృక్షమువంటివారు. దుర్జనులు గొడ్డలివంటివారు. గొడ్డలి చందనవృక్షమును నఱికివేయును. కాని! చందనవృక్షము తనను నఱికినగొడ్డలికే తన సువాసనను గూర్చును.
(చౌ॥ 1-4)

ఈ స్వాభావికగుణములవలననే చందనము అందఱికిని ప్రియమైనది. అది దైవశిరస్సులను గూడ అధిరోహించును. కాని అప్రియమైనందున గొడ్డలి ముఖమును నిప్పున గాల్చి, సమ్మెటతో గొట్టెదరు. (దో॥ 37)

సజ్జనులు విషయవాసనాలోలురు గారు. వారు సుశీలసద్గుణాకరులు. ఇతరులదుఃఖములను తమదుఃఖములుగా, ఇతరుల సుఖములను తమ సుఖములుగా భావించెదరు. వారు అన్నిటి యందును, అన్ని చోట్లను అన్ని సమయములయందును సమత్వము కలిగి యుందురు. వారి మనస్సులలో శత్రుత్వము ఉండదు. వారు అభిమానరహితులు, విరాగులు. వారిలో లోభము, క్రోధము, హర్షము, భయము లేశమాత్రముగూడ ఉండవు. వారి హృదయములు కోమలములు, దీనులయెడ, దుఃఖితులపైనను దయచూపుదురు. మనోవాక్కర్మలచే నాపై నిష్కపటభక్తిని గల్గి యుందురు. వారు స్వయముగా అభిమాన రహితులై ఇతరులను సమ్మానించెదరు. భరతా! ఇట్టి సజ్జనులు నాకు ప్రాణతుల్యులు. వారికి ఎట్టి కోరికలును ఉండవు. వారు నా నామస్మరణమునందే నిరతులు. సజ్జనులు శాంతి, వైరాగ్యము, వినయము, ప్రసన్నత కలిగి యుందురు. వారిలో శీతలత్వము, సరళత, అందఱియెడ మిత్రభావము, బ్రాహ్మణభక్తి ఉండును. ఇదియే ధర్మమునకు మూలము. సోదరా! ఈ లక్షణములు గల వారిని సజ్జనులుగా భావింపుము. వారు శమ, దమ, నియమ, నీతి మార్గములనుండి ఎన్నడునూ వైదొలగరు. వారెప్పుడును పరుష వచనములను పలుకరు. (చౌ॥ 1-4)

నిందాస్తుతులను సమానముగా భావించువారు, నా పాదపద్మములయందు అనన్యప్రేమ కలిగియుండువారు సజ్జనులు. వారు నాకు ప్రాణసములు. గుణధాములు, ఆనందస్వరూపులు. (దో॥ 38)

ఇక దుర్జనుల లక్షణములను వినుము. పొరపాటునగూడ వారితో సాంగత్యము చేయరాదు. వారి సహవాసము దుఃఖములకు కారణము. దుర్లక్షణములుగల గోవుతో కలిసి తిరుగుటవలన మంచి కపిలగోవుగూడ అట్లే మాఱును. దుష్టులైన వారి హృదయములయందు సంతాప మధికము. వారు ఇతరులసుఖసంపదలను జూచి, అసూయ పడెదరు. ఎప్పుడైనను ఇతరులను గూర్చిన నిందలను విన్నచో త్రోవలో నిధి దొరికినంతగ సంతోష పడెదరు. వారు కామ క్రోధ లోభ మద పరాయణులు. నిర్దయులు, కపటులు, కుటిలురు, పాపిష్ఠులు. వారు అకారణముగా ఇతరులతో వైరము పూనెదరు. మేలుచేసినవారికే కీడు తలపెట్టెదరు. వారి ఆదానప్రదానములన్నియును సత్యదూరములు, స్వార్థదృష్టితో చేయబడునవి. అనృతమే వారిభోజనము. వారు అన్ని విషయములయందును అనృతమే పలికెదరు. నెమలికూత (క్రేంకారము)మధురము. కాని దాని ఆహారము మహావిషసర్పములు. అట్లే దుర్జనుల మాటలు మిక్కిలి మధురములు. కాని వారి హృదయములు మిగులవిషపూరితములు, కఠినములు. (చౌ॥ 1-4)

దుష్టులు ఇతరులతో నిష్కారణముగా వైరముపూనెదరు. పరస్త్రీల యందును, ధనము నందును ఆసక్తులైయుందురు. పరులు నిందలపాలైనచో సంతోషపడుచుందురు. వారు నీచులు, పాపాత్ములు, మానవశరీరములను ధరించిన రాక్షసులు. (దో॥ 39)

దుర్మార్గులకు లోభమే దుప్పటి, లోభమే పఱుపు. (లోభములోనే మునిగి యుందురు.) ఆహార మైథునములయందే నిరతులైయుందురు. యమలోకభయము వారికిఉండదు. ఇతరుల అభివృద్ధిని చూచినను, విన్నను జ్వర పీడితులవలె నిట్టూర్పులు వదలెదరు. ఇతరులకు విపత్తు కల్గినపుడు చూచినను, విన్నను విశ్వమున కంతటికిని రాజైనంతగా సంతోషింతురు. వారు కటికి స్వార్థపరులు. వారు కామలోభలంపటులై, మిక్కిలి క్రోధస్వభావులై, తమ కుటుంబ సభ్యులతోగూడ విరోధము కల్గి యుందురు. వారు తల్లిదండ్రులను, గురువులను, బ్రాహ్మణులను అంతే గాదు ఎవ్వరినీ గుర్తింపరు, గౌరవింపరు. తాము నశించుటయే గాక ఇతరులను గూడ నష్టపఱచెదరు. మోహవశమున ఇతరులతో వైరము వహింతురు. వారికి సజ్జనసాంగత్యమునగాని, హరికథలయందుగాని అభిలాషయేయుండదు. వారు దుర్గుణసాగరులు. మందబుద్ధులు, కాముకులు, వేదములను దూషించువారు. పరధనములనుకబళించువారు.

బ్రాహ్మణులకును, విశేషముగా దేవతలకును, కడకు పరమాత్మకును ద్రోహము చేయుదురు. వారి హృదయము దంభ కపటపూరితము. వంచన చేయుటయే వారి స్వభావము. వారు పయోముఖ విషకుంభములు. చూచుటకు సజ్జనుల వలె కన్పింతురు. (చౌ॥ 1-4)

ఇట్టి అధములు, దుష్టులైన మనుజులు. కృతయుగమునందును, త్రేతాయుగమునందును ఉండరు. ద్వాపరయుగములో స్వల్పముగా ఉండెదురు. కాని కలియుగములో వీరు కోకొల్లలు. వీరి సంఖ్యఅపారము, అగణ్యము. (దో॥ 40)

సోదరా! పరోపకారముతో సమానమైన ధర్మము లేనే లేదు. ఇతరులకు కీడు చేయుటకంటెను వేఱొక పాపమే లేదు. నాయనా! వేదపురాణములలో తెలుపబడిన విషయములను నీకు సంగ్రహముగా వినిపించితిని. పండితులు వీటిని ఎఱుగుదురు. మానవశరీరములను పొందియు ఇతరులకు కీడు తలపెట్టువారు జననమరణచక్రములో పరిభ్రమించుచు, క్లేశములను అనుభవింపవలసియుండును. మనుష్యులు మోహవశమున స్వార్థములో మునిగి, పెక్కు పాపములను చేయుచుందురు. అందువలన వారు సద్గతులను పొందజాలరు. పైగా నరకయాతనలకు గుఱియగుదురు. సోదరా! నేను వారికి యమునితో సమానుడను. వారి మంచి, చెడుకర్మలకు తగినఫలములను ఒసంగెదను. దీనిని ఎఱింగి జ్ఞానులు, సంసారము దుఃఖ రూపమని తెలిసికొని, నన్ను భజింతురు. శుభాశుభఫలములనిచ్చు కర్మలను వదలి, వారు దేవతలకును, మనుష్యులకును, మునీశ్వరులకును అధి దేవతనైన నన్ను భక్తితో భజింతురు. ఇంత వరకును సజ్జన దుర్జనుల లక్షణములను తెల్పితిని. ఈ జనుల గుణదోషములను ఎఱింగిన వారు జననమరణచక్రములో పడరు. (చౌ॥ 1-4)

నాయనా! వినుము. లోకములోని గుణ దోషములు అన్నియును మాయాకల్పితములే. ఈ రెండింటిని చూడకుండుటయే వివేకము. వాటిని చూచుట అవివేకము. (దో॥ 41)

'శ్రీరామచంద్రప్రభుముఖతః' ఈ వచనములను విన్నపిదప సోదరులందఱును ప్రసన్న చిత్తులైరి. ప్రేమతో వారిహృదయములుప్పొంగెను. పదేపదే తమ ఆనందములను ప్రకటించిరి. ముఖ్యముగా ఆంజనేయునకు పట్టరానిఆనందము కలిగెను. పిమ్మట ప్రభువు తన భవనమునకేగెను. ఈ విధముగా ప్రభువు ప్రతిదినము నూతనములైన లీలలను చూపించుచునేయుండెను. నారదముని తఱచుగా అయోధ్యకు వచ్చి, పరమపావనమైన శ్రీరామచరితమును గానమొనర్చుచుండెను. నారదమహర్షి ప్రతిదినము ప్రభువుయొక్క నూతనలీలలను జూచి, బ్రహ్మలోకమున కేగి, వాటిని వర్ణించుచుండెను. బ్రహ్మ దేవుడు వాటిని విని, పరమానందమునొందుచు ఇట్లు పల్కుచుండెను. "నాయనా! శ్రీరాముని గుణములను మాటి మాటికిని తెలుపుము" సనకాదిమునులు నారదుని ప్రశంసించుచుండిరి. వారు బ్రహ్మనిష్ఠాగరిష్ఠులైనను శ్రీరామునిగుణప్రశంసలను వినినప్పుడు బ్రహ్మ సమాధిని మఱచి, శ్రద్ధగా వినుచుండిరి. ఈ కథకు వారు సరియైన శ్రోతలు. (చౌ॥ 1-4)

సనకాది మునులవంటి జీవన్ముక్తులు, బ్రహ్మ నిష్ఠాగరిష్ఠులుగూడ తమబ్రహ్మసమాధిని మాని ప్రభుదివ్యచరిత్రమును వినుచుండగా శ్రీహరికథలను ప్రేమతో విననివారిహృదయములు నిజముగా పాషాణ సదృశములే. (దో॥ 42)

పౌరులకు శ్రీరాముని హిత బోధ

ఒకసారి శ్రీరామచంద్రుడు గురువైన వసిష్ఠ మహర్షిని, బ్రాహ్మణులను ఇతర పుర ప్రముఖులను పిలిపించెను. సభలో గురువుగారు, మునులు, బ్రాహ్మణులు, సోదరులు, ఇతర సజ్జనులు యోగ్యతానుసారము కూర్చొని

యుండగా భవభయబాధలను తొలగించు శ్రీరాముడిట్లనెను. "ఓ పౌరులారా! వినుడు. నేను కేవలము మీమీది మమకారముతో మాత్రమే చెప్పుట లేదు. నేను తెల్పునది నీతిబాహ్యమైనదియుగాదు. అధికారముతోడనూ తెల్పుట లేదు. నేను పలికెడి మాటలను సావధానముగా వినుడు. పిదప మీ ఇష్టము ప్రకారము చేయుడు. నా ఆజ్ఞను పాలించు వారు నాకు సేవకులు, ప్రియులు. సోదరులారా! నేను పలికెడి వచనములలో దోషమున్నచో నన్ను నిస్సంకోచముగా అపుడు. మహాభాగ్యవశమున ఈ మానవజన్మ లభించినది. ఈ దేహము దేవతలకును దుర్లభమని ప్రామాణిక శాస్త్రగ్రంథములలో పేర్కొనబడినది. ఇది ధర్మార్థ కామ (త్రివర్గ) సాధనకు ఉపకరణము, మోక్షమునకు ద్వారము. ఇట్టి శరీరమును పొందియు భగవత్ప్రాప్తికై ప్రయత్నింపనివాడు- (చౌ॥ 1-4)

పరలోకమున దుఃఖమును అనుభవించును. నెత్తి బాదుకొనుచు 'లబో దిబో' యనును. పిదప 'కుయ్యో! మొఱ్ఱో' అనుచు, పశ్చాత్తాప పడును. కాలమును, కర్మను, పైగా భగవంతుని వ్యర్థముగా నిందించును. (దో॥ 43)

సోదరులారా! ఈ శరీరప్రాప్తికి ఫలములు విషయభోగములు గావు. స్వర్గ సుఖభోగములు గూడ అత్యల్పములు. పరిణామమున అవి దుఃఖప్రదములు. కావున మానవశరీరమును పొందినను విషయలోలురైనమూర్ఖులు అమృతమును వదలి, విషమును పానముచేసినవారగుదురు. 'పరుసవేది'ని పోగొట్టుకొని, గురువిందనాశ్రయించు వానిని మూఢుడు, అవివేకి అని అందురు. నాశరహితుడైన జీవుడు నాలుగువిధములైన ఎనుబదినాలుగులక్షలజీవరాసులలో పరిభ్రమించుచుండును. మాయా ప్రేరితుడై, కాలకర్మస్వభావగుణములకు వశుడై, ఈ జీవుడు వివిధయోనులలో జన్మించుచుండును. జీవుని ఈ దయనీయస్థితినిజూచి, నిర్హేతుక దయాళువైన భగవంతుడు వీనికి ఒక్కొక్కప్పుడు మానవశరీరమును ఇచ్చుచుండును. భవసాగరమును దాటుటకు ఈ మానవశరీరము ఒక నావవంటిది. నా అనుగ్రహమే అనుకూలపవనము. సద్గురువు ఈ నావకు కర్ణధారుడు. ఇట్టి దుర్లభ సాధనములు భగవత్కృపవలననే సులభముగా ప్రాప్తించును. (చౌ॥ 1-4)

ఇట్టి సాధనములు లభించినప్పటికిని భవసాగరమునుండి తరించుటకు ప్రయత్నింపనివాడు మందబుద్ధి, కృతఘ్నుడు. అతడు ఆత్మఘాతకుడు పొందెడి గతిని చేరును. (దో॥ 44)

మీరు ఇహ పరలోకములయందుగూడ సుఖములను గోరుకొన్నచో నా మాటలను విని, వాటిని దృఢముగా మనస్సులలో నిలుపుకొనుడు. సోదరులారా! నేను పేర్కొనిన ఈ భక్తిమార్గము 'అతి సులభము, సుఖ ప్రదము' అని వేదములును, పురాణములును తెలుపుచున్నవి. జ్ఞానమార్గము సుగమము గాదు. దానిసాధనలో అనేకవిఘ్నములు ఎదురగుచుండును. జ్ఞానమార్గసాధన కఠినము. దానిలో మనస్సుకు ఆలంబనము దొరకదు. అతికష్టముమీద ఏ యొక్కరికో జ్ఞానము లభ్యమగును. కాని భక్తిరహితమైన జ్ఞానమార్గసాధన నాకు ప్రియముగాదు. భక్తి స్వతంత్ర సాధనము. అన్ని సుఖములకును అది నిధానము. కాని సజ్జనసాంగత్యము లేనిదే ప్రాణులకు ఇది లభింపదు. పుణ్య సమూహము లేకుండ సజ్జన సాంగత్యము ప్రాప్తింపదు. సత్సాంగత్యమే జనన మరణ చక్రమునుండి ప్రాణికోటికి ముక్తిని కలిగించును. మనోవాక్కర్మలచే (త్రికరణ శుద్ధిగా) బ్రాహ్మణులను పూజించుటతో సమానమైన పుణ్యకార్యము ప్రపంచమున మఱియొకటి లేదు. కపటమును వదలి, బ్రాహ్మణసేవచేయువానియెడల మునులు దేవతలుగూడ ప్రసన్నులయ్యెదరు. (చౌ॥ 1-4)

మఱియొక రహస్యవిశేషము గలదు. వినయముతో దానిని ప్రకటించుచున్నాను. శంకరుని భజింపకుండ మానవుడు నా భక్తిని పొందలేడు. అనగా రామానుగ్రహము లభించుటకై శివపూజ ముఖ్యకర్తవ్యము. (దో॥ 45)

భక్తిమార్గమును అనుసరించుటలో కష్టమేమున్నది? తెల్పుడు. ఇందులో యోగమవసరమే లేదు. యజ్ఞ, జప, తపములతోగాని, ఉపవాసములతోగాని పనియే లేదు. కేవలము సరళ స్వభావము కావలెను. మనస్సులో కపటము

ఉండరాదు. లభించినదానితో తృప్తిపడుచుండవలెను. నా(భగవంతుని) సేవకుడనని తెలుపుకొనుచు ఇతరులను నమ్మినచో నాపై విశ్వాసము ఎట్లుండును? ఇంతకంటె ఎక్కువగా చెప్పవలసిది ఏమున్నది? సోదరులారా! నేను చెప్పబోవు దానిని ఆచరించెడివారికే నేను వశుడనగుదును. ఎవ్వరినీ ద్వేషింపనివాడు, ఎవ్వరితోడను పోట్లాడని వాడు, ఆశాభయములు లేనివాడు- ఐనట్టి వానికి సర్వత్ర సుఖమే లభించును. నిష్కామ కర్మల నాచరించు వాడు, ఇంటిపై మమకారము లేనివాడు, గర్వము లేని వాడు, పాప రహితుడు, క్రోధహీనుడు, భక్తిభావమునందు దృఢచిత్తుడు, భగవత్తత్త్వమును ఎఱిగినవాడు, సజ్జన సాంగత్యమునందు ఆసక్తి గలవాడు, విషయ సుఖములనే గాక స్వర్గమును ముక్తిని గూడ తృణ ప్రాయముగా జూచువాడు, భక్తి మార్గమును వీడని వాడు, అన్యమతములను దూషింపని వాడు, సర్వవిధ కుతర్కములను త్యజించు వాడు- (చౌ॥ 1-4)

నా గుణములను కీర్తించుట యందును, నా నామజపము నందును లీనమైయుండువాడు, అట్లే మమతా మద మోహములకతీతుడైన వాడు- పరమాత్మ స్వరూపము నెఱింగి, ఆత్మానందము పొందును. ఆ ఆత్మానందము అనుభవైకవేద్యము. ఆ తీపి తినే వారికే తెలియును.[1] (దో॥ 46)

శ్రీరాముడు పలికిన అమృతవచనములను విని, అందఱును ఆయనపాదములకు ప్రణమిల్లి, ఇట్లు పలికిరి. "ఓ కృపానిధానా! మీరే మా తల్లిదండ్రులు. గురువు, సోదరులు, అన్నియు మీరే. మీరు మాకు ప్రాణములకంటెను ప్రియమైనవారు. శరణాగతులదుఃఖములను నివారించు ఓ శ్రీరామా! మీరే మాసిరిసంపదలు, ఇల్లూ వాకిలీ మీరే. మీరే మాహితైషులు. ఇట్టి అమృతోపదేశమును మీరు తప్ప మఱియొకరు ఈయలేరు. తల్లిదండ్రులుగూడ స్వార్థపరులే. ఓ అసురారీ! ప్రపంచములో ఎట్టి కారణమూ లేకుండ మేలుచేయువారు ఇద్దఱే. మీరు, మీ భక్తులు, మిగిలినవారందఱును స్వప్రయోజనములను ఆసించియే మైత్రి చేయుదురు. ప్రభూ! స్వప్నమునందును వారికి పరమార్థ భావము రాదు." ప్రేమపూర్ణములైన వారివచనములను విని, శ్రీరామచంద్రుని హృదయము మిక్కిలి ప్రసన్నమయ్యెను. పిమ్మట ప్రభునాజ్ఞగైకొని, ఆ మధురోపదేశ వచనములను స్మరించుచు అందఱును తమతమ గృహములకు ఏగిరి. (చౌ॥ 1-4)

(శివుడు పలుకుచున్నాడు) ఓ ఉమా! అయోధ్యావాసులైన స్త్రీ పురుషులందఱును కృతార్థులు. ఏలనన వారి ప్రభునే స్వయముగా పరమానంద స్వరూపుడైన శ్రీరఘునాథుడు గదా! (దో॥ 47)

శ్రీరామునకు వసిష్ఠుని విన్నపము

ఒకసారి వసిష్ఠమహాముని సుఖధాముడైన శ్రీరామునియొద్దకు వచ్చెను. రఘునాథుడు ఆయనను మిక్కిలి ఆదరముతో గౌరవించి, ఆయనకాళ్లు కడిగి, ఆ పాదోదకమును గ్రోలెను. వసిష్ఠముని చేతులు జోడించి, పలికెను. "ఓ కృపాళూ! శ్రీరామా! నా విన్నపమును ఆలకింపుడు. మీరు ఆచరించుచున్న మానవోచితకార్యములను జూచి, నా హృదయము అపార మోహమగ్నమగుచున్నది. హే భగవన్! మీ మహిమ అపారము. దానిని వేదములుగూడ తెల్పజాలవు. నేనేవిధముగ తెలిసికొనగలను? పురోహితుని పని అతి నిమ్న శ్రేణికి చెందినది. వేద పురాణ స్మృతులుగూడ దానిని నిందించును. రఘువంశమునకు పురోహిత కార్యమును నేను స్వీకరింపక ముందు బ్రహ్మదేవుడు నాతో పలికెను. 'కుమారా! నీవీ పనిని స్వీకరింపుము. దీని వలన నీకు మున్ముందు లాభము కలుగును. పరమాత్మయే స్వయముగా మానవరూపముతో రఘుకుల భూషణుడై జన్మించును.' (చౌ॥ 1-4)

1. రామనామమే లడ్డంట
అది తినే వారికే తీపంట

అప్పుడు నేను మనస్సులో ఆలోచించితిని. జనులు ఎవరి కొఱకు యోగములు, యజ్ఞములు, వ్రతములు, దానములు మున్నగు ధర్మకార్యములను చేయుదురో అట్టి పరమాత్మను నేను ఈ పురోహిత కార్యమువలన పొందగలుగునప్పుడు దీనివంటి మఱియొక ధర్మము ఉండదు. (దో॥ 48)

జపతపోనియమములు, యోగములు, వర్ణాశ్రమధర్మములు, విధ్యుక్తములైన అనేకశుభ కర్మలు, జ్ఞానము, దయ, దమము, తీర్థ స్నానములు- క్షేత్రసందర్శనములు మున్నగునవి ధర్మములని వేదములయందును, సజ్జనులచేతనుచెప్పబడినవి. ప్రభూ! వీటిని ఆచరించుటవలనను, అనేకతంత్రములవలనను, వేదములను పురాణములను అధ్యయనముచేయుటవలనను, వినుట చేతను కలుగు ముఖ్యమైన ఫలమూ, సర్వసాధనలవలన కలిగెడి ఫలమూ ఒక్కటే. అదేమనగా మీ చరణకమలములపై నిరంతరభక్తి కలిగియుండుట. మురికితో కడిగినచో మురికి తొలగునా? నీటిని చిలికినచో నేయి లభించునా? అట్లే రఘునాథా! ప్రేమ, భక్తి అనెడి నీరు లేకుండా అంతఃకరణమునందలి 'అజ్ఞాన మనెడి మైల' తొలగదు. మీ చరణ కమలములపై భక్తి కుదురుకొనిన వాడే సర్వజ్ఞుడు, తత్త్వజ్ఞుడు, పండితుడు అతడే సద్గుణనిధానము, అఖండవిజ్ఞాని, సులక్షణ యుక్తుడు, దక్షుడు. (చౌ॥ 1-4)

ప్రభూ! శ్రీరామా! మిమ్ము ఒక్క వరమును గోరెదను. కృపతో ప్రసాదింపుడు. మీ చరణ కమలములపై నాకుగల భక్తి జన్మజన్మాంతరములయందును తరుగకుండుగాక." (దో॥ 49)

ఈ విధముగా పలికి, వసిష్ఠ మహర్షి తన నివాసమునకు వెళ్లెను. ఆయన హృదయమునందలి మనోభావములు దయాసింధువైన శ్రీరామునకు అత్యంత ప్రీతిని గూర్చెను. పిమ్మట సేవకులకు సుఖప్రదుడైన శ్రీరామచంద్రుడు హనుమంతుని, భరతాది సోదరులను తనవెంట తోడ్కొని, నగరము వెలుపలికి వెళ్లి, రథములను, ఏనుగులను, గుఱ్ఱములను అచటికి తెప్పించెను. అచటివారిని కృపతో చూచి, ప్రేమతో అందఱిని ప్రశంసించెను. వాటిని ప్రజలకు కోరిన విధముగా ఇచ్చివేసెను. సమస్త శ్రమలను దూరము చేయు ప్రభువు రథ గజ తురగములను ఇచ్చివేయుటచే డస్సినవాడై, చల్లని మామిడి తోపునీడలో విశ్రమించెను. భరతుడచ్చట తన వస్త్రమును పఱచెను. ప్రభువు దానిపై ఆసీనుడయ్యెను. సోదరులందఱును సేవలు చేయసాగిరి. పావని వీవనతో వీచు చుండెను. అతని శరీరము పులకితమయ్యెను. కన్నులలో ఆనందాశ్రువులు నిండెను. (శివుడు పలుకుచున్నాడు) ఓ గిరిజా! శ్రీరాముని చరణ కమలములను ఆశ్రయించిన హనుమంతుని కంటెను భాగ్యశాలి ఎవ్వరును లేరు. అతని ప్రేమను, సేవలను ప్రభువు స్వయముగా మాటి మాటికిని కొనియాడెను. (చౌ॥ 1-5)

నారదుడు శ్రీరాముని స్తుతించుట

ఆ సమయముననే నారదమహర్షి మహతిని చేతబూని, అచ్చటికి వచ్చెను. శ్రీరామచంద్రుని యొక్క నిత్యనూతనమనోహరకీర్తిని గానము చేయసాగెను.[1] (దో॥ 50)

"ఓ కమలనయనా! దయతో నన్ను కనికరింపుము. ఓ శోక విమోచనా! నాపై మీ కృపాదృష్టిని ప్రసరింప జేయుము. నీవు నీలకమలములవలె శ్యామసుందరుడవు. మన్మథశత్రువైన శివుని హృదయ కమలమునందలి ప్రేమ మకరందమును ఆస్వాదించుమధుపమవు. రాక్షస బలములను నశింపజేయువాడవు. మునులకును, సజ్జనులకును

1. నారద గానలోలా! నతజనపరిపాలా!
నీరద సమనీలా! నిరుపమగుణశీలా ॥నారద॥ (త్యాగరాజ)

ఆనందమును గూర్చువాడవు. పాపములను రూపుమాపువాడవు. బ్రాహ్మణసమూహములనెడి సస్యములపై వర్షించు సజలమేఘ సమూహామువంటివాడవు. అశరణశరణ్యుడవు. దీనజనపాలకుడవు. నీ అతులపరాక్రమముచే భూభారమునుబాపువాడవు. ఖరదూషణవిరాధులను వధించిన సమర్థుడవు. పరమానంద స్వరూపుడవు. రావణారీ! రాజ శిరోమణీ! దశరథకులకుముదసుధాకరా! నీకు జయము. నీ కీర్తిని వేద పురాణములును, తంత్రశాస్త్రములును ప్రస్తుతించినవి. ఆ కీర్తి దేవతల, మునుల, సజ్జనుల సభలలో గానము చేయబడుచుండును. నీవు కరుణాకరుడవు, దురభిమానమును దూరముచేయువాడవు. సర్వసమర్థుడవు. అయోధ్యకే అలంకారమైన వాడవు. కలియుగ పాపములను రూపుమాపువాడవు. ఓ తులసీదాస ప్రభూ! నీ నామస్మరణము మమకారమును హరించి వేయును. శరణుజొచ్చిన నన్ను రక్షింపుము. (చౌ॥ 1-5)

శ్రీరామచంద్రునిగుణములను కీర్తించిన పిమ్మట నారదమహాముని శోభాసింధువైన శ్రీరాముని తన హృదయమున నిలుపుకొని, బ్రహ్మలోకమునకు వెళ్లెను. (దో॥ 51)

(శివుడు పలుకుచున్నాడు) ఓ గిరిజా! వినుము. నా బుద్ధికి తోచినట్లు ఉజ్జ్వలమైన ఈ కథను నీకు వినిపించితిని. శ్రీరాముని గాథలు అసంఖ్యాకములు. అనంతములు, అపారములు. వేదములు గాని, వాగ్దేవిగాని వాటిని వర్ణించుట అశక్యము. శ్రీరామచంద్రప్రభువు అనంతుడు. ఆయన గుణములు అనంతములు, ఆయన జన్మలు, కర్మలు, నామములు అనంతములు. జల శీకరములను, పృథ్వీ రజఃకణములను లెక్కింప వచ్చునేమోగాని శ్రీరాముని లీలలను ఎంతగా వర్ణించినను పూర్తిగా ప్రకటింపజాలము. ఈ పావన నిర్మలగాథ శ్రీహరిపరమపదమును ప్రాప్తింప జేయును. దీని శ్రవణమున హృదయమునందు అచంచలభక్తియేర్పడును. ఉమా! కాకభుశుండి గరుడునకు వినిపించిన కథను నేను నీకు తెలిపితిని. నేను శ్రీరాముని గుణములను కొన్నింటినే వివరించితిని. భవానీ! ఇప్పుడు నేనేమి చెప్పవలెను? శ్రీరామునికల్యాణప్రదమైనగాథను విని, పార్వతీ దేవి ప్రసన్నురాలయ్యెను. ఆమె అత్యంత వినయముతో మృదు మధురముగా ఇట్లనెను. "ఓ త్రిపురారీ! జన్మమృత్యుభయములను హరించు శ్రీరామునిచరిత్రమును విన్ననేను ధన్యురాలను, కృతార్థురాలను. (చౌ॥ 1-5)

ఓ దయాళూ! మీ కృపవలననే కృతకృత్యురాలనైనాను. మోహరహితనైతిని. ప్రభూ! సచ్చిదానంద స్వరూపుడగు శ్రీరామునిప్రతాపమును దెలిసికొంటిని. నాథా! మీ ముఖచంద్రుడు శ్రీరఘువీర కథామృతమును వర్షించును. ఓ మహాత్మా! ఆ కథాసుధను ఎంతగా గ్రోలినను నాకు తనివితీరుట లేదు. ఈ కథామృతమును మీరు నిరంతరముగా వర్షించుచుండుడు, నేను దానిని ఆస్వాదించుచునే యుందును. (దో॥ 52. క,ఖ)

శ్రీరామకథా శ్రవణమున తృప్తులైనట్లు చెప్పెడివారిని ఆ కథా విశేషరసమును అనుభవింపని వారుగా భావింపవలెను. జీవన్ముక్తులైన మునులుగూడ భగవంతుని గుణరసమాధుర్యములను నిరంతరము ఆస్వాదించుచునేయుందురు. భవసాగరమును దాటగోరువారికి శ్రీరామ గాథ దృఢమైన నౌక వంటిది. విషయలోలురకును శ్రీహరిగుణపుంజములు చెవులకింపుగా మానసోల్లాసములను గూర్చును. చెవులుండియు శ్రీరాముని మధురగాథను విని ఆనందింప లేనివాడెవడు? ఆకథ రుచింపనివాడు నిజముగా జడుడు, ఆత్మ ఘాతకుడు. నాథా! మీరు 'శ్రీరామచరితమానసము'ను గానము చేసితిరి. దానిని విన్న నా ఆనందమునకు హద్దులు లేవు. ఈ కమ్మనికథను కాకభుశుండి గరుడునకు చెప్పినాడని మీరు నాకు తెల్పితిరి. ఇప్పుడు వారి సంవాదమును నాకు వివరింపుడు. (చౌ॥ 1-4)

కాకభుశుండి వృత్తాంతము

కాకి జన్మ నెత్తినను కాకభుశుండి వైరాగ్యమునందును, జ్ఞానవిజ్ఞానములయందును దృఢ చిత్తము గలవాడయ్యెను. అతనికి శ్రీరఘునాథుని భక్తి అబ్బెను. ఈ విషయమున నాకు మిక్కిలి సందేహము గలుగుచున్నది. (దో॥ 53)

ఓ త్రిపురారీ! వినుడు. వేయి మంది మనుష్యులలో ధర్మ పథమున నడచువాడు ఎవడో ఒక్కడు మాత్రమే ఉండును. అట్టి ధర్మ పరాయణులలో కోటి మందికి ఒక్కడు మాత్రమే విషయ వాంఛా విముఖుడై విరాగియైయుండును. అట్టికోటి మంది విరాగులలో ఒక్కడు మాత్రమే 'సమ్యక్' జ్ఞానమును పొందును. అట్టి జ్ఞానులలో కోటికొక్కడు మాత్రమే జీవన్ముక్తుడగును. అట్టి వేయి మంది జీవన్ముక్తులలో సుఖనిధానమైన బ్రహ్మానందమునమగ్నుడైనపురుషుడు అరుదుగా మాత్రమే లభించును. ధర్మపరాయణులు, విరక్తులు, జ్ఞానులు, జీవన్ముక్తులు, బ్రహ్మైక్యమును బొందిన వారు- వీరందఱిలో దురభిమానమునుండియు మాయనుండియు ముక్తుడై, శ్రీరామ భక్తిలో లీనమైన ప్రాణి మిక్కిలి అరుదుగా నుండును. ఓ విశ్వనాథా! అట్టి దుర్లభమైన హరిభక్తిని కాకభుశుండి యెట్లు పొందెను? నాకు విశదముగా తెలుపుడు. (చౌ॥ 1-4)

నాథా! శ్రీరామచంద్రునిపై ఆసక్తుడు, జ్ఞాననిరతుడు, గుణనిధి, స్థిరచిత్తుడు ఐన భుశుండుడు కాకి రూపమును పొందుటకు కారణమేమి? (దో॥ 54)

ఓ కృపాళూ! శ్రీరామచంద్రుని యొక్క ఈ దివ్య మైన మనోహర చరిత్రమును ఆ కాకభుశుండి ఎవరి నుండి పొందెను. ఓ మదనాంతకా! దానిని మీరు ఏ విధముగా వింటిరి? దానిని వినవలెనను కుతూహలము నాలో మెండుగానున్నది. గరుత్మంతుడు గొప్పజ్ఞాని, సద్గుణరాశి, హరిభక్తుడు, ఆ శ్రీహరికి వాహనము, అతి సన్నిహితుడు. ఆయన ఋషులను, మునులను, వదలి, కాకభుశుండి యొద్ద ఈ కథను ఏల వినెను? కాకభుశుండి గరుడుడు అను ఇరువురు భక్తులమధ్య పరస్పర సంభాషణము ఏ విధముగా జరిగెను?" పార్వతీదేవియొక్క సరళమైన, మనోహరములైన పలుకులను విని, శివుడు సంతోషించి, సాదరముగా పలికెను. "ఓ సతీ! నీవు ధన్యురాలవు. నీ బుద్ధి మిక్కిలి పవిత్రమైనది. శ్రీ రఘుపతిచరణములయెడ నీభక్తి అనన్యమైనది. ఇప్పుడా పరమపవిత్రగాథను వినుము. దానిని వినుటవలన దుఃఖములు, భ్రమలు తొలగిపోవును. పైగా శ్రీరామునిచరణములపై విశ్వాసము ఏర్పడును. మనుష్యుడు అనాయాసముగా సంసార సముద్రమును దాటగలుగును. (చౌ॥ 1-5)

ఉమా! నీవు నన్ను ప్రశ్నించిన విధముగనే పక్షి రాజైన గరుడుడుగూడ కాకభుశుండి యొద్దకు వెళ్లి, ఆయనను ప్రశ్నించెను. నేను దానిని సాదరముగా తెలిపెదను. సావధానముగా వినుము. (దో॥ 55)

జనన మరణముల నుండి ముక్తిని గూర్చు ఈ కథను నేను ఏ విధముగా వింటినో దానిని గూడ వినుము. ఓ సుముఖీ! సులోచనా! మొదట నీ అవతారము దక్షుని యింట జరిగెను. అప్పటి నీ నామము 'సతి'. దక్షుని యజ్ఞ వాటికయందు నీకు అవమానము జరుగుట వలన నీవు క్రుద్ధురాలవై యోగాగ్నిలో ప్రాణములను త్యజించితివి. నా అనుచరులు యజ్ఞమును ధ్వంసమొనర్చిరి. ఆ కథలన్నియును నీవెఱింగినవే. అప్పుడు నా మనస్సు అతిచింతాక్రాంతమైయుండుటచే నీ వియోగ దుఃఖమును అనుభవించితిని. విరక్తుడనై, ఉదాసీనభావముతో నేను సుందరములైన వనముల యందును, పర్వతముల యందును, నదీ తటాకముల దృశ్యములను జూచుచు తిరుగుచుంటిని. సుమేరు పర్వతమునకు ఉత్తర దిశయందు అతి దూరమున ఒక అందమైన నీలపర్వతము గలదు. దాని యొక్క నాలుగు శిఖరములును స్వర్ణమయములు. అవి నాకు ఎంతయో నచ్చినవి. ఆనాల్గు శిఖరములపై

వరుసగా విశాల వటవృక్షము, రావి, జువ్వి, మామిడి వృక్షములును గలవు. పర్వతముపై ఒక మనోహర సరస్సుగూడ కలదు. వాటిలోగల మణిమయసోపానములు మనస్సులను ముగ్ధ మొనర్చును. (చౌ॥ 1-5)

ఆ సరోవరజలము శీతలము, నిర్మలము, మధురము. దానిలో అనేకవర్ణముల కమలములు వికసించి యున్నవి. హంసలగణములు మధురముగా కలరవములనుగావించుచున్నవి. తుమ్మెదలు ఝుంకారములు సలుపుచున్నవి. (దో॥ 56)

ఆ మనోహర పర్వతము మీద ఈ పక్షి(కాకభుశుండి) నివసించును. కల్పాంతమునందుగూడ అది చిరంజీవియే. మాయారచితములై విశ్వవ్యాప్తములైన అనేకగుణదోషములును, మోహము, కామము మొదలగు అంతశ్శత్రువులును ఆ పర్వతమును దఱిజేరవు. అక్కడ నివసించు ఆ కాకభుశుండి హరిభజనచేయురీతిని శ్రద్ధగా వినుము. అది రావి చెట్టు క్రింద కూర్చొని, ధ్యానము చేయును. జువ్విచెట్టు నీడలో జపయజ్ఞములను ఆచరించును. ఆమ్ర వృక్షచ్ఛాయలలో మానస పూజలొనర్చును. హరిభజన చేయుట తప్ప దానికి మఱియొక పనియే లేదు. వటవృక్షము క్రింద అది హరికథా ప్రసంగములను గావించును. ఆ కథలను వినుటకై అక్కడ అనేకపక్షులు గుమిగూడును. ప్రేమాదరములతో అది అనేక విధములుగా శ్రీరామగాథను గానము చేయును. విశుద్ధ బుద్ధిగల హంసలు సర్వదా ఆ సరోవరమునందు నివసించుచు ఆ కథను వినుచుండును. అక్కడికి వెళ్లి, ఆ దృశ్యమును చూడగా నా మనస్సు ఆనందతరంగితమయ్యెను. (చౌ॥ 1-5)

నేను కొంత కాలము హంసశరీరమును ధరించి, అచట నివసించితిని. శ్రీ రఘునాథునికథను శ్రద్ధగా విని, తిరిగి కైలాసమునకు వచ్చితిని. (దో॥ 57)

ఓ గిరిజా! నేను కాకభుశుండి యొద్దకు వెళ్లినప్పటి వృత్తాంతమును నీకు వినిపించితిని. పక్షి రాజైన గరుత్మంతుడు భుశుండి కడకేగిన కారణమును వివరించెదను. రఘుపతి మేఘనాదుని చేతిలో తనకు తానే బంధింపబడినప్పటి లీలలను దలచినప్పుడు నాకు మిక్కిలి బిడియము గలిగినది. ఆ సమయమున నారదమహర్షి గరుడుని పంపెను. సర్పభక్షకుడైన గరుడుడు ప్రభు బంధములను తొలగించునపుడు అతని మనస్సులో ప్రగాఢమైన విచారము కలిగెను. ప్రభు బంధములను జ్ఞప్తికి దెచ్చుకొని, గరుడుడు అనేక విధముల ఆలోచింప సాగెను. 'సర్వవ్యాపకుడు, నిర్వికారుడు, వాగధిపతి, మాయాతీతుడు ఐన పరమేశ్వరుడు ఈ జగత్తున అవతరించినాడని విన్నాను. కాని ఆ అవతార ప్రభావమునేమాత్రమూ చూడలేదు. (చౌ॥ 1-4)

శ్రీరామ నామమును జపించుటచే మనుష్యుడు భవబంధములనుండి విముక్తులగుదురు. అట్టి మహిమాన్వితుడైన శ్రీరాముడు ఒకరాక్షసాధమునినాగపాశముచే బంధింపబడుట ఆశ్చర్యకరము". (దో॥ 58)

గరుడుడు తన మనస్సును కుదుట బఱచుకొనుటకు ప్రయత్నించెను. కాని జ్ఞానోదయము కాక పోవుటచే ఆయనహృదయము భ్రమతోనిండిపోయెను. భ్రమోత్పన్నమైన దుఃఖము అతనిని బాధించెను. మనస్సులోకుతర్క మధికమై అతడు నీ వలెనే మోహ విష్టుడయ్యెను. వ్యాకులుడై నారద మహర్షి యొద్దకు వెళ్లి, తన మనస్సులోని సందేహమును ఆయనకు తెలిపెను. నారదునకు అతనిపై జాలి కలిగి ఇట్లు పలికెను. "ఓ గరుడుడా! వినుము. శ్రీరామునిమాయ అతి ప్రబలమైనది. అది జ్ఞానుల చిత్తములనుగూడ భ్రమలకులోను గావించి, వారి మనస్సులను మోహవశము గావించును. ఆ మాయ నన్నుగూడ పలుమాఱులు మోహావేశపరునిగా జేసెను. అదియే నీలోగూడ వ్యాపించినది. ఓ గరుడా! నీ హృదయమును ఆవరించిన మోహము నా మాటలతో తొలగిపోవునది గాదు. కావున పక్షిరాజా! నీవు బ్రహ్మదేవుని యొద్దకు వెళ్లి, అతని ఆజ్ఞను అనుసరింపుము. (చౌ॥ 1-4)

ఇట్లు పలికి, నారద మహర్షి శ్రీరాముని గుణములను కీర్తించుచు శ్రీహరి మాయాప్రభావమును మాటి మాటికిని వర్ణించుచు పోయెను. (దో॥ 59)

పక్షిరాజైన గరుడుడు బ్రహ్మదేవుని కడకేగి, తన సందేహమును ప్రకటించెను. దానిని విని, బ్రహ్మ శ్రీరామచంద్రునకు మనస్సులోనే నమస్కరించెను. ప్రభుప్రతాపమును స్మరింపగానే అతని హృదయము ప్రేమతో నిండిపోయెను. "కవులును, పండితులును, జ్ఞానులును అందఱు మాయా ధీనులే గదా!" అని అతడు లోలోన ఆలోచింపసాగెను. భగవంతునిమాయాప్రభావము అపారము. అదినన్నే పలుమారులు అటపట్టించినది. సమస్తజడచేతనజగత్తు నేను సృష్టించినదే. అట్టి నేనే మాయామోహితుడనైతిని. ఇక పక్షిరాజు మోహితుడగుటలో ఆశ్చర్యమేమున్నది? బ్రహ్మదేవుడిట్లనెను. "ఓ గరుడుడా! శ్రీరామునిమహిమను ఆ పరమేశ్వరుడు బాగుగా ఎఱుంగును. కావున నీవు మహేశునికడకు పొమ్ము. నాయనా! ఎవ్వరినీ ఏమియు అడుగవలదు. నీ సందేహమును అతడే తొలగింపగలడు". బ్రహ్మ వచనములను విని, గరుడుడు అచట నుండి నాకొఱకు బయలు దేఱెను. (చౌ॥ 1-4)

మిక్కిలి ఆతురతతో గరుడుడు నా యొద్దకు వచ్చెను. ఉమా! నేను కుబేరుని కడకు పోవుచుంటిని. నీవాసమయమున కైలాస పర్వతమున ఉంటివి. (దో॥ 60)

గరుడుడు సాదరముగా నాకు ప్రణమిల్లి, తనసందేహమును వినిపించెను. మధుర వచనములతో సాగినఅతనివిన్నపమును నేను విని, ప్రేమతో అతనితో ఇట్లు పలికితిని. "ఓ గరుడుడా! నేను కుబేరుని కడకు వెళ్లు చుండగా నీవు నన్ను కలిసితివి. మార్గమధ్యమున నేను నీకు ఎట్లు ఉపదేశింపగలను? చాలాకాలము సజ్జనసాంగత్యమును నెరపినగాని సందేహములు దూరము గావు. అక్కడ మునీశ్వరులు అనేకవిధముల కీర్తించు మనోజ్ఞములైన హరికథలను విన వలెను. సోదరా! నిత్యము,నిరంతరము హరికథాప్రసంగములు జరుగు తావునకు నిన్ను పంపెదను. నీవు అచటికి వెళ్లి వినుము. అక్కడ ఆదిమధ్యాంతములయందుగూడ శ్రీరామచంద్రుడే ప్రతిపాదింపబడిన ప్రభువు. ఆ ప్రసంగశ్రవణమే నీ సందేహములను దూరమొనర్చును, నీకు శ్రీరాముని చరణములయందు అనన్యప్రేమ కలిగించును. (చౌ॥ 1-4)

సత్సాంగత్యము లేకుండ హరికథాశ్రవణము ప్రాప్తింపదు. హరికథలను విననిదే మోహము దూరముగాదు. మోహరహితుడు కానివానికి శ్రీరామచంద్రునిచరణములపై గాఢమైన భక్తి కుదురుకొనదు. (దో॥ 61)

యోగము, తపము, జ్ఞానము, వైరాగ్యము మొదలగునవి ఎన్నియున్నను ఆయనపై ప్రేమానురాగములు లేనిదే శ్రీరఘునాథుని అనుగ్రహము లభ్యముగాదు. కావున సత్సాంగత్యమునకై ఉత్తరదిశకు వెళ్లుము. అచ్చట ఒక అందమైన నీలగిరి కలదు. అక్కడ పరమసుశీలుడైన కాకభుశుండి నివసించుచున్నాడు. ఆయన రామభక్తినిరతుడు, జ్ఞాని, గుణనిధి, వయోవృద్ధుడు. ఆయన నిరంతరము శ్రీరామునికథలను వివరించుచుండును. నానావిధ సుందర పక్షులు ఆ గాథలను శ్రద్ధగా వినుచుండును. అచటికి వెళ్లి నీవు శ్రీహరిగుణములనుగూర్చి వినుము. దానివలన మోహజనితమైన నీ దుఃఖము దూరమగును" నేను ఈ విధముగా అతనికి నచ్చజెప్పగా గరుడుడు నాకు ప్రణమిల్లి, ప్రసన్నచిత్తుడై వెళ్లెను. ఓ ఉమా! శ్రీ రఘునాథుని కృపవలన నేను గరుడునిమోహమును ఎఱింగియుంటిని. కావున నేను స్వయముగా ఉపదేశమును ఇయ్యలేదు. అతడు ఎప్పుడైనను గర్వపడి యుండవచ్చును. అందువలన దయానిధి శ్రీరాముడు అతనిని దూరముగా ఉంచదలిచెను. మఱియొక కారణమేమనగా ఒకపక్షి భాషను మఱియొక పక్షి మాత్రమే సూటిగా గ్రహింపగలదు. భవానీ! ప్రభువుమాయ మిక్కిలి బలవత్తరమైనది. అట్టి మాయలో మోహితుడు కానివాడెవ్వడు? (చౌ॥ 1-5)

గరుడుడు ఉత్తమ జ్ఞాని, భక్త శిరోమణి, ముల్లోకములకును స్వామియైన భగవంతునకు వాహనము . అట్టి వాడుసైతము మాయామోహితుడయ్యెను. ఇక నరాధములైన అల్పమానవుల విషయము చెప్పనేల? కాని లోకములో సహజముగా మానవులు మూర్ఖులై, దురభి మానపూరితులగుచుందురు. (దో॥ 62. క,)

(మాసపారాయణము, ఇరువది యెనిమిదవ విరామము)

ఈ మాయ పరమేశ్వరుని, బ్రహ్మనుగూడ మోహితులనుగా జేయుచున్నప్పుడు ఇక పామరులైన ఇతరులసంగతి చెప్పనేల? ఈ విషయమును గ్రహించియే మునీశ్వరులు మాయాపతియైన ఆ సర్వేశ్వరుని భజించెదరు. (దో॥ 62. ఖ)

అఖండమైన హరిభక్తియు, నిశ్చలమైన బుద్ధియుగల కాకభుశుండి నివసించు ప్రదేశమునకు గరుత్మంతుడు వెళ్లెను. ఆ పర్వతమును జూచినంతనే అతనిమనస్సు ప్రశాంతమయ్యెను. ఆయనలోని మాయ, మోహము, శోకము అంతరించెను. గరుడుడు చెఱువులో స్నానమాచరించి, నీటిని సేవించి, ప్రసన్నచిత్తముతో వటవృక్షచ్ఛాయకు చేరెను. శ్రీరామునిసుందరమనోహర చరిత్రమును వినుటకు వయోవృద్ధ పక్షులన్నియును గుమిగూడి యుండెను. కాకభుశుండి శ్రీరామ వృత్తాంతప్రవచనమును ఆరంభింపబోవుచుండెను. ఇంతలో పక్షిరాజైన వైనతేయుడు అచటికి చేరెను. గరుత్మంతునిరాకను గమనించిన కాకభుశుండి మొదలగు పక్షులన్నియును మిక్కిలి సంతోషించెను. భుశుండి గరుడుని మిగుల గౌరవించి, కుశలసమాచారములను నడపి, సముచిత రీతిగా ఆసీనుని జేసెను. ఆయనను చక్కగా పూజించి, మృదుమృధురముగా ఇట్లు పలికెను. (చౌ॥ 1-4)

"ప్రభూ! పక్షిరాజా! మీ దర్శనముచే నేను ధన్యుడనైతిని. మీఆనను నేను శిరసావహింతును. మీరాకకు కారణమేమి?" అప్పుడు గరుత్మంతుడు మృదుమధురముగా ఇట్లనెను. "మహాదేవుడే స్వయముగా ప్రశంసించిన మీరు సర్వదా కృతార్థులే. (దో॥ 63. క,ఖ)

సంక్షిప్త రామాయణము

నాయనా! వినుము. నేను వచ్చినపని ఇచటికి రాగానే పూర్తియైనది. మీదర్శనముగూడ లభించినది. మీ పవిత్రమైన ఆశ్రమమును చూచినంతనే నా మోహము, సందేహములు, నానా విధ భ్రమలు తొలగిపోయినవి. దుఃఖములను రూపుమాపి సర్వదా సుఖప్రదమైన శ్రీరామచంద్రుని పునీతగాథను సాదరముగా వినిపింపుడని నేను మాటిమాటికిని విన్నవించు కొనుచున్నాను. గరుత్మంతుని వినయ పూర్వకమైన, సరళమైన, ప్రేమపూర్వకమైన, సుఖప్రదపవిత్రవాణిని విని, కాకభుశుండిలో ఉత్సాహము పెల్లుబికెను. అతడు శ్రీరఘురాముని గుణములను ప్రకటించు వృత్తాంతమును తెలుపసాగెను. భవానీ! మొదటనతడు రామచరితమనెడి మానససరోవరమును వర్ణించెను. పిదప నారదుని మోహమును గూర్చియు, రావణజననమును గూర్చియు తెల్పెను. పిమ్మట అతడు ప్రభువుయొక్క అవతారగాథను గానముచేసెను. పిదప మనస్ఫూర్తిగా శ్రీరాముని బాల్యలీలలను వర్ణించెను. (చౌ॥ 1-5)

పరమోత్సాహముతో శ్రీరామునిబాల్యలీలలను దెల్పి, అయోధ్యకు విశ్వామిత్రుని రాకను శ్రీ సీతారాములవివాహమును వర్ణించెను. (దో॥ 64)

తదనంతరము శ్రీరాముని రాజ్యపట్టాభిషేక ప్రసంగము, దశరథ మహారాజు చేసిన వాగ్దానము వలన రాజ్యాభిషేకము భంగమగుట, పిమ్మట నగరవాసుల విరహవిషాదములు, శ్రీరామలక్ష్మణ సంవాదమును వినిపించెను. శ్రీరామునివనగమనము, నావికునిభక్తి, గంగానదిని దాటుట, ప్రయాగలో నివాసము, వాల్మీకితో ప్రభువు యొక్క

సమాగమము, చిత్ర కూటములో నివాసము మున్నగు ఘట్టములను వివరించెను. పిమ్మట సుమంత్రుడు అయోధ్యకు మఱలి వెళ్లుట, దశరథ మహారాజు స్వర్గస్థుడగుట, భరతుడయోధ్యకు చేరుట, భరతుడు రామభక్తిపరవశుడగుట, సవిస్తరముగా దెలిపెను. దశరథునిఅంత్యక్రియలను జరిపిన పిమ్మట భరతుడు అయోధ్యా వాసులతో గూడి, సుఖనిధానమగు శ్రీరాముని యొద్దకు వెళ్లుట, అంతట శ్రీ రఘునాథుడు అతనికి అనేకవిధములనచ్చజెప్పుట. భరతుడు శ్రీరఘురాముని పాదుకలను గైకొని, అయోధ్యకు తిరిగి వచ్చుట. భరతుడు నందిగ్రామమునందున్నరీతిని, ఇంద్రపుత్రుడైన జయంతునిదుశ్చేష్టనూ, శ్రీరాముడు అత్రిమహర్షిని దర్శించుటను వర్ణించెను. (చౌ॥ 1-4)

విరాధవధ, శరభంగుని దేహత్యాగములను వర్ణించిన పిదప సుతీక్ష్ణుని ప్రేమానురాగములను, అగస్త్యశ్రీరామ సత్సంగ ప్రసంగములను వర్ణించెను. (దో॥ 65)

అనంతరము కాకభుశుండి గరుడునకు, ప్రభువుదండకారణ్యమును పావనమొనర్చుటను, గృధ్రరాజైన జటాయువుతో మైత్రి చేయుటను వివరించెను. ప్రభువు పంచవటిలో నివసించి, మునులకు రాక్షసభయమును తొలగించిన విధమును దెలిపెను. పిమ్మట ప్రభువు లక్ష్మణునకు ఇచ్చిన ఉపదేశమును వివరించెను. శూర్పణఖను కురూపిని జేసిన విషయమును, ఖరదూషణ త్రిశురులను వధించిన కథలను వర్ణించెను. రావణునకు ఈ సమాచారము తెలిసినరీతి, రావణ మారీచుల సంభాషణములను, రావణుడు మాయాసీతను అపహరించినభంగిని తెల్పెను. సంగ్రహముగా శ్రీరాముని విరహమును గూడ వర్ణించెను. పిదప ప్రభువు ఏవిధముగా జటాయువు అంత్యక్రియలను చేసినదియు, కబంధుని వధించినదియు, శబరికిముక్తిని ఇచ్చినదియు వర్ణించెను. తరువాత ప్రభువు యొక్క విరహ వర్ణనము ఆయన పంపాసరోవరమును చేరుటను తెలిపెను. (చౌ॥ 1-4)

శ్రీరామునకును నారదునకును మధ్య జరిగిన సంవాదమును, మారుతి రామ లక్ష్మణులను కలిసికొనుట, సుగ్రీవునితో మైత్రి, వాలివధ మున్నగు విషయములను వర్ణించెను. సుగ్రీవుని వానరులకు రాజుగాజేసి, ప్రభువు ప్రవర్షణ పర్వతముపై నుండుటను, వర్ష శరదృతువుల వర్ణనలను తెలిపెను. శ్రీరాముడు సుగ్రీవుని కోపించుట, సుగ్రీవుడు భయమునకు లోనగుట మొదలగు కథలను వినిపించెను. (దో॥ 66 క,ఖ)

పిమ్మట సుగ్రీవునిపంపున వానరములన్నియును సీతాన్వేషణకై వేర్వేఱుదిశలకు వెళ్లిన విధమును, హనుమదాదులు బిలములో ప్రవేశించినరీతిని, వారు సంపాతిని కలిసిన విధానమును వినిపించెను. సంపాతివలన కథనంతయు వినిన హనుమంతుడు సముద్రమును దాటి లంకలో ప్రవేశించినపద్ధతిని, సీతాదేవిని ఓదార్చిన విషయమును వర్ణించెను. అశోకవనమును ధ్వంసమొనర్చి, హనుమంతుడు రావణునకు బుద్ధి చెప్పి, లంకను కాల్చిన వృత్తాంతమును దెల్పెను. పిమ్మట మారుతి సముద్రమును దాటి, తిరిగిరాగా వానరులందఱును శ్రీరామచంద్ర ప్రభువునొద్దకు వచ్చి, సీతాదేవి కుశలసమాచారమును వినిపించినదియు వివరించెను. అనంతరము వానరసేనతోపాటు శ్రీరామచంద్రప్రభువు సముద్ర తీరమునకు చేరుట, విభీషణుడు శరణుజొచ్చుట, ప్రభువు సముద్రుని గర్వమణచుట మొదలగు కథలనన్నింటిని వివరించెను. (చౌ॥ 1-4)

శ్రీరాముడు వారధిని నిర్మించి, వానరసేనతోగూడి, సముద్రమునుదాటి, లంకలో ప్రవేశించుట, అంగదుడు దూతగావెళ్లుట మున్నగువిషయములను దెల్పెను. పిమ్మట నిశాచరులకును, వానరులకును మధ్యజరిగిన భయంకరసంగ్రామమును వర్ణించెను. కుంభకర్ణమేఘనాదుల బలపౌరుషములను, వారివధలనుగూర్చి తెల్పెను. (దో॥ 67 క,ఖ)

రాక్షసులందఱిని తుదముట్టించిన విధమును, శ్రీరామచంద్రప్రభువు రావణునితో యుద్ధమొనర్చిన రీతిని సమగ్రముగ వర్ణించెను. రావణసంహారము, మండోదరీవిలాపము, విభీషణునిరాజ్యపట్టాభిషేకము,

దేవతలశోకనివారణము మొదలగు ఘట్టములను వర్ణించి, సీతారాములపునస్సమాగమమునుగూర్చి తెల్పెను. దేవతలు అంజలిఘటించి, శ్రీరాముని స్తుతించిన విధమును, ప్రభువు పుష్పకవిమానముపై వానరులతోగూడి సకుటుంబముగా అయోధ్యకు చేరినరీతిని వర్ణించెను. శ్రీరామచంద్ర ప్రభువు రాజ్య పట్టాభిషిక్తుడైన పద్ధతిని, ఆయన లీలలను అన్నింటిని కాకభుశుండి గరుడునకు వివరముగా తెల్పెను. (శివుడు పలుకుచున్నాడు) భవానీ! అనేక విధములుగా రాజనీతి చర్చలను, అయోధ్యాపుర విశేష వర్ణనలను నేను నీకు తెల్పిన విధముగా కాక భుశుండి గరుత్మంతునకు వివరించెను. ఆగాధనంతయును వినిన గరుడుడు అమితోత్సాహముతో పలికెను. (చౌ॥ 1-4)

'నేను శ్రీరామచంద్రుని వృత్తాంతమునంతయును వింటిని. నా సందేహములన్నియును దూరమాయెను. ఓ వాయసకుల శిరోమణీ! మీ దయవలన శ్రీరాముని చరణకమలములపై నా భక్తి దృఢమయ్యెను. రణాంగణమున ప్రభువు నాగపాశబద్ధుడై యుండుటనుజూచి, నేను మిక్కిలి మోహా విష్టుడనైతిని. సచ్చిదానందఘనుడైన శ్రీరామచంద్రుడు వ్యాకులపాటునకు లోనైన రీతిని తెలిసికొన గోరితిని. (సో॥ 68 క,ఖ)

అతి సామాన్య మానవునివలె ప్రవర్తించిన ప్రభువుయొక్క చరితమును జూచి, నా హృదయమున గొప్ప సంశయము కలిగియుండెను. ఆ భ్రమ నాపాలిటగొప్పవరమైనదని తలంచుచున్నాను. కృపానిధియైన శ్రీరామచంద్ర ప్రభువు నాపై అనుగ్రహమును ప్రసరింప జేసెను. ఎండలో మిక్కిలి వెతచెందిన వ్యక్తియే వృక్షచ్ఛాయవలన మిక్కిలి ఆనందానుభూతిని పొందగలడు. నాయనా! నాకు ఈ ప్రబలమైన మోహము కలుగకున్నచో నిన్ను ఎట్లు కలిసెడివాడను? అత్యంత విచిత్రమైన సుందరరామకథను వినుట ఎట్లు సంభవించెడిది? మీరు అనేకరీతుల దానిని మధురముగా గానము చేసితిరి. నిజమైన పవిత్రసజ్జనులసమాగమము శ్రీరామునికృపాపాత్రులకే తప్పక లభించునని వేదశాస్త్రపురాణములు, సిద్ధులు, మునులు పేర్కొనిన విషయము ప్రసిద్ధము. ఇందు సందేహమునకు తావేలేదు. శ్రీరాముని కరుణవలననే మీ దర్శనమైనది. మీ దయవలన నా సందేహములు తొలగినవి. (చౌ॥ 1-4)

పక్షిరాజైన గరుడునియొక్క సవినయప్రేమార్ద్రవచనములను విని, కాకభుశుండి తనువు పులకించెను, కన్నులలో ఆనందాశ్రువులు నిండెను. మనస్సు హర్షముతో ఉప్పొంగెను. ఓ ఉమా! సద్బుద్ధి గలిగి, సుశీలురై, పవిత్రగాథలయందు ప్రేమగలవారై, హరిభక్తులైన శ్రోతలకు సత్పురుషులు అత్యంతగోప్యములైన విషయములనుగూడ తెలిపెదరు. (దో॥ 69. క,ఖ)

కాకభుశుండి పక్షిరాజుపై అపారప్రేమ కల్గియున్నవాడగుటవలన మఱల ఇట్లు పలికెను. "ఓ ప్రభూ! మీరు సర్వవిధముల నాకు ఆరాధ్యులు, శ్రీరఘునాథుని కృపాపాత్రులు. నిజముగా మీకు ఎట్టి సందేహములునూ ఉండవు, మీలో మోహమునకు చోటే ఉండదు, మీరు మాయావశులు కానేకారు. మీరు నాపై ఎంతయో కృపచూపితిరి. ఓ పక్షిరాజా! మోహమను నెపముతో శ్రీ రఘు నాథుడు మిమ్ము నా యొద్దకు పంపి, నన్ను ఉన్నతుని గావించెను. ఓ ఖగరాజా! మీరు మీ మోహమును గూర్చి తెలిపితిరి. ఇందులో ఆశ్చర్యపడవలసినది ఏ మాత్రమును లేదు. ఆత్మతత్త్వమర్మజ్ఞులును, దానిని ఉపదేశింపగలవారునుఐన బ్రహ్మ, శివుడు, నారదుడు, సనకాది మహామునులుగూడ మోహవశులైరి. ఈ చరాచరజగత్తులో మోహాంధుడు కాని వాడెవడు? కామమునకు దాసుడుకాని వాడెవడు? తృష్ణోన్మాదమునకు లోనుకానివాడెవడు? క్రోధము ఎవని హృదయమును దహింపదు? (చౌ॥ 1-4)

ఎంతటి జ్ఞానియు, తపస్వియు, శూరుడును, వీరుడును, కవియును, పండితుడును, కడకు గుణనిధియైనను ఈ జగత్తులో లోభమునకు లోనైనచో నవ్వులపాలుకానలసినదే. సంపదలచే గర్వోన్మత్తుడు కానివాడెవ్వడు?

అధికారమదముచే బధిరుడు కానివాడ్వెడు? మృగనయనల చూపులనెడి తూపు (బాణము)లచే కొట్టబడని వాడెవ్వడు? (దో॥ 70. క,ఖ)

రజస్తమోగుణముల సన్నిపాతమునుండి ఎవడు తప్పించు కొనగలడు? అభిమానమదములచే తాకబడనివాడెవ్వడు? యౌవనజ్వరము ఎవ్వనిని ఉన్మత్తునిగా చేయలేదు? మమతచే కీర్తిని కోల్పోనివాడెవడు? ఈర్ష్యాద్వేషములచే కళంకితుడు కానివాడెవ్వడు? శోకమను వాయువు ఎవ్వరిని చలింపజేయలేదు. చింతాసర్పదష్టుడు కానివాడెవడు? జగత్తులో మాయకు వశుడు కాని వాడెవడు? కోరిక అనునది ఒక కీటకము. శరీరమొక కఱ్ఱ. ఈ కఱ్ఱశరీరము కోరికయనెడి పురుగుచే తొలచబడని ధీరచిత్తుడెవడు? పుత్రులు, ధనము, లోక ప్రతిష్ఠ అనెడి ఈషణత్రయముచే ఎవని బుద్ధి మలినము గాదు? ఇవియున్నియును మాయ యొక్క ప్రబల-అపార పరివారములు. వీటిని పూర్తిగా వర్ణించుట ఎవరితరము? బ్రహ్మరుద్రాదులును వీటికి భయపడుదురు, ఇంక ఇతరులొక లెక్కా? (చౌ॥ 1-4)

మాయ యొక్క ప్రచండసైన్యము జగత్తంతయు వ్యాపించును. కామ క్రోధాదులు దాని సేనా పతులు. దంభము, కపటము, పాషండత్వము దాని యోధగణము. కాని ఈ మాయ రఘువీరునకు దాసి. ఇదియంతయు మిథ్యయని గ్రహించినను శ్రీరాముని కృపలేనిదే ఈ మాయ వదలదు. ప్రభూ! ఈ మాటలను నేను ప్రమాణపూర్వకముగా చెప్పుచున్నాను. (దో॥ 71. క,ఖ)

ఈ మాయ సమస్త ప్రపంచమును ఒక ఆట ఆడించును. దీని గతిని ఎవ్వరును తెలియజాలరు. ఓ ఖగరాజా! అట్టి మాయ శ్రీరామచంద్రప్రభుకనుసన్నలను అనుసరించి, తన పరివారముతో సహా నర్తకివలె ఆడును. శ్రీ రఘువీరుడు సచ్చిదానందఘనుడు, జన్మరహితుడు, విజ్ఞాన స్వరూపుడు, రూపబలగుణధాముడు, సర్వవ్యాపకుడు, సర్వరూపుడు, అఖండుడు, అనంతుడు, సంపూర్ణుడు, అమోఘశక్తిమంతుడు, షడ్గుణైశ్వర్య సంపన్నుడు. అతడు నిర్గుణుడు, సర్వోత్తముడు, వాక్కునకును, ఇంద్రియములకును గోచరము కానివాడు, సర్వదర్శి, దోష రహితుడు, అజేయుడు, మమతారహితుడు, నిరాకారుడు, మోహ స్పర్శయే లేనివాడు, నిత్యుడు, మాయాతీతుడు, సుఖ నిధానము, ప్రకృతికతీతుడు, సర్వసమర్థుడు, అందరి హృదయములలో ఉండువాడు, ఇచ్ఛారహితుడు, నిర్మలుడు, శాశ్వతుడైన పరబ్రహ్మ. అట్టి శ్రీరాముని యందు మోహమునకు తావే ఉండదు. సూర్యునికడకు అంధకారము రాగలదా? (చౌ॥ 1-4)

భగవంతుడైన శ్రీరామచంద్రప్రభువు తనభక్తులకై రాజుగా అవతరించి, సామాన్యమానవుని వలె పరమపవిత్రలీలావిలాసములను ప్రదర్శించెను. ఒకనటుడు పెక్కు (పాత్రల) వేషములు వేసి, నృత్యములు చేయును. ఆయా వేషములకు తగినట్లు భావములను ప్రకటించును. కాని అతడు ఆ పాత్రలలో ఏ ఒక్కటియు కాడు. అట్లే పరమాత్మ మానవరూపమును ధరించి, మానవునివలె ప్రవర్తించినను తాను మానవుడు కాడు. (దో॥ 72. క,ఖ)

ఓ ఖగరాజా! శ్రీ రఘునాథుని ఈ లీల రాక్షసులను విశేషముగా మోహితులను జేసెను. భక్తులకు సుఖములను గూర్చెను. ప్రభూ! గరుడా! మూర్ఖులు, విషయలోలురు, కాముకులైనవారు మాత్రమే రామచంద్రప్రభువుపై మోహము నారోపించెదరు. నేత్రదోషము, కామెర్ల వ్యాధి యున్నవాడు మాత్రమే చంద్రుడు పచ్చగానున్నాడని పల్కును. వైనతేయా! దిక్కులనుగూర్చిన జ్ఞానము లేనివాడు సూర్యుడు పడమట ఉదయించునని తెల్పును. నావపై కూర్చున్నవాడు ప్రపంచము సాగిపోవుచున్నట్లు తలంచును. మోహగ్రస్తుడై తాను నిశ్చలుడైయున్నట్లు భావించును. బాలుడు చక్రాకారములో తిరుగుచుండును. ఇండ్లు తిరుగవు. కాని వారు అది నమ్మరు. మిథ్యా వాదములు సేయుచు పరస్పరము ఒకరి నొకరు నిందించు కొందురు. ఓ గరుడుడా! శ్రీహరి విషయమున మోహకల్పన అట్టిదే. స్వప్నములో గూడ అజ్ఞానము అతనిని అంటదు. మాయలో పడియున్న వారు, మందబుద్ధులు, భాగ్యహీనులు,

మాయ యనెడితెఱచే కప్పబడిన మూర్ఖులు, మొండిగా సందేహములను ప్రకటించుచు తమ అజ్ఞానమును శ్రీరామునిపై ఆరోపించెదరు. (చౌ॥ 1-5)

కామక్రోధలోభమదములయందు నిమగ్నులైన వారు, దుఃఖరూపమగు సంసార వ్యామోహములో చిక్కుకొనినవారు, శ్రీ రఘునాథుని ఎట్లు తెలిసికొనగలరు? ఆ మూఢులు అజ్ఞానాంధకారకూపములో పడియుందురు. భగవంతుని నిర్గుణరూపము సులభము. కాని సగుణరూపలీలాతత్త్వము నెఱుంగుట కష్టము. పరమేశ్వరుని సగుణోపాసన సరళమగుటవలన సుగమము. కాని ఆయన లీలారహస్యములను తెలిసికొనుట అగమము (క్లిష్టము). ఏలనన సగుణ లీలలను చూచియు, వినియు మునులమనస్సులుగూడ ఒక్కొక్కప్పుడు భ్రమలకు గురియగుచుండును. (దో॥ 73. క,ఖ)

భుశుండి మోహము - శ్రీరాముని ప్రభావము

ఓ ఖగరాజా! శ్రీ రఘునాథుని ప్రాభవమునుగూర్చి వినుము. నేను నా బుద్ధిననుసరించి ఆ సుందరకథను తెలిపెదను. నేను ఒకప్పుడు మోహావిష్టుడనై ఉంటిని. ఆకథను వివరించెదను. నాయనా! నీవు శ్రీరామునికృపకు పాత్రుడవు. భగవద్గుణములయందు ప్రీతిగలవాడవు. అందుచే నీవు నాకు సుఖ ప్రదుడవు. కావున నీయొద్ద ఏమాత్రమూ దాచక అతిగోప్యమైన మనోహర చరిత్రమును వర్ణించెదను. శ్రీరామచంద్రుని సహజ స్వభావమును వినుము. ఆయన ఎల్లప్పుడునూ తనసేవకులలో అభిమానమును ఏమాత్రమూ ఉండనీయడు, ఏలనన దురభిమానమే జనన మరణములకు మూలకారణము. అది అనేక క్లేశములను, శోకములను కలిగించును. కృపానిధియైన శ్రీరాముడు భక్తులను గర్వమునకు దూరముగా ఉంచును. ఏలనన భక్తులపై ప్రభువునకు అపారమైన అనురాగము. మహాత్మా! బాలుని శరీరముపై గాయము కలిగినప్పుడు తల్లి కఠిన హృదయముతో దానికి శల్యచికిత్స చేయును. (చౌ॥ 1-4)

బాలుడు మొదట (శల్యచికిత్సాసమయమున) ధైర్యమును కోల్పోయి, దుఃఖముతో ఏడ్చినను రోగనివారణమునకై తల్లి వానిరోదనను పట్టించుకొనదు. అదే విధముగా శ్రీ రఘునాథుడు తన భక్తునిమేలుకొఱకు అతని గర్వమును హరించును. ఓ మనసా! భ్రమలను వీడి, అట్టి ప్రభువును ఏల భజింపవు? అని తులసీదాసు నుడువుచున్నాడు. (దో॥ 74. క,ఖ)

ఓ ఖగేశ్వరా! శ్రీరామునికృపనుగూర్చియు, నా మూర్ఖత్వమునుగూర్చియు తెలిపెదను, సావధానముగా వినుము. శ్రీరామచంద్రుడు మానవరూపమును దాల్చి, భక్తులకై అనేకలీలలను ప్రదర్శించుసమయమున నేను అయోధ్యకు వెళ్లెదను. ఆయనబాల్యలీలలను చూచి, సంతసించెదను. అచ్చట ఆయనజన్మదినమహోత్సవములను జూచెదను. ఆయన బాల్య లీలలకు ముగ్ధుడనై, ఐదు సంవత్సరములను అచటనే గడిపెదను. బాల రూపుడైన శ్రీరాముడు నాకు ఇష్టదైవము. అతనితనువు కోటి మన్మథ సౌందర్య శోభితము. గరుడుడా! నా స్వామిముఖవర్చస్సును గాంచి నా కన్నులను సఫలమొనర్చు కొందును. చిన్న కాకి ఆకారమును ధరించి, ప్రభువు చేయు బాల్యక్రీడలను చూచెదను. (చౌ॥ 1-4)

బాల్యమున శ్రీరాముడు తిరిగెడు అన్నిప్రదేశములయందును నేనును ఎగిరెదను. ప్రాంగణములో పడిన అతనిఎంగిలిని తినెదను. ఒకసారి శ్రీ రఘువీరుడు లోకోత్తరచరిత్రను సృష్టించెను. "ప్రభువు యొక్క ఆ లీలలను తలచుకొనినంతనే కాకభుశుండి తనువు పులకరించెను. (దో॥ 75. క,ఖ)

భుశుండి మఱల పల్కుచున్నాడు. "ఓ ఖగరాజా! వినుడు. శ్రీరామునిచరితము సేవకులకు అత్యంత సుఖానంద దాయకము. అయోధ్యానగరరాజభవనము అత్యంత సుందరము. అది స్వర్ణ నిర్మితమై, నానారత్నఖచితమై, విరాజిల్లు

చున్నది. నిత్యము సోదరులు నలుగురు ఆడుకొను ఆ ప్రాంగణశోభలు వర్ణనాతీతములు. తల్లులకు ఆనందమునుగూర్చుచు బాల్యవినోదక్రీడలలో తేలియాడుచు శ్రీ రఘునాథుడు అచట సంచరించుచుండెను. నీలమణిసమానమైన శ్యామ సుందరశరీరమునందలి ప్రత్యంగమునందును మన్మథశోభలు విలసిల్లుచుండెను. నవ రాజీ వారుణమృదుచరణకాంతులు, మృదుమనోహరములైన ఆకాలివ్రేళ్లు, ఆహ్లాదమును గొలుపు చుండెను. పాదపద్మములయందలి వజ్రాంకుశధ్వజకమలచిహ్నములు మిక్కిలి మనోజ్ఞములు. చరణములయందలి మంజులమంజీరధ్వనులు వీనులకు విందుగూర్చుచుండెను. మణిఖచిత స్వర్ణమయమేఖలా దీధితులుమిఱుమిట్లు గొలుపుచుండెను. ఆ బాలరాముని శోభలు వర్ణింపనెవరి తరము? (1) (చౌ॥ 1-4)

అతని ఉదరమునగల త్రివళులు త్రిరేఖావిలసితములు. నాభి సుందరమై గంభీరమైనది. విశాల వక్షస్థలము వస్త్రాభరణ శోభితము. (దో॥ 76)

ఎఱ్ఱని అరచేతులు, అంగుళులు నఖములు అతి మనోహరములు. దీర్ఘభుజములపై ఆకర్షణీయములైన భూషణములు అలరారుచుండెను. సింహకిశోరసదృశ భుజస్కంధములు, శంఖమువంటి కంఠము, మనోజ్ఞమైన చుబుకము, ముఖలాలిత్యములు వర్ణింపనలవికానివి. ముద్దులొలుకు మాటలు, ఎఱ్ఱని మధురాధరములు, స్వచ్ఛములైన దంతకాంతులు, నిగ్గులద్దములవంటి క్రమకపోలములు, సంపెంగవంటి మనోహరమైన నాసిక, చంద్రకిరణముల వలె ఆహ్లాదకరమైన చక్కని చిఱునవ్వు, నీల కమలములవలె కమనీయములైన కన్నులశోభలు, భవ మోచనములు. లలాటమున చక్కగా దిద్దబడిన గోరోచనతిలకశోభలు, ధనురాకార శోభితములైన కనుబొమలు, శృంగారములనువిరజిమ్ము శ్రవణవిలాసములు, మనోజ్ఞములైన కుటిలకుంతలములు, పసుపుపచ్చని అంగరఖాఅందచందములు, ఆయనశరీరశోభా వైభవములను ఇనుమడింపజేయుచుండెను. అతని కేరింతలు, చూపులు, నాట్యములు నా మనస్సుకు గిలిగింతలు పెట్టినవి. దశరథ మహారాజప్రాసాదప్రాంగణములో విహరించు సౌందర్య రాశి శ్రీరామచంద్రుడు తన నీడనుజూచుచు గంతులువేయుచుండెను..నాతో ఆయన అనేక బాల్యక్రీడలను ఆడుచుండెడివాడు. వాటిని వర్ణించుటకు నాకు బిడియము కలుగుచున్నది. కేరింతలు కొట్టుచు నన్ను పట్టుకొనుటకు అతడు నా వెంటపడుచుండెను. పక్షి స్వభావమున నేను పరుగెత్తు చుంటిని. నా కతడు అప్పాలు చూపుచు పిలుచుచుండెను. (చౌ॥ 1-5)

నేను సమీపించునపుడు ప్రభువు నవ్వుచుండెను. నేను దూరముగా వెళ్లినచో ఏడ్చుచుండెను. నేనతనిచరణములను స్పృశించుటకు వెళ్లినప్పుడు భయమును నటించుచు వెనుకకు పోవుచుండెను. నావైపు చూచి, పరుగెత్తుచుండెను. సచ్చిదానంద ఘనుడగు ఈ ప్రభువు సాధారణ బాలకులవలె లీలలను ప్రదర్శించుచున్నాడేల? అని నాకు మోహము కలుగుచుండెను. (దో॥ 77. క,ఖ)

ఓ ఖగరాజా! ఈ సందేహడోలికలలో ఊగిసలాడుచున్న నన్ను మాయ ఆవరించెను. కాని ఆ మాయ నాకు దుఃఖప్రదము కాదు. ఇతర జీవులనువలె నన్నుఅది సంసారచక్రమున పడవేయునది కాదు. ప్రభూ! దీనికి మఱియొక కారణమున్నది. శ్రీహరి వాహనమైన ఓ గరుడుడా! సావధానముగా వినుము. సీతాపతియైన శ్రీరాముడు అఖండుడు, అద్వితీయుడు, జ్ఞానస్వరూపుడు. జడచేతన (చరాచర) జీవులన్నియును మాయకు వశమైయుండునవియే. జడ చేతన

1. భావయామి గోపాలబాలంమనస్సేవితం తత్పదం చింతయేయం సదా ॥భావ॥
కటి ఘటిత మేఖలా ఖచిత మణిఘంటికాపటలనినదేన విభ్రాజమానం
కుటిల పదఘటిత సంకుల శింజితేన తం చటుల నటనా సముజ్జ్వల విలాసం ॥భావయామి॥

జీవులకు అఖండ జ్ఞానమే యున్నచో ఈశ్వరునకును, జీవునకును గల భేదమేమి? గర్వితమతియైన జీవుడు మాయకు అధీనుడు. సత్త్వరజస్తమోగుణయుక్తమైన మాయ ఈశ్వరాధీనము. జీవుడు పరాధీనుడు. (మాయకువశుడు) భగవంతుడు స్వాధీనుడు. జీవులనేకులు. లక్ష్మీపతియైన ఈశ్వరుడు ఒక్కడే. మాయవలన ఏర్పడిన ఈ భేదము అసత్యమేయైనను హరికృపలేకుండ కోట్లాది ఉపాయములతో గూడ అది సమసి పోదు.

(చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుని భజింపక ముక్తిని కోరుకొను మనుష్యుడు జ్ఞానియైనను తోకయు, కొమ్ములునులేని పశువుతో సమానుడు. సమస్త తారాగణములతోగూడి, పదునాఱు కళలతో అలరారు పూర్ణచంద్రుడుఉదయించినను, పర్వతారణ్యములను కార్చిచ్చు దహించినను, సూర్యుడు ఉదయింపనిదే రాత్రి అంతము కాదు గదా!

(దో॥ 78. క,ఖ)

ఓ గరుడుడా! ఇదే విధముగా హరిభజన లేకుండ జీవుడు దుఃఖ (పంచక్లేశముల) నివృత్తి పొందలేడు గదా! విద్యయు, అవిద్యయు మాయారూపములు. హరిసేవకునిపై అవిద్యారూపమాయ ఆవరింపదు. ప్రభు ప్రేరణచే అతనిలో విద్యారూపజ్ఞానము ఉదయించును. ఓ ఖగరాజా! అందు వలన హరిసేవకుడు నశింపడు. భేదభక్తి (సేవ్యసేవక సంబంధము) ఏర్పడును. నేను భ్రమలో పడి, ఆశ్చర్యచకితుడనై యుండుటను జూచి, శ్రీరామచంద్రుడు నవ్వెను. ఆ విశిష్టలీలావిలాస ఘట్టమును గూర్చియు వినుము. ఈ కౌతుకలీలారహస్యమును ఆయనసోదరులు గాని, తల్లిదండ్రులుగాని ఎఱుగరు. అంతే గాదు ఇతరులెవ్వరును ఎఱుగరు. శ్యామసుందరుడు, అరుణ కరచరణుడు ఐన బాలరాముడు మోకాళ్లపై దోగాడుచు నన్ను పట్టుకొనుటకు ప్రయత్నించెను. ఓ ఖగరాజా! నేను అప్పుడు పరుగెత్తితిని. శ్రీరాముడు నన్ను పట్టుకొనుటకు తనభుజములను చాపెను. నేనాకాశమున ఎగిరిన కొలదియు శ్రీరాముని బాహువులను నా సమీపముననే చూచుచుంటిని. ఇది భగంతుని సర్వవ్యాపకత్వమును సూచించుచున్నది.

(చౌ॥ 1-4)

అంతట నేను ఎగురుచు బ్రహ్మలోకమునకు వెళ్లితిని. అప్పుడు నేను వెనుదిరిగి చూడగా శ్రీరాముని బాహువులు నాకు కేవలము రెండంగుళముల దూరములోనే ఉండెను. పృథ్వి, జలము మొదలగు ఏడు ఆవరణములను దాటి, నాశక్తిని అనుసరించి, నేను ఎక్కడికి వెళ్లినను నా వెనుకనే ప్రభుబాహువులు ఉండుట చూచి, నేను వ్యాకులపాటునకు గుఱియైతిని. (దో॥ 79. క,ఖ)

భయముతో కన్నులను మూసికొంటిని. మఱల కన్నులు తెఱవగానే అయోధ్యానగరమున నుంటిని. నన్ను జూచి శ్రీరాముడు ఒక దరహాసము చేసెను. అతడు నవ్వగానే ఆకర్షితుడనై నేను ఆయన నోటిలో ప్రవేశించితిని. ఖగరాజా! వినుము. నేను అతనిఉదరములో అనేకబ్రహ్మాండ సమూహములను జూచితిని. అందులో పెక్కు విలక్షణములైన లోకములు ఒకదానికంటె మఱి యొకటి మిన్నగా నుండెను. కోట్లాది చతుర్ముఖబ్రహ్మలు, పరమేశ్వరులు, అసంఖ్యాకములైన తారలు, సూర్య చంద్రులు, లెక్కకు మిక్కిలిగానున్న లోకపాలురు. యములు, కాలములు, అసంఖ్యాక పర్వతములు, విశాలమైన పృథ్వి, లెక్కలేనన్ని సముద్రములు, నదులు, తటాకములు, వనములు, నానావిధసృష్టివిచిత్రములను జూచితిని. దేవతలు, మునులు, సిద్ధులు, నాగులు, కిన్నరులు, మానవులు, చతుర్విధస్థావరజంగమ జీవులను గాంచితిని. (చౌ॥ 1-4)

ఇది వరలో ఎన్నుడును కని,విని, ఊహకందని ఆశ్చర్యకరమైన సృష్టిని జూచితిని. వాటిని ఎట్లు వర్ణింపగలను? ఒక్కొక్క బ్రహ్మాండములో నేను వందేసి సంవత్సరములుంటిని. ఆ విధముగా నేను అనేక బ్రహ్మాండములను చూచుచు సంచరించితిని. (దో॥ 80. క,ఖ)

ప్రతిలోకమునందును వేర్వేఱు బ్రహ్మలు, శివులు, విష్ణువులు, మనువులు, దిక్పాలురు, గంధర్వులు, కిన్నరులు, మనుష్యులు, భూత భేతాళాది రాక్షసులు, సర్పములు, పశుపక్షులు మొదలగు అనేక దేవతా దైత్యాది గణములుండెను. జీవులందఱును వేర్వేఱు విధములుగా ఉండిరి. అనేకములైన భూములు, నదులు, సముద్రములు, సరస్సులు, పర్వతములు అన్నియును ప్రత్యేకతగలవియే. ప్రతిబ్రహ్మాండమునను నారూపమును జూచితిని. అనేకములైన అపూర్వవస్తువులను గాంచితిని. ప్రతిభువనమునందును. వేర్వేఱు అయోధ్యానగరములు, సరయూనదులు, స్త్రీ పురుషులు ఉండిరి. నాయనా! వినుము. దశరథుడు, కౌసల్యాదేవి, భరతాది సోదరులును అనేకరూపములను గలిగియుండిరి. నేను ప్రతిబ్రహ్మాండమున శ్రీరాముని అవతారమును అతని అపార బాల్యక్రీడలను చూచుచు తిరుగుచుంటిని. (చౌ॥ 1-4)

ఓ హరివాహనా! నేను ప్రతిబ్రహ్మాండమును ఇతర బ్రహ్మాండములకంటెను వేఱుగా, విచిత్రముగా ఉండుట గమనించితిని. నేను అసంఖ్యాకములైన బ్రహ్మాండములలో తిరిగితిని. కాని శ్రీరామచంద్రప్రభుని ఆకారములను మాత్రము వేర్వేఱుగా చూడలేదు. అవి ఒకే విధముగా ఉండెను. అన్నిచోట్ల యందును అదే బాల్యము, అదే సౌందర్యము, దయాళువైన ఆ రఘువీరుడే. ఈ విధముగా మోహమనెడి వాయువుచే కొట్టబడి, అన్ని భువనములను జూచుచు తిరిగితిని. (దో॥ 81. క,ఖ)

ఈ విధముగా అనేక బ్రహ్మాండములయందు పరిభ్రమించుచు నూఱు కల్పములను గడిపితిని. ఇట్లు సంచరించుచు నా ఆశ్రమమునకు వచ్చి, కొంతకాలము అచట గడిపితిని. నా స్వామి అయోధ్యానగరమున అవతరించిన విషయమును విని, భక్తి నిరతుడనై, నిర్భరప్రేమతో ప్రసన్నతతో లేచి, పరుగెత్తితిని. అచట నేను మొదట సవిస్తరముగా తెలిపినట్లు శ్రీరామ జనన మహోత్సవమును జూచితిని. శ్రీరామచంద్రుని ఉదరమున అనేకలోకములను గాంచితిని. వాటిని చూడవలెనేగాని వర్ణింపనలవిగాదు. అక్కడ మాయా పతియైన శ్రీరామచంద్ర ప్రభువును మఱల దర్శించితిని. నేను మాటిమాటికిని ఆలోచించుచుంటిని. కాని నాబుద్ధి మోహమనెడి ఊబిలో కూరుకొని యుండెను. ఒక రెండుగడియలలో ఈవిచిత్రములనన్నింటిని గాంచితిని. మనస్సును మోహమావరించియుండుటచే నేను అలసిపోయితిని. అలౌకికమైన ప్రభులీలలను జూచి నాబుద్ధి భ్రమకు గురియయ్యెను. (చౌ॥ 1-4)

నేను డస్సినది గమనించి, శ్రీరామచంద్ర ప్రభువునవ్వెను. ఓ ధీరబుద్ధీ! గరుడుడా! అవధరింపుము. ప్రభువునవ్వగానే నేను ఆయన నోటినుండి బయటికి వచ్చితిని. ప్రభువు మఱల నాతో ఆ బాల్యక్రీడలనే ఆడసాగెను. అనేకవిధముల నామనస్సునకు నచ్చజెప్పుకొంటిని. కాని మనశ్శాంతి లభింపకుండెను. (దో॥ 82 క,ఖ)

ప్రభువుయొక్క ఈ బాల్యలీలలనుజూచి, ఆయనయుదరములో నేను దర్శించిన ప్రభు మహిమలను దలంచుకొని, నా శరీరస్పృహనే కోల్పోయితిని. 'ఓ ఆర్తజనరక్షకా! నన్ను 'కావుకావు' (కాపాడుము') మనియఱచుచు నేలపై వ్రాలితిని. నేను పలుకజాలకయుంటిని. నేను ప్రేమ విహ్వలుడనగుటను జూచి, ప్రభువు తనమాయామహిమను నిలిపివేసెను. దీనదయాళువైన ప్రభువు తనకరకమలములను నా శిరస్సుపై నుంచెను. నా దుఃఖమును పూర్తిగా తొలగించెను. సేవకులకు సుఖప్రదుడు, కృపానిధియైన శ్రీరాముడు నన్ను మోహవిముక్తునిగావించెను. నేను ఆయన యొక్క పూర్వవైభవమును తలంచుకొనినప్పుడు నా మనస్సు హర్షాతిరేకమును పొందెను. భక్తులయెడ ప్రభువుయొక్క అనురాగమును గాంచి, నాహృదయములో అపారప్రేమ ఉత్పన్నమాయెను. నేత్రములయందు ఆనందాశ్రువులు నిండగా, శరీరము రోమాంచితముకాగా అంజలిఘటించి, అనేకవిధములుగా విన్నవించుకొంటిని. (చౌ॥ 1-4)

ప్రేమ పూర్వకమైన నావాణిని విని, తన సేవకుడనైన నా దీనావస్థను గమనించి, లక్ష్మీ నివాసుడైన శ్రీరాముడు సుఖదములైన తనకోమలగంభీరవచనములను పలికెను. "ఓ కాకభుశుండీ! నేను అత్యంతప్రసన్నుడనైతిని. నన్ను ఏదైననొకవరమునడుగుము. అణిమాద్యష్టసిద్ధులు, ఎనలేని సంపదలు, సమస్త సుఖములకు పరాకాష్ఠయైన మోక్షము (దో॥ 83, క,ఖ)

జ్ఞానము, వివేకము, వైరాగ్యము, విజ్ఞానము, (తత్త్వజ్ఞానము) మునీశ్వరులకును దుర్లభములైన పెక్కు అద్భుత గుణములు - మొదలగు వాటినన్నింటిని నేను నీకు ప్రసాదించెదను. ఇందు సందేహమేమాత్రము లేదు. నీ కిష్టములైన వరములను కోరుకొనుము." ప్రభువచనములను వినిన నేను ప్రేమవిహ్వలుడనైతిని. నా మనస్సున ఇట్లాలోచించితిని. "ప్రభువు అన్నిసుఖములను ఇచ్చెదనని పల్కెను. కాని తనభక్తిని ప్రసాదించెదననియనలేదు. ఉప్పులేకున్నచో ఏ భోజన పదార్థమూ భోజ్యముకానట్లు భక్తిలేనిదే ఏ గుణముగాని, సుఖముగాని నిష్ఫలమే. భజనలేని యేసుఖమూ ప్రయోజనకారిగాదు." ఓ ఖగరాజా! బాగుగాఆలోచించి, నేను ఇట్లంటిని. "ప్రభూ! మీరు ప్రసన్నులై కృపతో నాకు వరమిచ్చినచో నేను నాకిష్టమైనవరమును కోరుకొందును. మీరు ఉదారులు. నేను ప్రకటింపకయే నా మనస్సులోని మాటను గ్రహింపగలరు. (చౌ॥ 1-4)

ఓ వాంఛాకల్పతరువూ! శరణాగతహితైషీ! కృపాసాగరా! సుఖనిధానా! శ్రీరామా! దయతో మీపై నాకు అనన్యభక్తిని ప్రసాదింపుడు. ఈ ప్రగాఢ నిష్కామభక్తిని శ్రుతులు, పురాణములు వేనోళ్ల కీర్తించుచుండును. యోగీశ్వరులైన మునులు దీనిని అన్వేషించుచు సంచరింతురు. మీ కృపకు పాత్రుడైన ఏఒక్కరో దీనిని పొందగలరు.(దో॥ 84 క,ఖ)

"ఏవమస్తు (అట్లే యగుగాక)" అని పలికి రఘువీరుడు పరమానందకరమైన వచనములను ఇట్లు పలికెను. " ఓ వాయసమా! వినుము. నీవు సహజముగనే చతురుడవు. లేనిచో ఇట్టి వరమును కోరుకొనవు. సర్వ సుఖములకును గనియైన భక్తినడిగితివి. ప్రపంచములో నీవంటి భాగ్యశాలి ఎవ్వరును లేరు. జపయోగాగ్నులలో తమశరీరములను తప్తమొనర్చిన మునులు కోటి ప్రయత్నములు చేసినను వారికి ఇట్టి భాగ్యము అబ్బదు. నీ విచక్షణాచాతుర్యమునకు నేను ప్రసన్నుడనైతిని. నీవు భక్తిని కోరితివి. ఓ విహంగమా! వినుము. నా కృపచే సర్వశుభగుణములును నీ హృదయములో నెలకొనియుండును. భక్తి జ్ఞాన విజ్ఞాన వైరాగ్యయోగములు, నా లీలలు, వాటి రహస్యవిభాగములు, వీటి వైవిధ్యములనన్నింటిని నా అనుగ్రహమువలన సమగ్రముగా తెలిసికొనగలవు. నీకు సాధనలో ఎట్టి శ్రమయు ఉండదు. (చౌ॥ 1-4)

మాయచే ఉత్పన్నములగు భ్రమలు నిన్ను తాకనైనతాకవు. నన్ను అనాదిగా, జన్మరహితునిగా, ప్రకృతిగుణరహితునిగా, గుణాతీతునిగా, దివ్యగుణాకరునిగా, పరబ్రహ్మగా ఎఱుంగుము. ఓ వాయసమా! వినుము. భక్తులు నాకు సర్వదా ప్రీతి పాత్రులు. ఇట్లు తలంచి, నీవు త్రికరణశుద్ధిగా నా చరణములయందే అచంచలమైన అనురాగమును కలిగియుండుము. (దో॥ 85 క,ఖ)

ప్రస్తుతము సత్యమైన, సుగమమైన, వేదస్తుత్యమైన నా నిర్మలవాణిని వినుము. నీకు నానిశ్చిత సిద్ధాంతమును తెలిపెదను. దానిని మనస్సులో నిలుపుకొని, తక్కినవాటిని విస్మరించి, నన్నే భజింపుము. విశ్వమంతయును నా మాయవలననే ఉత్పన్నమైనది. ఇందు నానావిధజడచేతన ప్రాణులున్నవి. అవియన్నియును నాకు ప్రియమైనవి. ఏలనన అవియన్నియును నా సృష్టియే. కాని మనుష్యులు ఈయన్నింటికంటెను నాకు ప్రీతిపాత్రులు. వారిలో బ్రాహ్మణులు, అందును వేదములను బాగుగా ఎఱింగినవారు, వారిలోను వేదోక్తధర్మములను అనుసరించువారు, వారియందును వైరాగ్యసంపన్నులు నాకు అత్యంతప్రీతిపాత్రులు. విరాగులలో జ్ఞానులు, వారిలోను విజ్ఞానులు (తత్త్వజ్ఞులు) నాకు మిక్కిలి ప్రేమాస్పదులు. పరతత్త్వజ్ఞానులు విజ్ఞానులకంటెను ఎక్కువ ప్రేమభాజనులు, వేటే వాంఛలు లేకుండా నన్నే ఆశ్రయించు

నాసేవకులు నాకు అత్యంతప్రియతములు. ఇది నాసిద్ధాంతము. భక్తిభావములేనివాడు బ్రహ్మయంతటి వాడైనను సరే! నాకు ఇతర సామాన్య జీవులతో సమానుడే. కాని అనన్యభక్తిగల అల్పప్రాణులుగూడ నాకు ప్రాణతుల్యులు. ఇది నాకు సహజము. (చౌ॥ 1-5)

పవిత్రుడు, సుశీలుడు ఐన సద్బుద్ధిగలసేవకుని ఎవ్వడు ప్రేమింపడు? వేదములు, పురాణములు ఈ నీతినే ఉద్ఘోషించుచున్నవి. ఓ కాకరాజమా! సావధానముగా వినుము. (దో॥ 86)

ఒక తండ్రికి చాలామంది కుమారులు గలరు. వారి గుణములు, స్వభావములు, ఆచరణలు వేర్వేఱుగా ఉండును. ఒకడు విద్వాంసుడు, మఱియొకడు తపస్వి, వేఱొకడు జ్ఞాని, ఇంకొకడు ధనవంతుడు, మఱియొకడు శూరుడు, వీరుడు, వేఱొకడు దాత, ఒకడు సర్వజ్ఞుడు, అన్యుడు ధర్మాత్ముడు. కాని తండ్రిప్రేమ వీరందఱిపై ఒకేమాదిరిగానుండును. వీరిలో ఒకడు మనో వాక్కర్మలచే తండ్రియెడ భక్తిశ్రద్ధలు గలవాడు, స్వప్నములోగూడ ఇతరధర్మమును ఎఱుగనివాడు. అట్టివాడు తండ్రికి ప్రాణతుల్యుడు. అతడు అన్నివిధముల మూర్ఖుడైనను సరే అతడు తండ్రికి మిక్కిలి ప్రియమైనవాడు. ఆ విధముగనే పశుపక్ష్యాదులు దేవమనుష్యాసురులతోసహా జడచేతనప్రాణులుగల ప్రపంచమంతయు నా సృష్టియే. కావున అన్నింటిపైనను నా ప్రేమ సమానమే. కాని వీరిలో మదమును, మాయను త్యజించి, మనోవాక్కాయములచే నన్నే భజించువాడు- (చౌ॥ 1-4)

ఆ వ్యక్తి పురుషుడైనను, స్త్రీ యైనను లేదా తదన్యుడైనను లేక జడ చేతన ప్రాణులలో ఏదైనను కపట ప్రపంచమును వీడి, అన్నియును 'నేనే' (శ్రీరాముడే) అని భావించి, భజించువాడు నాకు అత్యంత ప్రియుడు. (దో॥ 87 క)

ఓ వాయసమా! నిష్కామసేవకుడు నాకు ప్రాణప్రియుడు. కావున ఇతర-ఆశావిశ్వాసములను వదలి నన్నే భజింపుము. (సో॥ 87 ఖ)

కాలమునిన్నేమియు చేయలేదు నిరంతరమునన్నే స్మరించుచు భజింపుము." ప్రభువుయొక్క అమృతతుల్యములగువచనములను ఎంతగా విన్నను నాకు తనివి తీరలేదు. నా శరీరము పులకితమయ్యెను. మనస్సు ఆనందవీధిలో విహరించెను. ఆ సుఖము కేవలము మనస్సునకును చెవులకే తెలియును. నాలుకతో దానిని వర్ణింపలేము. ప్రభుసౌందర్య వైభవము కేవలము కన్నులకే ఎఱుక. కాని అవి చెప్పలేవు. వాటికి మాటలు రావు. నన్ననేకవిధముల సమాధానపఱచి, సంతోష పఱచి, ప్రభువు మఱల తనబాల్య క్రీడలను చేయసాగెను. ప్రభువు కన్నులలో నీరు నింపుకొని, బుంగమూతితో తల్లివైపు చూచి ఏడ్వసాగెను. తల్లి అతనికి ఆకలియైనదని గ్రహించి హృదయమునకు హత్తుకొనెను. తన యొడిలోనికి చేర్చుకొని, పాలియ్యసాగెను. శ్రీ రఘునాథుని మనోహరలీలలను కీర్తింపసాగెను. (చౌ॥ 1-4)

సుఖప్రదుడు, మంగళస్వరూపుడు ఐన త్రిపురారి (శివుడు) విలక్షణమైన వేషమును ధరించి, అనుభవించు సుఖములోనే అయోధ్యలోని స్త్రీ పురుషులందఱును సర్వదా నిమగ్నులై యుండిరి. ఖగరాజా! ఒక్కసారి స్వప్నములోనైనను ఆ సుఖమును లేశమాత్రము అనుభవించు సజ్జనులు బ్రహ్మానందమునుగూడ కోరుకొనరు. (సో॥ 88, క,ఖ)

గరుడా! నేను కొద్దికాలమువఱకు అయోధ్యలోనే యుంటిని. అక్కడ నేను శ్రీరాముని రసానందశోభితములైన పెక్కు బాల్యలీలలను జూచితిని. శ్రీరాముని కృపవలన భక్తిని వరముగా పొందితిని. తదనంతరము ప్రభుచరణములకు వందనమాచరించి, నా ఆశ్రమమునకు తిరిగి వచ్చితిని. శ్రీరఘునాథుడు నన్ను తనవానినిగా

జేసికొనినప్పటినుండియు, ఆయనమాయ నన్ను ఆవరింపలేదు. శ్రీహరిమాయ నన్నాడించిన రహస్యచరిత్రను నేను వర్ణించితిని. ఓ ఖగరాజా! ఇప్పుడు నేను నా అనుభవములను తెల్పెదను వినుము. హరిభజన లేకుండ (పంచ) క్లేశములు దూరములుగావు. శ్రీరాముని దయలేనిదే ప్రభుమహిమను గూర్చినజ్ఞానము లభ్యముగాదు. అతని మహిమ తెలియనిదే ప్రభువుపై విశ్వాసము కుదురుకొనదు. విశ్వాసములేనిదే ప్రేమ కలుగదు. తైలము లేనిదే జలమునకు చిక్కదనము రానట్లు ప్రీతి, స్నేహము లేనిదే భక్తి దృఢముగాదు. (చౌ॥ 1-4)

గురువులేనిదే జ్ఞానము లభ్యముగునా? వైరాగ్యము లేకుండ జ్ఞానము సంభవమా? వేదపురాణములు పేర్కొనినట్లు హరిభక్తిలేనిదే సుఖము ప్రాప్తింపదు. నాయనా గరుడుడా! సహజమైన సంతోషము లేనిదే శాంతి లభ్యముగాదు. ప్రాణములకు తెగించి, ఎన్ని ప్రయత్నములు చేసినను నీరు లేనిదే నావ నడువజాలదు. (సో॥ 89 క,ఖ)

తృప్తిలేనిదే కామవాసనలు నశింపవు. వాంఛలున్నంతవఱకు స్వప్నములోగూడ హాయి చేకూరదు. శ్రీరాముని భజింపనిదే కోరికలు నశింపవు. భూమిలేనిదే చెట్టు నిలద్రొక్కుకొనునా? తత్త్వజ్ఞానములేనిదే సమభావము అసంభవము. ఆకాశములేకుండ అవకాశము ఉండునా? నిశ్చయాత్మకమైన శ్రద్ధలేనిదే ధర్మాచరణము సాధ్యముగాదు. పృథ్వీతత్త్వము లేనియెడల గంధము లభించునా? తపస్సు లేనిదే తేజస్సు విస్తరిల్లునా? జలతత్త్వములేనిదే ప్రపంచములో రుచి ప్రాప్తించునా? జ్ఞానులకు సేవలు చేయనిదే శీలము ఏర్పడునా? అగ్ని తత్త్వము లేనిదే రూపము లభింపదు. ఆత్మానందము అభావమైనచో మనస్సు స్థిరముగాదు. వాయు తత్త్వములేనిదే స్పర్శ సంభవముగాదు. విశ్వాసము లేనిదే ఏదియు సిద్ధింపదు. అట్లే హరిభజనలేనిచో జన్మ మృత్యుభయములు తొలగవు. (చౌ॥ 1-4)

విశ్వాసములేనిదే భక్తి యేర్పడదు. భక్తితో సేవింపనిదే శ్రీరామునిహృదయము ద్రవింపదు. శ్రీరాముని కృపలేనిదే కలలోగూడ శాంతి లభింపదు. (దో॥ 90 క)

ఓ ధీరమతీ! ఈ విధముగా ఆలోచించి, కుతర్కములను, సందేహములను వదలి, సుందరుడు, సుఖదాయకుడు, కరుణానిధియైన శ్రీరాముని భజింపుము. (సో॥ 90, ఖ)

భగవంతుని అపారమహిమ

ఖగరాజా! నా శక్తిననుసరించి, శ్రీరామచంద్రప్రభుప్రతాపమును మహిమలనుగూర్చి గానముచేసితిని. ఇందులో దేనినిగూర్చియు నేను కల్పించిచెప్పలేదు. అంతయు ఉన్నది ఉన్నట్లుగా చూచినదానినే తెల్పితిని. శ్రీ రఘునాథునిమహిమలు, నామములు, రూపములు, గుణములు అన్నియును అపారములు, అనంతములు. శ్రీరాముడు స్వయముగా అనంతుడు. మునులు తమతమ బుద్ధిబలములననుసరించి, శ్రీహరి గుణములను కీర్తించెదరు. వేదములు, శేషుడు, శివుడుగూడ వాటిని పూర్తిగా గ్రహింపలేరు. సూక్ష్మజీవియైన దోమ మొదలుకొని మీ (గరుత్మంతుని) వఱకును ఱెక్కలుగల ప్రాణులన్నియును ఆకాశమున ఎగురగలవు. కాని ఆకాశముయొక్క అంతమును చూడలేవు. అట్లే శ్రీరఘునాథుని మహిమను అందఱును తమ తమ బుద్ధిబలములను అనుసరించి, అవగాహన చేసికొందురు. కాని దానిలోతులను పూర్తిగా కనుగొనలేరు. శ్రీరాముడు కోటిమన్మథసుందరాకారుడు. శత్రువులను పరిమార్చుటలో అనంతకోటి దుర్గామాతలశక్తిగలవాడు. ఐశ్వర్యమున ఆయన కోటి ఇంద్రులతో సమానుడు. అసంఖ్యాకములైన ఆకాశములు పట్టనంత విస్తృతమహిమగలవాడు. (చౌ॥ 1-4)

శ్రీరాముడు కోట్లకొలది వాయువులకంటెను మహాబలుడు. ప్రకాశమున అసంఖ్యాక సూర్యులను మించినవాడు. చల్లదనమున లెక్కలేనంతమంది చంద్రుల కంటెను అధికుడు, సమస్త భయనివారకుడు, భయంకరమైన మృత్యు దేవతవలె ఆయన దుస్తరమైనవాడు. లోకమునకు ఎదిరింపశక్యముగానివాడు. దుర్గమమైనవాడు, అంతములేనివాడు. నూఱుకోట్ల అగ్నిదేవతలకంటెను ప్రబలుడు. (దో॥ 91 క,ఖ)

శతకోటి పాతాళములకంటెను గంభీరమైన (లోతైన)వాడు. కోట్లకొలది యములకంటెను భయంకరుడు. అనంతకోటితీర్థ స్థానములకంటెను అత్యంతపవిత్రుడు. ఆ ప్రభునామమే సర్వ పాపములను అంతరింపజేయును. శ్రీ రఘువీరుడు కోటిహిమాలయములకంటెను సుస్థిరుడు. గాంభీర్యమున అనేకమహాసముద్రములను మించినవాడు. ఆ భగవానుడు దాతృత్వమున శతకోటికామధేనువులకంటెను అధికుడు, బుద్ధి కౌశలమున కోటి సరస్వతీదేవతలకంటెను కోవిదుడు. కోట్ల కొలది బ్రహ్మదేవులను మించిన సృష్టి రచనా నిపుణుడు, కోట్ల కొలది విష్ణువులను మించిన లోక సంరక్షకుడు, శతకోటి రుద్రులను మించిన సంహర్త. నూఱుకోట్లకుబేరులను మించిన మహా ధనవంతుడు. అనేక మాయలతో సృష్టికి ఆధారభూతుడు. భూభార నిర్వహణలో కోట్లకొలది శేషులకంటెను అధికుడు. జగదీశుడైన శ్రీరామచంద్రప్రభువు నిరవధికుడు, నిరుపమానుడు. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుడు నిరుపమానుడు, ఆయనతో పోల్చదగినది ఈ జగత్తున లేనేలేదు. ఆయనకు ఆయనయే సాటి. సూర్యకాంతిని కోటి దీపపుపురుగులతో సమానమని పోల్చినను ఆ వర్ణన (పోలిక) సరిపోదు. మీదు మిక్కిలి అది సూర్యునిందయే యగును. అట్లే మునీశ్వరులు తమ తమ బుద్ధిబలములననుసరించి, శ్రీరాముని ఎంతగా వర్ణించినను అది సరిపోదు. ఐనను మునీశ్వరులు భగవంతుని గూర్చి యథాశక్తి గానముచేయుదురు. భగవంతుడు అతికృపాళువు. భక్తుల భావగ్రాహి. కావున సాదరముగా ఆ వర్ణనలను విని, ఆనందించును. (ఛం)

శ్రీరామచంద్రుడు అనంతగుణసాగరుడు. అతనిగాంభీర్యమును ఎవ్వరును కొలువ జాలరు? నేను సజ్జనుల ద్వారా విన్న దానిని మీకు విన్పించితిని. (దో॥ 92. క)

సుఖనిధియు, కరుణాళువు ఐన భగవంతుడు భావవశుడు, కావున మమకారము, మదము, గర్వము వీడి, శ్రీ జానకీనాథుని భజింపవలెను. (సో॥ 92. ఖ)

కాకభుశుండియొక్క మృదుమధుర వచనములను విని, ఖగరాజైన గరుడుడు మిక్కిలి ప్రసన్నచిత్తుడై తన ఱెక్కలను విప్పి, విదలించుకొనెను. అతని కనులలో ఆనందాశ్రువులు నిండెను. మనస్సు హర్షముతో పొంగిపోయెను. అతడు శ్రీ రఘునాథుని ప్రతాపమును తన హృదయమున నింపుకొనెను. మునుపటి మోహమును స్మరించుకొని పశ్చాత్తప్తుడయ్యెను. అనాదియైన పరబ్రహ్మను సామాన్యమానవునిగా తలంచితినని చింతింపసాగెను. గరుడుడు కాకభుశుండిచరణములకు పదే పదే ప్రణమిల్లి, అతనిని శ్రీరామునితో సమానునిగా భావించి, ప్రేమవివ్వలుడాయెను. ఎవ్వరైనను బ్రహ్మమహేశ్వరుల యంతటి గొప్పవారైనను గురుకృప లేనిదే తరింప లేరు. గరుడుడు పల్కుచున్నాడు. "నాయనా! సంశయసర్పదష్టుడనైన నన్ను అనేకకుతర్కములు బాధించుచుండెను. భక్తులకు సుఖమునిచ్చు శ్రీరామచంద్రుడనెడి గారుడ మంత్రము మీ రూపమున ఆ విషమును తొలగించెను. మీ దయవలన నా అజ్ఞానము నశించెను. నిరుపమానమైన రామరహస్యజ్ఞానము ప్రాప్తించెను. (చౌ॥ 1-4)

భుశుండి పూర్వజన్మగాథ

పిమ్మట వైనతేయుడు భుశుండిని పెక్కు విధముల ప్రశంసించి, శిరసా ప్రణమిల్లి, అంజలి ఘటించి, ప్రేమపూర్వకముగా వినయవచనములతో ఇట్లనెను. "ఓ ప్రభూ! అజ్ఞానినైన నేను మిమ్ము ఒక ప్రశ్నను అడిగెదను. దయాసాగరా! నన్ను మీదాసునిగా భావించి, సాదరముగా నా ప్రశ్నకు సమాధానమును దయసేయుడు. (దో॥ 93. క,ఖ)

మీరు సర్వజ్ఞులు, బ్రహ్మవిదులు, మాయాతీతులు, బుద్ధిమంతులు, సుశీలురు, సరళ స్వభావులు, జ్ఞానవిజ్ఞానవైరాగ్యసంపన్నులు, శ్రీరఘురామునిప్రియదాసులు. మీరు కాకి శరీరమును పొందుటకు కారణమేమి?

నాకు విశదీకరింపుడు స్వామీ! భుశుండీ! మీరీ సుందర 'రామచరిత మానసమనెడి సరోవరమును' ఎచ్చట పొందితిరి? తెల్పుడు. మహాప్రళయకాలము నందుగూడ మీకు నాశములేదని పరమేశ్వరుడు తెల్పినాడు. శివుడసత్యమాడడు. కావున ఈ విషయమును తెల్పుడు. ప్రభూ! దేవతలు, నాగులు, మనుష్యులు మొదలగు స్థావరజంగములతో గూడిన జగత్తంతయు కాలునిచే కబళింపబడును. అసంఖ్యాకములైన బ్రహ్మాండములనుగూడ కాలము కబళించును. ఇది అనివార్యము. (చౌ॥ 1-4)

అట్టి భయంకరుడైన కాలుడు నిన్ను ఏ మాత్రము ప్రభావితునిగా చేయకుండుటకు గల కారణమేమి? కృపాళువూ! ఇది జ్ఞాన ప్రభావమా? యోగ బలమా? (సో॥ 94. క)

ప్రభూ! మీ ఆశ్రమమునకు రాగానే నామోహము, భ్రమ దూరమైనవి. దీనికి కారణమేమి? దయచేసి, ప్రేమతో దెల్పుడు. (దో॥ 94. ఖ)

(శివుడు పల్కుచున్నాడు) ఓ ఉమా! గరుడుని వచనములను విని, కాకభుశుండి ప్రసన్నచిత్తుడై, అనురాగపూర్వకముగా పలికెను. "ఓ గరుడుడా! మీరు ధన్యజీవులు. అట్టి మీసద్బుద్ధికి ధన్యవాదములు. మీ ప్రశ్నలు మెచ్చుకొనదగినవి. మీ ప్రేమపూర్వకములైన ఈ ప్రశ్నలను వినినంతనే నా పూర్వజన్మలు అనేకము స్మరణకు వచ్చినవి. వాటి కథలను వినిపించెదను. శ్రద్ధాదరములతో మనసుపెట్టి వినుడు. జపతపోయజ్ఞశమదమవ్రతదానవైరాగ్య వివేకయోగ విజ్ఞానములఫలము శ్రీరామచరణములయందలి అనురాగ ప్రాప్తి. అది లేకుండ ఎవ్వరును శుభమును పొంద జాలరు. నేనీ కాకి శరీరముతోనే భక్తిని పొందియుంటిని. కావున దీనిపై నాకు మక్కువ అధికము. తమకు లాభ ప్రదమైన దానిపై మమకారము ఉండుట అందటికిని సహజము. (చౌ॥ 1-4)

గరుడుడా! "అతి స్వల్పప్రాణియైనను తమకు పరమహితమును గూర్చునదియైనచో ఎవ్వరైనను దానిని సాదరముగా ప్రేమతో గౌరవింపవలెను." అనునది వేద సమ్మతమైన నీతి. సజ్జనులుగూడ దానిని పాటింతురు. పట్టుదారము ఒక పురుగునుండి వచ్చును. దాని వలన అత్యంత సుందరమైన పట్టువస్త్రములు నేయబడును. కావున అపవిత్రమైన పురుగునుగూడ జనులు ప్రాణసమానముగా పెంచుదురు. (సో॥ 95. క,ఖ)

మనోవాక్కర్మలచే శ్రీరామునిపై భక్తికలిగియుండుటయే జీవునకు నిజమైనకర్తవ్యము. శ్రీరాముని భజించుశరీరమే సుందరమైనది, పవిత్రమైనది. శ్రీరామునకు విముఖుడైనవ్యక్తికి బ్రహ్మశరీరమే లభించినను అతనిని కవులు, పండితులు ప్రశంసింపరు. ఈ శరీరముతోడనే నాకు శ్రీరామ ప్రభువుపై భక్తి జనించెను. అందువలన ఓ స్వామీ! నాకు ఇది అత్యంతప్రియమైనది. నా మృత్యువు నా ఇచ్ఛతో కలుగునని భగవంతుని వరము. ఐనను ఈ శరీరమును త్యజింపను. ఏలనన శరీరములేకుండా హరిభజనచేయుట సాధ్యము కాదని వేదములు పేర్కొనుచున్నవి. మొదట మోహము నన్ను దుర్దశలపాలు చేసినది. శ్రీరాముని ఆశ్రయింపకుండుటచే నేను సుఖముగా నిద్రింపలేక పోయితిని. అనేకజన్మలలో నేను అనేకవిధములైన యోగ, జప, తపోయజ్ఞదానాది కర్మలను ఆచరించితిని. ఓ ఖగరాజా! నేను పెక్కుయోనులలో జన్మించి, వివిధ కర్మలను ఆచరించితిని. కాని ఇప్పటి సుఖము నాకెప్పుడును లభింపలేదు. నాకు ఇప్పుడు పూర్వ జన్మల స్మృతిగలదు. ఏలనన శివునికృపవలన నాబుద్ధి మోహమునకు లోనుగాలేదు. (చౌ॥ 1-4)

ఓ ఖగరాజా! వినుము. నేను నా పూర్వజన్మకథను తెలిపెదను. దానిని విన్నవారికి ప్రభు చరణములపై ప్రీతి యేర్పడును. దానిద్వారా సాంసారిక క్లేశములన్నియును తొలగును. ప్రభూ! పూర్వమొకకల్పములో పాపకూపమైన కలియుగము ప్రారంభమాయెను. అందు స్త్రీ పురుషులు అధర్మములో మునిగి వేదవిరుద్ధమార్గములయందు ప్రవర్తించుచుండిరి. (దో॥ 96. క,ఖ)

అట్టి కలియుగమున నేను అయోధ్యానగరమున ఒకశూద్రునిగా జన్మించితిని. మనోవాక్కర్మలచే నేను శివభక్తుడనై ఇతరదేవతలను నిందించుచుంటిని. అతిగర్వితుడనై, ధనమదోన్మత్తుడనై, వాచాలునిగా, ఉగ్రబుద్ధిగలవానినిగా ఉంటిని. నా హృదయమున 'దంభము' అధికముగానుండెను. శ్రీరఘునాథునిఅయోధ్యానగరమునందున్నప్పటికిని నేను దానిమాహాత్మ్యమును ఎఱుగకుంటిని. ఇప్పుడే నాకు అయోధ్యవైశిష్ట్యము తెలిసినది. ఏ జన్మలో నైనను అయోధ్యలో నివసించిన వాడు శ్రీరామునిపై అవశ్యముగా అనురక్తుడగునని వేదశాస్త్రపురాణములు తెలుపుచున్నవి. చేత ధనుర్బాణములను ధరించిన కోదండరాముని తన హృదయమునందు నిలుపుకొనినవాడే అయోధ్య-ఔన్నత్యమును తెలిసికొనగల్గును. గరుడుడా! కలికాలము చాల కలుషితమైనది. అందు స్త్రీ పురుషులందఱును పాపకర్మనిరతులు. (చౌ॥ 1-4)

కలియుగ లక్షణములు

కలియుగపాపములవలన ధర్మములన్నియును నశించెను. సద్గ్రంథములన్నియును మఱుగునబడెను. పాషండులు తమవిపరీతబుద్ధులతో వివిధసంప్రదాయములను కల్పించిరి. జనులందఱును మోహమునకు అధీనులైరి. లోభము సత్కర్మలను మ్రింగి వేసెను. ఓ జ్ఞాననిధీ! హరి వాహనా! వినుము. నేను కొన్ని కలియుగ లక్షణములను దెల్పెదను. (దో॥ 97. క,ఖ)

కలియుగమున వర్ణాశ్రమధర్మములు అడుగంటును. స్త్రీ పురుషులు వేదవిరుద్ధముగా ప్రవర్తింతురు. బ్రాహ్మణులు వేదములను అమ్ముకొందురు. రాజులు ప్రజలను పీడించుచు తిని వేయుచుందురు. వేద, శాస్త్ర బోధనలను ఎవ్వరును గౌరవింపరు. ఎవరికి ఏది ఇష్టమో వారికి అదియే ధర్మము. బిగ్గరగా అఱచువాడే పండితుడు. ఆడంబరముగా జీవించువానిని, ఆపాద మస్తకము కపటముతోకూడియుండువానిని ప్రజలు సజ్జనునిగా భావింతురు. ఏయుపాయము ద్వారా ఐనను ఇతరులధనములను అపహరించువాడే చతురుడు. కపటవర్తనుడే ఆచారపరుడు. అసత్యములాడుచూ వాటిని పరిహాసముగా ప్రకటించువాడు కలియుగములో గుణవంతుడుగా చెల్లుబడి యగును. ఆచారహీనుడును, వేద మార్గమును త్యజించు వాడును, పొడవుగా గోళ్లను, జడలను పెంచుకొను వాడును జ్ఞానిగా, విరాగిగా, తాపసిగా ప్రసిద్ధికెక్కును. (చౌ॥ 1-4)

అశుభ (అమంగళ కరములైన) వేషభూషణములను ధరించువాడును, తినదగినవి, తినగూడనివి అను వివక్షణ లేక అన్నింటిని తినెడువాడును, ఐనట్టి వాడే యోగి, సిద్ధుడు, కలియుగములో పూజ్యుడు. (దో॥ 98. క)

ఇతరులకు అపకారముచేయువారే ఎక్కువగా గౌరవింప బడుదురు. మనోవాక్కర్మలచే అసత్య ప్రలాపములాడువారు గొప్పవక్తలు. (సో॥ 98. ఖ)

పురుషులందఱు స్త్రీలకువశులై గారడీవానిచేతిలో కోతులవలె ఆడుచుందురు. శూద్రులు బ్రాహ్మణులకు జ్ఞానోపదేశము చేసెదరు. మెడలో యజ్ఞోపవీతములనుధరించి, అపవిత్ర దానములను స్వీకరించెదరు. జనులందఱును కామక్రోధలోభపరాయణులై యుందురు. వారు దేవతలను, బ్రాహ్మణులను, వేదములను, సజ్జనులను ద్వేషించెదరు. అభాగినులైన స్త్రీలు, సర్వ గుణసంపన్నుడును, సుందరుడైన పతిని వదలి, పరపురుషునిచెంత చేరుచుందురు. ముత్తైదువలశరీరములపై ఆభరణములుండవు. కాని విధవలు నిత్యమూ నూతన శృంగారములను చేసికొనుచుందురు. గురుశిష్యుల సంబంధము గ్రుడ్డి, చెవిటి వారిమధ్యగలసంబంధమువంటిది. గురువునకు జ్ఞానదృష్టి యుండదు. శిష్యుడు గురూపదేశమును వినడు. శిష్యుని ధనమును అపహరించి, వానిని శోకమునకుగురిచేయు గురువులు కొల్లలుగా ఉందురు.వారు ఘోర నరకముల పాలగుదురు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉదరపోషణమునకు ఉపయోగపడు ధర్మములనే బోధించెదరు. (చౌ॥ 1-4)

స్త్రీ పురుషులు ఒక వైపు బ్రహ్మ జ్ఞానమునుగూర్చి తప్ప వేఱేమియు మాట్లాడరు. మఱొక వైపు వారు లోభమున ఒకపైసా కొఱకే బ్రాహ్మణునైనను, గురువునైనను హత్యచేయుటకు వెనుకాడరు. శూద్రులు బ్రాహ్మణులతో "మేము మీకంటె తక్కువా?" అని గర్వముతో గ్రుడ్లురిమి గద్దించెదరు, వాదములకు దిగెదరు. "బ్రహ్మమును దెలిసినవాడే బ్రాహ్మణుడు" అని వితండవాదములకు దిగుచుందురు. (దో॥ 99. క,ఖ)

పరస్త్రీలయందు ఆసక్తులు, కపటప్రవర్తనలో నిపుణులు, మోహము, ద్రోహము, మమకారములలో మునిగిన వారే "అభేదవాదులు"గా, 'బ్రహ్మజ్ఞానులు'గా ప్రసిద్ధివహింతురు. నేను కలియుగములో ఈ విశేషములనన్నింటిని జూచితిని. జనులు తాము స్వయముగా భ్రష్టులగుటయే గాక సన్మార్గమున నడచువారినిగూడ భ్రష్టపఱచుదురు. వారు కుతర్కములతో వేదశాస్త్రములను దూషించెదరు. ప్రతికల్పమునందును నరకయాతనలను అనుభవింతురు. నీచవర్ణస్థులైన నూనెలను అమ్ముకొనెడివారు, కుమ్మరులు, కుక్కమాంసములను భక్షించెడి చండాలురు, భిల్లులు, కోలులు, మద్యములను అమ్ముకొనెడి వారు- వీరందఱును భార్య చనిపోయినపిదపగాని, సంపదలను కోల్పోయినతరువాతగాని, తలగొరిగించుకొని సన్న్యాసులయ్యెదరు. వారు బ్రాహ్మణులచేతను పూజలందుకొందురు. ఈ విధముగా తమచేతులారా అధోగతిపాలై, ఇహపరలోకములకు దూరమగుదురు. బ్రాహ్మణులు విద్యాహీనులై, లోభులై, విషయాసక్తులై, ఆచారహీనులై, మూర్ఖులై నీచజాతి స్త్రీలను, వ్యభిచారిణులను వివాహమాడెదరు. శూద్రులు నానావిధములైన జపతపోవ్రతాదులను జేసి, ఉన్నతాసనమున గూర్చుండి, పురాణ ప్రవచనములను గావింతురు. మనుష్యులందఱును తమఇచ్ఛానుసారము మంచి చెడ్డలను మఱచి, విచ్చలవిడిగా ప్రవర్తింతురు. కలియుగమున ప్రబలెడి అపారమైన అవినీతిని వర్ణింప ఎంత వారికిని తరము గాదు. (చౌ॥ 1-5)

కలియుగమున జనులందఱును వర్ణసంకరులై మర్యాదలను ఉల్లంఘించెదరు. వారు పాపములను జేసి, తత్ఫలితముగా దుఃఖములను, భయములను, రోగములను, శోకములను, ప్రియవస్తువియోగములను పొందెదరు. మనుష్యులు మోహవశమున వేదసమ్మతమైన జ్ఞాన వైరాగ్యయుక్తమైన హరిభక్తిమార్గమున కాలుమోపరు. వారు నిరర్థకముగా క్రొత్త సంప్రదాయములను కల్పనచేసెదరు. (దో॥ 100. క,ఖ)

కుహనాసన్న్యాసులు ధనమును సేకరించి, తమకై గృహములను నిర్మించుకొని, వాటిని అలంకరింప జేయుదురు. వారు విషయభోగలాలసులు. వారిలో వైరాగ్యము ఏ మాత్రమూ ఉండదు. కపటతాపసులు సంపన్నులయ్యెదరు. గృహస్థులు దరిద్రులయ్యెదరు. నాయనా! నిజముగా కలియుగలీలలు విచిత్రములు, అవర్ణనీయములు. జనులు పతివ్రతలైన తమ కులపతులను వెళ్ల గొట్టి, కులమర్యాదలను మంటగలిపి, దాసీలను చేరదీసెదరు. పుత్రులు తమభార్యల ముఖములను చూడనంతవఱకే తల్లిదండ్రులను గౌరవింతురు. క్రమముగా ఆ పుత్రులకు తమవారు శత్రువులయ్యెదరు. ఆలివైపు వారు ఆత్మబంధువులగుదురు. రాజులు పాపాత్ములై ధర్మములను విస్మరింతురు. నిత్యమూ ప్రజలను పీడించి వారిని దుర్దశలపాలుచేయుచుందురు. ధనవంతులు నీచ జాతివారైనను కులీనులుగా గౌరవింపబడుదురు. యజ్ఞోపవీతములు మాత్రమే బ్రాహ్మణులకు గుర్తు. దిగంబరత్వము తాపసులకు గుర్తు. వేదపురాణములపై విశ్వాసము లేనివారు హరి భక్తులుగా, సజ్జనులుగా చెలామణియగుచుందురు. కవులకు ఉదారముగా ఆశ్రయమిచ్చి, గౌరవించు వారుమాత్రము మచ్చునకైనను కనబడరు. ఇతరులగుణములను దోషములుగా చూపెడి వారు కోకొల్లలు. కాని వారిలో నిజమైన గుణవంతులెవ్వరును కానరారు. కలియుగమున తఱచుగా కఱవు కాటకములు సంభవించుచుండును. జనులలో ఆకలి చావులు మిక్కుటముగా నుండును. (ఛం॥ 1-5)

ఓ ఖగరాజా! వైనతేయా! వినుము. కలియుగమున కపటము, హఠము, దంభము, ద్వేషము, పాషండత్వము, అభిమానము, కామము, మదము, మోహము మొదలగునవి విశ్వమంతయు వ్యాపించును. మనుష్యులు జపతపోయజ్ఞవ్రతదానాదిధర్మములు తామసభావములతో ఆచరింతురు. దేవతలు భూమిపై వానలను కురిపింపరు. నాటినవిత్తములు మొలకెత్తవు. (దో॥ 101. క,ఖ)

స్త్రీలు శిరోజములను కత్తిరించుకొని వాటిని చిత్ర విచిత్రములుగా అలంకరించుకొందురు. వారు ఎన్నడును తృప్తి జెందరు. అనేక వస్తువులపై లాలస ఉండుటవలన ధనహీనలై దుఃఖముల పాలగుదురు. వారు మూర్ఖత్వమువలన వ్యర్థ సుఖములను ఆసించెదరు. ధర్మముపై వారి మనస్సులు లగ్నముగావు. వారు అల్పబుద్ధులు, కఠినాత్ములు అయ్యెదరు. కోమలత్వము వారిలో లేశమాత్రమూ ఉండదు. మనుష్యులు రోగపీడితులు అగుదురు. వారికి సుఖమనునదియే యుండదు. దురభిమానముతో వారు నిష్కారణవైరమును పూనుదురు. వారిజీవితకాలము క్షణికమైనను వారి గర్వముమాత్రము కల్పాంతమువఱకును ఉండును. కలియుగము మానవులజీవితములను తలక్రిందులుగావించును. జనులు తమ చెల్లెండ్రను, కూతుండ్రను సైతము పవిత్రముగా గౌరవింపరు. ఎక్కడనూ, ఎవ్వరిలోనూ సంతోషమూ, వివేకమూ మనశ్శాంతియూ మచ్చునకైనను కనబడవు. అన్ని జాతులవారును యాచకవృత్తిని అవలంబింతురు. ఈర్ష్య, పరుషవచనములనుబల్కుట, లోభము అనునవి జనులలో సంపూర్ణముగా ఉండును. సమతాభావములు ఉండవు. ప్రజలందఱును వియోగములను, అంతులేని దుఃఖములను అనుభవింతురు. వర్ణాశ్రమ ధర్మములు అడుగంటును. దమము, దానము, దయ, సానుభూతి కలికమునకైనను కానరావు. మూర్ఖత్వము, మోసము పెచ్చు పెఱుగును. శరీరపోషణయందే స్త్రీ పురుషులు ఆసక్తిని కనబఱచెదరు. జగత్తునందంతటను పరులను నిందించువారే దర్శనమిచ్చెదరు. (ఛం॥ 1-5)

ఓ పన్నగాంతకా! గరుడుడా! వినుము. కలియుగము పాపములకును, అవగుణములకును నిలయము. కాని ఈ కలియుగమున ఒక గొప్పగుణముగూడ లేకపోలేదు. ఎట్టి శ్రమలేకయే జనులకు జననమరణములనుండి విముక్తి లభించును. సత్య (కృత) త్రేతా, ద్వాపర యుగములయందు యోగ, యజ్ఞ, పూజలవలన ప్రాప్తించెడిగతి, కలియుగమున జనులకు కేవలము భగవన్నామస్మరణవలననే లభించును. (దో॥ 102 క,ఖ)

కృత యుగమునందు ఎల్లరును యోగులై, విజ్ఞానులై యుందురు. వారు దైవధ్యానముచే భవసాగరమును దాటెదరు. త్రేతాయుగమున ప్రజలు వివిధ యజ్ఞములను ఆచరించి, తమ కర్మలనన్నింటిని ప్రభువునకు సమర్పించి, సంసారసాగరమునుండి తరించెదరు. ద్వాపరయుగమున భగవంతుని చరణములను పూజించి, జనులు భవబంధములనుండి విముక్తి పొందెదరు. ఈ విషయమున ఇంతకంటెను వేఱుఉపాయమేలేదు. కలియుగమున శ్రీహరిగుణములను గానముచేసి, జనులు జననమరణచక్రమునుండి ముక్తిని పొందెదరు. కలియుగమున యోగము, యజ్ఞము, జ్ఞానము అనువాటిద్వారా శ్రమపడవలసిన అవసరము లేదు. కేవలము శ్రీరాముని గుణకీర్తనమే ముక్తికి పరమసాధనము. (కలౌ సంకీర్తనాన్ముక్తిః) కావున యోగము మొదలగువాని ప్రసక్తి లేకయు శ్రీరాముని భజించువాడు, అనన్యభక్తితో ప్రభుగుణగణములను గానమొనర్చువాడు భవసాగరమునుండి అవలీలగా బయటపడగలడు. ఇందు సందేహములేదు. కలియుగమున నామమహిమ గొప్పది. మానసికపుణ్యముండును గాని, మానసికపాపము ఉండదు. ఇది కలియుగమునందలి వైశిష్ట్యము. (చౌ॥ 1-4)

మానవుడు విశ్వాసము కలిగియున్నచో కలియుగముతో సమానమైన యుగములేదు. ఏలనన శ్రీరాముని నిర్మలగుణ గణములను స్మరించి, ఎట్టి ప్రయాసయు లేకుండగనే సంసారసాగరమును దాటగలడు. ధర్మమునకు సత్యము, దయ, తపము, దానము అనునాలుగు చరణములును ప్రసిద్ధములు. కలియుగమున 'దానము' అనుచరణమే ముఖ్యమైనది. దానమును ఏ విధముగా చేసినను అది శుభ ఫలితమునే ఇచ్చును.. (దో॥ 103 క,ఖ)

శ్రీరాముని మాయాప్రేరణవలన అందఱి హృదయములలో అన్ని యుగములధర్మములును నిత్యము ప్రకాశించుచుండును. శుద్ధసత్త్వగుణము సమత్వము, విజ్ఞానము, మనఃప్రసన్నత అనునవి కృతయుగ ప్రభావములని తెలిసికొనవలెను. సత్త్వగుణము అధికముగా ఉండి, అది కొంత రజోగుణమిశ్రితమైనచో, అది త్రేతాయుగ లక్షణము. దీని ప్రభావము వలన కర్మలయందు ప్రీతి, సర్వవిధసుఖములనుకోరుట జరుగును. రజోగుణము ఎక్కువగా నుండి, సత్త్వ గుణము చాలా కొద్దిగానుండి, కొంతతమోగుణము గూడ మిశ్రితమై, హర్షము, భయము కలుగుచుండుట ద్వాపరయుగలక్షణము, తమోగుణము అధికముగా ఉండి కొద్దిగా రజోగుణము మిశ్రితమై నలుదెసల వైరము, ప్రతీకారము వ్యాపించుట కలియుగ ప్రభావము. పండితులైన వారు యుగ ధర్మములనుగూర్చి బాగుగా ఆలోచించి, అధర్మమును త్యజించి, ధర్మమును ఆచరించెదరు. శ్రీరఘునాథుని చరణములపై అత్యంతప్రీతిగలవానిని యుగధర్మములు ఏ మాత్రమును అంటవు. ఓ ఖగరాజా! ఇంద్రజాలికుడు ప్రదర్శించుమాయ చూచువారికే అనూహ్యమైనది. కాని అతని ఉపాయములు అతనిసేవకులను ప్రభావితము చేయవు. (చౌ॥ 1-4)

శ్రీహరిమాయాప్రేరితములైన గుణదోషములు దూరమగుటకు హరినిభజించుటతప్ప మఱియొక మార్గము లేదు. మనస్సులో ఇట్లాలోచించి, కోరికలన్నింటిని త్యజించి, నిష్కామ భావముతో శ్రీరాముని భజింపవలెను. ఓ ఖగరాజా! వైనతేయా! ఈ కలియుగమున నేను అనేక వత్సరములు అయోధ్యానగరమున నివసించితిని. అక్కడ కఱవు సంభవింపగా ఆపదలకు గుఱియై ఇతర దేశములకు వెళ్లితిని. (దో॥ 104. క,ఖ)

ఓ పన్నగాశనా! ఖగరాజా! వినుము. నేను దీనుడనై, ఉదాసీనుడనై, దరిద్రుడనై, దుఃఖితుడనై, ఉజ్జయినీ నగరముకు వెళ్లితిని. కొంత కాలము అచట గడిపి, కొంత ధనమును సంపాదించి, పరమ శివుని ఆరాధింప సాగితిని. అక్కడ ఒక బ్రాహ్మణుడు వైదికపద్ధతిలో శివుని పూజించుచుండెను. అహర్నిశలు శివుని పూజించుటయే అతని పని. అతడు పరమసాధువు, పరమార్థమును ఎఱిగిన వాడు, శివునియుపాసకుడు. కాని విష్ణునింద చేయకుండెను. నేను కపటభావముతో అతనిని సేవించుచు ఉంటిని. ఆ బ్రాహ్మణుడు అతిదయాళువు. నీతిమంతుడు . గరుడుడా! నా 'పైపై' వినయమును జూచి, అతడు నన్ను తనపుత్రునివలె భావించి, బోధించుచుండెను. ఆ బ్రాహ్మణుడు నాకు శివమంత్రమునే గాక అనేకపవిత్ర విషయములను ఉపదేశించెను. నేను ప్రతి దినము దేవాలయమునకు వెళ్లి, శివమంత్రమును జపించుచుంటిని. కాని నా హృదయమున డంబాహంకారములు నిండియుండెను. (చౌ॥ 1-4)

నేను పాపబుద్ధిని, దుష్టుడను, నీచుడను, అకారణమున మోహవశుడనై హరిభక్తులను, బ్రాహ్మణులను చూడగనే కోపముతో మండిపడుచుంటిని. భగవంతుడైన విష్ణువును వైరభావముతో చూచుచుండెడివాడను. (దో॥ 105. క)

గురువుగారు నా ప్రవర్తనను జూచి, బాధపడుచుండిరి. వారు నాకు నిత్యము సదుపదేశములను ఇచ్చుచుండిరి. కాని నేను వారిఉపదేశములను పెడచెవిన పెట్టుచుంటిని. రాను రాను నాకు కోపము అధికము కాజొచ్చెను. గర్విష్ఠియైన వానికి నీతి వాక్యములు చెవికెక్కునా? (సో॥ 105. ఖ)

ఒక దినమున గురువుగారు నన్ను పిలిచి, "పుత్రా! శివుని సేవాఫలము నిరంతరము శ్రీరాముని చరణములపై భక్తి కుదురుకొనుటయే" అని అనేకవిధముల నీతి గఱపెను. నాయనా! శివుడు, బ్రహ్మయు శ్రీరాముని భజించెదరు. ఇక మానవమాత్రులసంగతి అడుగనేల? బ్రహ్మ, పరమేశ్వరుల యంతటివారుగూడ శ్రీరామునిచరణసేవయందు ఆసక్తులు. అట్టి ఆ ప్రభువుతో వైరముపూని నీవు సుఖమును ఆశించుచున్నావా?" శివుడు హరిసేవకుడని గురువు గారు పలికెను. ఓ ఖగరాజా! ఈ మాట వినగానే నా హృదయము కోపాగ్నిలో దహించుకొనిపోయెను. జాతిచేత అనర్హుడనైన నాకు గురువుగారు విద్యలను నేర్పుట పామునకు పాలుపోసినట్లైనది. గర్వపోతును, కుటిలుడను, దౌర్భాగ్యుడను, కుజాతివాడను ఐన నేను రాత్రింబవళ్లు గురువునకే ద్రోహము తలపెట్టితిని. కాని గురువుగారు

అత్యంతదయాళువులు. కావున ఆయన ఏమాత్రము కోపపడలేదు. ఆయన అనుక్షణము చక్కనిజ్ఞానమును బోధించుచుండెను. నీచుడు తనకు ఔన్నత్యమునుగూర్చినవానికే హాని చేకూర్చును. సోదరా! వినుము. పొగ నిప్పునుండి ఉత్పన్నమగును. కాని అదేపొగ మేఘముగా రూపొంది, తాను వర్షించినజలముతో ఆ నిప్పును ఆర్పివేయును. ధూళి మార్గములోపడి, అవమానము పాలై సర్వదా అందఱిపాదములచే త్రొక్క బడును. కాని గాలివలన ఆ ధూళి ఎత్తునకు (పైకి) ఎగిరినప్పుడు అది ఆ గాలినే చుట్టుముట్టి రాజుల కండ్లలోను, కిరీటములపైనను పడును. ఓ ఖగరాజా! వినుము. ఈ ప్రసంగమును గ్రహించిన బుద్ధిమంతులు అధములతో సాంగత్యము చేయరు. దుష్టులతో కలహముగాని, స్నేహముగాని, చేయుట తగదని పండితశ్రేష్ఠులు నీతిగఱపెదరు. ఖలునియెడ ఎల్లప్పుడును తటస్థునివలెనే ఉండ వలెను. అతనిని కుక్కనువలె దూరముగా ఉంచవలెను. నేను దుష్టుడను, కపటిని, కుటిలుడను, గురువుగారు నాకు హితవచనములనే నుడువుచుండిరి. కాని అవి నాకు రుచింపకుండెను. (చౌ॥ 1-8)

ఒక దినము నేను శివాలయములో శివనామమును జపించుచుంటిని. అదే సమయమున గురువుగారు అచటికి విచ్చేసిరి. కాని గర్వితమతినై నేను లేవలేదు. పైగా ఆయనకు నమస్కరింపలేదు. గురువుగారు దయానిధులు. నాదౌష్ట్యమును చూచియు, ఆయన ఏమియును అనలేదు. ఆయనహృదయములో ఆవంతయు కోపములేకుండెను. కాని గురువును నిరాదరించుట మహాపాపము. మహాదేవుడు దీనిని సహింపలేకపోయెను. (దో॥ 106. క,ఖ)

మందిరము లోపలనుండి ఒక అదృశ్యవాణి ఇట్లు పలికెను. "ఓరీ! దౌర్భాగ్యుడా! మూర్ఖుడా! దురభిమానీ! నీ గురువు మిక్కిలి దయామయుడు గావున నిన్ను కోపగింపలేదు. ఆయన పరిపూర్ణ జ్ఞాని. ఐనను శఠుడా! నేను నిన్ను శపించెదను. నీతి బాహ్యమైనపని నాకు రుచింపదు. దుష్టుడా! నిన్ను దండింపనిచో వైదికనిష్ఠానియమములను ఉల్లంఘించినట్లు అగును. గురువునెడ ఈర్ష్యాళువైనమూర్ఖుడు కోట్లకొలదియుగములవఱకు రౌరవనరకయాతనలకు గుఱియగును. తరువాత పశుపక్ష్యాది యోనులలో జన్మించును. వేలకొలది జన్మలలో దుఃఖములననుభవించును. ఓరీ! పాపీ! నీవు గురువుగారిముందు కొండచిలువవలె కూర్చొని యుంటివి. నీ బుద్ధి పాప పంకిలమైనది. కావున నీవు సర్పమువై, నీచాతినీచముగా అధోగతిపాలై, పెద్ద చెట్టుతొఱ్ఱలో పడియుండెదవు. (చౌ॥ 1-4)

భయంకరమైన ఆ శివునిశాపమును విని, గురువుగారు 'హాహా కారము' చేసెను. వణకుచున్న నన్ను చూచి, అతని హృదయములో దుఃఖము ఉప్పొంగెను. నా విహ్వలస్థితిని గమనించి, ఆ బ్రాహ్మణుడు శివునకు భక్తితో దండప్రణామములను ఆచరించి అంజలి ఘటించి, గద్గద కంఠముతో స్తుతింప సాగెను. (దో॥ 107. క,ఖ)

పరమేశ్వరస్తవము

ఓ మోక్ష స్వరూపా! ఓ విభూ! సర్వవ్యాపకా! బ్రహ్మస్వరూపా! వేదమూర్తీ! ఈశాన్య దిశాధీశా! పరమేశ్వరా! నీకు నమస్కారములు. నీవు స్వస్వరూపస్థితుడవు. (మాయాతీతుడవు.) నిర్గుణుడవు. నిర్వికల్పుడవు. ఇచ్ఛారహితుడవు. చిదాకాశరూపుడవు. (చిత్తము ఆకాశమువలె స్వచ్ఛము నిర్మలము, ఉదారగుణసంపన్నము, విశాలము ఐన వాడవు.) ఆకాశమే వస్త్రముగాగలవాడవు (దిగంబరుడవు) ఐన నిన్ను భజించెదను. (1) నిరాకారుడవు. ఓంకారమునకు నిలయమైనవాడవు. తురీయుడవు. (సర్వదా సమాధినిష్ఠలోనుండువాడవు) వాక్కునకును, ఇంద్రియములకును, జ్ఞానమునకును అగోచరుడవు, కైలాసపతివి, భయంకరుడవు, మహామృత్యుంజయుడవు, కృపాళుడవు. గుణనిధివి. సంసారమునకు అతీతుడవు. పరమేశ్వరా! నీకు నా ప్రణామములు. (2) హిమాలయమువలె తెల్లనికాంతిగలవాడవు. గంభీరుడవు. కోటిమన్మథశోభలతో విలసిల్లు వాడవు. నీ శిరమున జటాజూటము, సుందరతరంగములతో

గంగానదియు విరాజిల్లుచున్నవి. లలాటమున చంద్రకళ, కంఠమున సర్పములు శోభిల్లుచున్నవి. (3) చలించుకుండలములు, సుందరమైనభ్రుకుటి, విశాలములైన నేత్రములు, మనోజ్ఞములైయున్నవి. ప్రసన్నముఖముతో, నీలగళముతో ఒప్పెడి నీవు దయామయుడవు. వ్యాఘ్ర చర్మమును, కపాలమాలికను ధరించి యున్నవాడవు. అందఱికిని ప్రియమైనవాడవు. అట్టి నీకు ప్రణమిల్లు చున్నాను. (4) శ్రేష్ఠుడవు, తేజస్వివి, పరమేశ్వరుడవు, అఖండుడవు, జన్మరహితుడవు, ప్రచండుడవు, కోటి సూర్య ప్రభా భాసితుడవు, తాపత్రయ నివారకుడవు, త్రిశూలధారివి, భావగమ్యుడవు, భవానీ పతివి. అట్టి సర్వ శుభంకరా! శంకరా! నీకు నమస్కారములు. (5) సకలకళాపూర్ణుడవు, కల్యాణస్వరూపుడవు, కల్పాంతమొనర్చు వాడవు, సజ్జనులకు ఆనందప్రదాతవు. త్రిపురారివి, చిదానందరాశివి, మోహ నాశకుడవు. కామారివి, ప్రభూ! ప్రసన్నుడవుగమ్ము. (6) ఓ ఉమాపతీ! నీ చరణ కమలములను భజింపనివారికి ఇహ పరలోకములయందు సుఖశాంతులు ఉండవు, వారి సంతాపములు తొలగి పోవు. సర్వప్రాణిహృదయములయందుండువాడవు. ప్రభూ! ప్రసన్నుడవు గమ్ము. (7) నేను యోగము, జపము, పూజలు ఎఱుగను. శంభో! సర్వదా నీకు ప్రణమిల్లెదను. జరామరణ దుఃఖములతో తపించుచు శరణుజొచ్చినవాడనైన నన్ను ఈ దుఃఖములనుండి రక్షింపుము. ఈశ్వరా! శంభో! నీకు ప్రణామములు. (8) (ఛం)

శంకరుడు ప్రసన్నుడగుటకై ఈ రుద్రాష్టకము ద్వారా ఆ బ్రాహ్మణుడు ఆ పరమేశ్వరుని స్తుతించెను. భక్తితో దీనిని పఠించుమానవులను ఆ పరమశివుడు అనుగ్రహించును. (శ్లో॥ 9)

సర్వజ్ఞుడైన శివుడు ఈ స్తుతిని విని, బ్రాహ్మణునిభక్తివిశ్వాసములను గ్రహించెను. అపుడు మందిరముననుండి అశరీరవాణి "ఓ ద్విజశ్రేష్ఠా వరమును కోరుకొనుము." అని పలికెను. బ్రాహ్మణుడు పలికెను. "ఓ ప్రభూ! నా యెడ మీరు ప్రసన్నులైనచో ఈ దీనునిపై కృప యుంచి, మొదట మీ చరణములపై భక్తిని ప్రసాదింపుడు. పిమ్మట రెండవవరమును అనుగ్రహింపుడు. ప్రభూ! ఈ జడ ప్రాణి మీమాయకు వశుడై నిత్యము నిరంతరము అజ్ఞానముతో తిరుగు చుండును. కృపాసాగరా! ఇతనిపై కోపింపకుడు. ఓ దీన దయాళూ! శంకరా! ఈతనిని కనికరించి, శాప విముక్తి త్వరగా కలుగునట్లు అనుగ్రహింపుడు. (దో॥ 108. క,ఖ,గ,ఘ)

ఓ కృపానిధీ! ఇతనికి హితమును గూర్చుడు "పరహితార్థపూర్ణములైన బ్రాహ్మణవచనములను విని, ఆ అదృశ్యవాణి 'అట్లే కానిమ్ము' అనెను. "ఇతని ఘోరపాపములను జూచి, (ఇతనికి) తగిన శాపము నిచ్చితిని. కాని నీ సాధుత్వమును, సరళవచనములను గమనించి, ఓ బ్రాహ్మణుడా! క్షమాశీలుడు, పరోపకారియునైన వానిపై, ఖరారియైన శ్రీరామునివలె నేను కృపను ప్రసరింప జేసెదను. నాశాపము వ్యర్థముగాదు. ఇతనికి వేయి జన్మలు తప్పవు. కాని జనన మరణ దుఃఖములు ఇతనిని బాధింపవు. ఏ జన్మలోనూ ఇతనిజ్ఞానము లుప్తముగాబోదు" అని పిదప ఆ అదృశ్యవాణి నాతో (భుశుండితో) ఇట్లనెను. "ఓ శూద్రా! వినుము. ఇప్పటి నీజన్మ రఘునాథుని (అయోధ్యా) నగరముననే ఐనది. పైగా నీ మనస్సును నా సేవ యందే నిమగ్నమొనర్చితివి. నగర ప్రభావమునను, నా అనుగ్రహమునలనను నీ హృదయమున రామ భక్తి ఉదయించును. నా వచనములు సత్యములు. వత్సా! బ్రాహ్మణ సేవయే శ్రీహరిని సంతృప్తిపఱచు వ్రతము. ఇంక ఎప్పుడును, ఏ విధముగను బ్రాహ్మణులను నిరాదరింపవలదు. సజ్జనుడు అనంతుడైన భగవంతునివంటివాడని ఎఱుంగుము. ఇంద్రునివజ్రాయుధముతోను, నాత్రిశూలముతోను, కాలునిదండముతోను, శ్రీహరికరాళచక్రముతోను మృతిచెందనివాడు విప్రద్రోహమనెడి అగ్నిలో మాడి మసియగును. ఈ వివేకమును మనస్సుననుంచుకొనుము. ప్రపంచములో నీకు దుర్లభమైనదేదియు, ఉండదు. మఱియొక వరమునిచ్చుచున్నాను. నా ఆశీః ప్రభావమున నీ వెక్కడికైనను అప్రతిహతముగా సంచరింపవచ్చును. (చౌ॥ 1-8)

పరమశివునివచనములను విని, గురువు ప్రసన్నచిత్తుడై "అట్లేయగును" అని పలికి, నాకు నచ్చజెప్పెను. తదనంతరము అతడు శివునిచరణములను స్మరించుచు తనఇంటికి వెళ్లెను. విధి ప్రేరితుడనై నేను వింధ్యాచలమున సర్పమునైతిని. కాని కొలదికాలముతరువాత అనాయసముగనే ఆ శరీరమును త్యజించితిని. ఓ హరివాహనా! ఖగరాజా! మనుజుడు ప్రాత వస్త్రమును వదలి, నూతన వస్త్రమును ధరించునట్లు నేను ఆయాజన్మలశరీరములనన్నింటిని అనాయాసముగా అవలీలగా త్యజించితిని. ఈ విధముగా శివుడు వేదమర్యాదలను నిలిపెను. నాకు క్లేశములుగూడ ఎదురుకాలేదు. ఓ పక్షిరాజా! నానాయోనులలో జన్మించి, వివిధ శరీరములను ధరించినను దైవానుగ్రహమున నా జ్ఞానము లుప్తము కాలేదు. (దో॥ 109. క,ఖ,గ,ఘ)

దేవతల, మనుష్యుల, జన్మలనెత్తినను, పశువుగా, పక్షిగా జన్మించినను, శ్రీరాముని భజనను మాత్రము వీడలేదు. కాని ఒక్క విషయముమాత్రము నన్ను సర్వదా బాధించుచునేయుండెను. గురువు గారి కోమల, సుశీల స్వభావమును నేను ఎప్పుడును మఱువలేదు. వేదపురాణములలో పేర్కొన బడినట్లు దేవతలకును లభ్యముగాని బ్రాహ్మణశరీరమును నేను చివరిజన్మలో పొందితిని. ఆ ద్విజదేహమున శ్రీరామునివిశిష్ట లీలలనన్నింటిని స్మరించుచు తోడి బాలకులతో కలిసియాడు చుంటిని. నా విద్యావయస్సునకనుగుణముగా లౌకికవిద్యలలో నన్ను మా పితృపాదులు ప్రవేశపెట్టిరి. నేను వాటిని ఎంతగావిన్నను, ఆలోచించినను, అర్థము చేసికొనుటకు ప్రయత్నించినను ఆవిద్యలు నాకు రుచింపలేదు. నా మనస్సునుండి సాంసారిక వాసనలు దూరమైనవి. కేవలము శ్రీరాముని చరణసేవలయందే నా మనస్సులగ్నమైనది. వైనతేయా! నీవే తెల్పుము. కామధేనువును త్యజించి, గాడిదను సేవించు దౌర్భాగ్యుడెవ్వడైనను ఉండునా? శ్రీరాముని ప్రేమలో మునిగిన నాకు ఏదియును రుచింపలేదు. తండ్రి గారు నన్ను చదివించి అలసిపోయిరి. నా తల్లిదండ్రులు గతించిన పిమ్మట నేను భక్తరక్షకుడైన శ్రీరామునిభజించుటకు వనమునకు వెళ్లితిని. అచ్చట ప్రతిమునీశ్వరుని ఆశ్రమమును దర్శించి, వినమ్రుడనై వారికి నమస్కరించితిని. గరుడుడా! వారినుండి శ్రీరామునిగుణగాథలను వినుచు ఆనందించుచుంటిని. ఈ విధముగా నేను సర్వదా శ్రీహరి గుణగణములను వినుచు ఆ వనమునందంతటను శివానుగ్రహముచే నిరాటంకముగా తిరిగితిని. ఈషణ త్రయములు నానుండి పాఱిపోయినవి. నా హృదయములో ఒకే ఒక కోరిక ప్రబలమాయెను. శ్రీరామచంద్రుని చరణకమలములను జూచి, నా జన్మను సార్థకము చేసికొనదలచితిని. నేను ఏ మునీశ్వరుని అడిగినను, "ఈశ్వరుడు సర్వభూతమయుడు" అని తెల్పిరి. కాని నాకీనిర్గుణోపాసన నచ్చలేదు. నా హృదయమున సగుణబ్రహ్మపై ప్రీతి అధికమాయెను. (1-8)

గురువుగారివచనములను స్మరించుటచే నామనస్సు శ్రీరామునిచరణములయందు లగ్నమాయెను. అనుక్షణము నేను ప్రవృద్ధమానభక్తినిరతితో శ్రీ రఘునాథునియశమును కీర్తించుచు సంచరించుచుంటిని. క్రమ క్రమముగా నాలో శ్రీరామునిపై భక్తి ప్రగాఢమగుచుండెను. సుమేరు పర్వతశిఖరమున ఒక వటవృక్షచ్ఛాయలో కూర్చొనియున్న 'లోమశ'మునిని గాంచి, అతని పాదములకు ప్రణమిల్లి, సవినయముగా దీనుడనై ప్రార్థించితిని. ఓ ఖగరాజా! నా వినమ్ర కోమల వచనములను విని, దయాళువైన ఆ ముని నావచనములకు సంబరపడి పల్కెను. "ఓ బ్రాహ్మణోత్తమా! మీరేపనిపై ఇచ్చటికేతెంచితిరి?" నేను సమాధానమును ఇచ్చితిని. "ఓ దయానిధీ! మీరు సర్వజ్ఞులు, సజ్జనులు. నాకుసగుణబ్రహ్మోపాసనప్రక్రియను తెల్పుడు. (దో॥ 110. క,ఖ,గ,ఘ)

ఓ ఖగరాజా! అప్పుడా మునీశ్వరుడు శ్రీ రఘునాథుని గుణవైభవములనుగూర్చి సాదరముగా కొన్ని కథలను దెలిపెను. బ్రహ్మ జ్ఞానతత్పరుడు, బ్రహ్మజ్ఞానములో లీనమైనవాడును ఐన అతడు నన్ను అర్హునిగా గుర్తించి, బ్రహ్మోపదేశమును చేయసాగెను. "పరబ్రహ్మ జన్మరహితుడు, అద్వితీయుడు, నిర్గుణుడు, అందఱి హృదయములలోనుండువాడు, అకలస్వరూపుడు, (హెచ్చుగుట, తఱుగుట లేనివాడు) ఇచ్ఛారహితుడు,

నామరూపరహితుడు, అనుభవైకవేద్యుడు, అఖండుడు, నిరుపమానుడు, మనస్సునకును ఇంద్రియములకును అతీతుడు, నిర్మలుడు, నాశరహితుడు, నిర్వికారుడు, నిరవధికుడు, సుఖనిధానుడు, నీటికిని నీటిఅలలకును భేదము లేనట్లు అతనికిని నీకును భేదము లేదు. అతడే నీవు, (తత్ త్వమసి) అని వేదములు పేర్కొనుచున్నవి" అని యిట్లు 'లోమశ' మహాముని నాకనేకవిధముల బోధించెను. కాని నిర్గుణ బ్రహ్మయందు నా మనస్సు నిలువలేదు. మునిచరణములకు ప్రణమిల్లి, నేను పలికితిని. "మునీశ్వరా! నాకు సగుణబ్రహ్మోపాసననుగూర్చి తెల్పుడు. ఏలనన శ్రీరామభక్తియనెడి జలములో నా మనస్సు చేపవలెనున్నది. ప్రాజ్ఞుడవైన ఓ మునీశ్వరా! ఇట్టిదశలో అది యెట్లు వేఱుకాగలదు? కావున దయతో శ్రీ రఘునాథునిదర్శించుమార్గమును ఉపదేశింపుడు. మొదట అయోధ్యాపతియైన శ్రీ రఘువరుని కన్నులార చూచి, తరువాత నిర్గుణబ్రహ్మనుగూర్చిన ఉపదేశమును విందును." నేనిట్లు పలుకగా ఆ మహాముని మఱల నిరుపమానములైన శ్రీహరి కథలను వినిపించి, సగుణమార్గమును ఖండించి, నిర్గుణమార్గమును ప్రతిపాదించెను. అప్పుడు నేను నిర్గుణ మార్గమును త్రోసిపుచ్చి, పట్టుదలతో సగుణమార్గమును ప్రతిపాదింప బూనితిని. నేను ఉత్తరప్రత్యుత్తరములను ఈయసాగితిని. అప్పుడు మునియందు క్రోధచిహ్నములు పొడసూపెను. ప్రభూ! వినుడు. మిక్కిలి అవజ్ఞకు గుఱియైనప్పుడు జ్ఞానులహృదయములయందుగూడ కోపముఉత్పన్నమగును చందనపుచెక్కనుగూడ ఎక్కువ రాపిడిపెట్టినచో దాని నుండియు అగ్ని ఉత్పన్నమగును. (చౌ॥ 1-8)

మునీశ్వరుడు మాటి మాటికిని క్రుద్ధుడగుచు జ్ఞాననిరూపణ చేయుచుండెను. నేను లోలోపల ఇట్లు తర్కించు కొనుచుంటిని "ద్వైత బుద్ధి లేనిదే కోపముండునా? అజ్ఞానము లేనిదే ద్వైతబుద్ధి యుండునా? మాయాధీనుడై భగవంతుని నుండి వేఱైనజడజీవుడు ఈశ్వరునితో సమానము కాగలడా? (దో॥ 111. క,ఖ)

ఇతరులమేలును కోరెడివానికి ఎన్నడైనను దుఃఖము కలుగునా? పరుసవేది కలిగియున్న వానిని దారిద్ర్యము బాధించునా? ఇతరులతో వైరమును పూనువాడు నిర్భయుడై యుండునా? కామియైన వాడు కళంక రహితుడగునా? బ్రాహ్మణుని బాధించిన వానివంశము నిలుచునా? తన (ఆత్మ) స్వరూపమును ఎఱిగినవాడు కర్మలయందు ఆసక్తుడైయుండునా? దుష్టులసాంగత్యము చేయుచున్నవానికి సుబుద్ధి కలుగునా? పరస్త్రీగమనము చేసినవానికి సద్గతి లభించునా? పరమాత్మతత్త్వమును ఎఱిగినవాడు జననమరణరూపచక్రములో పడునా? భగవంతుని నిందించెడువాడు సుఖపడునా? నీతితెలియకుండగనే రాజ్యము నిలుచునా? శ్రీహరి చరితమును గానము చేసినచో పాపములుండునా? పుణ్యకర్మలను చేయనిదే పవిత్రయశము ప్రాప్తమగునా? పాపము చేయనిదే అపయశము ప్రాప్తించునా? వేదములు, పురాణములు, సజ్జనులు గానము చేయు హరిభక్తిని మించిన లాభము మఱియొకటి యుండునా? సోదరా! ప్రపంచములో మానవుడై జన్మించియు, శ్రీరామునిభజన చేయనిచో కలిగెడిహానితో సమానమైనది ఏదైననున్నదా? చాడీలు చెప్పుటకంటెను మఱియొక పాపమున్నదా? దయతో తుల్యమగు ధర్మము గలదా?" హరి వాహనా! గరుడుడా! ఈ విధముగా నేను తర్కించుకొనుచు ముని యుపదేశములను సాదరముగా విననైతిని. నేను పదేపదే సగుణోపాసనపక్షమున వాదించుచుండగా మునీశ్వరుడు కుపితుడై పలికెను. "ఓరీ మూర్ఖుడా! నేను నీకు ఉత్తమోత్తమమైన ఉపదేశమును ఇచ్చుచున్నను నీవు దానిని విశ్వసింపక పిడివాదము చేయుచుంటివి. నా సత్యవచనములపై నీకు విశ్వాసముకుదురుకొనలేదు. కాకివలె అన్నింటి యందును సంశయాత్ముడవైయుంటివి. నీ అభిప్రాయము మీదనే నీకు ఎక్కువ పట్టుదల యున్నది. నీవు వెంటనే చండాలపక్షియైన 'కాకి'వి కమ్ము" నేను మునిశాపమును వినయముతో స్వీకరించితిని. దానివలన నాకు భయము గాని దైన్యముగాని కలుగలేదు. (చౌ॥ 1-8)

మునీశ్వరుని శాపప్రభావమున వెంటనే నేను కాకినైతిని. పిమ్మట ఆయనచరణములకు నమస్కరించి, రఘుకులశ్రేష్ఠుడైన శ్రీరాముని స్మరించుచు హర్షముతో ఎగిరి పోయితిని. (శివుడు పలుకుచున్నాడు) ఉమా!

శ్రీరాముని చరణములయందు అనురక్తులును, కామము, అభిమానము, క్రోధము మున్నగువాటిని కలిగియుండని వారును, జగత్తంతయు రామ మయముగా చూచెదరు. మఱి వారికి ఎవరిపై ద్వేషముండును? (దో॥ 112. క,ఖ)

కాకభుశుండి పలికెను. "ఖగరాజా! గరుడుడా! వినుడు. శాపమిచ్చుటలో 'లోమశ' మహర్షి తప్పిదమేమియులేదు. రఘుకులభూషణుడైన శ్రీరాముడు అందఱి హృదయములకును స్ఫూర్తి ప్రదాత. దయాసాగరుడైన శ్రీరాముడు మునిబుద్ధిని భ్రమింపజేసి, నా భక్తిని పరీక్షించెను. మనోవాక్కర్మలచే ప్రభువు నన్ను తనసేవకునిగా గుర్తించి, ముని బుద్ధిని మఱల మార్చెను. ఋషి నా సహనమును, సౌశీల్యమును, శ్రీరాముని చరణములపై నాకు గల విశ్వాసమును గ్రహించెను. ముని అతి విస్మయముతో మాటి మాటికిని పశ్చాత్తాప పడెను. నన్ను ప్రేమాదరములతో పిలిచెను. నన్ను అనేకవిధముల సంతుష్టునిగా చేసి, ప్రసన్నచిత్తుడై నాకు తారక (రామ) మంత్రమును ఉపదేశించెను. దయానిధియైన ముని నాకు బాలస్వరూపుడైన శ్రీరామునిధ్యానవిధిని నేర్పెను. సుందరము, సుఖ ప్రదమూ అగు ఈ ధ్యానము నాకు మిక్కిలి రుచించెను. దానిని నేను నీకు ఇది వఱకే వినిపించితిని. ముని కొంతకాలము నన్ను అచటనే ఉండనిచ్చెను. పిదప 'రామ చరితమానసము'ను వర్ణించెను. సాదరముగా నాకు ఈ కథను వినిపించి, మఱల మధుర వచనములను పలికెను. "నాయనా! రహస్యమైన సుందరమైన ఈ 'రామచరిత మానసము' అను సరోవరమును నేను శివుని అనుగ్రహముచే పొందితిని. నిన్ను నిజమైన శ్రీరామభక్తునిగా గుర్తించి, నీకు ఈ చరిత్రమును సవిస్తరముగా తెలిపితిని. హృదయమున రామ భక్తి కుదురుకొనని వానికి దీనిని ఎప్పుడును తెలుపరాదు." మునీశ్వరుడు నాకు పెక్కురీతుల అనేకవిషయములను బోధించెను. నేను భక్తిపూర్వకముగా ఆయనచరణములకు నమస్కరించితిని. తన చల్లని కరకమలములతో నాతలను నిమురుచు హర్షముతో మునీశ్వరుడు "నా కృపచే నీ హృదయమున సర్వదా రామభక్తి ప్రగాఢమగుచుండును." అని ఆశీర్వదించెను. (చౌ॥ 1-8)

నీవు సర్వదా శ్రీరామునకు ప్రీతిపాత్రుడవగుదువు. శుభగుణములు నీలో కుదురుకొనును. నీవు కామరూపుడవు, మానరహితుడవు, జ్ఞానవైరాగ్యములకు నిధివి అయ్యెదవు. ఇచ్ఛా మృత్యువును కలిగియుండెదవు. భగవంతుని స్మరించుచు నీవు నివసించు ఆశ్రమమునకు ఒక యోజనము లోపల 'అవిద్య' అనగా మాయామోహప్రభావములు ఉండవు. (దో॥ 113. క,ఖ)

కాల, కర్మ, గుణ, దోష, స్వభావ జనితములైన దుఃఖములు నిన్ను ఆవరింపవు. ఇతిహాస పురాణములలో రామరహస్యములు కొన్ని గుప్తములు మఱి కొన్ని ప్రకటితములు. అవియన్నియును ఎట్టి శ్రమలేకయే నీకు కరతలామలకములగును. శ్రీరామునిచరణములపై నీ అనురాగము నిత్యనూతనముగా ప్రవృద్ధమానమగుచుండును. నీవు మనస్సున కోరినవన్నియును శ్రీహరికృపచే సులభముగా లభ్యములగును." ఓవైనతేయా! గరుడా! వినుము. 'లోమశ' మహర్షి ఆశీర్వాదమును విని, ఆకాశమునుండి గంభీరమైన బ్రహ్మవాణి ఇట్లు వినబడెను. "ఓ జ్ఞానీ! మునీ! నీ వచనములు సత్యములగును. ఇతడు మనోవాక్కర్మలచే నా భక్తుడు." ఆకాశవాణిని విని నేను హర్షించి, రామునియెడ ప్రేమమగ్నుడనైతిని. నా సందేహములు తొలగిపోయెను. తదనంతరము మునియాజ్ఞగైకొని, ఆతనిచరణకమలములకు పదే పదే ప్రణమిల్లి, హర్షోల్లాసములతో నేను ఈ ఆశ్రమమునకు వచ్చితిని. శ్రీరామునికృపచే నేను దుర్లభమైనవరమును పొందితిని. ఓ ఖగరాజా! నేను ఇచట ఇఱువది యేడు కల్పములనుండి నివసించుచుంటిని. శ్రీ రఘునాథుని గుణములను నిరంతరము గానముచేయుచుందును. జ్ఞానులైన పక్షులు ఆ గుణములను ప్రీతితో వినును. శ్రీ రఘువీరుడు భక్తులహితమునకై అయోధ్య యందు మానవావతారమును దాల్చినప్పుడు నేను ఆనగరమునకు వెళ్ళుచునే యుందును. ప్రభుబాల్యలీలలను గాంచి సంతోషించెదను. ఖగరాజా! శ్రీరాముని బాలరూపమును హృదయమున నిలుపుకొని, తిరిగి నా ఆశ్రమమునకు వచ్చెదను. నేను కాకి రూపమును పొందిన కథనంతయును నీకు వినిపించితిని. నాయనా! నీ ప్రశ్నలన్నింటికి ప్రత్యుత్తరమిచ్చితిని. నిజముగా రామభక్తిమహిమ మహోన్నతమైనది. (చౌ॥ 1-8)

ఈ కాకి రూపముననే నాకు శ్రీరామునిచరణములపై భక్తి ఏర్పడెను. ఈ రూపమునందే నాకు ప్రభుదర్శనము కలిగెను. నా సందేహములు అన్నియును దూరమాయెను. కావున ఈ రూపము నాకు అత్యంత ప్రియమైనది. (దో॥ 114.-క)

(మాసపారాయణము-ఇఱువది తొమ్మిదవ విరామము)

భక్తి మార్గ వైశిష్ట్యము

పట్టుదలతో నేను భక్తిమార్గమును అనుసరించితిని. దానివలన 'లోమశ' మహర్షి నన్ను శపించెను. కాని కడకు మునీశ్వరులకును దుర్లభమైన వరమును నేను పొందితిని. దైవభజన మహిమ అట్టిది. (దో॥ 114. ఖ)

ఇట్టి భక్తిమహిమను ఎఱింగియు, దానిని విస్మరించి, కేవలము జ్ఞానమునకై శ్రమలతో సాధన చేయువారు తమఇంటిలోని కామధేనువును కాదని, పాలకై జిల్లేడుచెట్టును వెదకుచు తిరుగు వారగుదురు. ఖగరాజా! హరిభక్తిని వీడి, ఇతరోపాయములచే సుఖములను పొందగోరు జనులు మూర్ఖులు. ఆ జడులు ఓడ లేకుండగనే మహాసముద్రమును దాటబూనువారు (శివుడు పలుకుచున్నాడు) ఓ భవానీ! కాకభుశుండివచనములను విని, గరుత్మంతుడు ప్రసన్నచిత్తుడై మృదుమధురముగా కాకభుశుండితో ఇట్లు పలికెను. "ఓ ప్రభూ! మీ కృపవలన శ్రీరాముని పవిత్ర గుణములను వింటిని, శాంతిని పొందితిని. నా మనస్సున సందేహము, శోకము, మోహము భ్రమలు ఏ మాత్రమూ లేవు. ప్రభూ! మిమ్ము ఒకమాట అడిగెదను. దయానిధీ! నాకు విశదీకరింపుడు. జ్ఞానముతో సమానముగా దుర్లభమైనది ఏదియును లేదని, సజ్జనులు, మునులు, వేద పురాణములు తెల్పుట సువిదితము ఆ జ్ఞానమునే మీకు మునీశ్వరుడు విశదీకరించి యుండెను. కాని మీరు భక్తిమార్గమును వలె దానిని ఆదరింపలేదు. ఓ ప్రభూ! కృపానిధీ! జ్ఞానభక్తిమార్గముల భేదమేమి? ఇది యంతయు నాకు వివరింపుడు." ఖగరాజువచనములను విని, జ్ఞానియైన కాకభుశుండి సంతోషించి, సాదరముగా పలికెను. "భక్తి జ్ఞానములలో భేదమేమియు లేదు. ఈ రెండును సాంసారిక దుఃఖములను బాపును. కాని మునీశ్వరులు ఈ రెండింటి మధ్య కొంత భేదమున్నట్లు పేర్కొందురు. ఖగశ్రేష్ఠా! సావధానముగా వినుము. జ్ఞానము, యోగము, వైరాగ్యము, విజ్ఞానము- ఇవి యన్నియును పురుషవర్గమునకు చెందినవి. పురుషుని యందు ప్రతాపము ప్రబలమై యుండును. 'మాయ' స్త్రీ వర్గమునకు జెందినది. ఆమె స్వభావతః అబల. జన్మతః జడము (ప్రకృతి స్వరూపిణి). (చౌ॥ 1-8)

కాని వైరాగ్యవంతుడు, ధీరబుద్ధియుఐన పురుషుడే స్త్రీఆకర్షణలకులోనుగాడు. విషయలంపటుడు, కాముకుడు, రఘువీరునకు విముఖుడు స్త్రీకి అధీనుడై యుండును. (దో॥ 115. క)

అట్లే జ్ఞానఖనులైన మునులుగూడ 'మృగనయన'యు చంద్రముఖియు ఐన స్త్రీని చూచి, ఆమెకు అధీనులయ్యెదరు. గరుడుడా! విష్ణుభగవానునిమాయయే సాక్షాత్తు స్త్రీరూపమున ప్రకటితమగును. (సో॥ 115. ఖ)

నేను పక్షపాతవైఖరితో చెప్పుటలేదు. వేదపురాణములు, సజ్జనులు నుడివిన ప్రామాణిక సిద్ధాంతమునే తెల్పుచున్నాను. ఒక స్త్రీ మఱియొక స్త్రీ రూపమును జూచి మోహము చెందదు. ఇది విలక్షణమైన రీతి. మాయ, భక్తి ఈరెండును స్త్రీ వర్గమునకు చెందినవనుట సుప్రసిద్ధము. శ్రీ రఘువీరునకు ప్రియమైనది భక్తి. మాయ కేవలము నర్తకిమాత్రమే. శ్రీరాముడు విశేషముగా భక్తిని ఆదరించును. కావున మాయ ఆయనకు భయపడును, నిరుపమ, నిరుపాధికమైన రామభక్తిని హృదయములో నింపుకొనినవానిని జూచి, మాయ భయపడును. ఆతనిపై మాయ తన ప్రభావమును చూపజాలదు. ఇట్లు యోచించియే విజ్ఞానులైన మునులు సమస్తసుఖములకు ఖనియైన భక్తిమార్గమునకే మొగ్గు చూపుదురు. (చౌ॥ 1-4)

ఈ రామభక్తిరహస్యమును ఎవ్వరును త్వరగా గ్రహింపజాలరు. శ్రీ రఘునాథుని కృపచే ఈ రహస్యవిషయమును తెలిసికొనినవానిని కలలోగూడ మోహము తాకజాలదు. ధీరమతీ! గరుడుడా! జ్ఞానభక్తి మార్గములమధ్య మఱియొకరహస్యమున్నది. దానిని వినుటవలన శ్రీరామునిచరణములయందు అవిచ్ఛిన్నమైన (అఖండమైన) భక్తి జనించును. (దో॥ 116. క,ఖ)

నాయనా! ఈ అకథనీయకథను వినుము. ఇది అనుభవైకవేద్యము. వర్ణించుటకు అలవి గానిది. జీవుడు ఈశ్వరుని అంశయే. కావున అతడు శాశ్వతుడు, చేతనుడు, నిర్మలుడు, స్వభావతః సుఖనిధానము. స్వామీ! అట్టి జీవుడు మాయావశుడై, చిలుకవలె, కోతివలె తనకుతానై బంధములలో చిక్కుపడుచుండును. ఈ విధముగా జడచేతనములు ముడివడియున్నవి. ఆ ముడి అసత్యమేయైనను దానినుండి బయటపడి ముక్తిని పొందుట మిక్కిలికష్టము. అకారణమున జీవుడు జననమరణచక్రములో చిక్కుపడును. ఆ ముడి విడువదు. అతనికి సుఖము అబ్బదు. ఈ విషయమున వేదపురాణములు పెక్కు ఉపాయములను సూచించినవి. కాని ఆ ముడినుండి విముక్తిలభింపదు. పైగా అది ఇంకను గట్టిపడును. జీవునిహృదయములో మోహమనెడి అజ్ఞానాంధకారము దట్టముగా అలముకొనియుండును. దానివలన ముడి కనబడదు. ఇక ఆముడి ఎట్లు విడివడును. మునుముందు చెప్పబడురీతిగా ఈశ్వరానుగ్రహమున పరిస్థితులు అనుకూలించినచో ఆ ముడి ఎప్పుడో ఒకప్పుడు విడి పోవును. భగవత్కృపచే సాత్త్వికశ్రద్ధయనెడి అందమైన ఆవు హృదయమనెడి ఇంటిలో నివసించినచో, అది వేదోక్తమైన జపతపోవ్రతయమనియమాదికల్యాణప్రదమైన ధర్మాచరణమను పచ్చనిగడ్డిని మేసినప్పుడు ఆస్తికభావములనెడి దూడలను పొంది, దానిపొదుగునుండి పాలు రాసాగును. నివృత్తి మార్గము (విషయవాసనా ప్రపంచమునుండి ముక్తి) ఆవు వెనుక కాళ్లకు కట్టుత్రాడు. విశ్వాసమే దోహన పాత్ర. నిర్మలమైనమనస్సే పాలను పితికెడిదాసుడు(దోగ్ధ). సోదరా! ఈ విధముగా పరమధర్మమయక్షీరములను పిదికి, వాటిని నిష్కామభావమనెడి 'మంటపై' బాగుగా కాగబెట్టవలెను. క్షమాసంతోషములనెడి వాయువులు ఆపాలను చల్లార్చును. ధైర్యము, శమము వాటిని పెఱుగుగా జేయును. తత్త్వవిచారమనెడి కవ్వమునకు దమమనెడిస్తంభమును ఆలంబనముగా జేసి, ప్రసన్నత్వమనెడికుండలో ఆ కవ్వమును చేర్చి, సత్యము, మధురవచనములనెడి త్రాడును ఆ కవ్వమునకు చుట్టవలెను. పిదప ఆ త్రాడు సహాయమున కవ్వముతో ఆ పెఱుగును మథింపవలెను. అపుడు దానినుండి వైరాగ్యమనెడి శుద్ధమనోహర పవిత్రమైన వెన్న వచ్చును. (చౌ॥ 1-8)

అప్పుడు యోగాగ్ని (మనస్సును భగవంతుని యందు లయమొనర్చుట) యందు శుభాశుభ కర్మలనెడి ఇంధనములతో ఆ వెన్నను కాచవలెను. మమతయనెడి మఱికి మాడిపోయి, జ్ఞానమనెడి నెయ్యిమిగులును. అప్పుడు నిశ్చలబుద్ధితో దానిని చల్లార్చ వలెను. విజ్ఞానరూపమైన బుద్ధి స్వచ్ఛమైన ఆ సద్యోఘృతమును పొంది, చిత్తమను ప్రమిదలో నింపవలెను. సమతయను సెమ్మెను సిద్ధపరచి, దానిపై ఈ ప్రమిదెను భద్రముగా నుంచవలెను. జాగ్రత్స్వప్నసుషుప్త్య వస్థలును, సత్త్వరజస్తమోగుణములును అనెడి ప్రత్తినుండి తురీయావస్థ యనెడి శుభ్రమైన దూదిని తీసి, దానితో చక్కనివత్తిని సిద్ధపఱచ వలెను. దానిని (ఆ వత్తిని) జ్ఞానమనెడి నేతితో తడుపవలెను. (దో॥ 117. క,ఖ,గ)

ఈ విధముగా తత్త్వజ్ఞానమనెడి తేజోమయమైనదీపమును వెలిగింపవలెను. దానిని సమీపింపగనే మదము మొదలగు అరిషడ్వర్గములనెడి శలభము(దీపపు పురుగులు)లు మసియై పోవును. (సో॥ 117. ఘ)

"సోహమస్మి" (పరబ్రహ్మమే నేను) ఇది అఖండమైన జ్యోతి. అదియే జ్ఞానదీపముయొక్క ప్రచండదీపశిఖ. ఆత్మజ్ఞానమనెడి సుఖప్రదమైన సముజ్జ్వలప్రకాశము వ్యాపించినప్పుడు సంసార బంధములకు మూలకారణమైన భేదరూపభ్రమలు తొలగిపోవును. అవిద్య యొక్క ప్రబల పరివారమైన మోహము మొదలగు తమస్సులు పటాపంచలగును. అప్పుడు ఆ విజ్ఞాన రూపమగు బుద్ధి ఆత్మానుభవ ప్రకాశమును పొంది, హృదయమనెడి ఇంటిలో కూర్చొని, జడచేతనగ్రంథిని విప్పివేయును. ఈ విజ్ఞాన రూపమగు బుద్ధి ఈ జడచేతన గ్రంథిని విప్పగలిగినచో ఆ

జీవుడు కృతార్థుడగును. కాని ఖగరాజా! గరుడుడా! ఆ ముడి విడిపోవుచున్నట్లు తెలియగనే మాయ మఱల అనేక విఘ్నములను కల్పించును. అది బుద్ధి సిద్ధులనెడి పెక్కు అంతరాయములను పంపును. అవి వచ్చి బుద్ధిని ప్రలోభపఱచును. అవి కళలు, బలము, మోసములు అనెడి రూపములతో సమీపించి, తమ కొంగుగాలితో జ్ఞానరూపశిఖను ఆర్పివేయును. ఒకవేళ బుద్ధి వికసించినచో ఇవియు తనకు హానిని గూర్చునవియని తెలిసికొని, వాటివైపే చూడదు. ఇట్లు మాయ కల్గించు విఘ్నములచే బుద్ధిబాధింపబడనిచో దేవతలు విఘ్నములను సృష్టించెదరు. హృదయమనెడి గృహమునకు ఇంద్రియములనెడి వాతాయనములు (కిటికీలు) కలవు. అట్టి ప్రతిగవాక్షము(కిటికీ)పై దేవతలు కూర్చుందురు. విషయములనెడి వాయువులు వచ్చుటను గమనింపగానే వారు ఆ కిటికీలను పట్టుబట్టి తెఱచెదరు. హృదయమనెడి ఇంటిలోనికి ఆ పెనుగాలులు ప్రవేశింపగనే విజ్ఞాన దీపము ఆఱిపోవును. ముడి విడిపోలేదు సరిగదా! ఆత్మానుభవ ప్రకాశముగూడ ఆఱిపోవును. విషయ పవనములచే బుద్ధి వికలమైపోవును. చేసినసాధనయంతయు వ్యర్థమైపోవును. ఏలనన ఇంద్రియములకును, వాటిఅధిష్ఠానదేవతలకును జ్ఞానము రుచింపదు. వారికి విషయభోగముల యందే సర్వదా ఆసక్తి మెండు. బుద్ధియు విషయభోగములచే కొట్టబడినచో జ్ఞానదీపము మఱల ఏ విధముగా ప్రజ్వరిల్లును? (చౌ॥ 1-8)

జ్ఞానదీపము ఆఱిపోవుటవలన జీవుడు మఱల వివిధములైన జననమరణపరంపరలలో క్లేశములపాలగును. ఖగరాజా! హరిమాయను తప్పించుకొనుట మిక్కిలి కష్టము. దానిని దాటుట అసాధ్యము ఈ వివేకమును(జ్ఞానమును) గ్రహించుట, వ్యక్త పఱచుట, సాధన చేయుటగూడ కష్టము. ఘుణాక్షరన్యాయమున అట్టి జ్ఞానముప్రాప్తించినను దానిని రక్షించుకొనుటలో అనేక కష్టములున్నవి. (దో॥ 118. క,ఖ)

జ్ఞానమార్గము అసిధారావ్రతముతో సమానము. ఓ ఖగేశా! ఈ మార్గమునందలి సాధకులదీక్ష ఎప్పుడైనను సడలవచ్చును. ఈ మార్గమును నిర్విఘ్నముగా అనుసరించువారే అతిదుర్లభమైన పరమపదమును చేరుదురు. కైవల్యమును పొందుట అత్యంతక్లిష్ట కార్యమని సజ్జనులు, వేద శాస్త్ర పురాణములు, ప్రాజ్ఞులు నుడివెదరు. కాని ఓ మహాత్మా! దుర్లభమైన ఆ ముక్తియే రాముని భజించుటవలన కోరకున్నను లభించును. ఆధారము లేనిదే ఆధేయము నిలువదు. ఎన్ని ఉపాయములు పన్నినను, నేల లేనిదే నీరు నిలువదు. అట్లే భగవద్భక్తి లేనిదే మోక్షసుఖము స్థిరముగానుండదు. ఈ విషయమును గ్రహించి, దక్షులైన హరిభక్తులు భక్తిమార్గమునే కోరుకొనుచు, ముక్తిపై ధ్యాసను ఉంచరు. ఎట్టి యత్నమూ, శ్రమయు లేకుండగనే జననమరణ పరంపరకు కారణమైన అవిద్య భక్తితత్పరులనుండి దూరమగును. భోజనము చేసినచో కడుపు నిండును. సంతృప్తి కల్గును. ఆ భుజించినపదార్థము మనప్రయత్నము లేకుండగనే జఠరాగ్నిచే జీర్ణము కావింపబడును. అట్లే హరిభక్తి సంతృప్తి కలిగించును. అది సులభము, సుఖ ప్రదము. ఇది రుచింపని వాడు నిజముగా మూఢుడే. (చౌ॥ 1-5)

ఓ ఉరగారీ! గరుడుడా! 'నేను సేవకుడను, శ్రీరామచంద్రప్రభువు నాకు స్వామి' అను భావము లేనిదే సంసారసాగరమును దాటుట సంభవమేగాదు. ఈ సిద్ధాంతమును విశ్వసించి, శ్రీరామ చరణకమలములను భజింపుము. చేతనమును జడముగను, జడమును చేతనముగను జేయుటకు సమర్థుడైన రఘునాథుని భజించు వారలు ధన్యులు. (దో॥ 119. క,ఖ)

ఓ ఖగరాజా! నేను జ్ఞానమార్గసిద్ధాంతమును విశదీకరించితిని. ఇప్పుడు భక్తియనెడి మణి మహిమనుగూర్చి వినుము. రామభక్తి మహిమాన్వితమైన సుందరచింతామణి. దీనిని హృదయమున ధరించువాడు స్వయముగా అహర్నిశలు ప్రకాశమానుడగును. అతనికి నేయి, వత్తి, దీపము అవసరము లేదు. మోహమనెడి దారిద్ర్యము అతనిని సమీపింప జాలదు. ఏలనన ఈ చింతామణి స్వయంప్రకాశకము. లోభమనెడి వాయువు దానిని ఆర్పజాలదు. దానికాంతితో అవిద్యయనెడి గాఢాంధకారము పటాపంచలగును. మదాదిదీపపుపురుగుల సమూహము పరాజితమగును. భక్తి పరిపూర్ణహృదయునిచెంతకు కామక్రోధాదిదుష్టులు రానేరారు. అతనికి విషముగూడ

అమృతమువంటిదేయగును, శత్రువు మిత్రుడగును. ఆ భక్తిమణిలేనిచో ఎవ్వడును సుఖశాంతులను పొందజాలడు. లోకమును పీడించునట్టి మానసజాడ్యములు శ్రీరామభక్తి యనెడి మణిని హృదయమున ధరించిన వానిని ఏమాత్రము పీడింపజాలవు. కలలోగూడ అతనిని దుఃఖములంటవు. ఈ మణికై ప్రయత్నించువారు ఉత్తమోత్తములు, దక్షులు. ఈ మణి జగత్తులో ప్రత్యక్షముగనే యున్నను శ్రీరాముని అనుగ్రహములేనిదే అది ఎవ్వరికిని లభ్యము గాదు. అది సులభముగా ప్రాప్తించునదియేయైనను భాగ్య హీనులు దానియెడ నిరాదరణమును చూపుచు క్లిష్ట మార్గములను అనుసరింతురు. వేదపురాణములు పవిత్రపర్వతములు. శ్రీరాముని వివిధ గాథలు ఆ పర్వతమునందలి అందచందాలగనులు. ఈ గనులమర్మములు సజ్జనులకే ఎఱుక. పదునైనబుద్ధి ఈగనిని త్రవ్వి ఆ మణిని వెలికిదీయు గునపము. గరుడుడా! జ్ఞాన వైరాగ్యములు ఆయన నేత్రములు. ప్రేమతో అన్వేషించు వారే సుఖనిధియైన ఆభక్తి మణిని పొందగలరు. ప్రభూ! శ్రీరామునికంటెను ఆయనభక్తులే గొప్పవారని నా విశ్వాసము. శ్రీరాముడు జలనిధియైనచో ధీరులైన సజ్జనులు జలదములు. శ్రీహరి చందనవృక్షమైనచో సజ్జనులు గంధవహులు (వాయువులు). అనన్యమైన హరిభక్తియే అన్నిసాధనలఫలము. సత్పురుషులసహకారము లేనిదే ఎవ్వరును దానిని పొందలేరు. గరుడుడా! ఇట్లు యోచన చేసి, సత్సాంగత్యము చేయువారికే శ్రీరామభక్తి సులభముగా లభించును.

(చౌ॥ 1-10)

బ్రహ్మ (వేదములు) ఒక సముద్రము. జ్ఞానమే ఒక మందరాచలము. సజ్జనులే దేవతలు. ఈ సముద్రమును మథించువారు రామకథ' యనెడి అమృతమును వెలికితీయగలరు. ఆ కథామృతములో భక్తిమాధుర్యము మిళితమై యుండును. వైరాగ్యమనుడాలుతో తనరక్షణ చేసి కొనుచు జ్ఞానమనెడి ఖడ్గముతో మదమోహాలోభాది శత్రువులను సంహరించి, విజయమును సాధించునది శ్రీహరిభక్తియే. ఖగరాజా! ఆలోచింపుము. (దో॥ 120. క,ఖ)

సప్తప్రశ్నలు - సమాధానములు

అనంతరము ఖగరాజైన గరుడుడు ప్రేమతో పలికెను. కృపాళూ! "మీకు నాపై ప్రేమయున్నచో ప్రభూ! నన్ను మీ సేవకునిగా భావించి, నా 'ఏడు ప్రశ్నలకు' సమాధానములను దయచేయుడు. (1) మిక్కిలి దుర్లభమైన జన్మఏది? (2) అన్నింటి కంటెను ఘోరమైన దుఃఖమేది? (3) అన్నింటి కంటెను గొప్ప సుఖమేది? (4) సజ్జనుల లక్షణములును, దుర్జనుల స్వభావములును ఎట్టివి? వాటి మధ్యగల భేదమేమి? (5) శ్రుతులలో పేర్కొనబడిన గొప్ప పుణ్యకార్యమేది? (6) భయంకరమైన పాపకార్యమేది? (7) మానసిక రోగము లెట్టివి? మీరు సర్వజ్ఞులు. నాపై అపారకృపాళువులు. ఈ విషయములను అన్నింటిని వివరింపుడు" కాకభుశుండి ఇట్లు పలికెను. "నాయనా! నేను సంక్షిప్తముగా తెలుపబోవునీతిని అత్యంతప్రేమాదరములతో ఆలకింపుము. (1) మానవ జన్మ దుర్లభమైనది. దీనితో సమానమైనజన్మ ఏదియును లేదు. చరాచర (జడ చేతన) ప్రాణులన్నియును ఈ జన్మను కోరుకొనును. ఈ మానవజన్మ నరకము, స్వర్గము మోక్షములకు సోపానము. ఇది మంగళకరములైన భక్తిజ్ఞానవైరాగ్యములను సిద్ధింపజేయునది. ఇట్టి జన్మ ప్రాప్తించినను శ్రీహరిని భజింపక తుచ్ఛములైన విషయభోగములలో మునిగియుండు మనుజులు చేతనున్నపరుసవేదిని పాఱవైచి, గాజుముక్కకై వెదకుమూఢులవంటివారు. (2) జగత్తులో దారిద్ర్యమునకు మించిన దుఃఖమే లేదు. (3) సత్సాంగత్యమునకు సమానమైన సుఖమేదియును లేదు. ఖగేశ్వరా! (4) మనోవాక్కాయములచే పరోపకారమొనర్చుటయే సజ్జనులకు సహజ స్వభావము. సజ్జనులు ఇతరులహితముకొఱకు ఎట్టి దుఃఖములనైనను సహింతురు. కాని భాగ్యహీనులైన దుర్జనులు ఇతరులను దుఃఖపెట్టుటకై తాము ఎట్టి శ్రమలనైనను ఓర్చుకొందురు. దయాళువులైన సత్పురుషులు భూర్జవృక్షములవలె ఇతరుల మేలుకొఱకు ఎంతటి కష్టములనైనను ఓర్చుకొందురు, అందులకై తమ చర్మమునొలిచి యైనను ఆపదలకు తట్టుకొని, తమ ప్రాణములను సైతము ఆహుతిగా జేసెదరు. కాని దుష్టులు జనుపనారవలె ఇతరులను బంధించెదరు. తమకు ఎట్టి ప్రయోజనమూ లేకున్నను నిష్కారణముగా పాములవలె, ఎలుకలరీతి ఇతరులకు హాని గూర్తురు. వడగండ్లు పంటలను పాడు చేసి, తాము కటిగిపోవునట్లు దుష్టులు ఇతరుల సంపదలను నష్టపఱచి, తామును నశించెదరు. అధమగ్రహముగా ప్రసిద్ధమైన కేతువు యొక్క ఉదయము వలె దుష్టులఅభివృద్ధి ప్రపంచమునకు దుఃఖహేతువు అగును. సూర్య చంద్రుల ఉదయము సమస్త

విశ్వమునకు సుఖదాయకమైనట్లు సజ్జనుల అభ్యుదయము సమస్త మానవాళికిని సుఖప్రదము. (5) 'అహింసా పరమో ధర్మః' అనునది వేదప్రమాణ వచనము. (6) ఇతరులను నిందించుట వంటి మహా పాప కృత్యము మఱియొకటి లేదు. శంకరుని, తన గురువును నిందించిన వాడు కప్పగా వేయిజన్మల నెత్తును. బ్రాహ్మణనింద చేసినవాడు పెక్కునరకయాతనలను అనుభవించి, పిమ్మట కాకియై జన్మించును. దేవతలను, వేదములను నిందించునట్టి అహంకారియైన జీవుడు రౌరవ నరకములోబడి కొట్టుకొనుచుండును. సజ్జననిందానిరతులైనవారు గ్రుడ్లగూబలుగా జన్మింతురు. వాటికి అజ్ఞానరూపమైన రాత్రియే ప్రియమైనది. జ్ఞానరూపసూర్యోదయమును వారు చూడజాలరు. అందఱినీ నిందించుజడులు గబ్బిలములుగా జన్మింతురు. నాయనా! (7) ఇప్పుడు మానసిక రోగములనుగూర్చి వినుము. మోహమే సమస్త రోగములకును మూలము. దాని వలన మఱిల అనేకబాధలు కలుగును. కామము వాత రోగము. అపారమైన లోభమే కఫవ్యాధి. క్రోధమే ఒక మహాపైత్య రోగము. అది సర్వదా హృదయమును దహించును. కామ క్రోధ లోభములు (కఫ, వాత, పిత్తములు) అనెడి ఈ ముగ్గురు సోదరులును ఒక చోట కూడియున్నచో దుఃఖప్రదమైన 'సన్నిపాత రోగము' ఉత్పన్నమగును. విషయ భోగములపైగల అంతులేని మక్కువయే వివిధ బాధలకును మూలము. వాటి పేర్లను పేర్కొనుట కష్టము. అవి అనంతములు. మమతయే తామరవ్యాధి. ఈర్ష్య అనునది గజ్జి, హర్ష విషాదములు కంఠమాల రోగములు. ఇతరుల సుఖములను జూచి అసూయపడుటయే క్షయరోగము. దౌష్ట్యము, మనఃకుటిలతలే కుష్ఠ వ్యాధి, అహంకారము అత్యంత బాధాకరమైన 'డమరు' (కీళ్లనొప్పుల)వ్యాధి. దంభము, కపటము, మదము, దురభిమానము నరముల రోగములు. తృష్ణయనునది జలోదరవ్యాధి- పుత్రులకును, ధనమునకును, కీర్తి ప్రతిష్ఠలకును (ఈషణత్రయమునకు) ఆరాటపడుటయే ప్రబలములైన ఉష్ణ (వరుసజ్వర)వ్యాధులు. మత్సరము, అవివేకము అనునవి రెండు విధములగు జ్వరములు. వాస్తవముగా ఇంకను అసంఖ్యాకములైన రోగములు గలవు. వాటికి అంతములేదు. (చౌ॥ 1-19)

ఏ ఒక్క రోగముతోనైనను మనుష్యుడు మరణించును. అసాధ్యములైన ఇన్ని రోగములు అతనిని నిరంతరము పట్టి పీడించునపుడు ఆ నిర్భాగ్యుడు పరమశాంతినెట్లు పొందును? నియమము, ధర్మము, ఉత్తమ కార్యాచరణము, తపము, జ్ఞానము, యజ్ఞము, జపము, దానము మున్నగు వాటి రూపములలో ఈ రోగములకు పెక్కు ఔషధములు గలవు. కాని ఖగరాజా! వీటితో ఆ రోగములు పూర్తిగా నయముగావు. (దో॥ 121. క,ఖ)

ఈ విధముగా జీవులందఱును రోగ పీడితులే. వారందఱును శోకము, హర్షము, భయము, ప్రీతి, వియోగము మొదలగు ద్వంద్వములచే ఇంకను దుఃఖితులయ్యెదరు. నేను కొన్ని మానసిక రోగములనే వర్ణించితిని. ఈ రోగములందఱిని బాధించినను కొందఱు మాత్రమే వీటిని గుర్తింప గల్గుదురు. జీవులకు విశేషమైన తాపమును గల్గించు ఈ రోగములను గుర్తించినచో కొంత ఉపశమనము గలుగును. కాని పూర్తిగా అవి నశింపవు. విషయములనెడి అపథ్యములవలన మునులహృదయములలోగూడ అంకురించును.ఇక సాధారణమానవులసంగతి చెప్పనేల? శ్రీరామునికృపచే ముందు పేర్కొనినట్లు సజ్జనులసంయోగము గల్గినచో అన్ని రోగములును ఉపశమించును. సద్గురువనెడి వైద్యునిపై విశ్వాసమును ఉంచవలెను. విషయవాంఛలుండరాదు. ఇదియే పథ్యము. శ్రీ రఘునాథునిపైగలభక్తి సంజీవనిమూలిక. శ్రద్ధతో గూడిన బుద్ధి అనుపానము. ఈ విధముగా ఆరోగములు నశించును. లేనిచో ఎన్ని ఉపాయములతోనైనను వాటిని నిర్మూలించుట అసాధ్యము. హృదయమున వైరాగ్యము అనెడి బలము పుంజుకొనినప్పుడు, ఉత్తమబుద్ధియనెడి ఆకలి నిరంతరము అధికమగుచున్నప్పుడు, విషయవాంఛలు దుర్బలమైనప్పుడు, మనస్సు రోగరహితమైనదని తెలిసి కొనవలెను. రోగరహితుడైన మానవుడు నిర్మల జ్ఞానమనెడి జలములలో స్నానము చేసినప్పుడు, అతనిహృదయములో శ్రీరామభక్తి పరిపూర్ణమగును. శ్రీరాముని పదకమలములయందు భక్తి కలిగియుండుటయే తరణోపాయమని శివుడు, బ్రహ్మ, శుకుడు, నారదుడు, సనకాది మునులు మొదలగు బ్రహ్మజ్ఞానులు అభిప్రాయపడుదురు. శ్రీ రఘునాథుని యందు భక్తి లేనిచో సుఖము ఉండదని వేద పురాణాది గ్రంథములు తెలుపుచున్నవి. ఒక వేళ తాబేలు వీపుపై వెంట్రుకలు మొలిచిన మొలువవచ్చును, గొడ్రాలికి కొడుకు కలిగి హంతకుడు కావచ్చును, ఆకాశమున పెక్కు విధములైన పూలు వికసింపవచ్చును, (అనగా ఇట్టి అసంభవములైనవి సంభవము కావచ్చును.) కాని హరికి విముఖుడైన జీవునకు ఎట్టి సుఖమూ కలుగనే కలుగదు.

మృగతృష్ణలోని నీటితో దాహము తీరవచ్చును, కుందేటిశిరముపై కొమ్ములు మొలవవచ్చును, అంధకారము సూర్యకాంతిని కప్పివేయవచ్చును. మంచునుండి అగ్ని పుట్టవచ్చును. కాని శ్రీరామునియెడ విముఖుడు ఐన వాడు ఎన్నడును, ఎప్పటికిని సుఖమును పొందజాలడు. (చౌ॥ 1-10)

నీటిని చిలికి నెయ్యి తీయవచ్చును. ఇసుకనుండి తైలము తీయవచ్చును. కాని హరిని సేవింపనిదే సంసారసాగరమునుండి తరించుట దుర్లభము. ఇది తిరుగులేని సిద్ధాంతము. ప్రభువు సంకల్పించినచో దోమనుగూడ బ్రహ్మనుగా చేయగలడు. బ్రహ్మను సైతము దోమకంటెను తుచ్ఛప్రాణిగా చేయగలడు. ఇట్లు ఆలోచించి, ప్రతిభగలయోగ్యులు సందేహములను వీడి శ్రీరాముని భజించెదరు. (దో॥ 122. క,ఖ)

నేను నీకు ఒక పరమసిద్ధాన్తమును తెలిపెదను. భక్తి పరిపూర్ణులై శ్రీహరిని భజించెడి వారు అతి దుస్తరమైన సంసారసాగరమును అవలీలగా దాటగలరు. ఈ నావచనములు నిత్యసత్యములు. (శ్లో॥ 122. గ)

ఓ ప్రభూ! నేను శ్రీహరి యొక్క మహిమాన్విత చరితమును సందర్భానుసారముగ కొన్ని చోట్ల విపులముగను, మఱికొన్నిచోట్ల సంక్షిప్తముగను యథాశక్తి వర్ణించితిని. ఓ ఉరగారీ! సర్వ లౌకిక విషయములను త్యజించి, శ్రీరాముని భజింపవలెనని శ్రుతులు పేర్కొనుచున్నవి. నా వంటి మూర్ఖునిపైగూడ తనఅపారకృపను ప్రసరింపజేసిన శ్రీ రఘునాథుని కాదని మఱి యెవ్వరిని సేవించెదవు? ప్రభూ! మీరు విజ్ఞానరూపులు. మోహమనునది మీ దఱిదాపులకును రాదు. మీరు నాపై ఎంతయో దయచూపితిరి. శుకమహర్షికిని, శివునకును, సనకాది మునులకును గూడ ఆనందదాయకమైన అతిపవిత్రమైన శ్రీరాముని గాథను తెలుపుమని నన్నడిగితిరి. ప్రపంచములో సజ్జనసాంగత్యము ఒక గడియయైనను, కడకు ఒక క్షణమైనను లభించుట దుర్లభము- ఓ ఖగరాజా! నేను శ్రీరాముని భజించుటకు నిజముగా అర్హుడనా? మీరే యోచింపుడు. నేను పక్షులలో అధముడను, అపవిత్రుడను, ఐనను జగన్నాథుడైన శ్రీరామచంద్రప్రభుగాథను తెల్పుట ద్వారా సంపూర్ణ జగత్తును పవిత్రమొనర్చు వానినిగా ప్రభువు నన్ను అనుగ్రహించెను. (చౌ॥ 1-4)

కాకభుశుండి ఇంకను తెల్పుచున్నాడు. నేను అన్ని విధములుగ అధముడనైనను నేడు ధన్యుడనైతిని. ఏలనన శ్రీరామచంద్రుడు నన్ను తనసేవకునిగా భావించి, నాకు మీవంటి సత్పురుషుల సాంగత్యమును కలిగించెను. నేను అత్యంతధన్యుడను. ప్రభూ! నేను నాబుద్ధిబలమునననుసరించి, శ్రీరామచరితమును యథాశక్తి వినిపించితిని. దేనినీ దాచలేదు. ఐనను శ్రీ రఘువీరునిచరితము ఒకసముద్రమువంటిది, అపారమైనది. దాని లోతును ఎవ్వరును కనుగొన జాలరు. (దో॥ 123. క,ఖ)

శ్రీరామునిగుణగణములను స్మరించుచు విజ్ఞుడైన భుశుండి మాటిమాటికిని ఆనందాబ్ధిలో ఓలలాడెను. వేదములు ఆయనమహిమను 'నేతి నేతి'యని కీర్తించినవి. అతనిబలము, ప్రతాప పరాక్రమములు, ప్రభుత, సాటిలేనివి. శివుడు, బ్రహ్మయు, రఘువీరుని చరణములను పూజనీయములుగా భావించిరి. అట్టి రఘునాథుడు నాపై కృప జూపెను. ఇది ఆయన కోమల స్వభావ స్థితి. ఇట్టి ఉదాత్త స్వభావ శోభితుని ఎక్కడను కనలేదు, వినలేదు. కావున ఓఖగేశ్వరా! శ్రీ రఘునాథునివంటిప్రభువును ఎట్లు ఊహింపగలను. సాధకుడు, సిద్ధుడు, జీవన్ముక్తుడు, విరక్తుడు, కవి, విద్వాంసుడు, కర్మధర్మమర్మజ్ఞుడు, సన్న్యాసి, యోగి, శూరుడు, వీరుడు, తపస్వి, ధర్మతత్పరుడు, పండితుడు, తత్త్వజ్ఞాని మొదలగు వారు ఎవ్వరైనను శ్రీరామునిసేవాభజనలను చేయనిదే తరింప లేరు. నేను అట్టి శ్రీరామునకు మాటి మాటికిని నమస్కరించెదను. నా వంటి పాపాత్ములును ఆయనను శరణుజొచ్చినచో పుణ్యాత్ములగుదురు. అట్టి శ్రీరామ చంద్రునకు నేను ప్రణమిల్లుదును. (చౌ॥ 1-4)

శ్రీరామనామము జననమరణవ్యాధులకు దివ్యౌషధము. తాపత్రయదుఃఖములను రూపు మాపును. అట్టి కృపాళువైన శ్రీరామచంద్రుడు నాపైనను, మీపైనను కృపజూపుగాక. కాక భుశుండి యొక్క మంగళకరవచనములను విని, శ్రీరాముని చరణములపై ఆయనకు గల అపూర్వభక్తిని జూచి, సందేహరహితుడై గరుడుడు ప్రేమతో ఇట్లనెను. (దో॥ 124. క,ఖ)

"శ్రీరఘువీరుని భక్తి రసవాహినిలో ఓలలాడిన మీ వాణిని విని. నేను కృతార్థుడనైతిని. శ్రీరాముని చరణములపై నాకు పరమభక్తి నెలకొనినది. మాయాజనితములైన ఆపదలన్నియును తొలగి పోయినవి. మోహసముద్రములో మునిగిపోవుచున్న నాకు మీరు నౌక యైతిరి. నాకు అనేక విధముల సుఖ, శాంతులను ప్రసాదించితిరి. దీనికి నేనేమి ప్రత్యుపకారము చేయగలను? మీ చరణములకు పదే పదే వందనములనాచరించెదను. మీరు పూర్ణకాములు. శ్రీరామునకు ప్రీతిపాత్రులు. నాయనా! మీవంటిభాగ్యశాలురు ఎవరు? సజ్జనులు, వృక్షములు, నదులు, పర్వతములు, భూమి- ఇవి యన్నియును పరులకు హితములనే చేకూర్చును. సజ్జనుల హృదయములు వెన్న వంటివని కవులు పేర్కొనిరి. కాని నిజముగా వారికి సరిగా చెప్పుట చేతగాలేదు. ఏలనన వెన్న తాను తప్తమైనప్పుడే కఱుగును. కాని సజ్జనులహృదయములు ఇతరులు బాధలకు గురియైనప్పుడును కఱుగును. నా జన్మ, జీవనము సఫలమైనవి. మీ కృపవలననానందేహములు అన్నియును తొలగినవి. సర్వదా నన్ను మీసేవకునిగా భావింపుడు. శివుడు పలుకుచున్నాడు ఉమా! ఖగరాజైన గరుడుడు మాటి మాటికిని ఇట్లు పలికెను. (చౌ॥ 1-5)

కాకభుశుండిచరణములకు ప్రేమపూర్వకముగా నమస్కరించి, హృదయమున శ్రీరఘువీరుని ప్రతిష్ఠించుకొని, ధీరబుద్ధియైన గరుత్మంతుడు వైకుంఠమునకు వెళ్లెను. శివుడు పల్కుచున్నాడు. ఓ గిరిజా! సజ్జనసమాగమమును మించిన లాభమేమియును లేదు. కాని హరికృపావిశేషమువలననే ఇది లభ్యము. వేదపురాణములు ఇట్లే చెప్పుచున్నవి. (దో॥ 125. క,ఖ)

శ్రీరామకథా శ్రవణఫలము

పరమపవిత్రమైన శ్రీరామచరితమును తెల్పితిని. దీనిని వినినంతనే సంసారబంధము లన్నియు తెగిపోవును. శరణాగతులకు కల్పవృక్షమూ, కరుణామూర్తియునైన శ్రీరామునిపాద పద్మములయందు ప్రీతియు గల్గును. మనస్సును, చెవులను లగ్నమొనర్చి, ఈ కథను విన్నవారికి మనోవాక్కర్మలచే ఉత్పన్నమైన పాపములన్నియును నశించిపోవును. తీర్థయాత్రలు మొదలగు సాధనలు, యోగ వైరాగ్య జ్ఞాన కౌశలములు, నానావిధ ధర్మకర్మలు, వ్రతములు, దానములు, సంయమ, దమ, జప తపో యజ్ఞములు ప్రాణి కోటిపై కనికరము, బ్రాహ్మణులను గురువులను సేవించుట, విద్యావినయవివేకాదిసాధనలఫలము శ్రీహరిభక్తియే. భవానీ! శ్రుతులలో వర్ణింపబడిన శ్రీరామునిపైఅనన్యభక్తి ప్రభుఅనుగ్రహముచేమాత్రమే ఏ ఒక్కరికో అబ్బును. (చౌ॥ 1-4)

ఉత్తమోత్తమమైన ఈ పుణ్యకథను నిత్యము, నిరంతరము గాఢమైన భక్తివిశ్వాసములతో వినెడివారు మునీశ్వరులకును దుర్లభమైన హరిభక్తిని అనాయాసముగా పొందగలరు. (దో॥ 126)

శ్రీరాముని చరణసేవలయందు అనురక్తుడైనవాడే సర్వజ్ఞుడు, జ్ఞాని, గుణనిధి. అతడే భువికి భూషణము, విద్వాంసుడు, దాత, ధర్మపరాయణుడు, వంశరక్షకుడు. త్రికరణశుద్ధిగా శ్రీ రఘువీరుని భజించువాడు నీతికోవిదుడు. పరమబుద్ధిశాలి. అతడే వైదికసిద్ధాన్తములను ఎరిగినవాడు. అతడే కవి, విద్వాంసుడు, రణధీరుడు. దివ్యనది గంగ ప్రవహించు దేశమే ధన్యము. పతివ్రతా ధర్మములను అనుసరించెడి స్త్రీలే ధన్యలు. నీతి నియమములచే పరిపాలనచేయు రాజులే పరమధన్యులు. తమధర్మములను ఆచరించెడి బ్రాహ్మణులే ధన్యులు. దాన ధర్మములకు వినియోగపడు ధనసంపదలే సార్థకములు. పుణ్యకార్యతత్పరమైన బుద్ధియే బుద్ధి. సజ్జన సాంగత్యము కలిగిన క్షణమే క్షణము. బ్రాహ్మణ భక్తి గల జన్మయే జన్మ. (చౌ॥ 1-4)

ఉమా! వినుము. శ్రీరామభక్తిపరాయణులు జన్మించు వంశమే ధన్యము. అది జగత్తులో పరమ పూజ్యము, అత్యంత పవిత్రము. (దో॥ 127)

భవానీ! నేను నా బుద్ధిబలముతో ఈ కథను వినిపించితిని. ఇంత వఱకును దీనిని రహస్యముగా ఉంచి యుంటిని. కాని నీలో రామభక్తి పెంపొందుట జూచి, నీ వైశిష్ట్యమును గుర్తించి, శ్రీరామ చరితమును వివరించితిని.

శఠునకును, హఠస్వభావముగల వానికిని, శ్రీహరి లీలలను మనస్ఫూర్తిగా విననివానికిని,
లోభి, క్రోధి, కామి, మొదలగు వారికిని, శ్రీరామునిభజింపనివారికిని, ఈ కథను విప
సమానుడగు ఐశ్వర్యవంతుడైనను బ్రాహ్మణద్వేషియైనచో అతనికి ఈ పుణ్యకథను
సత్సాంగత్యముపై భక్తిశ్రద్ధలుగలవారే ఈ రామకథాశ్రవణమునకు అర్హులు. గు
ప్రీతిగలవారు, నీతిపరులు, బ్రాహ్మణులను సేవించువారు ఈ కథా శ్రవణమునకు పా
సమానముగా శ్రీ రఘునాథుని ప్రేమించువ్యక్తికి ఈ చరితము మిక్కిలి సుఖప్రదాయకమ

శ్రీరాముని చరణములయందు అనురాగముగలవాడును, మోక్షపదమును
అమృతతుల్యమగు ఈ కథను తనచెవులార గ్రోలును.

ఓ గిరిజా! కలియుగ పాపములను అంతరింప జేయునదియు, మనోమాలిన్యములను
ఐన శ్రీరామ చరితమును తెల్పితిని. ఈ రామ కథ జనన మరణరూపవ్యాధిని నివారిం
కథను వేదములు, విద్వాంసులు వేనోళ్ల ప్రస్తుతించుచున్నారు. ఇందులో మనోహరములైన
ఇవి శ్రీ రఘునాథునిపై భక్తినికలిగించు మార్గములు. శ్రీహరికృపకు పాత్రులైనవారే ఈ
కపటమును త్యజించి (త్రికరణ శుద్ధిగా) ఈ కథాగానముచేసినవారిమనోరథములు సిద్ధి
వారికిని, వినిపించువారికిని, విశ్వసించెడివారికిని, సంసారసాగరము గోష్పాదమంతగా అ
పలుకుచున్నాడు.) కథనంతయు వినినపిదప పార్వతీహృదయము అతి ప్రసన్న
మృదుమధురముగా ఇట్లు పలికెను. "స్వామీ! మీకృపచే నాసందేహములు పటాప
చరణకమలములపై అనన్యభక్తి జనించెను.

ఓ విశ్వనాథా! మీ దయవలన నేను కృతార్థురాలనైతిని. నాలో దృఢమైన
నాక్లేశములన్నియును దూరమయ్యెను."

ఉమాశంకరుల ఈ సంభాషణము శోకనాశకము, లోకకల్యాణ కారకము.
జననమరణరాహిత్యమును గూర్చును. సందేహములను దూరముచేయును. భక్తులకు ఆన
ఇది జనమనోరంజకము. సజ్జనులకు అత్యంత ప్రియము, ప్రపంచములో శ్రీ
శ్రీరామచరితమువలె ప్రియమును గూర్చునది ఈ లోకములో ఏదియును ఉండదు. (తుల
నేను ఈ పవిత్ర సుందర కథను యథాశక్తి గానముచేసితిని. ఈ కలియుగమున యో
తపము, వ్రతము, అర్చనము, మొదలగుసాధనమార్గములేవియు శ్రీరామునికథవలె
ఈయజాలవు. కేవలము శ్రీరాముని స్మరించుట, శ్రీరామునిగుణగానము
శ్రీరామునిగుణగణములనుగూర్చి వినుటయే మానవాళికి పరమకర్తవ్య
పవిత్రమొనర్చెడివాడుగా (పతితపావనుడుగా) కీర్తిగాంచినవాడు ఆ శ్రీరామచంద్రప్రభువు
కవులు, వేదపురాణములు లోకమునకు ఉపదేశించుచుండుట జగద్విదితము. కావున ఓ

నేను నమస్కరించెదను. (1) రఘు వంశ భూషణుడైన శ్రీరాముని ఈ చరిత్రమును వర్ణించువారును, వక్తలును, శ్రోతలును, గానము చేయువారును కలియుగపాపములను, మనోమాలిన్యములను ప్రక్షాళనమొనర్చుకొని, అనాయాసముగా, నేరుగా రామధామమును జేరుదురు. వేయేల? ఈ రామాయణమునందలి '5100' చౌపాఈలను మనోహరమైనవిగా గ్రహించి, హృదయమున స్థిరముగా చేర్చుకొనినవారు దారుణ-అవిద్యాజనితములైన పంచవికారములను (అవిద్య, అస్మిత, రాగ, ద్వేష, అభినివేశ క్లేశములను) అరిషడ్వర్గములను (కామక్రోధలోభమోహ మదమాత్సర్యములడి వికారములను) శ్రీరాముడు నిర్మూలించును. (2) సౌందర్యనిధి, సుజ్ఞాని, దయాపయోధి, అనాథరక్షకుడు-అను విశిష్ట గుణ శోభితుడు శ్రీరాముడు మాత్రమే. నిష్కామ భక్తిని, కల్యాణగుణములను ఆయనవలె ప్రసాదించువాడును, సంసారబంధముల నుండి విముక్తిని కల్గించు వాడును మఱియొకడు లేడు. అతనిలేశమాత్రమైన కృపచేతనే, మంద బుద్ధినైన నేను తులసీదాసును పరమశాంతికి నోచు కొంటిని. అట్టి శ్రీరామచంద్రుని వంటి ప్రభువు "న భూతో న భవిష్యతి". (ఛం॥ 3)

ఓ రఘువీరా! నా వంటి దీనుడు ఎవ్వడును ఉండడు. నీ వంటి దీనజనరక్షకుడును లేడు. ఇట్లు యోచించి, ఓ రఘువంశమణీ! నా జననమరణరూపభయానకభవసంకటములను అంతరింప జేయుము. కాముకునకు స్త్రీ, లోభికి ధనము అత్యంత ప్రీతికరమైనట్లు రఘునాథా! శ్రీరామా! నీవు నాకు నిరంతరము మిక్కిలి ప్రీతికరుడవు (ప్రియమును గూర్చువాడవు) కమ్ము. (దో॥ 130. క,ఖ)

సర్వ సమర్థుడును, మహాకవివితంసుడును ఐన శ్రీ శంకరుడు శ్రీరామచరణకమలముల యందు అనన్యమైనభక్తికలిగి, అది నిరంతరము తనమనస్సునందు కుదురుకొనుటకై దుర్లభమైన ఈ మానస రామాయణమును పూర్వమే రచించెను. తులసీదాసు ఈ మానస రామాయణమును రామనామమహత్త్వ పరిపూర్ణముగా భావించి, తనఅంతఃకరణమునందలి అజ్ఞానాంధకారమును అంతరింపజేసికొనుటకై ఈ మానసమును భాషాబద్ధమొనర్చెను. (1)

ఈ రామచరితమానసము అత్యంత పుణ్యప్రదము, సమస్తపాపహరము, సర్వదా మంగళ కరము, అనన్య భక్తిజ్ఞానములను ప్రసాదించునది, మాయామోహమాలిన్యములను నశింప జేయునది, నిర్మల ప్రేమజలపరిపూర్ణము, సర్వ శుభ ప్రదము. ఈ మానస సరోవరమున భక్తి పూర్వకముగా మునకలు వేయువారు సాంసారికక్లేశములనెడి ప్రచండసూర్యకిరణములచే దహింపబడక పరమశాంతిని పొందెదరు. (2)

(మాస పారాయణము-ముప్పదియవ విరామము)

(నవాహ్నిక పారాయణము-నవమ విరామము)

కలియుగ సమస్త పాపములను నశింపజేయు

శ్రీరామచరితమానసమునందలి ఉత్తరకాండము-అను సప్తమసోపానము సమాప్తము.

శ్రీ రామాయణ హారతి

- ఉత్తరకాండము సమాప్తము -

శ్రీ గోస్వామి తులసీదాసు జీవితవిశేషములు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ప్రయాగ సమీపమున 'బాందా' జిల్లాలో 'రాజాపురము' అను గ్రామము గలదు. అచట ఆత్మారామ్ దూబే - అను సుప్రసిద్ధుడైన సరయూపారీణబ్రాహ్మణుడు ఉండెను. శ్రీమతి హులసీదేవి ఆయన ధర్మపత్ని. క్రీ.శ. **1497**, విక్రమశకం **1554**వ సంవత్సరమున శ్రావణ శుద్ధ సప్తమినాడు అభుక్తమూలా నక్షత్రమున ఆ పుణ్యదంపతులకు జన్మించిన ముద్దులబిడ్డడే మన గోస్వామి తులసీదాసు. అతడు మాతృగర్భమున 12 (పన్నెండు) మాసములు మసలెను. శిశువైన తులసీదాసు పుట్టగనే రోదనము కావింపలేదు. ఆతనిముఖమునుండి 'రామ్' అను శబ్దము (రామనామము) వినిపించెను. ఆయననోటిలో ముప్పది రెండు(32) దంతములుండెను. చూచుటకు అతడు ఐదు (5) సంవత్సరముల ఈడుగల బాలకునివలె ఒప్పుచుండెను. ఇట్టి అద్భుతలక్షణములుగల బాలకుని జూచి, ఆయనతండ్రి అమంగళములను శంకించి భీతిల్లెను. కుమారునివిషయమై ఆత్మారాముడు పెక్కు విధములగు ఊహాగానములను చేయసాగెను. తల్లియైన 'హులసి' మిక్కిలి చింతించెను. అశుభములను శంకించి, ఆమె ఆ పసికందును దశమినాటి రాత్రి దాసీచేతులలో ఉంచి, ఆ దాసియొక్క అత్తగారింటికి పంపెను. మఱునాడే ఆ పవిత్ర మాతృమూర్తి ఈ లోకమును వీడెను. 'చునియాఁ' అను పేరుగల ఆదాసి ఆ శిశువును మిక్కిలి ప్రేమానురాగములతో పెంచెను. తులసీదాసునకు దాదాపు ఐదున్నర సంవత్సరములప్రాయమున చునియాఁ గూడ దివంగతురాలయ్యెను. ఇప్పుడతడు అనాథబాలుడై ఇంటింటికిని తిరుగసాగెను. జగజ్జననియైన పార్వతీదేవికి ఈ అమాయకబాలునిపై కృపగలిగెను. ఆమె బ్రాహ్మణస్త్రీవేషమున ప్రతిదినము ఆ బాలునికడకు వచ్చి, స్వహస్తములతో అతనిచే అన్నము తినుపించుచుండెడిది.

రామశైలనివాసియైన శ్రీ అనంతానందజీ ప్రియశిష్యుడు శ్రీ నరహరి ఆనంద. అతడు పరమేశ్వర ప్రేరణచే ఈ బాలకుని వెదకుచు వచ్చెను. ఈ బాలునకు 'రామ్ బోలా' అను పేరు పెట్టి, అతడు వానిని తనతో అయోధ్యకు తీసికొనివెళ్లెను. విక్రమ శకము **1561** (క్రీ॥శ॥ **1504**)వ సంవత్సరమున మాఘ శుద్ధ పంచమీ శుక్రవారము నాడు అతడు ఆ బాలునకు ఉపనయన సంస్కారములను జరిపెను. ఎవ్వరి ప్రేరణ లేకయే ఏకసంతగ్రాహియైన 'రామ్‌బోలా' గురూపదేశమైన వెంటనే గాయత్రీ మంత్రమును ఉచ్చరించెను. దానిని జూచి అందఱును చకితులైరి. పిమ్మట నరహరి స్వామి రామ్‌బోలాకు వైష్ణవసంప్రదాయమును అనుసరించి, పంచసంస్కారములను జరిపించి, రామమంత్ర దీక్షను ఒసంగెను. అయోధ్యయందే ఆతనిచే విద్యాధ్యయనము చేయించెను. బాలకుడైన రామ్‌బోలా మిక్కిలి బుద్ధిమంతుడు, చురుకైన వాడు. అతడు ఏకసంతగ్రాహి. 'గురుముఖతః' ఒకసారి విన్నంతనే ఆ విషయము అతనికి కంఠస్థమగుచుండెను. ఆ గురుశిష్యులిద్దఱును అచట కొంత కాలము గడిపి, అనంతరము 'వరాహ క్షేత్రము'నకు చేరిరి. అక్కడ శ్రీ నరహరిస్వామి తులసీదాసునకు రామచరితమును వినిపించెను. కొలదిదినములపిమ్మట వారు కాశీనగరమును చేరిరి. కాశీలో శేషసనాతనస్వామివారికడ తులసీదాసు పదునైదు (15) సంవత్సరముల కాలము అధ్యయనము చేసి, వేదములను, వేదాంగములను జిహ్వాగ్రమున నిలుపుకొనెను. ఇచ్చట ఆయనకు సాంసారికవాసనలు జాగృతములయ్యెను. గురునాజ్ఞను దీసికొని, తిరిగి తన జన్మ స్థానమునకు చేరెను. అచట తన వారెవ్వరును మిగిలి యుండకపోవుటను అతడు గ్రహించెను. తన మాతాపిత్రాదులకు విధ్యుక్తములైన శ్రాద్ధకర్మలనాచరించెను. అచటనేయుండి జనులకు శ్రీరామచరితమును వినిపింపసాగెను.

విక్రమ శకము 1583 (క్రీ॥శ॥ 1526)వ సంవత్సరమున జ్యేష్ఠ శుద్ధ త్రయోదశీ గురువారము నాడు భారద్వాజగోత్రజమైన 'రత్నావళి'యను సుందరి(కన్య)తో ఆయనకు వివాహమయ్యెను. ఆ క్రొత్త దంపతులు సుఖసంతోషములతో తమజీవితమును కొనసాగించుచుండిరి. ఒకసారి రత్నావళి తన సోదరునితోగూడి, పుట్టింటికి వెళ్లెను. కొంతసేపైన తరువాత తులసీదాసు భార్యమీది ప్రేమతో తన ఇంటినుండి బయలుదేఱి, తన భార్యపుట్టింటికి చేరెను. అతనిని జూచి, భార్య రత్నావళి తన భర్తను చులకన జేయుచు ఇట్లనెను. "రక్తమాంసములతో గూడిన ఈ నా తనువుపైగల ఆసక్తిలో సగమైనను మీకు భగవంతునిపై ఉన్నచో మీరు తరించియుండెడివారు." ఆమెమాటలు తులసీదాసు మనస్సులో బాగుగా నాటుకొనెను. దానితో ఆయనలో అంతర్మథనము జరిగెను. ఆయనకు కనువిప్పు కలిగెను. వెంటనే ఆయనమనస్సు భగవంతునిమీదికి మఱలెను. మఱుక్షణముననే అతడు అచటినుండి తన ఇంటికి చేరెను, పిదప ప్రయాగ వెళ్ళెను. అచ్చట తులసీదాసు గృహస్థవేషమును పరిత్యజించి, సాధువేషమును స్వీకరించెను. పిమ్మట తీర్థయాత్రలను గావించుచు అతడు కాశీ చేరెను. ఈ సమయముననే ఆయనకు మానససరోవరమున 'కాకభుశుండి' దర్శనమాయెను.

కాశీలో తులసీదాసు రామకథాప్రవచనమును చేయసాగెను. ప్రతినిత్యము తులసీదాసు తన సంధ్యావందనము ముగిసిన పిమ్మట ఆ తీర్థమును ఒక చెట్టుమొదట చల్లుచుండెడివాడు. ఆ చెట్టు పైనున్న ఒక బ్రహ్మరాక్షసుడు ఆ తీర్థప్రభావమున శాపవిముక్తుడై, మానవరూపమున తులసీదాసు సమ్ముఖమున నిలిచెను. అతడు "నీ తీర్థ ప్రభావమున నాకు శాపవిముక్తి కలిగినది. నీకు నేను ఏవిధముగా సహాయపడగలనో తెలుపుము." అని తులసీదాసును అడిగెను. అప్పుడు తులసీదాసు "నాకు శ్రీరాముని దర్శనము కలుగు ఉపాయమును తెలుపుడు"- అని ఆయనను ప్రార్థించెను. అప్పుడు అతడు "అట్టి శక్తి నాకు లేదు. నీవు హనుమంతుని ఆశ్రయించినచో నీ కోరిక నెఱవేఱును" అని పలికెను. "అది సరే! హనుమంతునిదర్శనము కలుగుట యెట్లు?" అని తులసీదాసు ప్రశ్నించెను. దానికి సమాధానముగా అతడు-

"యత్ర యత్ర రఘునాథకీర్తనం, తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్ ।
బాష్పవారిపరిపూర్ణలోచనం, మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥"

అను శ్లోకమును పఠించెను- అనగా శ్రీ రఘురాముని కథాప్రవచనము (కీర్తనము) జరుగుచోట ఆంజనేయుడు తప్పక ఉండితీరును.

తులసీదాసు ప్రవచనమును వినుటకు నిత్యము ఒక వృద్ధ బ్రాహ్మణుడు వచ్చుచుండెడివాడు. అతడు శ్రీరామకథా శ్రవణము చేయుచు ఆర్ద్ర హృదయముతో ప్రేమవిహ్వలుడగుచుండెను. అతడు ఎవరో కాదు, మాఱువేషమున వచ్చిన ఆంజనేయస్వామియే. తులసీదాసు ఆయనకు ప్రణమిల్లి "స్వామీ! మీరు ఎవరు? అందఱికంటెను ముందుగా వచ్చి, చివరకు వెళ్లుచున్నారు". అని అడిగెను. అప్పుడు ఆంజనేయుడు ఆయనకు తన రూపమును జూపెను. అంతట తులసీదాసు మిక్కిలి హర్షితుడై "స్వామీ! నాకు శ్రీరామునిదర్శనము కలిగింపుము" అని ప్రార్థించెను. ఆంజనేయుడు ఇట్లు నుడివెను. "నీవు చిత్రకూటమునకు వెళ్ళుము. అచ్చట నీకు శ్రీరఘునాథునిదర్శనము కాగలదు." ఈ మాటలను విని, తులసీదాసు శ్రీరామదర్శనమునకు త్వరపడుచున్నవాడై చిత్రకూటమునకు చేరెను. అక్కడ రామఘట్టమునందు ఒక పీఠమును ఏర్పఱచుకొనెను. ఒకనాడు అతడు కామదగిరికి ప్రదక్షిణమొనర్చుటకు బయలుదేఱెను. మార్గమున ఆయనకు శ్రీరామునిదర్శనమాయెను. మిక్కిలి

అందమైన ఇద్దఱు రాజకుమారులు ధనుర్బాణములను ధరించి, గుఱ్ఱములపై వెళ్లుచుండిరి. తులసీదాసు వారిని జూచి ముగ్ధుడాయెను. కాని వారిని అతడు గుర్తింపలేదు. పిమ్మట ఆంజనేయుడు ఆయనకడకు వచ్చి, వాస్తవమును ఎఱింగించెను. అప్పుడతడు మిక్కిలి పశ్చాత్తాపపడసాగెను. హనుమంతుడతనిని అనునయించి, మఱల మఱునాటి ప్రాతఃకాలమున శ్రీరామ దర్శనమగునని తెలిపెను.

వి॥ శ॥ 1607వ సంవత్సరమున మౌనిఅమావాస్య, (పుష్యబహుళ అమావాస్య) బుధవారమునాడు శ్రీరామచంద్ర ప్రభువు మఱల అతనిముందు ప్రత్యక్షమాయెను. బాలరూపుడుగా ఉన్న శ్రీరాముడు తులసీదాసుతో "బాబా! మాకు చందనము ఇమ్ము" అని అడిగెను. ఈసారి పొరపాటు జరుగకుండ ఆంజనేయుడు చిలుక రూపము ధరించి, ఈ దోహాను పలికెను.

చిత్రకూట కే ఘాట్ పర్ భఇ సంతన కీ భీర్ । తులసిదాస చందన్ ఘిసేఁ తిలక్ దేత రఘువీర్ ॥

అనగా చిత్రకూటమునందలి రామఘట్టమున సజ్జనసమూహములు గలవు. తులసీదాసు చందనము దీసెను. రఘువీరుడు తిలకమును దిద్దెను.

నీవు తీయు చందనమును దిద్దువాడు సాక్షాత్తు శ్రీరామచంద్రభగవానుడే.

తులసీదాసు అద్భుతమైన రామునితేజస్సునకు అబ్బురపడి, తనశరీరస్పృహను కోల్పోయెను. భగవానుడు తనచేతితో చందనమును దీసికొని తనకును, తులసీదాసునకును ముఖములయందు తిలకమును దిద్దెను. అనంతరము అతడు అంతర్ధానమాయెను.

వి॥ శ॥ 1628వ సంవత్సరమున ఆంజనేయుని అనుమతితో తులసీదాసు అయోధ్యకై బయలుదేఱెను. ఆ సమయమున ప్రయాగయందు మాఘమేలా జరుగుచుండెను. అతడు అచ్చట కొన్ని దినములు గడిపెను. ఆఱు పర్వదినములపిమ్మట ఒక వటవృక్షచ్ఛాయయందు ఆయనకు మహర్షులైన భరద్వాజ, యాజ్ఞవల్క్యుల దర్శనమయ్యెను. వరాహక్షేత్రమునందు గురువుద్వారా తాను వినినకథయే అచట చెప్పబడుచుండెను. అచటినుండి అతడు కాశీనగరమునకు చేరి, ప్రహ్లాదఘట్టమున ఒక బ్రాహ్మణునిఇంటియందు నివసింపసాగెను. అచ్చట అతనిలో కవితాశక్తి జాగృతమయ్యెను. సంస్కృత భాషలో శ్లోకరచన చేయసాగెను. కాని పగటివేళ వ్రాసిన శ్లోకములన్నియును రాత్రియందు లుప్తములగుచుండెను. ఈ సంఘటనము ప్రతిదినము కొనసాగుచు వచ్చెను. ఎనిమిదవ దినమున తులసీదాసునకు ఒక కల వచ్చెను. ఆ కలలో "నీవు నీ (వ్యవహార) భాషయందు కావ్యరచన చేయుము" అని అతనిని పరమేశ్వరుడు ఆదేశించెను. తులసీదాసు మేల్కొని కూర్చుండెను. ఆసమయమున శివపార్వతులు అతనికి ప్రత్యక్షమైరి. తులసీదాసు ఆ ఆదిదంపతులకు ప్రణమిల్లెను. పరమేశ్వరుడు పలికెను. "నీవు అయోధ్యకు వెళ్లి, వ్యవహార (అవధి) భాషలో కావ్య రచనచేయుము. నా ఆశీర్వాదప్రభావమున నీకవిత సామవేదముతో సమానముగా ఫలములను గూర్చును. సామవేదమువలె దీనిని ప్రజలందఱును గానముచేయుదురు." ఇట్లు ఆశీర్వదించి, గౌరీశంకరులు అంతర్ధానమైరి. వారి ఆజ్ఞలను శిరసావహించి, తులసీదాసు కాశీనుండి అయోధ్యకు చేరెను.

త్రేతాయుగమున శ్రీరామజన్మదినోత్సవము జరుపబడునట్లే 1631వ సంవత్సరమున అయోధ్యలో శ్రీరామనవమిఉత్సవములు జరుపబడుచుండెను. ఆనాడు ప్రాతఃకాలమున శ్రీతులసీదాసు 'శ్రీరామచరితమానస'రచనను ప్రారంభించెను. రెండు సంవత్సరముల ఏడు మాసముల ఇఱువది ఆఱుదినములలో ఆ గ్రంథరచన పూర్తియయ్యెను. 1633వ సంవత్సరమున మార్గశిర శుక్ల పక్షమున శ్రీ సీతారాములవివాహమహోత్సవమునాడు ఏడు కాండములును సంపూర్ణమాయెను.

ఆ పిదప తులసీదాసు భగవదాజ్ఞను అనుసరించి, కాశీ చేరెను. అచట అన్నపూర్ణావిశ్వేశ్వరులకు 'శ్రీరామచరిత మానసమును' విన్పించెను. ఆ రాత్రి ఆ గ్రంథము విశ్వనాథునిమందిరమున ఉంచబడెను. ప్రాతఃకాలమున పుస్తకమును తెఱచిచూడగా అందు 'సత్యం, శివం, సుందరమ్' అను మధుర పదత్రయము వ్రాయబడి యుండెను. క్రింద శంకరభగవానునిసంతకముగూడ ఉండెను. అచ్చట నున్న జనులు 'సత్యం, శివం, సుందరమ్' అను పదములను గూడ వినిరి.

ఈ విషయములను వినిన అక్కడి పండితులమనస్సులలో ఈర్ష్య జనించెను. వారు అందఱును ఒకటై తులసీదాసును నిందింపసాగిరి. ఆ గ్రంథమునుగూడ నష్టపఱచుటకు ప్రయత్నించిరి. దానిని దొంగిలించి తీసికొనివచ్చుటకై ఇద్దఱు దొంగలను పంపిరి. వారు వెళ్లిచూడగా తులసీదాసు కుటీరసమీపమున ఇద్దఱు వీరులు ధనుర్బాణములను ధరించి, కాపలాకాయుచుండిరి. వారు శ్యామగౌరవర్ణశోభితులై యుండిరి. వారిదర్శనముతో చోరులబుద్ధి మాఱిపోయెను. వెంటనే చోరవృత్తికి స్వస్తిపలికి, శ్రీరామభజనను చేయసాగిరి. తనకొఱకై భగవంతుడు కష్టపడినట్లు తెలిసికొని, కుటీరమునందలి వస్తువులనన్నింటిని అతడు దానమొనర్చి, గ్రంథమును మాత్రము తనమిత్రుడైన 'తోడర్‌మల్' కడనుంచెను. ఆ పిమ్మట అతడు మఱియొక ప్రతిని వ్రాసెను. దీనిని ఆధారముగా చేసికొనియే ఇతరప్రతులు సిద్ధపఱచబడినవి. ఈ గ్రంథము క్రమక్రమముగా ప్రసిద్ధి వహించెను.

ఇచ్చట పండితులకు ఏమియు తోచక ఆ పుస్తకమును పరిశీలింపవలసినదిగా శ్రీ మధుసూదన సరస్వతిగారిని ప్రార్థించిరి. శ్రీ మధుసూదనసరస్వతిగారు ఆగ్రంథమును సావధానముగా సమగ్రముగా పరిశీలించి, మిక్కిలి ప్రసన్నులై తమ సమ్మతిని ఇట్లు తెల్పిరి.

ఆనందకాననేహ్యస్మిన్ జంగమస్తులసీతరుః । కవితామంజరీ భాతి రామభ్రమరభూషితా ॥

'కాశీ'యను ఆనంద వనమున 'తులసీదాసు' అనెడి సంచరించుతులసిమొక్క కలదు. దాని కవితారూపమంజరి మిక్కిలి సుందరమైనది. దానిపై శ్రీరాముడనెడి తుమ్మెద సర్వదా పరిభ్రమించు చుండును.

దీనితో పండితులకు సంతుష్టి కలుగకపోగా, వారి ఈర్ష్య ఇంకను అధికమైనది. ఈ గ్రంథ ప్రామాణిక పరీక్షకు వారు మఱియొక ఉపాయమును ఆలోచించిరి. వారు విశ్వేశ్వరునిఎదుట ఒక పీఠముపై వేదశాస్త్ర పురాణగ్రంథములను, వాటి అన్నింటికిని అడుగుభాగమున తులసీరామాయణగ్రంథమును ఉంచిరి. పిమ్మట మందిరము మూయబడెను. ప్రాతఃకాలమున మందిరద్వారములు తెఱచిచూడగా అట్టడుగున ఉంచబడిన శ్రీరామచరితమానసము వేదపురాణాదిగ్రంథములపైభాగమున వారికిగనబడెను. పండితులందఱును సిగ్గుతో తలవంచుకొనిరి. వారు శ్రీ తులసీదాస గోస్వామివారికి క్షమాపణ చెప్పుకొని భక్తితో ఆయన పాదోదకమును సేవించిరి.

ఇపుడు తులసీదాసు 'అసీఘట్టము'న ఉండసాగెను. ఒకనాటిరాత్రి కలిపురుషుడు ఆయనయొద్దకు వచ్చి, ఆయనను బాధింపసాగెను. గోస్వామీజీ ఆంజనేయుని ధ్యానించెను. 'మారుతి' వినయపదములను వ్రాయుమని ఆయనను ఆజ్ఞాపించెను. తులసీదాసు 'వినయ పత్రిక'ను రచించి, భగవంతునిపాదముల కడ సమర్పించెను. శ్రీరాముడు దానిపై తనహస్తాక్షరములను ఉంచెను. ఆయనకు అభయప్రదానము చేసెను. అంతట తులసీదాసునకు కలిపురుషుని భయము తొలగిపోయెను. 1680 సంవత్సరమున ఆషాఢ బహుళ తదియ శనివారము నాడు అసీఘట్టమున రామనామమును స్మరించుచు తులసీదాసు తన తనువును వీడి, పరమపదమును జేరెను.

* * *

శ్రీరామశలాకా ప్రశ్నావళి

శ్రీరామచరితమానసముపై ప్రేమానురాగములుగల మహానుభావులకు శ్రీరామశలాకాప్రశ్నావళిని గూర్చి ఎక్కువగా వివరింపవలసిన పనిలేదు. 'మానస' అభిమానులందఱికిని దీనిమహిమను గూర్చియు, ప్రయోజనమును గుఱించియు బహుశా తెలిసియేయుండును. కావున దాని స్వరూపమును మాత్రము రూపొందించి, ప్రశ్నోత్తర విధానమును, తదుత్తరఫలవిశేషములను ఉల్లేఖించుట జరిగినది. 'శ్రీరామశలాకాప్రశ్నావళి' స్వరూపము ఈ విధముగా గలదు.

సు	ప్ర	ఉ	బి	హో	ము	గ	బ	సు	ను	బి	ఘ	ధి	ఇ	ద
ర	రు	ఫ	సి	సి	రహిఁ	బస	హి	మం	ల	న	ల	య	న	అం
సుజ	సో	గ	సు	కు	మ	స	గ	త	న	ఇ	ల	ధా	బే	నో
త్య	ర	న	కు	జో	మ	రి	ర	ర	అ	కీ	హో	సం	రా	య
పు	సు	థ	సీ	జె	ఇ	గ	మ	సం	క	రే	హో	స	స	ని
త	ర	త	ర	స	హుఁ	హ	బ	బ	ప	చి	స	హిఁ	స	తు
మ	కా	ా	ర	ర	మ	మి	మీ	మ్హా	ా	జా	హూ	హీఁ	ా	ా
తా	రా	రే	రీ	హ్వా	కా	ఫ	ఖా	జా	ఈ	ర	రా	పూ	ద	ల
ని	కో	జో	గో	న	ము	జి	యఁ	నే	మని	క	జ	ప	స	ల
హి	రా	మి	స	రి	గ	ద	న్మ	ఖ	మ	ఖి	జి	మ	త	జం
సిం	ఖ	ను	న	కో	మి	నిజ	ర్క	గ	ధు	ధ	సు	కా	స	ర
గు	బ	మ	అ	రి	ని	మ	ల	ా	న	ఢ	తీ	న	క	భ
నా	పు	వ	అ	ా	ర	ల	ా	ఏ	తు	ర	న	ను	వై	థ
సి	హుఁ	సు	మ్హా	రా	ర	స	స	ర	త	న	ఖ	ా	జ	ా
ర	ా	ా	లా	ధీ	ా	రీ	ా	హూ	హీఁ	ఖా	జూ	ఈ	రా	రే

ఈ రామ శలాకా ప్రశ్నావళి ద్వారా తమకు ఇష్టమైన ప్రశ్నకు సమాధానమును పొందదలచిన వారు మొట్ట మొదట శ్రీరామచంద్రభగవానుని ధ్యానింపవలెను. పిమ్మట శ్రద్ధా విశ్వాసములతో తమకు ఇష్టమైన ప్రశ్నను మనస్సునందు అనుకొనుచు ప్రశ్నావళి చక్రమునందలి ఏదేని ఒక గడిలో వ్రేలును గాని, ఒక శలాక (పుల్ల)ను గాని ఉంచవలెను. ఆ గడి యందలి అక్షరమును వేఱుగా ఒక కాగితముపైన గాని, పలకపైన గాని వ్రాసికొనవలెను. ఆ గడిని శుభ్రముగా ఉంచుచు దానిలో పెన్సిలుతో ఒక గుర్తును ఉంచవలెను. ఆ గుర్తును ఉంచినగడిని వదలి, ప్రక్క గడినుండి తొమ్మిదవ గడిలోని అక్షరమును మొదట విడిగా వ్రాసియుంచుకొనిన అక్షరముప్రక్కన వ్రాసికొనవలెను. ఇట్లు ప్రతి తొమ్మిదవ గడిని గుర్తించుచు ఆ గడియందలి అక్షరమును వ్రాసికొనుచు ముందుకు సాగవలెను. ఈ ప్రక్రియను మొదట గుర్తించిన గడి వచ్చువఱకు కొనసాగింపవలెను. దానితో ఒక చౌపాఈ పూర్తియగును. ఈ చౌపాఈలో కోరుకొనిన ప్రశ్నకు సమాధానము లభించును. ఆయా గడులలో ఏ గడియందైనను ఒక దీర్ఘ చిహ్నము ( ) గాని, రెండేసి అక్షరములు గాని ఉండవచ్చును. రెండక్షరములున్నను ఆ గడిని ఒక గడి క్రిందనే గుర్తింపవలెను. దీర్ఘ చిహ్నము ( ) గల గడిని వదలక, దానిని ఒక గడిగా గుర్తించి, ఆ దీర్ఘ చిహ్నము ( )ను అంతకు ముందున్న అక్షరముతో కలిపి వ్రాసికొనవలెను.

ఉదాహరణమునకు :- ఏదైననొక ప్రశ్నకు సమాధానముగా ఈ రామశలాకాప్రశ్నావళియందలి ఒక 'చౌపాఈ'ని పరిశీలింతము. ఒక వ్యక్తి శ్రీరామచంద్రభగవానుని ధ్యానించుచు తన ప్రశ్నను మనస్సున అనుకొనుచు ప్రశ్నావళి చదరములో గుర్తునుంచిన 'మ' అను అక్షరముపై వ్రేలును ఉంచెననుకొందము. ఇంతకు ముందు తెలుపబడిన రీతిననుసరించి, ప్రతి తొమ్మిదవ గడిలోని అక్షరమును వ్రాసికొనుచు పోగా ఈ క్రింది 'చౌపాఈ' వచ్చును.

1) హోఇహి సోఇ జో రామ రచి రాఖా । కో కరి తర్క బఢావై సాఖా ॥

ఈ 'చౌపాఈ' బాలకాండాంతర్గతమైనది. శివపార్వతుల సంవాదములోనిది. ఈ 'చౌపాఈ' యొక్క సారాంశమే కోరుకొనిన ప్రశ్నకు ఫలరూపసమాధానము. దీనిని బట్టి 'కార్యము సఫలము అగుటలో సందేహము' ఉన్నట్లు తెలియుచున్నది. కనుక ఆకార్యసాఫల్య భారమును భగవంతునిపై ఉంచుట శ్రేయస్కరము.

ఈ 'చౌపాఈ' గాక 'శ్రీరామ శలాకా ప్రశ్నావళిలో ఇంకను ఎనిమిది (8) 'చౌపాఈ'లు గలవు. వాటి స్థానములు. ఫలములు ఇట్లు పేర్కొనబడుచున్నవి. మొత్తము తొమ్మిది చౌపాఈలు.

2) సును సియ సత్య అసీస హమారీ । పూజిహి మన కామనా తుమ్హారీ ॥

స్థానము : ఈ 'చౌపాఈ' బాలకాండమున శ్రీసీతాదేవి గౌరీపూజ చేయుసందర్భములోనిది. గౌరీదేవి సీతాదేవిని ఆశీర్వదించెను.

ఫలము : పృచ్ఛకుని ప్రశ్న ఉత్తమమైనది. కార్యము సిద్ధించును.

3) ప్రబిసి నగర కీజే సబ కాజా । హృదయఀ రాఖి కోసల పుర రాజా ॥

స్థానము : ఈ 'చౌపాఈ' సుందరకాండమున హనుమంతుడు లంకలో ప్రవేశించు సందర్భములోనిది.

ఫలము : భగవంతుని స్మరించి కార్యారంభము చేయుము. కార్యసాఫల్యము కలుగును.

4) ఉఘరహిఀ అంత న హోఇ నిబాహూ । కాలనేమి జిమి రావన రాహూ ॥

స్థానము : ఈ చౌపాఈ బాలకాండములో ఆరంభమునందలి సత్సంగవర్ణనసందర్భములోనిది.

ఫలము : ఈ కార్యమున మేలు లేదు. కార్యసాఫల్యమగుట సందేహము.

5) బిధి బస సుజన కుసంగత పరహీఀ । ఫని మని సమ నిజ గున అనుసరహీఀ ॥

స్థానము : ఈ చౌపాఈ గూడ బాలకాండములో ఆరంభమునందలి సత్సంగవర్ణనసందర్భములోనిది.

ఫలము : దుష్టుల సాంగత్యమును వీడుము. కార్యము సఫలమగుట సందేహము.

6) ముద మంగలమయ సంత సమాజూ । జో జగ జంగమ తీరథ రాజూ ॥

స్థానము : ఈ 'చౌపాఈ' బాలకాండమున సజ్జనసమాజరూపతీర్థమును వర్ణించుసందర్భములోనిది.

ఫలము : ప్రశ్న ఉత్తమమైనది - కార్యము సిద్ధించును.

7) గరల సుధా రిపు కరహిఀ మితాఈ । గోపద సింధు అనల సితలాఈ ॥

స్థానము : ఈ 'చౌపాఈ' సుందరకాండములో శ్రీ ఆంజనేయస్వామి లంకానగరములో ప్రవేశించు సందర్భములోనిది.

ఫలము : ప్రశ్న మిక్కిలి శ్రేష్ఠమైనది. కార్యము సిద్ధించును.

8) బరున కుబేర సురేస సమీరా । రన సన్ముఖ ధరి కాహుఁ న ధీరా ॥

స్థానము : ఈ 'చౌపాఈ' లంకాకాండమున రావణునిమరణానంతరము మందోదరి విలపించు సందర్భములోనిది.

ఫలము : కార్యము పూర్తియగుట సందేహము.

9) సుఫల మనోరథ హోహు తుమ్హారే । రాము లఖను సుని భఏ సుఖారే ॥

స్థానము : ఈ 'చౌపాఈ' బాలకాండమున పుష్పవాటికనుండి రామలక్ష్మణులు పుష్పములను గొనివచ్చినపిదప వారికి విశ్వామిత్రుడు ఒసగు ఆశీర్వాదము.

ఫలము : ప్రశ్న మిక్కిలి ఉత్తమమైనది. కార్యము సిద్ధించును.

ఈ విధముగా రామశలాకా ప్రశ్నావళిలో తొమ్మిది (9) 'చౌపాఈ'లు గలవు. వాటిలో అన్ని విధములగు ప్రశ్నలకు సమాధానములు లభించును.

- ఓమ్ తత్సత్ -

శ్రీరామాయణహారతి

ఆరతి శ్రీరామాయనజీ కీ । కీరతి కలిత లలిత సియ పీ కీ ॥

గావత బ్రహ్మాదిక ముని నారద । బాలమీక బిగ్యాన బిసారద ।
సుక సనకాది సేష అరు సారద । బరని పవనసుత కీరతి నీకీ ॥ 1 ॥

గావత బేద పురాన అష్టదస । ఛవో సాస్త్ర సబ గ్రంథన కో రస ।
ముని జన ధన సంతన కో సరబస । సార అంస సమ్మత సబహీ కీ ॥ 2 ॥

గావత సంతత సంభు భవానీ । అరు ఘటసంభవ ముని బిగ్యానీ ।
బ్యాస ఆది కబిబర్జ బఖానీ । కాగభుసుండి గరుడ కే హీ కీ ॥ 3 ॥

కలిమల హరని బిషయ రస ఫీకీ । సుభగ సింగార ముక్తి జుబతీ కీ ।
దలన రోగ భవ మూరి అమీ కీ । తాత మాత సబ బిధి తులసీ కీ ॥ 4 ॥

శ్రీరామావతారము

దో- సుర సమూహ బినతీ కరి, పహుంచే నిజ నిజ ధామ ।
జగనివాస ప్రభు ప్రగటే, అఖిల లోక బిశ్రామ ॥

ఛం-భఏ ప్రగట కృపాలా దీనదయాలా కౌసల్యా హితకారీ ।
హరషిత మహతారీ మునిమన హారీ అద్భుత రూప బిచారీ ।
లోచన అభిరామా తను ఘనస్యామా నిజ ఆయుధ భుజ చారీ ॥
భూషన బనమాలా నయన బిసాలా సోభాసింధు ఖరారీ ॥ 1 ॥
కహ దుఇ కర జోరీ అస్తుతి తోరీ కెహి బిధి కరౌం అనంతా ।
మాయా గున గ్యానాతీత అమానా బేద పురాన భనంతా ॥
కరునా సుఖ సాగర సబ గున ఆగర జెహి గావహిం శ్రుతి సంతా ।
సో మమ హిత లాగీ జన అనురాగీ భయఉ ప్రగట శ్రీకంతా ॥ 2 ॥
బ్రహ్మాండ నికాయా నిర్మిత మాయా రోమ రోమ ప్రతి బేద కహై ।
మమ ఉర సో బాసీ యహ ఉపహాసీ సునత ధీర మతి థిర న రహై ॥
ఉపజా జబ గ్యానా ప్రభు ముసుకానా చరిత బహుత బిధి కీన్హ చహై ।
కహి కథా సుహాఈ మాతు బుఝాఈ జెహి ప్రకార సుత ప్రేమ లహై ॥ 3 ॥
మాతా పుని బోలీ సో మతి డోలీ తజహు తాత యహ రూపా ।
కీజై సిసులీలా అతి ప్రియసీలా యహ సుఖ పరమ అనూపా ॥
సుని బచన సుజానా రోదన ఠానా హోఇ బాలక సురభూపా ।
యహ చరిత జె గావహిం హరిపద పావహిం తే న పరహిం భవకూపా ॥ 4 ॥

దో-బిప్ర ధేను సుర సంత హిత, లీన్హ మనుజ అవతార ।
నిజ ఇచ్ఛా నిర్మిత తను, మాయా గున గో పార ॥ 192 ॥

అత్రికృత శ్రీరామ స్తుతి

ఛం-నమామి భక్తవత్సలం । కృపాలు శీల కోమలం ॥
భజామి తే పదాంబుజం । అకామినాం స్వధామదం ॥ 1 ॥
నికామ శ్యామసుందరం । భవాంబునాథ మందరం ॥
ప్రఫుల్ల కంజ లోచనం । మదాది దోష మోచనం ॥ 2 ॥
ప్రలంబబాహు విక్రమం । ప్రభోఽప్రమేయ వైభవం ॥
నిషంగ చాప సాయకం । ధరం త్రిలోక నాయకం ॥ 3 ॥
దినేశ వంశ మండనం । మహేశ చాప ఖండనం ॥
మునీంద్ర సంత రంజనం । సురారి వృంద భంజనం ॥ 4 ॥
మనోజ వైరి వందితం । అజాది దేవ సేవితం ॥
విశుద్ధ బోధ విగ్రహం । సమస్త దూషణాపహం ॥ 5 ॥
నమామి ఇందిరాపతిం । సుఖాకరం సతాం గతిం ॥
భజే సశక్తి సానుజం । శచీపతి ప్రియానుజం ॥ 6 ॥
త్వదంఘ్రి మూల యే నరాః । భజంతి హీన మత్సరాః ॥
పతంతి నో భవార్ణవే । వితర్క వీచి సంకులే ॥ 7 ॥
వివిక్త వాసినః సదా । భజంతి ముక్తయే ముదా ॥
నిరస్య ఇంద్రియాదికం । ప్రయాంతి తే గతిం స్వకం ॥ 8 ॥
తమేకమద్భుతం ప్రభుం । నిరీహమీశ్వరం విభుం ॥
జగద్గురుం చ శాశ్వతం । తురీయమేవ కేవలం ॥ 9 ॥
భజామి భావ వల్లభం । కుయోగినాం సుదుర్లభం ॥
స్వభక్త కల్ప పాదపం । సమం సుసేవ్యమన్వహం ॥ 10 ॥
అనూప రూప భూపతిం । నతోఽహముర్విజా పతిం ॥
ప్రసీద మే నమామి తే । పదాబ్జ భక్తి దేహి మే ॥ 11 ॥
పఠంతి యే స్తవం ఇదం । నరాదరేణ తే పదం ॥
వ్రజంతి నాత్ర సంశయం । త్వదీయ భక్తి సంయుతాః ॥ 12 ॥

పరమేశ్వరుడు శ్రీరాముని స్తుతించుట

ఛం - జయ రామ రమారమనం సమనం । భవ తాప భయాకుల పాహి జనం ।
అవధేస సురేస రమేస బిభో । సరనాగత మాగత పాహి ప్రభో ॥ 1 ॥
దససీస బినాసన బీస భుజా । కృత దూరి మహా మహి భూరి రుజా ।
రచనీచర బృంద పతంగ రహే । సర పావక తేజ ప్రచండ దహే ॥ 2 ॥
మహి మండల మండన చారుతరం । ధృత సాయక చాప నిషంగ బరం ।
మద మోహ మహా మమతా రజనీ । తమ పుంజ దివాకర తేజ అనీ ॥ 3 ॥
మనజాత కిరాత నిపాత కిఏ । మృగ లోగ కుభోగ సరేన హిఏ ।
హతి నాథ అనాథని పాహి హరే । బిషయా బన పావఁర భూలి పరే ॥ 4 ॥
బహు రోగ బియోగన్హి లోగ హఏ । భవదంఘ్రి నిరాదర కే ఫల ఏ ।
భవ సింధు అగాధ పరే నర తే । పద పంకజ ప్రేమ న జే కరతే ॥ 5 ॥
అతి దీన మలీన దుఖీ నితహీఁ । జిన్హ కేఁ పద పంకజ ప్రీతి నహీఁ ॥
అవలంబ భవంత కథా జిన్హ కేఁ । ప్రియ సంత అనంత సదా తిన్హ కేఁ ॥ 6 ॥
నహిఁ రాగ న లోభ న మాన మదా । తిన్హ కేఁ సమ బైభవ వా బిపదా ।
ఏహి తే తవ సేవక హోత ముదా । ముని త్యాగత జోగ భరోస సదా ॥ 7 ॥
కరి ప్రేమ నిరంతర నేమ లిఏఁ । పద పంకజ సేవత సుద్ధ హిఏఁ ।
సమ మాని నిరాదర ఆదరహీ । సబ సంత సుఖీ బిచరంతి మహీ ॥ 8 ॥
ముని మానస పంకజ భృంగ భజే । రఘుబీర మహా రనధీర అజే ।
తవ నామ జపామి నమామి హరీ । భవ రోగ మహాగద మాన అరీ ॥ 9 ॥
గున సీల కృపా పరమాయతనం । ప్రనమామి నిరంతర శ్రీరమనం ।
రఘునంద నికందయ ద్వంద్వఘనం । మహిపాల బిలోకయ దీన జనం ॥ 10 ॥

దో- బార బార బర మాగఉఁ, హరషి దేహు శ్రీరంగ ।
పద సరోజ అనపాయనీ, భగతి సదా సతసంగ ॥
బరని ఉమాపతి రామ గున, హరషి గఏ కైలాస ।
తబ ప్రభు కపిన్హ దివాఏ, సబ బిధి సుఖప్రద బాస ॥

రుద్రాష్టకము

ఛం-నమామీశమీశాన నిర్వాణరూపం । విభుం వ్యాపకం బ్రహ్మ వేదస్వరూపం ॥
నిజం నిర్గుణం నిర్వికల్పం నిరీహం । చిదాకాశమాకాశవాసం భజేఽహం ॥ 1 ॥
నిరాకారమోంకారమూలం తురీయం । గిరా గ్యాన గోతీతమీశం గిరీశం ॥
కరాలం మహాకాల కాలం కృపాలం । గుణాగార సంసారపారం నతోఽహం ॥ 2 ॥
తుషారాద్రి సంకాశ గౌరం గభీరం । మనోభూత కోటి ప్రభా శ్రీ శరీరం ॥
స్ఫురన్మౌలి కల్లోలినీ చారు గంగా । లసద్భాలబాలేందు కంఠే భుజంగా ॥ 3 ॥
చలత్కుండలం భ్రూ సునేత్రం విశాలం । ప్రసన్నాననం నీలకంఠం దయాలం ॥
మృగాధీశచర్మాంబరం ముండమాలం । ప్రియం శంకరం సర్వనాథం భజామి ॥ 4 ॥
ప్రచండం ప్రకృష్టం ప్రగల్భం పరేశం । అఖండం అజం భానుకోటిప్రకాశం ॥
త్రయఃశూల నిర్మూలనం శూలపాణిం । భజేఽహం భవానీపతిం భావగమ్యం ॥ 5 ॥
కలాతీత కల్యాణ కల్పాంతకారీ । సదా సజ్జనానందదాతా పురారీ ॥
చిదానందసందోహ మోహాపహారీ । ప్రసీద ప్రసీద ప్రభో మన్మథారీ ॥ 6 ॥
న యావద్ ఉమానాథ పాదారవిందం । భజంతీహ లోకే పరే వా నరాణాం ॥
న తావత్సుఖం శాంతి సంతాపనాశం । ప్రసీద ప్రభో సర్వభూతాధివాసం ॥ 7 ॥
న జానామి యోగం జపం నైవ పూజాం । నతోఽహం సదా సర్వదా శంభు తుభ్యం ॥
జరా జన్మ దుఃఖౌఘ తాతప్యమానం । ప్రభో పాహి ఆపన్నమామీశ శంభో ॥ 8 ॥

శ్లో॥ రుద్రాష్టకమిదం ప్రోక్తం విప్రేణ హరతోషయే ।
యే పఠంతి నరా భక్త్యా తేషాం శంభుః ప్రసీదతి ॥ 1 ॥

శ్రీరామమంగళాశాసనమ్

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే ।
చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్ ॥ 1 ॥

వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే ।
పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్ ॥ 2 ॥

విశ్వామిత్రాంతరంగాయ మిథిలానగరీపతేః ।
భాగ్యానాం పరిపాకాయ భవ్యరూపాయ మంగళమ్ ॥ 3 ॥

పితృభక్తాయ సతతం భ్రాతృభిః సహ సీతయా ।
నందితాఖిలలోకాయ రామభద్రాయ మంగళమ్ ॥ 4 ॥

త్యక్తసాకేతవాసాయ చిత్రకూటవిహారిణే ।
సేవ్యాయ సర్వయమినాం ధీరోదాత్తాయ మంగళమ్ ॥ 5 ॥

సౌమిత్రిణా చ జానక్యా చాపబాణాసిధారిణే ।
సంసేవ్యాయ సదా భక్త్యా స్వామినే మమ మంగళమ్ ॥ 6 ॥

దండకారణ్యవాసాయ ఖరదూషణశత్రవే ।
గృధ్రరాజాయ భక్తాయ ముక్తిదాయాస్తు మంగళమ్ ॥ 7 ॥

సాదరం శబరీదత్తఫలమూలభిలాషిణే ।
సౌలభ్యపరిపూర్ణాయ సత్త్వోద్రిక్తాయ మంగళమ్ ॥ 8 ॥

హనుమత్సమవేతాయ హరీశాభీష్టదాయినే ।
వాలిప్రమథనాయాస్తు మహాధీరాయ మంగళమ్ ॥ 9 ॥

శ్రీమతే రఘువీరాయ సేతూల్లంఘితసింధవే ।
జితరాక్షసరాజాయ రణధీరాయ మంగళమ్ ॥ 10 ॥

విభీషణకృతే ప్రీత్యా లంకాభీష్టప్రదాయినే ।
సర్వలోకశరణ్యాయ శ్రీరాఘవాయ మంగళమ్ ॥ 11 ॥

ఆగత్య నగరీం దివ్యామభిషిక్తాయ సీతయా ।
రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగళమ్ ॥ 12 ॥

బ్రహ్మాదిదేవసేవ్యాయ బ్రహ్మణ్యాయ మహాత్మనే ।
జానకీప్రాణనాథాయ రఘునాథాయ మంగళమ్ ॥ 13 ॥

శ్రీసౌమ్యజామాతృమునేః కృపయాస్మానుపేయుషే ।
మహతే మమ నాథాయ రఘునాథాయ మంగళమ్ ॥ 14 ॥

మంగళాశాసనపరైః మదాచార్యపురోగమైః ।
సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్ ॥ 15 ॥

రమ్యజామాతృమునినా మంగళాశాసనం కృతమ్ ।
త్రైలోక్యాధిపతిః శ్రీమాన్ కరోతు మంగళం సదా ॥ 16 ॥

* * *